
కీర్తనలు

# హరి యేమనెనో అలిగెనో: 1-4



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని గీతా దీక్ష వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) గీతా దీక్ష వారి వెబ్ సైట్: http://geetadeeksha.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో గీతా దీక్ష వారి వెబ్ సైట్ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## గీతా దీక్ష వారి వెబ్ సైట్:

**http://www.geetadeeksha.com**



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!


మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటీ కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు





# హరి యేమనెనే అలిగెనో

## సంపుటం - 1,2,3,4

ఎన్నుకొన్న

అన్నమయ్య మధురకీర్తనలకు

# పరిచయ పరిమళము


రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.



# సతీ సమేత అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు


Address :

Flat No.5; Plot 61,

Siddardha Apartments,

Siddardha Nagar,

Hyderabad - 500 038, A.P, India

E-Mail : deekshitulu_a@yhaoo.com

Mobile : 9393021360

Website: http://www.geetadeeksha.com/

(సంపుటి - I)



# “హరి యేమనెనే అలిగెనో”

## అలమేలుమంగమ్మతో అలనాటి హరి అనురాగ పరిమళం

## ఆత్మ పరమాత్మల ఐక్యము

ఇది


అన్నమయ్య పదకవితకు అమరవాది పరిచయం





శ్రీరస్తు

శుభమస్తు                    అవిఘ్నమస్తు





# హరి యేమనెనే అలిగెనో

ఎన్నుకొన్న

అన్నమయ్య మధురకీర్తనలకు

# పరిచయ పరిమళము

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.

# హరి యేమనెనే అలిగెనో
(సంపుటి - I)

మొదటి ప్రచురణ
**మార్చి 2014**

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :
కె.వి.ఆర్.
98495 79345





## అంకితము

**నా ఇష్టదైవము, శ్రీ వేంకటరమణునికి**
**ఆయనలో ఇమిడిపోవాలని ఆశపడే రమణులకు...**



కం॥ హరియేమనెనే అలిగెనొ
వెరపందిన నాయికలును వేదనజెందన్
కరిగెడి వేంకటపతికిని
తరుణులకిది అంకితమ్ము ధన్యత నిత్తున్.

తా॥ "హరి యేమన్నాడే, ఒకవేళ నాపై అలిగాడా? ఇక యెన్నటికీ మమ్మల్ని చూడడా" అని భయపడి దుఃఖిత అయిన తన నాయికనావిధంగా చూచి కరిగిపోయే తిరుమల శ్రీవేంకటరమణునికి, ఆయన తరుణులకు ఈ కృతిని నాకు ధన్యత కలుగునట్లు అంకితమిచ్చెదగాక!

# హరి యేమనెనో అలిగెనో

(సంపుటి - I)

ఎన్నుకొన్న అన్నమయ్య మధుర కీర్తనలకు
పరిచయ పరిమళము

## విషయ సూచిక


| క్ర.సం. | విషయం | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | అంతచక్కనివాఁడవు అన్నిటా జాణవు నీవు | 28/146 | 19 |
| 2. | అలమేలుమంగవు నీవౌనే పతిఁ జేకొంటివి | 28/118 | 31 |
| 3. | ఆలిమగని జాడలు అందరికి నివియే | 28/290 | 23 |
| 4. | ఇంకానేల దాచేవు ఇంతకు వచ్చెబనులు | 18/209 | 49 |
| 5. | ఇప్పుడుగారమణుడు యీడేరె నా కోరికలు | 28/570 | 18 |
| 6. | ఇచ్చకమేసేసితేను యీడేరు వలపులు | 29/451 | 50 |
| 7. | ఇట్టి నెరవాదివి నీవలమేల్మంగవు | 28/123 | 17 |
| 8. | ఇట్టుండవలదా యిరవైన మోహము | 7/118 | 3 |
| 9. | ఈతని నాపొందులు యికజూడవే నీవు | 28/1554 | 27 |
| 10. | ఎంత భాగ్యవంతుడవో యీకె నీకు దేవులాయ | 28/474 | 24 |
| 11. | ఎంతయెమ్మెలబొరలేవేమే నీవు | 29/32 | 39 |
| 12. | ఎక్కడ నుండి వచ్చెనో యేకరి నీరతులకు | 29/374 | 41 |
| 13. | ఎచ్చటజూచినా నితడై కృష్ణుడు | 29/31 | 38 |
| 14. | ఎట్టు సాధించవచ్చునే యిటువంటి మగవాని | 28/565 | 20 |




హరి యేమనెనే అలిగెనో


| | | | |
|---|---|---|---|
| 15. | ఎన్నడు నేరిచేనో యింతేసి దంటతనాలు | 29/155 | 46 |
| 16. | ఎన్నడు నెరుగమయ్య యిటువంటి వలపుల్ను | 28/353 | 34 |
| 17. | ఎదుటనేవుండగాను యెడమాటలేమిటికి | 29/489 | 43 |
| 18. | ఎన్ని వేదాలు చదివి యెంతసోమయాజి | 16/493 | 11 |
| 19. | ఎవరికి గలవమ్మా యిటువంటి సొబగులు | 28/272 | 30 |
| 20. | ఏమని విన్నవించేము ఇంతిచందములు | 28/272 | 30 |
| 21. | ఏమని విన్నవించేము యీపెసుద్దులు | 28/271 | 36 |
| 22. | ఏమి చెప్పీనే తనయెమ్మెలు చెలులతోడ | 16/488 | 15 |
| 23. | ఏలనన్నొడబరచేవు యెరుగనా నీ గుణము | 28/553 | 31 |
| 24. | ఒకతొకతెనెరుగకుండ నందేదాగిరి | 16/432 | 16 |
| 25. | ఓయమ్మచూడగదరె వుద్దగిరికృష్ణుడు | 16/433 | 10 |
| 26. | కాంతపై మిక్కిలి బత్తిగలిగిన చెలులాల | 29/149 | 44 |
| 27. | కొమ్మలాల యిదేమంచి కొలువు వేళ | 7/449 | 4 |
| 28. | గద్దెమీదనున్నవాడు కరుణానిధైనవాడు | 28/435 | 8 |
| 29. | చక్కనిగుణవంతుడు సరినీకుమగడాయ | 28/361 | 25 |
| 30. | చదురంగమాడమని సాధించేవు | 16/482 | 13 |
| 31. | చల్లలమ్మేదానవు అచ్చపుమగనాలవు | 7/322 | 2 |
| 32. | చెప్పజెప్పగొత్తలాయ చెలియ నీసొబగులు | 28/507 | 22 |
| 33. | చూచిచూచి మీ పెండ్లికి సోబనపాడేముగాక | 28/352 | 35 |

| | | |
|---|---|---|
| 34. తప్పులెంచనేనిన్ను దరుణీ | 29/416 | 45 |
| 35. తెలిసినవాడవు ధీరుడ విన్నిటా నీవు | 7/243 | 5 |
| 36. నన్నేల పిలిచేవు నగుతానౌపె యింటికి | 28/443 | 29 |
| 37. నిన్ను జూచెప్పటినుండి నేడు నాకువరవయ్యా | 29/193 | 51 |
| 38. నీవేమంచితనాలు నెరుపనేరుతువమ్మా | 29/74 | 42 |
| 39. పంచుక అనుభవించుపడతుల | 7/517 | 6 |
| 40. బుద్ధి చెప్పేము నీకు పుట్టినయింటివారము | 28/117 | 33 |
| 41. భూపతిచెరువుచెంత బొంచుకరతులకును | 29/193 | 47 |
| 42. మచ్చిక గలిగితేనేమి మరగువద్దా | 29/460 | 48 |
| 43. మన్నించీబదారువేల మగడు తాను | 16/487 | 14 |
| 44. మరగులమాటలేల మాపుదాకాను | 16/434 | 12 |
| 45. మెచ్చిరిందరును నిన్ను మేలుమేలే | 28/351 | 37 |
| 46. మేలుకు మేలేకాక మెరమెరలేమిటికే | 28/171 | 9 |
| 47. వట్టి సిగ్గులేటికి వద్దికి వచ్చేనిభుడు | 28/119 | 28 |
| 48. వేగమేయానతీవమ్మా వినవేడుకయ్యీనాకు | 29/461 | 40 |
| 49. సిగ్గువడీసుమ్మీ చిన్నవయసుది | 28/370 | 7 |
| 50. సుదతికి మీరందరుజుట్టాలైన పలము | 28/273 | 29 |
| 51. హరియేమనెనే అలిగెనో | 7/329 | 1 |






# ప్రార్థన

కం॥ శ్రీవిభుడు వేంకటేశుడు
ఆ వైకుంఠంబునందు అమరినవాడై
ఏవేళగాచునార్తుల
నీవే దిక్కన్న చాలు నిరుపమ భక్తిన్

ఉ॥ ఈకడ జెప్పబూనెదను యేపుగ వేంకటనాథు గొల్చుచున్
చేకొని అన్నమయ్య తను చెప్పిన యీమధురంపు కీర్తనల్
మూకగ భావమున్ దెలుప ముత్యపు జల్లును బోలు భాషలో
తూకపు ముందుమాట పరితుష్టత బొందగ యెంచి వ్రాసెదన్.

చం॥ సరసములైన కీర్తనల చాలపదంబులు ఒక్కతీరునౌ
విరివిగ అర్థముల్ తెలుప వింతగబుట్టు విరక్తి వీటిపై
మురియుచు తీపియున్ తినగ మొత్తు మొగంబని నేర్వగా వలెన్
పరిచయమందునే తెలుప భావమునీకడ నిశ్చయించితిన్.

సీ॥ శృంగారకీర్తనల్ బంగారు పుట్టమ్ము
కట్టు దేవర కింపు కలుగజేయు
మధుర భక్తికి తల మాధవుండేవూచు
సెలవినవ్వుల జిల్కు సిరిపెనిమిటి
సరసభక్తిని మెచ్చి సతి జూచి కొంటెగా
కనుగీటు తిరుమల కరివరదుడు
అమలిన రసవృష్టి అన్నమయ్య పదంబు
మురిపించు నెల్లరన్ తరతరముల

ఆ.వె॥ మధుర కీర్తననగ మంచి శృంగారంబు
గూడుకొన్నపాట కురియు దేనె
అణువుమాత్రమైన అశ్లీలతుండదు
మనసు నిర్మలముగ మారవలయు.

మత్తకోకిల॥
పరిచయంబును సేయనెంచితి బాగుబాగని మెచ్చగా
పరిమళంబులు చిల్కు కీర్తన భావమున్ కుదియించుచున్
సరసమొప్పెడి మాధురిన్ వెదజల్లు వేంకటనాయకా!
మురిపెమందగ ముద్దుగుమ్మల ముంచుమా రతివేడుకన్.

మ॥ కరిగించెన్ హరి ముద్దుగుమ్మ రతులన్ కళ్యాణమైకూడుచున్
వరపుత్రుండగు అన్నమయ్య అటుపై పాడెన్ భళా! కీర్తనన్
యెరుకన్ గూర్పగ వాటికిన్ పరిచయం బేనెంచి సేతున్ ప్రభూ!
దరికిన్ జేర్చుము నాదు'నావ' సుడిలో తాజిక్కి అల్లాడినన్.

శా॥ శృంగారంబన చిన్నచూపు తగునా, సేవింపగా శ్రీపతిన్
బంగారంబగు బాటరా కలుగునా పాపంబు ఆవంతయున్
క్రుంగంబోకుర వేంకటేశ్వరుడు తాగూడంగ గోపెమ్మలన్
సంగంబౌనుర అన్నమయ్య కవికిన్ సంతృప్తి కల్గెన్ గదా!





# తొలిపలుకు

అన్నమయ్య శృంగారకీర్తనలు ఇదివరలో ఏలుకో శృంగారరాయ అనే పేరుతో మున్నుడి, భావవివరణలతో 101 కీర్తనలు అందించాను. ఈనాడు మళ్ళీ అన్నమయ్య సరసకీర్తనలను, శృంగార కీర్తనలను అన్నమయ్య మధుర కీర్తనల పేరుతో అందిస్తున్నాను. వీటికి 'హరి యేమనెనే అలిగెనో' అనే సంపుటిగా వెలువరిద్దామని సంకల్పం.

శ్రీవేంకటేశ్వరుని కృపా కటాక్షవీక్షణముంటే ఈ నాప్రయత్నం వెలుగులోకి వస్తుందని నా అపార నమ్మకం ఆపై కొండలరాయని దయ, నా ప్రాప్తము. నేను ఇదివరలో అన్నమయ్య శృంగార కీర్తనలు తీసుకొన్నప్పుడు "రవ్వా శ్రీహరి" గారి నిఘంటువు నావద్దలేదు. అందువలన ఆనాడు నేను ఎక్కువ శ్రమపడవలసి వచ్చింది. ఈనాడు ఆ కష్టంలో సగం పడితేచాలు గట్టెక్కవచ్చని నా నమ్మకం.

ఆ పురుషోత్తముడే ఏదో ఒక దారిచూపిస్తాడు. దీనిలోనే గాయకులు రాగంకట్టి పాడిన కొన్ని కీర్తనలను యెన్నుకొన్నాను. సాహిత్యపరంగానేకాక సంగీతపరంగా కూడా ఈ సంపుటి అందరినీ అలరిస్తుందని నా ఆశ.

"హరి నీమయమే అంతాను" అనే పేరుతో నేను శ్రీవేంకటరమణుని కృపవలన 375 అన్నమయ్య శృంగార, భక్తి, వైరాగ్య, తత్త్వ చింతన కీర్తనలు 4 సంపుటములుగా వెలువరించాను. శృంగార కీర్తనలన్నీ వివరిస్తే రసికలోకానికి తప్ప, శరణాగతులకు పెద్ద ఉపయోగకరము కాదేమో అని నామట్టుకు నాకనిపించింది. మనకు లభ్యమైన అన్నమయ్య కీర్తనలన్నీ సింహభాగము శృంగార కీర్తనలే. అయినా నేటి సమాజంలో అన్నమయ్య కీర్తనలు వినేవారేకానీ విశ్లేషించిన తాత్పర్యవివరణ చదివేవారు కోటికొక్కరు. ఒకవేళ చదివినా రెండవ పర్యాయం చదివేవారుండరు. మరి అన్నమయ్య అన్నట్లు వరద ఆగిపోయాక అడ్డుకట్టవలన లాభమేమి? కానీ అన్నమయ్య కీర్తనలు పాఠకలోకానికి పరిచయం చేయాలనే నాకోరిక తీరనిది. అందుకనే అన్నమయ్య శృంగార కీర్తనలను పాఠకలోకానికి పరిచయం చేస్తే చాలు అనే సత్సంకల్పంతో నా ప్రయత్నానికి "హరియేమనెనే అలిగెనో" అని నామకరణంచేసి శ్రీకారం చుట్టాను.

ఒకవేళ ఈ శృంగార కీర్తనలకు విడమరచి భావవిశ్లేషణ చేసినా ఇక్కడ చూపిన విధంగా వస్తుంది.

**భావవిశ్లేషణ:**

ఓ చెలియా! హరి నామాటవిని యేమనెనే (ఏమని అన్నాడే?) కొంపదీసి అలిగెనో (అలిగినాడాయేమే?) విరహినై నేనుండ (నేనింత విరహ బాధతో వేదన చెందుతుంటే) యీవేళ ఇంకా రాడేలనే?

మళ్ళీ మళ్ళీ తనను నా మాటలతో కొసరను (ఆక్షేపించను) అని వేడుకొన్నాను కదా! అతిశయించిన హరి యేమనినాడే. తరుణులందరూ వచ్చేశారు కదా! ఇంకా తాను అక్కడనేవున్నాడు. కారణమేమిటే? ఎరవెరవై (విలక్షణముగా) నున్న ఆతడు అప్పుడు తాను నా గురించి యేమనినాడే?

ఓ చెలీ! నావాకిటిదాకా వచ్చి తిరిగెనట (మరలిపోయెనట), నావిభుడు. కారణమేమైవుంటుంది? తానెందుకలా చేశాడో చెప్పినాడా? ఈ రాకపోకల (వచ్చీపోవుటలోనే) తెల్లవారేటట్లుంది. ఈకడ (ఇప్పుడు) తుదమాట యేమనెనే (తన ఆఖరి మాటగ యేమి చెప్పమంటాడే.)

ఓ చెలియా! నా తలపులో ప్రియము (నా మనస్సులో అతని నెంత ప్రేమిస్తున్నానో) తనకే తెలుసును కదే! తన మనసులో మాట యెలుగెత్తి యేమనెనే (గొంతువిప్పి ఏమీ చెప్పలేదా?) ఇప్పుడు ఆయనగారు నామాట యేమి వింటున్నాడని? తానే బలవంతంగా వచ్చి ఆ శ్రీవేంకటేశ్వరుడు నిన్ను నన్ను కూడినాడు కదా! దాని గురించి యేమనినాడే?

దీనివలన ప్రయాస తప్పించి విశేషఫలితము నాకు కనిపించలేదు. బాగా ఆలోచించి ఒక కృత నిశ్చయానికి వచ్చాను. ఈ "హరియేమనెనే అలిగెనో"లో యెన్ని సంపుటములు చేస్తానో తెలియదు కానీ ప్రతి శృంగార కీర్తనకు "పరిచయపరిమళం" వ్రాసి అన్నమయ్య ఆరాధన కొనసాగిస్తాను. శ్రీవేంకటేశ్వరుని నామస్మరణ యెలాగూ ఇందులో భాగమే కదా!

శృంగార కీర్తనలంటే చదువరిలో శృంగారభావాలను తట్టిలేపేవి. జావళీలు ఆ కోవకే చెందుతాయి. జయదేవుని అష్టపదులవలె, అన్నమయ్య కీర్తనలలో కూడా అశ్లీలతకి తావులేదు. అష్టపదులలో హరి దర్శనమైతే ఇక్కడ శ్రీవేంకటేశ్వరుడు శృంగారరాయడు. అలమేల్మంగమ్మ, ఆమెచెలికత్తెలు, వేంకటేశుని పరివారంలోని స్త్రీలు కీర్తన పాడుతున్నారు అన్నట్లు వుంటాయి. కొండొకచో అన్నమయ్య తనే నాయికా నాయకులకు సలహాలిస్తారు. అప్పుడూ ఆయనా స్త్రీగా ఆ కీర్తనాలపిస్తున్నారా అనిపిస్తుంది. నాకు ఇవి శృంగారకీర్తనలన్న భావం రాదు. ఇవి





అన్నమయ్య మధుర భక్తిని ప్రతిపాదించే మధుర కీర్తనలు. సరసత్వము గలవికాబట్టి సరస కీర్తనలు అనికూడా అనవచ్చును. అన్ని కీర్తనలూ దాదాపు ఒకే పంథాలో నడిచినందువల్ల పునరుక్త భావన కొండొకచో కలుగవచ్చును. మరి మన నాయకీ నాయకులు మానవమాత్రులు కారుగదా! జగత్పిత, జగన్మాతలు వారు.

ఏది యేమయినప్పటికీ ఈ మధుర కీర్తనలకు పరిచయ పరిమళం మాత్రమే అందించడం జరిగింది. కొన్ని తెలుగు మాటలకి కూడా అర్థం చెప్పవలసి వచ్చింది. ఎందుకంటే అది 600 ఏళ్ళ క్రిందట నేటి రాయలసీమ మాండలిక భాష. అటువంటి సందర్భాలలో చదువరుల సౌకర్యార్థం కొన్ని పదములకు నేటి తెలుగు అర్థం ఇవ్వటం జరిగింది. అలాగే కొన్ని కీర్తనలలో తమిళ, కన్నడ పదములు కూడా ఆనాటి వాడుకవలన మనకు కనిపిస్తాయి.

ఈ కీర్తనలు ప్రత్యేకించి రసిక భావనలున్న భక్తులకు. ఇరవైయేళ్ళలోపు వారికి, అరవై యేళ్ళు పైబడిన వారికి కాదు. అలాగని వారు చదువరాదని నా అభిప్రాయము కాదు. పచ్చి మామిడికాయ, బాగా మగ్గి మెతకబారిన మామిడికాయ తినలేం కదా! ప్రౌఢులకు ప్రింటు సన్నగా వున్నా పర్వాలేదని ఈ "హరియేమనెనే అలిగెనో" పేజీకి ఒక్క కీర్తన పరిచయ పరిమళంతో సహా అందిస్తున్నాను. ఆస్వాదించండి.

చివరికి వినండి. కొంతమంది అల్పజ్ఞానంతో అన్నమయ్య బూతుకీర్తనలు చెప్పాడని ఆ రోజుల్లో తమ అక్కసును వెళ్ళబోసుకొన్నారు. అటువంటి వారు నేటికాలంలోనూ వున్నారు. వారందరికీ కనువిప్పే నామాటలివే. పండితులు అన్నమయ్య శృంగార కీర్తనలను పరిష్కరించి ఆ కీర్తనలలోని నాయకుడు పరమాత్మ, నాయిక పరమాత్మ సంగమం కోరే ఆత్మ అని విశదీకరించారు. జనబాహుళ్యానికి వారు స్త్రీ పురుషులనిపిస్తే వారు భగవంతుని పాఠశాలలో ఎల్.కె.జి. విద్యార్థుల క్రింద లెక్క అన్నమాట. మరి పి.హెచ్.డి. అంటే ఆత్మ పరమాత్మను చేరుకోవటం, జరిగేనా? ఏమో! శ్రీహరికే తెలుసు.

అందుకే మనం ఈ అద్భుత సాహిత్యాన్ని మధురకీర్తనలు అందాము. అన్నట్లు ఇవి సరసము చిందించే సరసకీర్తనలు కూడా.

**తిరుమల తిరుపతి దేవస్థానములవారికి సదా కృతజ్ఞుడను**

***Please visit:*** **geetadeeksha** in google Network, for my other works









సంఖ్య :329 సంపుటము : 7 పుట: 203 రాగం : బౌళి

**1 హరి యేమనెనే అలిగెనో**
**విరహినై నేనుండఁగా యేల (యీవేళ) రాఁడాయ** ॥పల్లవి॥

**మరలి మరలి తన్ను మాటలఁ గొసరను**
**యిరవైన విభుఁడేమనెనే**
**తరుణులే వచ్చితిరి తానాడనున్నాఁడు**
**యెరవెరవై తానేమనెనే** ॥హరి॥

**వాకిటికిందాఁక వచ్చి తిరిగెనట**
**యేకారణమిది యేమననే**
**రాకలఁ బోకల రాతిరాయనిదె**
**యీకడఁ దుదమాఁ టేమనెనే** ॥హరి॥

**తలపులో ప్రియము తానే యెరుఁగును**
**యెలుఁగెత్తొకమాఁటేమనెనే**
**బలిమి శ్రీవేంకటపతి దా విచ్చేసి**
**యిల ననుఁగూడెను యేమనెనే.** ॥హరి॥ **329**

**పరిచయ పరిమళం :**

ఆదిలోనే హంసపాదు అన్నట్లు ఈ కీర్తన పల్లవిలోనే పొరబాటు దొర్లింది. "విరహినై నేనుండఁగా యేలరాడాయె" అనివున్నది. విరహినై లోని'వి'కి యేలరాడాయెలో'యే'కి యతి భంగమైనది. కావున ఈ చరణము "విరహినైనేనుండఁ యీవేళరాఁడాయ" అనివుంటే బాగుంటుందని విజ్ఞుల అభిప్రాయము. నాయిక తన చెలికత్తెను అడుగుతోంది హరి యేమన్నాడే? నాపై అలగలేదు కదా! ఇక్కడ నేను విరహంలో వేగిపోతుంటే యీవేళ యెందుకు రాడే అని తెగవ్యాకులపడుతున్నది. నా తలపులలో కూడా అతనంటే నాకు ప్రేమేకదే! యెలుగెత్తి ఒక్కసారికూడా నేనంటే ఇష్టమని అనలేదా? మరి తాను విచ్చేసినపుడు బలవంతంచేసి మరీ కూడినాడు కదే! శ్రీవేంకటపతికి నేనంటే ప్రేమ వున్నట్టా లేనట్టా? అని నాయిక సందిగ్ధంలో పడింది.

★ **ఎరవెర** – విలక్షణము ★ **కొసరను** – ఆక్షేపించను





సంఖ్య :322 సంపుటము : 7 పుట: 199 రాగం : శ్రీరాగం

**2 చల్లలమ్మేదానవు అచ్చపుమగనాలవు**
**మల్లడిమాపొందులేల మరిగేవు నీవు** ॥పల్లవి॥

**కమ్మి పున్నమవెన్నెల గాదెఁబోసికొంటివటే**
**యెమ్మెకే సెలవి నవ్వేవేపొద్దును**
**తమ్మిరేకులెల్లాఁ దెచ్చి దాఁచుకవుందానవటే**
**కుమ్మరించేవు కన్నులఁ గుచ్చికుచ్చి మీఁదను** ॥చల్ల॥

**చిలుకపలుకులెల్లఁ జేన విత్తుకొంటివటే**
**వొలికేవు పెదవుల నొకటొకటే**
**కులికి చిగురులెల్లఁ గోసితటే మావాకిట**
**వెలయ నీయడుగుల వెదచల్లేవు** ॥చల్ల॥

**సోగతీఁగెలెల్ల నీసొమ్ముటే నీచేతులను**
**భోగపుఁ గాఁగిట నన్నుఁ బొదిగేవు**
**యీగతి నే శ్రీ వేంకటేశుఁడ కూడితి నిన్ను**
**జాగులేల యిక్కడనే సతమై నిలువవే.** ॥చల్ల॥ **322**

**పరిచయ పరిమళం :**

"మగనాలి" అంటే భర్తచాటు భార్య అని అర్థం. ఈ గొల్లభామ యెప్పుడో కృష్ణయ్య చెయ్యిపట్టుకొంటే నా జోలికి రాబోకు నేనసలే మగనాలిని అని బీరాలు పోయివుంటుంది. ఇప్పుడు కృష్ణయ్యకు అవకాశం దొరికి మాటకి మాట ఒప్పచెబుతున్నాడు. పాపం! నీవు చల్లలమ్ముకొనే గొల్లభామవు కదా! మా మల్లడి పొందు నీకేలనే అంటున్నాడు. అచ్చము రేపల్లె కొంటె రసికునివలెనే మాట్లాడుతున్న కృష్ణయ్య దురుసుమాటల్లోంచి వలపు మాటలలోకి మారిపోయాడు. "వ్యాపించిన పున్నమి వెన్నెల కలబోసికొన్నావా యేమిటే చల్లని నవ్వులు వెదజల్లుతున్నావు. తామరపూలరేకులను నీకళ్ళల్లో దాచుకొన్నావే యేమిటే మాటిమాటికీ గుచ్చి గుచ్చి చూస్తున్నావా అనేట్లు నీ చూపులు కుమ్మరిస్తున్నావు". అని భావకవిత చెప్పాడు. చివరికి నేను శ్రీవేంకటేశ్వరుడనే జాగులేల? ఇక్కడ శాశ్వతంగా నాతోవుండవే అని ఆమెను కూడినాడట. అన్నమయ్య మధురగీతమిది.

★ **మల్లడిపొందు** – మిక్కుటమైన కూటమి ★ **ఎమ్మె** – గర్వము ★ **సతమె** – శాశ్వతమె
★ **తమ్మిరేకు** – తామరపూవురేకలు ★ **సోగతీగెలు** – సొగసైన లతలు

సంఖ్య :118 సంపుటము : 7 పుట: 72 రాగం : సాళంగనాట

**3 ఇట్టుండ వలదా యిరవైన మోహము**
**వొట్టుకొనీఁ జెమటలు ఉవ్విళ్ళూరును** ॥పల్లవి॥

**తలపోసి తలపోసి తనువెల్లాఁ బులకించి**
**వలపులఁ బొద్దువుచ్చీ వనిత**
**నెలకొని పానుపుపై నిద్దిరించి నిద్దిరించి**
**కలలోన నిన్నుఁ గూడీఁ గామిని** ॥ఇట్టు॥

**నీపదాలు పాడిపాడి నెయ్యమునఁ గరఁగుచు**
**రాపుగానానందించీ రమణి**
**చూపులనెదురుచూచిచూచి యంతలోనె తరి**
**తీపులనే తనిసీని తెఱవ** ॥ఇట్టు॥

**వచ్చివచ్చి నీతోడ వన్నెగా సరసమాడి**
**మెచ్చీనిదివో యలమేలుమంగ**
**యిచ్చకుఁడ శ్రీవేంకటేశ నిన్నిపుడు గూడి**
**నిచ్చలు నిన్నుభోగించీ నీపట్టపుదేవి.** ॥ఇట్టు॥ **118**

**పరిచయ పరిమళం :**

బాగుగా అతిశయించిన మోహము అంటే ఇట్లావుండాలి అంటున్నారు అన్నమయ్య. ఒట్టుకొనీ (ఒట్టుపెట్టుకొని) చెమటలతో తడిసి ముద్దవుతున్నా ఆమె నీవెప్పుడు వస్తావోనని తెగ ఉవ్విళ్ళూరుతున్నది, అంటున్నారు. నీ గురించి ఆలోచించి ఆలోచించీ ఆమె శరీరమంతా పులకరించింది. ఆ వనిత నీవలపును తలచుకొంటూనే పొద్దుబుచ్చుచున్నది. ఇక ఇట్లాకాదనుకొని నిద్రపోయి నీతో తన కలలో కూడినది. ఆ కామినికి నీవనిన అంతయెడతెగని మోహము అంటున్నారు. మధురభక్తిలో వలపుతలపులే మాధవుని సేవ. అలమేల్మంగమ్మ నీ దరిజేరి, నీ సరసమును మెచ్చినది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీ పట్టపురాణి నిన్నిపుడు కూడి భోగించినదయ్యా! అని అంటున్నారు.

★ **ఇరవు** – నెలకొను, స్థిరపడు ★ **రాపుగ** – మిక్కుటముగా
★ **తనిసి** – తనివిదీరి ★ **తరితీపులు** – తమకము





సంఖ్య :449 సంపుటము : 7 పుట: 276 రాగం : గౌళ

**4 కొమ్మలాల యిదె మంచికొలువువేళ**
**చిమ్ముచు విన్నపాలెల్లఁ జేయరే యిపుడు** ॥పల్లవి॥

**భామఁ దొడపైనిడుక ప్రహ్లాదవరదుఁడు**
**ఆముకొని సరసములాడుచున్నాఁడు**
**దోమటివలపులను తొప్పఁదోఁగి చెమటల**
**ఆమని వేడుకనోలలాడుచున్నాఁడు** ॥కొమ్మ॥

**చెలి విడెమియ్యఁగాను శ్రీనారసింహుఁడు**
**నలువంకఁ బకపక నవ్వుచున్నాఁడు**
**పులకలజొంపముల పువ్వుదండలతోడ**
**చెలరేఁగి మచ్చికలు సేయుచున్నాఁడు** ॥కొమ్మ॥

**పొంది లకిమమ్మతోడ బొమ్మిరెడ్డిచెర్లహరి**
**యిందరి శ్రీవేంకటేశుఁ డేలుచున్నాఁడు**
**సందడిరతులఁ జొక్కి జవ్వనమదము మించి**
**మందెమేళాము సేసుక మన్నింపుచున్నాఁడు.** ॥కొమ్మ॥ **449**

**పరిచయ పరిమళం :**

బొమ్మిరెడ్డిచెర్ల – అనేవూరిలో నెలకొన్న ప్రహ్లాదవరద నరసింహస్వామిపై చక్కటి మధురకీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. శ్రీనారసింహుని దేవేరి శ్రీలక్ష్మి. జానపదలోకం ఆమెను లక్ష్మి అనలేక 'లకుమమ్మ' అని పిలుస్తారు. ఈ ప్రహ్లాదవరదుడు శృంగారప్రియుడేనండీ. ఎందుకంటే భక్తుల విన్నపాలు వినటానికి ఆయన కొలువుదీరినా తన భామ శ్రీలక్ష్మిని తన తొడపై కూర్చొనబెట్టుకొని, సరసములాడుతున్నాడు. వలపులలో అలసిపోయినందువలన చెమటలలో ఓలలాడుతున్నాడు. వసంతోత్సవముల వేడుకలో వున్నాడు. ఈ బొమ్మిరెడ్డిచెర్ల హరి (సింహము) నిజానికి తిరుమల శ్రీవేంకటేశ్వరుడే. జవ్వన గర్వముగల ఈ నరసింహుడై అందరినీ మన్నిస్తున్నాడు.

★ **చిమ్ముచూ** – విక్షేపించుచు ★ **ఆముకొని** – కైపెక్కి
★ **దోమటివలపు** – విందులో శృంగారము ★ **విడెము** – తాంబూలము
★ **మందెమేళము** – చనువు

సంఖ్య :243 సంపుటము : 7 పుట: 151 రాగం : గుజ్జరి

**5 తెలిసినవాఁడవు ధీరుఁడవిన్నిటా నీవు**
**చలము సాదింతురా సతులతో నీవు** ॥పల్లవి॥

**అప్పటి మానవు మాటలాపెతో నీవు**
**కప్పురమిచ్చినమీఁద గలదా వాదు**
**చెప్పరాని తిట్టుదిట్టి చేయెత్తి మొక్కితేను**
**వొప్పుగొనవద్దా మతి వొరట్లేమిటికి** ॥తెలిసి॥

**తలవంచుకున్నాఁడవు తరుణియెదుట నీవు**
**సెలవి నవ్వినమీఁద సేతురా యింత**
**కలువపువ్వులవేసి కౌఁగలించుకొంటేను**
**అలుకదీరఁగవద్దా ఆనలు మరేఁటికి** ॥తెలిసి॥

**బింకములు నెఱపేవు ప్రియురాలి యెదుటను**
**సంకెలు దీర్చిన మీఁద చలమేఁటికి**
**అంకెల శ్రీవేంకటేశ అలయించి నిన్నుఁగూడె**
**మంకులు మానఁగవద్దా మదము మరేటికి.** ॥తెలిసి॥ **243**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ మధుర కీర్తనలో, నీవు ధీరుడవు, అన్నీ తెలిసినవాడవు కదా! ఈ విధంగా సతులమీద పట్టుదల చూపిస్తారా యెవ్వరైనా? అని వేంకటేశ్వరునే మందలింపుగా అంటున్నారు. నీవామెకు కర్పూరతాంబూలం ఇచ్చాక ఇంకేమి కాదని వాదిస్తావు? అదేమిటంటే తిట్లులంకించుకొంటావు. అప్పటికీ పాపం, మీ ఆవిడదగ్గర నీ తలవంచుకొనే వున్నావు. చిరునవ్వులు చిందిస్తూనేవున్నావు. నీవు ఆమెపై కలువపూలువేసి కౌగలించుకొన్నా ఆవిడ కోపం చల్లారలేదు. నీవు ఎన్ని ఒట్లు పెట్టుకొంటే ఏం లాభం? నీ మట్టుకు నీవు బింకంగా ఆమె అనుమానాలు తీర్చావు. నిన్నీ విధంగా శ్రమపెట్టి అప్పుడు నిన్ను ఆమె కూడినది. ఎందుకో ఆమెకీ మంకుపట్టుదల, అంటున్నారు.

★ **అప్పటిమానవు** – పాత అలవాటు మానుకోవు ★ **ఒరట్లు** – మంకుపట్టుదల
★ **సెలవి నవ్వులు** – చిరునవ్వులు ★ **సంకెలు** – అనుమానాలు
★ **అలయించి** – శ్రమపెట్టి





సంఖ్య :517 సంపుటము : 7 పుట: 317 రాగం : సామంతం

**6 పంచుక అనుభవించు పడఁతులమిందరము**
**ముంచి నీమన్నన నాపై మోహముగలంతే** ॥పల్లవి॥

**మనసిచ్చి నాతోను మాటాడుటే పదివేలు**
**యెనయుమనుచు దూరనెంతదానను**
**చనవు నీదొకటే సతులు పదారువేలు**
**పెనఁగితే నెంతవచ్చు బెరసి నావంతు** ॥పంచుక॥

**యిచ్చగించి నాయెదుట నిరవవుటే పదివేలు**
**యెచ్చరించి కొసర నేనెంతదానను**
**అచ్చపు నీకాఁగిలిడే అతివలు శానాశాన**
**ఇచ్చితివి నావంతు యెంతవచ్చునందును** ॥పంచుక॥

**కందువ నీరతి నన్నుఁ గలయిటే పదివేలు**
**యిందరిలోఁ జెప్పేనంటే యెంతదానను**
**విందుల శ్రీవేంకటేశ విభుఁడవు నేమాండ్ల**
**మిందులో మించితి వంతుకెంత వచ్చునిపుడు.** ॥పంచుక॥ **517**

**పరిచయ పరిమళం :**

ఓ రమణుడా! మేమెంతమంది పడచులము వున్నా సంకోచించకు. మమ్మల్ని పంచుకొని వంతులప్రకారం అనుభవించరాదా? నీమన్నన, నాపై మోహము కలగాలి. అంతే అంటున్నది, ఆ జవ్వని. అన్నమయ్య తన ఈ మధురకీర్తనలో పదహారు వేలమంది భామలతో పంచుకోవాలంటే శృంగారరాయుడా! నావంతు యెప్పుడొస్తుందో చెప్పగలమా? ఒకవేళ వాళ్ళని నిందిస్తే వూరుకొంటారా? పోనీ, నీ కౌగిట్లో నీవిచ్చే 'శానాశాన' (మీదుమిక్కిలి) సుఖం పొందుదామా అంటే నావంతు యెప్పుడొస్తుందో తెలీదు. నీరతి సౌభాగ్యంతో నన్ను కలిస్తే నాకదే పదివేలు.

నీ భామలందరిముందు, ఈమాట నేను చెప్పాలంటే నాకెన్ని గుండెలుండాలి? ఓ తిరుమలరాయా! మేము స్త్రీలము కదా! మాకు లెక్క అంతగా తెలియదు కాని నీవే చెప్పు నిన్ను పంచుకొంటే యెవరి వంతు కెంతవస్తుందో!!

★ **ముంచి** – అతిశయించి ★ **చనవు** – వలపు ★ **పెనగితే** – బలవంతాన పోట్లాడితే
★ **నేమాండ్లము** – నేము+ఆండ్లము = మేము స్త్రీలము
★ **ఇవవుట** – నెలకొనియుండుట

సంఖ్య :370 సంపుటము : 28 పుట: 244 రాగం : శంకరాభరణం

**7 సిగ్గువడీ సుమ్మీ చిన్నవయసుది**
**వొగ్గిసారెనెంత వొరసేవయ్యా** ॥**పల్లవి**॥

**వలచి యేపొద్దు వద్దనున్నదంటా**
**చెలినేల కాకు సేసేవయ్యా**
**చెలిమి సేయఁగా చెమరించెనంటా**
**నలిరేఁగి యేమి నవ్వేవయ్యా** ॥**సిగ్గు**॥

**కనుఁగొని మతి గరఁగెనంటాను**
**చెనకేల గోరఁ జిమ్మేవయ్యా**
**వినయాన నిన్ను వేఁడుకొనెనంటా**
**గునిసి యేమాడుకొనేవయ్యా** ॥**సిగ్గు**॥

**కందువల నిన్నుఁ గాలు దొక్కెనంటా**
**చెంది యేమి సన్నసేసేవయ్యా**
**యిందుకె శ్రీవేంకటేశ కూడితివి**
**అంది మర్మమేల అంటేవయ్యా** ॥**సిగ్గు**॥

**పరిచయ పరిమళం :**

అతిచిన్న వయసు చిన్నది వలచి వేంకటపతికి దగ్గరయినది. ఆమె సిగ్గుల మొగ్గ. అన్నమయ్య స్వామిని మందలిస్తున్నారు. నీవు ఆమెను ఒగ్గేస్తావేమోనని పాపం యెంత వ్యాకులపడుతున్నదయ్యా! అంటున్నారు. నిన్ను వలచి నీవెప్పుడో కోరితే అప్పుడు నీ సందిట చేరుతున్నదని యెంతచులకనగా చూస్తున్నావు ప్రభూ! నీవద్ద చేరగానే చెమరించిపోతుందని ఆమె అంటే నీకు అలుసు. అందుకే విజృంభించి యేమి నవ్వుకొంటున్నావయ్యా! తనని అలా చూస్తుంటే నీ మనస్సు కరిగిపోతోందని నఖక్షతములను చేస్తావు. వినయంతో నిన్ను తెగవేడుకొంటున్నదని ఆమెతో యేమి ఆడుకొంటున్నావయ్యా!! ఆ తత్తరపాటులో నిన్ను పెండ్లాడింది అని యేమి రగడ చేస్తున్నావయ్యా! నీవే జాలికలిగి ఆమెను కూడినావు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఆమె మర్మము తాకుటెందులకయ్యా?

★ **నలిరేగి** – విజృంభించి ★ **ఒరసేవు** – సంఘర్షణకు గురిచేస్తావు
★ **కాకుసేసేవు** – అవమానించేవు ★ **సన్నసేసేవు** – చిన్నబుచ్చేదవు
★ **కాలుదొక్కేనంటా** – పెళ్ళాడిందికదా! అని





సంఖ్య :435 సంపుటము : 28 పుట: 286 రాగం : సాళంగనాట

**8 గద్దెమీఁద నున్నవాఁడు కరుణా నిధైనవాఁడు**
**గద్దరివాఁడుగదె యీ ఘనుఁడు వో చెలియా** ॥**పల్లవి**॥

**వెన్నెలమొగముతోడ వేడక నవ్వులతోడ**
**చెన్నుమీరీ నిదె నరసింహదేవుఁడు**
**వున్నది తొడమీఁదట నొద్దికతో లకిమమ్మ**
**ఇన్నిటా జాణఁడుగదె యీతఁడు వోచెలియా** ॥**గద్దె**॥

**అంగపుఁ గాంతులతోడ నల్లాడే జడలతొడ**
**చెంగలించీఁ గదె నరసింహదేవుఁడు**
**ముంగిటఁ బ్రహ్మాదుఁలు మొక్కుతాఁ బాటలువాడి**
**సంగతైనవాఁడుగదె చనవిచ్చీఁ జెలియా** ॥**గద్దె**॥

**బీరపు మాటలతోడ పెలుఁగిరీటముతోడ**
**చేరి నిన్నుఁగూడె నరసింహదేవుఁడు**
**యీరీతి శ్రీవేంకటేశుఁ డితడై వరములిచ్చీ**
**ధారుణీ కాంతుఁడు గదె తానితఁడు చెలియా** ॥**గద్దె**॥

**పరిచయ పరిమళం :**

ఓ చెలియలారా! ఈ సింహాసనంపై నున్నవాడే కరుణానిధి అని ప్రఖ్యాతుడైన నరసింహదేవుడు. ఈ ఘనుడు బహు గద్దరివాడు (గడుసరివాడు) అంటున్నారు అన్నమయ్య. ఓ చెలియా! ఆయన ముఖము వెన్నెలవలె తెల్లగా, చల్లగానున్నది. ఆయన యెడమతొడపై లక్ష్మీదేవి ఒద్దికగా కూర్చొనివున్నది. అన్నిటిలోనూ ఈ స్వామి జాణయైనవాడు. ఆయన శరీరం కాంతులను వెదజల్లుతోంది. బ్రహ్మాది దేవతలు ఆయన ముందు మొక్కుతున్నారు. తన దేవేరితో కూడివున్నాడు గనుక చనువుగా వున్నాడు. ఆయన మాటలు వీరోచితంగా వున్నాయి. కాంతులీనే కిరీటము ధరించిన ఈ నరసింహుడే తిరుమల శిఖరాలపైనున్న వేంకటేశ్వరుడు.

★ **గద్దరి** – గడుసువాడు ★ **చెన్నుమీరి** – మనోహరంగా ★ **జాణ** – నేర్పరి
★ **చెంగలించు** – అతిశయించు ★ **పెలుకిరీటము** – వజ్రపు కిరీటము
★ **ధారుణీకాంతుడు** – భూదేవి భర్త

సంఖ్య :171 సంపుటము : 28 పుట: 115 రాగం : ముఖారి

**9 మేలుకు మేలేకాక మెరమెర లేమిటికే**
**పోలికలు మీకుఁ దగు పొందులెల్లాఁ జేయవే** ॥పల్లవి॥

**కరుణించి యాతఁడు కలువల వేయఁగాను**
**శిరసువంచుకోనేలే చెలియనీకు**
**సరసములాడి నిన్ను సారెఁ గరఁగించఁగాను**
**తెరమాఁటు మాఁటలనే తేనెలెంత చల్లేవే** ॥మేలు॥

**చుట్టరికములు నీతో చూచి చెప్పి తగులఁగా**
**గుట్టుతో నుందానవేమే కోమలి నీవు**
**నెట్టుకొని యాతఁడు నిన్నుఁజేరి చెనకఁగా**
**వట్టి సిగ్గుతోనేల వలపుదాఁచేవే** ॥లల॥

**కోరి వేఁడి నీతోను కొచ్చి కొచ్చి నవ్వఁగాను**
**వూరకే వుండఁగ నేలే వువిద నీకు**
**యీరీతి శ్రీవేంకటేశుఁ డిన్నిటా నిన్నుమన్నించె**
**తారుకాణ వచ్చితే నెందాఁకా వెరగందేవే** ॥మేలు॥

**పరిచయ పరిమళం :**

'మెరమెర' అంటే 'బాధ' అని అర్థం. అన్నమయ్య ఈ కీర్తనలో నాయికను మందలిస్తున్నారు. ఆయన జగన్నాథుడు. నిన్ను స్వీకరించి నీకు అంతమేలు చేస్తే ఆ మేలుకు నీవిచ్చే ప్రతిఫలం మెరమెరలా? మీ ఇద్దరినీ రతీ మన్మథులలాంటి ఏ జంటతో పోలినా తగినట్లే వుంటుంది. చక్కగా రతికూటములతో ఆనందించండి, అంటున్నారు. నీపై దయతో ఆయన కలువపూలతో స్వాగతం చెబుతే శిరస్సువంచుకొని సిగ్గుపడతావేమే? నిన్ను సరసాలతో మురిపించబోతే తెరచాటు మాట్లాడుతూనే తేనెలొలికిస్తున్నావు కదే! ఇదేమిటమ్మా! ఆయనకీ నీకూ గల చుట్టరికం తెలిసింది కదా! ఆయనంతట ఆయనే నిన్ను జేరితే ఇంకాయేమి సిగ్గమ్మా? నిన్ను వేడుకొని సరదాగా వుందామని ఆయనవస్తే శ్రీవేంకటేశ్వరుని ముందు భయమెందుకమ్మా? అంటున్నారు.

★ **తగులగా** – కూడగా ★ **చెనకగా** – నొక్కగా ★ **కొచ్చికొచ్చి** – కొసరి కొసరి
★ **కోరి** – ప్రార్థించి ★ **తారుకాణవచ్చితే** – సత్యముచెబుతుంటే





సంఖ్య :433 సంపుటము : 16 పుట: 289 రాగం : మేఘరంజి

**10 ఓయమ్మ చూడగఁగదరె వుద్దగిరికృష్ణుఁడు**
**సేయుచేఁత లెల్లాను చెప్ప సిగ్గయ్యీనే** ॥పల్లవి॥

**చూడ బాలుఁడుగాని సుదతులగాఁగిళ్లఁ**
**గూడేవేళ పాయపుకొమారుఁడే**
**దూడలఁ గాచేవేళ వాడగొల్లఁడై యుండుఁగాని**
**యేడఁ బక్కఁ బెట్టుకొంటే యింటిమగఁడౌనే** ॥ఓయ॥

**చీటికిమాటికి చిన్ని చేఁతలెల్లాఁ జేసుఁగాని**
**పాటించి ముద్దాడఁబోతే పచ్చిసేఁతలే**
**చాటిచాటి నేరిపిన చక్కమాటాడఁడు, లోన**
**మాటలాడించి చూచితే మదనతంత్రాలే** ॥ఓయ॥

**పట్టి చెక్కులు మీఁటితేఁ బాలు దాగీఁ (గారీ?) గాని**
**వెట్టిమోవితేనెలకు వేడుకకాఁడే**
**మట్టులేనిమహిమల మానిశై వున్నాఁడుగాని**
**దిట్ట శ్రీవేంకటాద్రిపై దేవరై వున్నాఁడే** ॥ఓయ॥ **433**

**పరిచయ పరిమళం :**

ఉద్దగిరి (ఉదయగిరిలో) వెలసిన శ్రీకృష్ణునిపై మధురకీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. మగనిచాటు గొల్లెత ఓయమ్మా! ఇది చూడండమ్మా! ఈ కృష్ణుడు చేసే పనులన్నీ చెప్పుకోవాలంటే, అంతులేని సిగ్గు కలుగుతున్నది. వీడు చూడటానికి బాలునిలా వున్నాడు కానీ స్త్రీలతో వున్నప్పుడు ప్రాయం వచ్చిన వాడవుతున్నాడు. పగటిపూట దూడలుకాచే బాలగొల్లడే కానీ రేయి అయి పక్కలో చేరాడంటే ఇంటిమగడవుతాడు. వీడి పనులు చిన్నపిల్లాడివేగాని ముద్దాడామంటే మరీ పచ్చిగా వ్యవహరిస్తాడు. మాట్లాడించామంటే వీడికి తెలిసినన్ని మదన తంత్రాలు మరెవ్వరికీ తెలీవు. చెక్కిలిమీటితే పాలు కారుతాయి కానీ అధరామృతం కావాలంటాడు. మరి వీడు శ్రీవేంకటేశుడు కదా! గోకులంలో మనిషిగానే మహిమలు చూపినాడమ్మా!

★ **పాయపుకొమారుడు** – కౌమారదశలోవున్నవాడు
★ **పక్కబెట్టుకొంటే** – పక్కపై చేరితే ★ **పచ్చి సేతలు** – బూతుపనులు
★ **మదనమంత్రాలే** – రతి రహస్యాలే

సంఖ్య :493 సంపుటము : 16 పుట: 329 రాగం : పాడి

**11 ఎన్ని వేదాలు చదివి యెంత సోమయాజివైన**
**కన్నెలు వద్దనుండగా కాంక్ష లేల తీరును ॥పల్లవి॥**

**కోరకుండేవా నీవు గొల్లెతలఁ గనుఁగొంటే**
**పారదా మనసు వారిపాలిండ్లపై**
**ఊరదానీనోరుతేనె లొలికే మోవిపండ్లకు**
**పేరదా వలపు వారి బెల్లింపుమాటలను ॥ఎన్ని॥**

**చిక్కవా వారికి నీవు చేతులు పైఁ జాఁచితేను**
**చొక్కకుండేవా మేనులు సోఁకించితేను**
**చక్కనుండేవా వారు సరసము లాడితేను**
**పక్కన రేఁగదా తమి భావించి నవ్వితేను ॥ఎన్ని॥**

**పాయఁగలవా సతులు భ్రమయించి కూడితేను**
**అయనా తనివి నీకు నంతలోననే**
**యేయడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు**
**మాయలకు లోను గాదా మంతనమాడితేను ॥ఎన్ని॥ 492**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో శ్రీకృష్ణుని శృంగారాన్ని సమర్థిస్తున్నారు. ఎన్ని వేదాలు చదివినా, యెంత గొప్ప సోమజాయులుగారైనా కన్నెపిల్లల సంగత్వంతో వుంటే కోరికలు రేగక తగ్గుతాయా అంటున్నారు. గొల్లెతలు కావాలని నీవద్ద చేరితే కోరకవుంటావా? నీనోరు వూరదా? వాళ్ళ కవ్వింపు మాటలకి వలపు పేరుకోదా? వాళ్ళు చేతులు చాస్తే కౌగిట్లో దూరవా? వారు సరసమాడుతూ నవ్వితే మోహమురేగదా? వాళ్ళు కలిగించే భ్రమలకి లొంగక వదలివుండగలవా? ఆయనా నీతనివి (నీ తృప్తి తీరుతుందా)? నేడు శ్రీ వేంకటేశ్వరా! నీతో మంత్రాంగం జరిపింది నీ మాయలోపడకుండా వుంటుందా?

★ **పారదా** – చలించదా ★ **బెల్లింపు** – మైమరపించు ★ **చొక్కు** – పరవశించు
★ **పాయగలవా** – వదలగలవా ★ **మంతనము** – కలిసిచేసే ఆలోచన
★ **ఉమ్మడి** – పొత్తుకుదిరిన





సంఖ్య :434 సంపుటము : 16 పుట: 290 రాగం : కురంజి

**12 మరఁగుల మాటలేల మాపుదాఁకాను**
**అరిమురివేడుకతో నానతి యిమ్మనవే ॥పల్లవి॥**

**చిత్తము వచ్చితేఁజాలుఁ జేసే నేపనియైనా**
**యిత్తల నాతో నాన తిమ్మనవే**
**బత్తి సేసేదాన నింతే పైపైఁ దనకేల కొంక**
**హత్తించే నెవ్వతెనైనా నానతి యిమ్మనవే ॥మరఁ॥**

**పంత మీదేరితేఁజాలు భామల నొడఁబరచే-**
**నింతయు నాతో నాన తిమ్మనవే**
**వింతదానవా నేను విచారము మరియాల**
**అంతరంగమైనపొందు లానతి యిమ్మనవే ॥మరఁ॥**

**సమ్మతియైతేఁజాలు చాయలోనే మెలఁగేను**
**ఇమ్ముల నింపేన దానతిమ్మనవే**
**వుమ్మడి శ్రీవేంకటేశుఁ డొనరెఁ దా నాకాఁగిట**
**అమ్మలాల తనసుద్దు లానతి యిమ్మనవే (రే?) ॥మరఁ॥ 434**

**పరిచయ పరిమళం :**

“మాపటిదాకా మరగిపోయే మాటలెందుకే చెలియా? సంభ్రమం కలిగించే వేడుకలతో అనుగ్రహించమనవే” అంటున్నది చెలికత్తె అయిన అన్నమయ్యతో నాయిక. ఆ స్వామి తాను అనుకొంటే యేపనైనా చేస్తాడు మరి, నా మీద అనుగ్రహం రాదేమే? పోనీ నేనేమన్నా పైకిమాత్రం భక్తి చూపించే దానినని, కింకొ (సంకోచమా). తనని హత్తుకొనే ఎవ్వతెనైనా తనని ‘అనుగ్రహించ’మనవే. ఇక ఆ స్వామి పంతం పట్టాడంటే ఏభామనైనా వదలడు. ఇంతచేయవలసిన పనేమిటే? నన్ననుగ్రహించవచ్చును కదా! నేనేమన్నా కొత్తదాననా? ఆయనకిష్టమైతే నీడపట్టునే వుంటాడు. ఆ శ్రీవేంకటేశునకు ఇంపైన అనుమతిమ్మని చెప్పవే.

★ **అరిమురి** – సంభ్రమము గొలుపు ★ **ఆనతి** – అనుగ్రహం
★ **హత్తించే** – మత్తుకొనే ★ **అంతరంగమైన** – మనసుపడ్డ ★ **ఉమ్మడి** – పొత్తుకుదిరిన

సంఖ్య :482 సంపుటము : 16 పుట: 322 రాగం : దేసాళం

**13** చదురంగ మాడుమని సాధించేవు నేఁడు నన్ను
కదియఁగఁగలఁ గాక కయ్యానకుఁ గలనా ॥పల్లవి॥

మలసి నీతో మంచిమాఁట లాడఁగలఁ గాక
కెలన బొమ్మలను జంకించఁగలనా
వలపులు చల్లుతా నీవద్ద నుండఁగలఁ గాక
వెలినుండఁగా దెరవేసుకొనఁగలనా ॥చదు॥

సన్నలను నీమోవి చవిగొనఁగలఁ గాక
చెన్నుమీర నది గంటిసేయఁగలనా
అన్నిటా నీకుఁ జుట్టమనై యుండఁగలఁ గాక
పన్నుక నీవు నేనని పందేలాడఁగలనా ॥చదు॥

మంతనపురతి నిన్ను మరిగించఁగలఁ గాక
వంతులరతుల గెలువఁగఁ గలనా
యింతలో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
సంతోసించఁగలఁ గాక చలపట్టఁగలనా ॥చదు॥ **482**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలోని నాయిక ముగ్ధ. గడుసరి కాదు. ఆవిడను శ్రీవేంకటేశుడు చదరంగం ఆడమని సాధిస్తున్నాడట. స్వామీ! చదరంగంలో పోట్లాటలు తప్పవు. నేను నిన్ను తగిలియుండగలనుగాని కయ్యమాడలేను అని వేడుకొంటున్నది. నేను నిన్ను వురిమి చూడనుకూడాలేను. తియ్యగా మాట్లాడగలను. నీవు నాకడకు వస్తే తెరచాటున దాగలేను. నీమీద వలపులు చిలికించమంటే సరే! నీఅధరామృతము గ్రోలగలనుగాని, దంతక్షతములు సేయసాహసించలేను. నీకు చుట్టము వలె ఆదరణ చూపగలనుగాని, పంతముతో పందేలు కట్టలేను. నిన్ను రతి సుఖములో ముంచగలను గానీ నీపై వుజ్జీకాగలనా? నిన్ను సాధించగలనా?

★ **కదియ** – తగిలియుండు ★ **బొమ్మలజంకించు** – భుకుటిముడివేయు
★ **మలసి** – ఉత్సాహించి ★ **కెలన** – చెలరేగి ★ **సన్నల** – రేయి తొలిజాము
★ **పన్నుక** – అతిశయముతో ★ **వంతులరతులు** – పోటీ రతిక్రీడ
★ **చలపట్టి** – పగబూని





సంఖ్య :487 సంపుటము : 16 పుట: 325 రాగం : సౌరాష్ట్రం

**14** మన్నించీఁ బదారువేల మగఁడు తాను
నిన్న నేఁటిపడుచను నేనేమి బాఁతే ॥పల్లవి॥

చెక్కు నొక్కి బుజ్జగించి చేతిమీఁదఁ జేయివేసి
యిక్కువ లంటీ నేఁ దన కేమిబాఁతే
చక్కనిదాననంటా జవ్వనపుదాననంటా
నెక్కొని పొగడీ నిదే నే నేమిబాఁతే ॥మన్నిం॥

పచ్చిదేర మాఁటలాడి పాపట దువ్వి దువ్వి
యిచ్చె (చ్చీ?) వీడెము నాకు నే నేమిబాఁతే
యిచ్చకముదాననంటా నితవరిదాననంటా-
నిచ్చలు నన్నుఁ బాయఁడు నే నేమిబాఁతే ॥మన్నిం॥

చుట్టరికములు చెప్పి సొమ్ములెల్లా నాకుఁ బెట్టి
యిట్టె నన్నుఁ గూడీ నే నేమిబాఁతే
ముట్టి శ్రీవేంకటేశుఁ డిమ్ముల మేలుదాననంటా
నెట్టన నన్నుఁబెండ్లాడీ నే నేమిబాఁతే ॥మన్ని॥ **487**

**పరిచయ పరిమళం :**

'బాతి' అంటే ప్రీతి అని అర్థం. ఈ రమణుడు వారి అభ్యర్థన మన్నించి తాను నరకాసురుని చెరవిడిపించిన పదియారు వేలమంది రాచకన్నెలకు మగడైనాడు. ఇది ద్వాపరయుగంనాటిమాట. నేను నేటి కలియుగపు పడుచును. నేనంటే ఈయనకీప్రీతి యెందుకో, అంటున్నది నాయిక. అన్నమయ్య మధుర కీర్తన ఇది. నా చెక్కిలి నొక్కుతాడు, మర్మములనంటుతాడు, నేను చక్కని దాన్నంటాడు, ఇదేమి "బాఁతి"? పచ్చిగా మాట్లాడతాడు. నాపాపిట బాగాదువ్వి, నాకు అంగీకారంతో తాంబూలమిస్తాడు, ఇదెక్కడి "బాఁతి" నేనొక్కదాన్నే తనహితవు కోరేది అందుకే నేనంటే ఇష్టము అంటాడు, ఇదేమి "బాఁతి?" నేనొక్కదానినే తన చుట్టమునని నాకు తన ఆభరణాలన్నీ ఇచ్చేస్తాడు, నేనే తన మేలుకోరేదాన్నని నన్ను పెండ్లాడాడే ఆ శ్రీవేంకటేశ్వరుడు.

★ **బాఁతి** – ప్రీతితో కలిగే భ్రాంతి ★ **ఇక్కవలు** – మర్మాంగములు
★ **నెక్కొని** – నిలిచి ★ **నెట్టున** – బాహాటంగా ★ **నిచ్చలు** – నిత్యమూ
★ **ఇమ్ముల** – ఇంపుగా

సంఖ్య :488  సంపుటము : 16  పుట: 326  రాగం : రామక్రియ

**15 ఏమి చెప్పీనే తనయెమ్మెలు చెలులతోడ**
**నామగఁడే యెరుఁగును నాలాగూ** ॥పల్లవి॥

**మచ్చికమాఁటలు చల్లి మందులు నూరీఁ దాను**
**యిచ్చకపుదానను నాయీడా తాను**
**పచ్చిదేరేనవ్వులను పదనులు చూచీఁ దాను**
**అచ్చమైనయిల్లాల నాయంతటిదా తాను** ॥ఏమి॥

**తిలకించి సిగ్గులనే తెరలుగట్టీఁ దాను**
**తలఁపులోదాన నాయంతటిదా తాను**
**వెలినుండి వలపులవేడుకలు చల్లీఁ దాను**
**తొలుతటిదాన నాతోటిదా తాను** ॥ఏమి॥

**చెనకుల చేఁతలనే చిగిరించీఁ దాను**
**చనవరిదానను నాసాటి (సాటిదా?) తాను**
**యెనసి శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్ను మన్నించె**
**పనికి వచ్చితిని నాపాటిదా తానూ** ॥ఏమి॥ **488**

**పరిచయ పరిమళం :**

అలమేల్మంగ తన పతిని కోరే చిన్నదాన్ని తన చెలికత్తె అయిన అన్నమయ్య దగ్గర దుయ్యబడుతోంది ఆ వగలాడి. దాని విలాసములు తన చెలులతో యేమి చెప్పుకొంటున్నదే!! నామగనికి నాకు ఆయనపై యెంత మోహమున్నదో తెలుసులే. అతి చనువుగా మాట్లాడి, మందూ మాకూ పెట్టటానికి నేను దానిలా ఇచ్చకాలు చెప్పను, వెకిలిగా నవ్వను. నేను అచ్చమైన ఇల్లాలినే. నాఅంత ఆలోచనదానికున్నదా? చెప్పలేని సిగ్గు దానికి. నేను ఆయనకు ఆదిలక్ష్మిని. అది బయటనుండి వలపులు ఒలకబోస్తుంది. నొక్కుల చేతలంటే దానికిష్టం. నేను స్వేచ్ఛగల ప్రేయసిని. అందుకే నన్ను శ్రీవేంకటేశుడు మన్నించేడు. నేను ఆయనకు పనికివచ్చుదానను. అది నా సాటిదా? అని తన అక్కసు వెళ్లబోసుకొంటున్నది అలమేలుమంగమ్మ.

★ **ఎమ్మెలు** – విలాసములు ★ **లాగు** – మోహము ★ **పచ్చిదేరె** – నర్మగర్భముగ
★ **పదనులు** – చెమరింతలు ★ **చనవరి** – చనువుతో ప్రేమ
★ **చెనకుల చేతలు** – నొక్కుల పనులు





సంఖ్య : 432  సంపుటము : 16  పుట: 289  రాగం : లలిత

**16 ఒక్కతొకతె నెరఁగకుండా నందె దాఁగిరి**
**మొక్కలానదాఁగిలి ముంత (మూఁత?) లాయ రతులు** ॥పల్లవి॥

**యిక్కువ జీఁకటింటిలో యిరవై నీ వుండఁగాను**
**గక్కన యొక్కతే వచ్చి కాఁగిటఁ గూడె**
**అక్కరతో వేరొక్కతె అది యెరఁగక నీ-**
**వొక్కడ వున్నాఁడవంటా నొనరఁ దాఁ గూడెను** ॥ఒక్క॥

**పని సేసి వేరొకతె పానుపుపైఁ బండ వచ్చి**
**నినుఁ గని సంతోసాన నెప్పునఁ గూడె**
**తనర వేరొక్కగొల్లెత పాలు దాఁచఁగ వచ్చి**
**వొనర నీకాలు దొక్కి వొగి మెచ్చి కూడెను** ॥ఒక్క॥

**భూపతిచెరువుకాడఁ బొంచి శ్రీవేంకటేశ్వర**
**యేపున నిన్నుఁ గూడినయింతులెల్లాను**
**లోపలనుండి గవాక్షులు దెరచితమమోము-**
**లాపొద్దె చూచుకొని యందరును నవ్విరి** ॥ఒక్క॥

**పరిచయ పరిమళం :**

భూపతి చెఋవు అనే గ్రామంలో వెలసిన శ్రీవేంకటేశునిపై శృంగార సంకీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. రేపల్లెలో కృష్ణయ్యగావున్నప్పుడు, ఒక గోపికకి తెలియకుండా అదేచోట ఇంకొకతె దాగి దాగుడుమూతలాడారు. వారినలా చూచి నీవు వూరకున్నావా? నీ రతులు ముంతలాయ (అధికమైనాయి). నీవు చీకట్లో దాగివుంటే ఒకతె నిన్ను చూచింది. తనొక్కతే అని కౌగలించి కూడినది. ఇంతలో ఇంకొకతె అక్కడికేదో పనుండి వచ్చి నీవు ఒంటరిగా దొరికావని నీతో కూడినది. ఇంకొకతె నీవు పాన్పుపై పడుకునుంటే తెగసంతోషపడి తనూ నిన్ను కూడినది. ఇంకొక గోపిక పాలు దాచిపెడదామని వచ్చి నీకాలుదొక్కి అవకాశం దొరికిందని వదలక నిన్ను కూడినది. భూపతి చెరువులో వెలసిన వేంకటేశ్వరా! ఒకతె వెళ్ళి ఇంతలో గవాక్షం తెరచి వెలుతురులో నీతో ఇంతమంది వుండటం చూచి అంతా పక్కున నవ్వారయ్యా.

★ **మొక్కలాన** – ధైర్యంతో ★ **ఇక్కువ** – సంకేతస్థలము ★ **ఒగి** – క్రమముగా
★ **ఏపున** – విజృంభించి ★ **పొద్దె** – వెలుతురులో

సంఖ్య :123 సంపుటము : 28 పుట: 83 రాగం : సాళంగనాట

**17 అట్ట నెరవాదివి నీ వలుమేలుమంగవు**
**నెట్టన నీరమణుఁడు నిన్ను మెచ్చీ నిందుకు ॥పల్లవి॥**

**ఇయ్యకొంటే మాఁటలెల్లా నింపులై యుండు**
**నెయ్యముగలిగినట్టి నెలఁతలకు**
**వొయ్యనే విచారించితే నుపమ వుట్టు**
**యెయ్యెడా నలుకలేని యింతులకును ॥అట్టి॥**

**వున్నది నేమిసేసినా నొడఁబాటౌను**
**సన్నయెఱిఁగినయట్టి సతులకును**
**విన్నకన్న సేఁతలెల్లా వేడుకై తోఁచు**
**అన్నిటా నోరుపుగల యతివలకు ॥అట్టి॥**

**కందువఁ దెలిసితేఁ గరఁగు మతి**
**అంది వివేకముగల యాఁడువారికి**
**యిందరిలో శ్రీవేంకటేశుఁడు గూడె**
**పొందు లిట్టివి నీవంటి పొలఁతులకును ॥అట్టి॥**

**పరిచయ పరిమళం :**

ఈ కీర్తనలో అలమేలుమంగమ్మ చెలికత్తెగా మారిన అన్నమయ్య ఓ అలమేలుమంగా నీవు సమర్థురాలైన దానవు. అందుకే నీరమణుడు నిన్ను యెట్టెదుటనే మెచ్చుకొంటాడు. అయినా ప్రపంచంలో జరిగేదేకదా! ఇంతికి స్నేహంగా వుండే మగనిమాటలెల్లా ఇంపుగానే వుంటాయి. అలుకేలేని స్త్రీలకు తిన్నగా ఆలోచిస్తే యెన్నో ఉపాయాలు తట్టుతాయి. సంజ్ఞ తెలిసిన స్త్రీకి అంగీకారమైతే ఏమిచేసినా ఇష్టంగానే వుంటుంది. అన్నిట్లోనూ ఓర్పుగల స్త్రీకి ఏమివిన్నా ఏమి కనినా తనమగని చేతలన్నీ వేడుకగానే వుంటాయి. వివేకమున్న స్త్రీకి నేర్పువుంటే మగని మనస్సు కరిగించగలదు. నీవంటి స్త్రీలకి శ్రీవేంకటేశుని పొందులు ఇటువంటివే.

★ **నెరవాది** – సమర్థుడు ★ **ఉపమవుట్టు** – ఉపాయం తడుతుంది
★ **సన్న** – సంజ్ఞ ★ **ఒయ్యన** – తిన్నగా ★ **కందువ తెలిసితే** – నేర్పువుంటే
★ **ఒడబాటు** – అంగీకారం





సంఖ్య :570 సంపుటము : 28 పుట: 376 రాగం : శ్రీరాగం

**18 ఇప్పుడుగా రమణుఁడ యాదేరె నా కోరికలు**
**తప్పక నాపై దయ దలఁచితివి నీవు ॥పల్లవి॥**

**కామించి నిన్నుఁ బాసిన కడలేని విరహాగ్ని**
**నీమేని చెమట పన్నీటఁ జల్లారె**
**ప్రేమఁ దలపోఁతలఁ బెనగొన్న చీఁకటి**
**వేమరు నీ చిరునవ్వు వెన్నెలచే బాసెను ॥ఇప్పు॥**

**గక్కన నిన్నుఁ జూడని కలువకన్నులవాడు**
**చొక్కి నీవదనచంద్రుఁ జూచి తేరెను**
**నిక్కి కొప్పువీడిన నెరిఁదేఁటుల కలఁక**
**తక్క కిట్టె నీకరపద్ద(ద్మ?) ము లంటి జారెను ॥ఇప్పు॥**

**చేరి నిన్ను నెయని సిగ్గుల చిత్తజు చొక్కు**
**దారకపు నీ మాఁట మంత్రాలఁ దెలిసె**
**యీరీతి శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి**
**గారవపు వలపుల కాఁపురా లమరెను ॥ఇప్పు॥**

**పరిచయ పరిమళం :**

ఈ కీర్తన అన్నమయ్య భావుకతను ప్రతిపాదిస్తున్నది. అందుకే నా పరిచయ పరిమళంలో వివరణ అన్నమయ్య భావమే కాకపోవచ్చును. అయినా ప్రయత్నిస్తాను. రమణుడా! నా కోరిక ఇప్పటికి నెరవేరింది. నీకు నాపై దయ కలిగింది. నా విరహాగ్ని నీమేని చెమటల పన్నీటిజల్లు వలన చల్లబడింది. నా వలపుతలపులు కలిగించిన చీకట్లు నీ చిరునవ్వు వెన్నెల తొలగించింది. నా కలువకన్నులు నీవదన చంద్రుని చూచి తేరుకొన్నాయి. చంద్రుని చూసి పద్మాలు ముకుళించాయి. కొప్పు వీడిన నా కేశపాశం అనే తుమ్మెదలగుంపు నీ కరపద్మాలలో చిక్కుకుపోయాయి. మన్మథుడే సిగ్గుపడ్డాడు. నీ మాటలు తారకమంత్రములు. ఈరీతిగా వేంకటేశా! నా కాపురం చక్కబడినది.

★ **నెరితేటలకలక** – అతిశయించ తుమ్మెదలు కలకబారినవి
★ **తక్కక** – తగ్గక ★ **నిక్కి** – పైకి లేచిన

సంఖ్య :146 సంపుటము : 28 పుట: 98 రాగం : సాళంగం

**19** **అంతచక్కనివాఁడవు అన్నిటా జాణవు నీవు**
**సంతోసాన నుప్పంగీ సారెకు నామనసు** ॥**పల్లవి**॥

**పొలసి నిన్నొకమారు పూఁచి తప్పక చూచితే**
**వలవక వుండుదురా వనితలు**
**నిలువున నెప్పుడైనా నీరూపు దలఁచుకొంటే**
**వులివచ్చి చెమటల నోలలాడకుందురా** ॥**అంత**॥

**సముకాన నీతోను సంగాతాలు సేసితే**
**తమకించకుండుదురా తరుణులు**
**జమళి మేనులు సోఁక సరసము లాడితేను**
**మమతల నిన్ను నిట్టె మరుగక వుండుదురా** ॥**అంత**॥

**యీడుజోడై నిన్నుఁ గూడి యెడవాయ కుండితే**
**వేడుకఁ జొక్కకుందురా వెలఁదులు**
**యీడనె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె**
**యేడవారూ నీపొందుల కేఁకరకవుందురా** ॥**అంత**॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని వశీకరణ శక్తిని కొనియాడుతున్నారు. స్వామీ! నీవేమో అంత చక్కనివాడవు. దానికితోడు సరసత్వముగల జాణవు. నిన్ను చూడంగానే నా మనసు ప్రతిసారి ఉప్పొంగిపోతుంది. నిన్నొకసారి చూచినవారు వలపుచెందక వుండగలరా? కొంచెము శృంగారభావంతో నీ రూపం తలచుకొన్న వెంటనే నేను చెమర్చక మానను. నీ యెదుటికి రాంగానే తరుణులు తన్మయత్వం చెందకుండెదరా? నీవు వాళ్ళ ఒళ్ళంతా తాకుతూ సరసములాడితే జవ్వనులు నీ జతకు అలవాటుపడరా? వెలదులు నిన్ను వదలక కూడితే సొక్కిపోకుందురా? ఓ శ్రీవేంకటేశ్వరా! నన్నూ యేలినావు. నా తప్పేమీలేదు, యెక్కడివారూ నీ పొందుకోసం వువ్విళ్ళూరుతారు.

★ **ఉలివచ్చి** – కొంచెం పచ్చి ★ **పొలసి** – సమీపించి ★ **సంగాతాలు** – చేరికలు
★ **వలువక** – మోహించక ★ **ఏడవారూ** – ఎక్కడివారైనా
★ **ఏకరక** – వువ్విళ్ళూరక





సంఖ్య :565 సంపుటము : 28 పుట: 373 రాగం : రామక్రియ

**20** **ఎట్టు సాదించవచ్చునే యిటువంటి మగవాని**
**నెట్టనఁ దనంతనే మన్నించితేఁ గాక** ॥**పల్లవి**॥

**సెలవినే నవ్వుఁగాని చెప్పఁడే తనగుట్టు**
**సొలసి యెంత వొరసి చూచినాను**
**చెలి మేలేసేసుఁగాని చేతికి లోనుగాఁడే**
**పిలిచి పైకొని యెంత పెనఁగినాను** ॥**ఎట్టు**॥

**మాటలే యాడుఁగాని మనసు గరఁగఁడే**
**చీటికి మాటికి యెంత చెనకినాను**
**తేటలనే తేలుఁగాని తెమలి యసమియ్యఁడే**
**కూటమికి నే నెంత కొసరినాను** ॥**ఎట్టు**॥

**ఆసలే పుట్టించుఁగాని అంకెకు తాఁ జిక్కఁడే**
**వేసరక యం(యెం?) తేసి వేఁడుకొనినా**
**బాసయిచ్చి శ్రీవేంకటపతి నన్నుఁదానే కూడె**
**పాసిపోఁడే యిఁక నెంత బలిమిసేసినాను** ॥**ఎట్టు**॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ మధుర కీర్తనలో నాయిక తన చెలియతో మగని గురించి ఆలోచిస్తున్నది. ఓ చెలియా! ఇటువంటి మగవాడిని ఎట్లా సాధించుటే? తనంతట తానే నన్ను మన్నించాలి. చిరునవ్వులు చిందిస్తాడేగానీ తన గుట్టు చెప్పనే చెప్పడు. ఎంత పోట్లాడి ఉరిమిచూచినా నాఅలుపేకాని తాను ఉలకడు పలకడు. స్నేహంగానే వుంటాడు గాని చేతికి చిక్కడు. నేను పిలిచి అతనిని చేరినా అదే తీరు. మాట్లాడతాడు కానీ మనస్సు కరుగదు. ఎన్నిసార్లు తాకినా ఇంతేనే. ప్రసన్నంగా వుంటాడుకాని అనురాగం చూపించడు. మా కూటమికి నేనెంత కొసరికొసరి అడిగినా, అంతే. ఆశపుట్టిస్తాడు కాని అందడు, యెంత వేడుకొన్నా ఇంతే. ఎట్టకేలకు బాస ఇచ్చినన్నుకూడినాడు ఈ వేంకటపతి, ఇక నన్ను వదలడు.

★ **ఒరసి** – పోట్లాడి ★ **యసము** – అనురాగము
★ **తేటలనేతేలు** – ప్రసన్నంగా వుంటాడు
★ **అంకెకు** – వశమునకు ★ **పాసిపోడే** – వదలిపెట్టడే

సంఖ్య :197    సంపుటము : 28   పుట: 132   రాగం : ఆహిరి

**21 ఏమని విన్నవించేము ఇంతిచందములు నీకు**
**ఆముకొన్న కరుణతో నాదరింతు గాక**    ॥పల్లవి॥

**వొప్పుగు నిన్నుఁ దలఁచి వువిద పాన్పుమీద**
**నుప్పతిల్లుఁ జెమటల నోలలాడీని**
**ముప్పిరిగొన్నవయసు ముంచి యాసలు రేఁచఁగా**
**చెప్పరాని వలపుల జిమ్మిరేఁగీని**    ॥ఏమని॥

**వొట్టిన నీగుణములు వొకటొకటె యెంచుక**
**అట్టె నిట్టూరూపుల నుయ్యాల లూఁగీని**
**గట్టిగా నీవిచ్చినవుంగరము చూచి చూచి**
**గుట్టుతో దమకముల గుబ్బతిలీని**    ॥ఏమని॥

**గక్కనఁ జెలులు నీకతలు చెప్పఁగా విని**
**వెక్కసపుఁ బులకల విఱ్ఱవీఁగీని**
**యిక్కడ వచ్చి శ్రీవేంకటేశ యింతిఁ గూడితివి**
**పిక్కటిల్లు సంతోసాలఁ బెనగొనీని**    ॥ఏమని॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో నాయిక విరహవేదన వర్ణిస్తున్నారు. ఈ పడతి తీరు నీకేమని విన్నవించగలమయ్యా! అధికమైన కరుణతో నీవే ఆదరించాలి. ఈ వనిత నిన్నే తలచుకొంటూ పాన్పుపై ఇంకా నీవు రాలేదని రుసరుసలాడుతోంది. విజృంభించిన యౌవన మదమున ఆశలు పెరిగి తన వలపులు చెలరేగినవి. చక్కటి నీగుణగణాలు తలచుకొని నిట్టూర్పుల వుయ్యాలలూగినది. నీవిచ్చిన పెళ్ళినాటి వుంగరాన్ని చూస్తూ పరితపించింది. ఆమెను వూరడించుటకు నీ కథలు చెలులు చెప్పగా విని పులకించి ఆపై అతిశయించింది. ఇంతలో ఓ శ్రీవేంకటేశా! నీవు రావడం, ఆమెను కూడటం జరిగాయి. ఆమె సంతోషంతో అతిశయించింది.

★ **ఆముకొన్న** – అధికమైన    ★ **ఉప్పతిల్లు** – ఓర్వలేక నిందించు
★ **చిమ్మిరేగి** – చెలరేగి    ★ **ఒట్టిన** – హత్తుకొన్న
★ **గుబ్బతిల్లి** – పరితపించి    ★ **పిక్కటిల్లు** – అతిశయించు





సంఖ్య :504    సంపుటము : 28   పుట: 333   రాగం : వరాళి

**22 చెప్పఁ జెప్పఁ గొత్తలాయ చెలియ నీ సొబగులు**
**కుప్పలుఁదెప్పలునై గురుతులు మీరెనే**    ॥పల్లవి॥

**కన్నులపండుగ గదే కలికి నీరూపము**
**జన్నె పాఁడిగదే నీచక్కని మోవి**
**వెన్న (న్నె?)ల తేటలుగదే వేడుక నీనవ్వులు**
**వన్నెగా నిన్నుఁ బొందినవాఁడే భాగ్యవంతుఁడే**    ॥చెప్పఁ॥

**ముంగిట ముగ్గులు గదే ముదిత నీ సింగారము**
**తంగేటి జున్ను గదే దంట మాఁటలు**
**కొంగుఁ బాలు గదవె పూఁటవూఁట నీసిగ్గులు**
**అంగన నిన్నేలేవాఁడు అతిభాగ్యవంతుఁడే**    ॥చెప్పఁ॥

**పెట్టెలో సొమ్ము గదవే ప్రియురాలు నీవయసు**
**కట్టిన ముడుపుగదే కాఁగిటి రతి**
**యెట్టె శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్ను నేలె**
**దట్టమై నీపాలివాఁ డితఁడే భాగ్యవంతుఁడే**    ॥చెప్పఁ॥

**పరిచయ పరిమళం :**

అలమేలుమంగమ్మ సొగసులను వర్ణిస్తూ కీర్తిస్తున్నారు అన్నమయ్య. చెప్పినకొద్దీ కొత్తకొత్తగా వుంటాయట. కుప్పలు తెప్పలై (అధికమై) అవి యెల్లలు మీరాయట. ఎలా కీర్తిస్తున్నారో చూడండి. కలికీ! నీరూపం కన్నులపండుగ. నీ అధరం అమృతపు వూట. నీ నవ్వులు వెన్నెలతేట. భాగ్యవంతుడంటే నిన్ను చేపట్టినవాడేనే. ఓ అంగనా! నీ సింగారము నీముంగిట ముగ్గులా వున్నది. నీ మాటలు సులభంగా అర్థమవుతాయి. నిత్యమూ నీ సిగ్గులు కొంగునకట్టిన అక్షతలు. నిన్నేలే నీ మగడు యెంత భాగ్యవంతుడో కదా! నీ వయస్సు పెట్టెలో దాచిన ఆభరణం. నీ కౌగిట రతులు కట్టిన ముడుపుల వలె ఆ ఏడుకొండలవాడికే కైంకర్యం. నిన్ను పాలించే శ్రీవేంకటేశ్వరుని మించిన భాగ్యవంతుడెవడమ్మా?

★ **గురుతులు** – ఎల్లలు ★ **జన్నెపాడి** – అమృతము
★ **తంగేటిజున్ను** – సులభముగా అర్థమయ్యేది
★ **కొంగుబాలు** – కొంగులోని అక్షింతలు★ **పూటవూట** – నిత్యము

సంఖ్య :290 సంపుటము : 28 పుట: 193 రాగం : ముఖారి

**23 ఆలిమగని జాడలు అందరికి నివియే**
**మేలుమీఁదుగా విభుని మెప్పించవే నీవు** ॥పల్లవి॥

**వింత లేక మెలఁగితే వేడుక నెరపవలె**
**సంతోసించితేను మెచ్చఁగవలెను**
**మంతనానకు లోనైతే మరిగియుండఁగవలె**
**పంతము లాడఁగరాదు పతితోడఁ జెలికి** ॥ఆలి॥

**ననుపు గలిగితేను నవ్వులు నవ్వఁగవలె**
**మనసు లెనసితే సమ్మతించవలె**
**వినయాలు నేరిచితే వేమారు వేఁడుకోవలె**
**పెనఁగులాడఁగరాదు ప్రియునితో సతికి** ॥ఆలి॥

**వావు లేకములైతే వడిఁ బొందుసేయవలె**
**దేవులైతేఁ దనబత్తి దెలుపవలె**
**శ్రీవేంకటేశుఁ డేలితే సిగ్గులు మానఁగవలె**
**కావరించి మీరరాదు కాంతునితో నింతికి** ॥ఆలి॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ మధురకీర్తనలో నాయిక చెలికత్తెగా ఆమెకు సతీపతులెలా వుండాలో వివరిస్తున్నారు. ప్రపంచంలోని ఆలూమగలందరి పద్ధతులిలాగే వుంటాయి. ఓ దేవీ! నీవు నీ విభుని ప్రత్యక్షంగానే మెప్పించవమ్మా! నేను చెప్పేది శ్రద్ధగా వినవమ్మా! ఆయన నిరుత్సాహంగావుంటే వేడుక కలిగించాలి. సంతోషంతో వుంటే మెచ్చుకోవాలి. ఏకాంతమంత్రాంగంలోవుంటే తగ్గివుండాలి. ఎప్పుడూ పంతము పట్టరాదు. ఆయనకు ఇష్టము కలిగితే నవ్వుతూ వుండాలి. మనసులొకటైతే నీ అంగీకారం తెలపాలి. నీవు వినయంగావుండి ఆయనను వేడుకోవాలి. భార్యలు భర్తలతో వాదులాడరాదు. చుట్టరికం ఇదివరకే వుంటే తొందరగా క్రీడించాలి. పట్టపుదేవివైతే భక్తి చూపించాలి. శ్రీవేంకటేశుడు యేలుకొంటే సిగ్గులు మానుకోవాలి, కాని గర్వించరాదు.

★ **మేలుమీదుగా** – పైభాగం ★ **మంతనాన** – ఏకాంతము ★ **ననుపు** – ఇంపు
★ **వావులు** – చుట్టరికములు ★ **కావరించి** – మదించి ★ **దేవులు** – పట్టపురాణి





సంఖ్య :474 సంపుటము : 28 పుట: 311 రాగం : పాడి

**24 ఎంత భాగ్యవంతుఁడవో యీకె నీకు దేవులాయ**
**వింతలేక యెప్పుడూ వినోదించవయ్యా** ॥పల్లవి॥

**కన్నుల కొలుకులను కడఁగీ మదరాగము**
**చన్నుల తుదల రేఁగీ జవ్వనము**
**సున్నని చెక్కుల వెంట నూలు కొనీని కళలు**
**పిన్నది నీకె తగు బెండ్లాడవయ్యా** ॥ఎంత॥

**నెట్టుకొని మొగమున నిండెను చక్కఁదనము**
**అట్టె తేనియ లూరీ నాకె మోవిని**
**తెట్టెలై వినయమెల్లాఁ దేరీ నిలువునను**
**పెట్టెను సొమ్ములు నిండాఁ బెండ్లాడవయ్యా** ॥ఎంత॥

**పిరుఁదు బటువుననుఁ బెనగొనీ సింగారము**
**కరకమలమునుఁ గైకొనె సేస**
**యిరవై శ్రీవేంకటేశ యెదఁబెట్టితి వీకెను**
**బెరసితివి నిచ్చలు పెండ్లాడవయ్యా** ॥ఎంత॥

**పరిచయ పరిమళం :**

ఇది శ్రీనివాసుని పెండ్లిపాట. ఆడపెండ్లివారిముత్తైదువలు పాడుతున్నారు. ఆ లలనలలో అన్నమయ్యా ఒకరు. దీని పల్లవి కీర్తన చివర నప్పుతుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ పెండ్లికూతురు యెలావున్నదో చూడవయ్యా! ఈమె కనుకొలుకులలో గర్వం తొంగిచూస్తున్నది. చన్నుకొనలు యౌవన మదమురేపుతాయి. చెక్కిళ్ళలో కళలు కుదురుకొన్నాయి. వదనములోంచి చక్కదనమునెట్టుకొని తొంగి చూస్తోంది. అధరము తేనెలూరే మధురము. వినయము రాశిపడినట్లున్నది. ఒంటినిండా నగలు ధరించి పెండ్లికూతురైనది. గుండ్రని నితంబములు ఈమె శృంగారరాజ్ఞి అని సూచిస్తున్నాయి. పద్మములవంటి చేతులలో అక్షతలు పట్టుకొన్నది. ఎంత భాగ్యవంతుడవయ్యా, ఈమె నీ దేవేరి అయింది. నీ హృదయవాసినియై నిత్యపెళ్ళికూతురైనది.

★ **కడగీమదరాగము** – గర్వం తొంగిచూస్తున్నది ★ **నూలుకొను** – కుదురుకొను
★ **తెట్టెలు** – రాశివలె ★ **సేస** – అక్షతలు ★ **బెరసితివి** – పొందితివి
★ **బటువు** – గుండ్రని

సంఖ్య :361    సంపుటము : 28   పుట: 239    రాగం : రామక్రియ

**25** చక్కని గుణవంతుఁడు సరి నీకు మగఁడాయ
యెక్కువైన నీభాగ్య మేమని చెప్పుదమే ॥పల్లవి॥

నెలఁత నీ నోములు నేఁడె ఫలిఇంచెఁగదే
కలలు నీకిపుడె నిక్కలలాయెనే
పలికిన సగినాలు పతి వచ్చెఁగదవే
తలఁచఁగానే విభుఁడు తానే ఇందు వచ్చెను ॥చక్క॥

తొల్లిటి మీ పూజలు తుదకెక్కెఁగదవే
యెల్లగా నీకోరికలు యీడేరెనే
చెల్లు బడి నీ పంతము చేకూడె గదవే
యిల్లిదివో నీరమణుఁ డెదుటనున్నాఁడు ॥చక్క॥

నీవెంచిన యెన్నికలు నెరవేరెఁగదవే
కావలసినవి తారుకాణలాయెనే
దేవుల వయితివి వావి దిష్టములాయఁ గదవే
శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జేరికూడినాఁడు ॥చక్క॥

**పరిచయ పరిమళం :**

శ్రీనివాసుడు పద్మావతీ ఆలూమగలైనారు. ముత్తైదువలు ఆ జంటను మెచ్చుకొంటున్నారు. తనూ ఒక ముత్తైదువయై అన్నమయ్య వధువును పొగడుతున్నారు. చక్కనివాడు, తగిన గుణవంతుడు నీ మగడైనాడు. అతిశయించిన నీ భాగ్యము నేమని పొగడగలమే? నీ కలలు నిజమై నీ నోములు పండినవి తల్లీ! నీకు మంచి శకునాలు కనబడ్డనాడే నీకు మంచి మొగుడు వస్తాడనుకొన్నాం. తలచినట్లే నీ మొగుడే ఇక్కడికి వచ్చాడు. నీ పూర్వజన్మ పూజలు ఫలించి నీకోరిక యీడేరిందే. ఎట్లాగైతేనేమి నీ పంతం నెరవేరింది కదే! ఇల్లిదిగో మాటలలోనే మీ ఆయన వచ్చేశాడు. నీ ఎన్నిక మేమెంచినట్లే బాగుంది. ఇది దృష్టాంతంగా వుండి పోతుంది. శ్రీవేంకటేశుని దేవేరివైనావు ఇంకేమే.

★ **సరిమగడు** – తగిన భర్త ★ **సగినాలు** – శకునములు
★ **తొల్లిటి మీపూజలు** – మీ పూర్వజన్మ పూజలు ★ **వావి** – సంబంధం
★ **తారుకాణాలు** – దృష్టాంతము ★ **దిష్టము** – అదృష్టము





సంఖ్య :443    సంపుటము : 28   పుట: 291    రాగం : ముఖారి

**26** నన్నేల పిలిచేవు నగుతా నాపె యింటికి
విన్న సుద్దులే చాలు వేడుకాయ నాకును ॥పల్లవి॥

సరుసఁ గూచుండి యాపె సారె నిన్ను జంకించఁగా
విరులనుఁ బూఁచి పూఁచి వేయఁగాను
తురుము కొనగోళ్లను దువ్వి దువ్వి తియ్యఁగాను
నిరతి నివెల్లాఁ జూచి నే నోరువఁ గలనా ॥నన్నే॥

తొడమీఁద దొడ వేసి దొరతనాలు చూపఁగా
కడఁగి నీమోవి యాకె గంకి సేయఁగా
గుది(డి?) గొన రాకొట్లు గొట్టి నిన్నుఁ బిలువఁగా
వొడఁబడి నేనిందుకు నోరువఁగఁగలనా ॥నన్నే॥

చనుమొనలు నాఁటించి సదమదము సేయఁగా
పెనఁగులాడి నీమేను పిప్పిసేయఁగా
ననచి శ్రీవేంకటేశ నాకాఁగిట నీవుండఁగా
వొనరి యాపె చేఁతల కోరువఁగఁగలనా ॥నన్నే॥

**పరిచయ పరిమళం :**

అలమేలుమంగమ్మ స్త్రీ సహజమైన అసూయ కలదై శ్రీవేంకటేశునితో నిష్ఠూరంగా ఈ అన్నమయ్య కీర్తన వినిపిస్తున్నది. నేను విన్న మీ కథలన్నీ నాకు ఇదివరకే చాలా వేడుక కలిగించాయి. నన్ను ఇవ్వాళ ఏకముగా ఆమె ఇంటికే తీసికొని వెళుతున్నావు. పైగా చిరునవ్వులు చిందిస్తున్నావు. ఇదంతా నేనెట్లా ఓర్వగలను ప్రభూ! నీవు చిలిపిగా ఆమె పక్కన కూర్చోవటం, ఆమెపై పూలు వేయటం, నీవు అనునయంగా ఆమె కొప్పులోని కురులను దువ్విదువ్వి సవరించటం దానికామె నేను చూస్తున్నానన్నట్లు నిన్ను బెదిరించడం... ఇదంతా నేనెట్లా ఓర్వను ప్రభూ! నీవు ఆమెతొడపై నీ తొడవేసి దొరలా నవ్వటం, ఆమె నీమోవిపై చేసిన గాట్లు చూపించి తమరు అతిశయం చూపటం, దానికామె నిన్ను 'రా'కొట్టి వూరుకోరా అన్నట్లు మాట్లాడటం... నేనిదంతా ఒడబాటై ఎట్లా భరించనయ్యా? ఆమె తన చనుమొనలనుతాకి నీవు సదమదమున చేస్తే దానికామె నీమేను పిప్పిచేసిందిట. నేనామె చేతలు సహించలేను. నీ కూటమికి నేనే రాణిని

★ **గుదిగొను** – అతిశయించు ★ **కడగి** – అతిశయించి ★ **నాటించి** – ఒత్తి
★ **సదమదము** – నలుపుట

సంఖ్య :554 సంపుటము : 28 పుట: 365 రాగం : పాడి

**27 ఈతని నాపొందులు యిఁకఁ జూడవే నీవు**
**నీతి నెక్కుడైనదాన నీకంటె నేను ॥పల్లవి॥**

**వట్టి మాఁకు లిగిరించ వాడికమాఁటలాడి**
**కట్టుకొంటివి గదే మగనిమన్నన**
**బట్టబయలు నవ్వుల పందిళ్లుగాఁ బెట్ట**
**చుట్టమువైతివి గదే సులబాల(న?) నీవు ॥ఈత॥**

**ఆలకు గిలిగింతలు అట్టుగ గుబ్బలనొత్తి**
**ఆలవైతివిగదే యాతనికిని**
**గాలిబుడియలు గట్టి కలికితనాలు చూపి**
**వోలి గొంటివిగదే వుదుటున నీవు ॥ఈత॥**

**చెఱకునఁ బండువండ చిత్తజకళలు రేఁచి**
**గుఱియైతివి గదే గక్కునఁ బతికి**
**మఱి శ్రీవేంకటేశ్వరు మరిగించుకొంటి నేను**
**వెఱగందితివి గదే వేడుకతో నీవు ॥ఈత॥**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య స్వామిని కోరే వనితయై యేమన్నారోగాని అలమేలుమంగమ్మ ఈమెని ఎలా దులిపేస్తున్నదో వినండి. ఈ శ్రీవేంకటేశుడు నన్ను పొందినాడు చూసుకోవే. నేను నీతిగలదాన్నే. నీకూ నాకూ పోలికేమిటి? వట్టిపోయిన మాకులు చిగురించగల, వశీకరణమాటలు చెప్పి ఆయనను ఆకట్టుకొన్నావు కదే! బజారుదానిలా నవ్వి, పైకి అందంగా కనిపించి సులభంగా చుట్టమైపోయావు కదే! బండరాళ్ళను కదిలించే నీ గుబ్బలను బైటపెట్టుకొని ఆయనకు పెండ్లామవుదామనుకొన్నావా యేమిటే? గాలి బుడగలు గట్టే వనితలా అమాయకత్వం నటించి స్వామిని ఓలికి కొన్నావు కదే! అపురూపమైన మదన కళలన్నీ చూపి ఆయనకు కావలసిదానివైనావు కదే! మరి, నేనెవరో తెలుసా? శ్రీవేంకటేశుని పట్టపురాణిని, భయపడ్డావా? అంతవద్దులే.

★ **బట్టబయలు నవ్వులు** – పకపకమని నవ్వటం ★ **ఆలవైతివి** – పెండ్లానివైనావు
★ **ఓలి** – కట్నము ★ **చెఱకున పండువండు** – అపురూపమైన
★ **గాలిబుడియలు** – నేటికాలపు బెలూన్లు





సంఖ్య :119 సంపుటము : 28 పుట: 80 రాగం : దేశాక్షి

**28 వట్టిసిగ్గు లేఁటికి వద్దికి వచ్చె విభుఁడు**
**గట్టిగా నిద్దరు నిట్టె కాఁపురాలు సేయరే ॥పల్లవి॥**

**చెలిమి పెంచఁజొచ్చితే చేఁగలెక్కును**
**బలిమిఁ బైకొంటేను పంత మలరు**
**కలిమి నొనగూడితే కడఁగు నింపు**
**అలమి చొక్కించవే అదివో నీ మగఁడు ॥వట్టి॥**

**కలికితనాలవంకఁ గళ లుబ్బును**
**చిలికితే వలపులు చిమ్మిరేఁగును**
**పలికి బొంకకుండితే బాస లీడేరు**
**కొలికికిఁ దెచ్చి పతి గూడవే రతులను ॥వట్టి॥**

**కలసి మెలఁగితేను కరఁగు మతి**
**సొలసి మాటాడితేను సొంపు గలుగు**
**వలసి నీకాఁగిటిలో నలమేలు మంగ**
**వెలసీ నిదివో శ్రీవేంకటేశుఁడు ॥వట్టి॥**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెలికత్తెవలె అలిమేలుమంగమ్మకు అంత సిగ్గు భర్తవద్ద తగదని అతివలు కొత్తగా కాపురానికి వచ్చాక యేదిచేయాలో యేది చేయగూడదో చెబుతున్నారు. దేవీ! అదిగో నీ మగడు వస్తున్నాడు. ఇద్దరూ అన్యోన్యంగా కాపురం చేయండి. వ్యర్ధమైన సిగ్గులు దేనికమ్మా అవి ఇక వద్దు. ఇద్దరూ చక్కగా కాపురం చేసికొనండి. కాపురంలో స్నేహం పెంచుకొంటే దాని చేవ పెరుగుతుంది. ఒకరు బలవంతం చేస్తే ఇంకొకరికి పంతం పెరుగుతుంది. సమ్మతముతో కూడితే ఇంపుగా వుంటుంది. అదిగో మీ ఆయన వస్తున్నాడు బాగా పరవశింపజేయవమ్మా! స్త్రీకి నేర్పువుంటే శృంగారకళలు అతిశయిస్తాయి. వలపులు చల్లినకొద్దీ చెలరేగుతాయి. అబద్ధాలాడే వనితను నమ్మరు. పతికి ఆనందపుటంచులు చూపాలి. కలిసివుంటే మనస్సు కరుగుతుంది. మాటలు పరవశించినట్లుండాలి. ఓ అలమేల్మంగా! అదిగో నీకౌగిట్లో శ్రీవేంకటేశుడు.

★ **చేగలెక్కును** – చేవపెరుగును ★ **చొక్కించితే** – పరవశింపజేస్తే
★ **కలికితనము** – నేర్పు ★ **చిమ్మిరేచు** – చెలరేగు
★ **కొలికి** – నేటి కాలంలో క్లైమాక్సు

సంఖ్య :273 సంపుటము : 28 పుట: 182 రాగం : భైరవి

**29 సుదతికి మీరిందరూఁ జుట్టాలైన ఫలము**
**మదనుని వేఁడుకోరే మంచిదౌఁగాని** ॥పల్లవి॥

**జలములలో నెల్లా చంద్రకాంతాలు చల్లరే**
**అలతామరలగర్వ మణఁగుఁగాని**
**చలపట్టి వనముల జవ్వాది వాసించరే**
**మలయుఁ జిలుకలకు మాటుమందౌఁగాని** ॥సుద॥

**పొదలపై సంపెంగ పువ్వులు వెదచల్లరే**
**వుదుటఁ దుమ్మిదమూఁక లుడుఁగుఁగాని**
**పది దిక్కులను రఘుపతిపేరు దలవరే**
**గుదిగొన్న కోవిలలు కూయకుండుఁగాని** ॥సుద॥

**పాటలలో శంకరాభరణం మాళాపించరే**
**నీటు చల్లగాలి సొంపు నిలుచుఁగాని**
**యీటున శ్రీవేంకటేశుఁ దేలె నలమేల్మంగను**
**చాటించరే యిన్నీఁ దొంటి జాడల నుండుఁగాని** ॥సుద॥ **273**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య పెద్దముత్తైదువలాగా అలమేల్మంగ చెలికత్తెలకు పనులు పురమాయిస్తున్నారు. నాయికను ఎలా సిద్ధంచేయాలో వివరిస్తున్నారు. ఈ అమ్మాయికి మీరందరూ చుట్టాలేనర్రా, ముందుగా వలపులఱేడు మన్మథునితో వీరికి మంచి జరగాలని వేడుకోండి. ఆమె జలకమాడే జలములలో కలువపూలు చల్లండి, తామరల గర్వం నశిస్తుంది. ఆ నీళ్ళల్లో జవ్వాది వేయండి చిలుకలు గొడవ చేయవు. ఆ దంపతులు వుండే పొదరింటిపై సంపంగి పూలు వెదజల్లండి, తుమ్మెదలు రావు. నలుదిక్కులా రామ, రామ, రామ అని పెద్దగా రాముని పేరు అరుపులు పెట్టండి, ఇక కోయిలలు కూయవు. శ్రావ్యంగా శంకరాభరణరాగం ఆలపించండి చల్లగాలి వీస్తుంది. శ్రీవేంకటేశుడు అలమేల్మంగ ఒక్కటయ్యేవేళ ఎక్కడివాళ్ళనక్కడే వుండమనండి.

★ **చంద్రకాంతాలు** – కలువపూలు ★ **వనములు** – నీళ్ళు
★ **ఈటున** – అతిశయంతో ★ **తొంటిజాడలు** – ఎక్కడివక్కడే





సంఖ్య :272 సంపుటము : 28 పుట: 182 రాగం : సామంతం

**30 ఎవ్వరికిఁ గలవమ్మ ఇటువంటి సొబగులు**
**నివ్వటిల్ల నన్నియును నీకే తగుఁగాక** ॥పల్లవి॥

**జక్కవగుబ్బల మీఁద జారేటి పయ్యదకొంగు**
**చెక్కులపై వడిసేటి చెమటనీరు**
**పుక్కిటి బంటియైన పొలపనిట్టూరుపులు**
**ఇక్కువలై కనుపట్టె నేనోము నోఁచితివో** ॥ఎవ్వ॥

**కదలేని బిత్తరపు కనుచూపుతేటలు**
**గుడిగొన రాలేటి కొప్పువిరులు**
**జడియక తొలఁకేటి చక్కని మోముకళలు**
**అదరి నీవు సేసిన దది యెంత భాగ్యమో** ॥ఎవ్వ॥

**మొగి సెలవులఁ గమ్మేముసి ముసినగవులు**
**చిగురుఁబెదవి నూరే చిరుసిగ్గులు**
**జిగి నలమేల్మంగవు శ్రీవేంకటేశురాణివి**
**తగిలె నీకీరతులు తపమెంత సేసితివో** ॥ఎవ్వ॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య నాయిక అలమేలుమంగ సొగసును మెచ్చుకొంటున్నారు. ఇటువంటి సొంపులు ఎవ్వరికున్నాయమ్మా? ఆ సొంపులన్నీ నీకే అతిశయముగా తగినట్లున్నవమ్మా! జక్కువ పిట్టలవంటి నీ కుచయుగ్మముపైన పయ్యెద జారింది. చెక్కిళ్ళపై చెమట నీరైకారింది. పుక్కిటనిండేట్లుగా దీర్ఘమైన నిట్టూర్పులను విడచుచున్నది. ఏమి నోములు నోచావోగాని ఈ సొంపులన్నీ అతిశయించి కనబడుతున్నాయి. బాగా బిత్తరబోయినట్లుండే నీ కనుచూపులు స్వచ్ఛంగా వున్నాయి. నీ ఆతృత వల్ల కొప్పులోని పూలన్నీ రాలిపోతున్నాయి. నీ చక్కని అధరాలు నిశ్చలంగా వున్నాయి. ఎంత భాగ్యవంతురాలవమ్మా!! నీ ముసిముసి నవ్వులు, చిగురుటాకులవంటి పెదవిని నూరుతున్న సిగ్గులు అతిమనోహరం. శ్రీవేంకటేశుడు నిన్ను రతివీడడు. ఎంత తపము ఆయనకు చేశావమ్మా!!!

★ **నివ్వటిల్లు** – అతిశయించు ★ **వడిసేటి** – కారేటి
★ **జడియక తొలకు** – నిశ్చలంగా అతిశయించు ★ **అదరి** – అతిశయించి
★ **గుడిగొను** – అతిశయించు ★ **పొలపు** – దీర్ఘమైన

సంఖ్య :553   సంపుటము : 28   పుట: 365   రాగం : ఆహిరి

**31 ఏల నన్నొడఁబరచే వెఱఁగనా నీగుణము**
**కోలుముందుగాఁ దానే కొసరీఁగాక** ||పల్లవి||

**వలెన నెవ్వతెకైనా వలచేటివాఁడవా**
**చెలి తాఁ జుట్టరికాలు చెప్పీఁగాక**
**పిలిచి వట్టి పొందులఁ బెనఁగేటివాఁడవా**
**చెలఁగి నీకాపె సేవసేయవచ్చీఁగాక** ||ఏల||

**నంటుసేసి వొకరితో నవ్వేటివాఁడవా**
**అంటిముట్ట (ట్టి?) తా సరసమాడీఁగాక**
**వెంట వెంటఁ జెక్కు నొక్కి వేఁడుకొవే వాఁడవా**
**దంటతనమునఁ దానే తగిలీఁగాక** ||ఏల||

**చేరి నీవు కెలనికిఁ జేయిచాఁచేవాఁడవా**
**కోరి తానే కాఁగలించుకొనీఁగాక**
**కూరిమి శ్రీవేంకటేశ కూడితివి నన్ను నేఁడు**
**పోరచికి వచ్చి తానే పొదిగీఁగాక** ||ఏల||

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో అలమేలుమంగమ్మ స్వామితో నీ ప్రియురాలు నీవూ ఒకర్నొకరు యెంతైనా సేవించుకోండి, మధ్యలో నన్నెందుకు ఒడబరచెదవు? నీ బుద్దులు నాకు తెలియవా? ఆవిడగారు తానే మొట్టమొదట నిన్ను ఆపేక్షించి వుండవచ్చుగాక! మరీ ఇంత బరితెగింపా? ఆవిడ నీకూ తనకూ చుట్టరికం చెప్తే మాత్రం, "వలెననెవ్వతెనైనా" (కోరినదానినెల్లా) వలచేటంతటివాడవా? నీకు ఆవిడయెంతసేవ చేయాలనుకొన్నా ఇదా సేవ? పిలిచి పట్టుకొని రతుల పెనగేటంతటివాడవా? నిన్ను అంటుకొని (ముట్టుకొని) అదేసరసమాడివుండవచ్చును. అయితేనేమి చెలిమిచేసి ఎవరితోనో నవ్వేటంత తెగించావా? ధైర్యం చేసి అదే నిన్ను తగులు కొని వుండవచ్చు. వెంటపడి చెక్కిళ్ళు నొక్కివేడుకొనేటంతటివాడవా? కోరితేనే కౌగలించిన ఆమె దిక్కుకి చేయిచాచేవాడివా? నన్ను కూడిన శ్రీవేంకటేశా వూరకే వచ్చి అది కోరినా నీవు నా వాడివే.

★ **కోలుముందు** – మొట్టమొదట ★ **కొసరు** – ఆక్షేపించు
★ **నంటుసేసి** – చెలిమిచేసి ★ **దంటతనము** – ధైర్యంతో
★ **పోరచి** – వ్యర్ధము ★ **కెలను** – దిక్కు





సంఖ్య :118   సంపుటము : 28   పుట: 79   రాగం : పాడి

**32 అలమేలుమంగవు నీవౌనే పతిఁ జేకొంటివి**
**నెలకొని యీచేఁతలు నీవే నేరుతువే** ||పల్లవి||

**మొగము చూడఁగానే ముంచుకొను నగవులు**
**నగఁగానే పెనగొని నాఁటుఁ దగులు**
**తగులఁగా దగులఁగాఁ దమకము చిగిరించు**
**చిగిరంపునాసలు చిమ్మిరేఁచువలపు** ||అల||

**వలవఁగా వలవఁగా వడిఁబెట్టుఁ దలఁపులు**
**తలఁచఁగా నోరికబ్బు తానే పిలుపు**
**పిలువఁగాఁ బిలువఁగా బెనలుఁగొనుఁజెలిమి**
**చెలిమిఁ గడుఁ జేయఁగా చెలరేఁగు మనసు** ||అల||

**మనసెపెట్టఁ బెట్టఁగా మల్లడిగొను ననుపు**
**ననుచఁగా ననచఁగా నంటు లెనయు**
**యెనయఁగా శ్రీవేంకటేశుఁ డేలేగుట్టు గను**
**కనుఁగొనఁగానే చెంగలించు మొగము** ||అల||

**పరిచయ పరిమళం :**

అలమేలుమంగ చక్కదనమును, గుణగణములను కీర్తిస్తున్నారు అన్నమయ్య. దేవీ! నీపేరుకు తగినట్లు (అలర్‌మేల్‌మంగ అంటే పుష్పంపై భాగంలో జన్మించిన లక్ష్మీదేవి అని అర్థం) నీవు వున్నావు. శ్రీవేంకటేశ్వరుని నీ పతిగా చేకొన్నావు. ఈ చేతలన్నీ నీవే నేర్వగలవు. నీ వదనము చూడగానే సంతోషం కలుగుతుంది. నీవు నవ్వగానే బంధం పాతుకొనిపోతుంది (తగులము) అతిశయించును. తగలగానే తమకము చిగురిస్తుంది. ఆ చిగురింపువలన ఆశలు పెంచి వలపు చెలరేగిపోతుంది. వలపు పెరిగిపోతే తలపులు మెలిబెట్టినట్లవుతాయి. తలపుల వల్ల నోరు నీపేరే పిలుస్తుంది. పిలవగా, పిలవగా చెలిమి చుట్టుకొంటుంది. ఆ చెలిమి యెక్కువైతే చెలరేగిపోతుంది మనసు. మనస్సు పెట్టగానే అధికమయ్యేదే ననుపు. ననచగా చెలిమి యెక్కువయై యెనయును. ఎనయగా ఓ తరుణీ! వేంకటపతి నిన్నేలును గుట్టుగను. కనుగొనగా మొగము వికశిస్తుంది. (ముక్తపదగ్రస్త అలంకారం)

★ **నాటుదగులు** – బంధం పాతుకొనును ★ **వడిబెట్టు** – మెలిబెట్టు
★ **పెనలుగొను** – చుట్టుకొను ★ **మల్లడి** – మిక్కుటము ★ **ననుపు** – అనురాగము
★ **నంటు** – చెలిమి

సంఖ్య :117 సంపుటము : 28 పుట: 79 రాగం : సాళంగం

**33** **బుద్ధిచెప్పేము నీకు పుట్టినయింటివారము**
**పొద్దువొద్దు మగనికి పొందులు మరుపవే** ॥పల్లవి॥

**గుత్తపు గుబ్బల నూఁది కొప్పు దువ్వవే పతి -**
**చిత్తమురా వేళగాచి సేవసేయవే**
**హత్తి ఇచ్చకపుమాఁట లాడి పైకోవే**
**కొత్తపెండ్లికూఁతుర యీగుణాలెఱుఁగుకోవే** ॥బుద్ధి॥

**వినయాలు చూపి చూపి వీడె మియ్యవే**
**ననుపులు సేసుకొని నవ్వు నవ్వవే**
**తనివారా భోగమిచ్చి తమిరేఁచవే**
**వొనరినకొమెరెవు వోజ నేరుచుకోవే** ॥బుద్ధి॥

**మోవితేనియ లొసఁగి మోము చూడవే**
**శ్రీవేంకటేశుఁ గూడి చెలగించవే**
**కైవసముగ మెలఁగి కాఁగిలించవే**
**యీవల నలమేల్మంగ విన్నీఁ దెలుసుకోవే** ॥బుద్ధి॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య పెండ్లి ముత్తైదువలలో ఒకరై అలమేల్మంగకు నాలుగు మంచి మాటలు చెబుతున్నారు. ఓ దేవీ! మేము నీ పుట్టినింటివారము. నాలుగు మంచి మాటలు చెబుతాము వినవమ్మా! నీ మగనికి (భర్తకు) ప్రతిరోజూ నీ రతులు అలవాటు చేయాలి. ఆ వేంకటపతి కొప్పు ప్రతిరోజూ నువ్వే దువ్వుతూ అప్పుడప్పుడూ నీ బింకపు చనుగవ ఆయనకు వొత్తాలి. ఏవేళనైనా మనస్ఫూర్తిగా సేవచేయాలి. ఆయనకు ఇష్టమైన మాటలు చెబుతూ కూడవలెను సుమా! కొత్తపెండ్లి కూతురువు యీ సుగుణములన్నీ నీకు అవసరమవుతాయి. ఆయనకు తాంబూలం వినయంగా ఇవ్వాలి. ఇంపుగా నవ్వాలి. తనివిదీరా భోగములన్నీ అందించి పరవశింపజేయాలి. కొత్త పెండ్లికుమార్తెవు నేర్పులన్నీ నేర్చుకో. ఆయన మొగములోనికి చూస్తూ మధురాధరమునందించాలి. శ్రీవేంకటేశుని కూడి సుఖించు. నీవు అలమేల్మంగవమ్మా! ఇవన్నీ నీవు నేర్వవలసినదే.

★ **గుత్తపుగుబ్బల** – బిగువైన స్తనముల ★ **ననుపులు** – ఇంపులు
★ **కొమెరవు** – లేప్రాయపు జవ్వనివి ★ **పొద్దువొద్దు** – ప్రతిరోజూ
★ **చెలగించవే** – సంతోషపెట్టవే ★ **ఓజ** – నేర్పు





సంఖ్య :353 సంపుటము : 28 పుట: 234 రాగం : వరాళి

**34** **ఎన్నఁడు నెఱఁగమయ్య యిటువంటివలపులు**
**విన్నకన్నవారికెల్లా వెరగయ్యీ నిపుడు** ॥పల్లవి॥

**వెలఁది నీగుణములు వినివిని తనియదు**
**తలపోసి తలపోసి తనియదు**
**సొలసి కన్నుల నిన్నుఁ జూచి చూచి తనియదు**
**యెలమి నీపై మోహమింకా నెంతోకాని** ॥ఎన్నఁ॥

**అట్టె నీతోడుత మాటలాడియాడి తనియదు**
**తట్టి తట్టి పాదాలొత్తి తనియదు**
**చిట్టకపు కొనగోరఁ జిమ్మి చిమ్మి తనియదు**
**యిట్టె నిన్నుఁ గూడే వేడు కింకా నెంతోకాని** ॥ఎన్నఁ॥

**అచ్చపు నీమోవితేనె లానియాని తనియదు**
**తచ్చి తచ్చి నవ్వి నవ్వి తనియదు**
**కొచ్చి శ్రీవేంకటేశ్వర కూడిగూడి తనియదు**
**యిచ్చల నీపై తమక మింకా నెంతో కాని** ॥ఎన్నఁ॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య మధురకీర్తన తేనెలూరుతుందంటే ఇదే చక్కని ఉదాహరణ. ఎన్నడును ఇటువంటి వలపునెరుగమయ్యా! ఇప్పుడు దీని గురించి విన్నవారికి దీనిని చూచిన వారికి ఆశ్చర్యం కలిగింది. ఆమెకు నీ గుణముల గూర్చి యెంత విన్నా తృప్తిలేదు. నీ గురించి యెంత ఆలోచించినా తృప్తి చెందదు. నిన్నెంతసేపు చూచినా తృప్తిలేదామెకు. ఓ వేంకటేశ్వరా! ఆమెకు నీపై ఇంకా యెంత మోహమో కాని నీ సుగుణములంటే ఆమెకంత మక్కువ. నీతో యెంత మాట్లాడినా తృప్తిజెందదు. ఎంతసేపు నీ పాదాలు వొత్తినా తృప్తిలేదు ఆమెకు. నీ అల్లరికి యెంత గిల్లినా గీరినా తృప్తి చెందదు. పరవశించి నీ కూటమి అంటే యెంత వేడుకో ఆమెకు. ప్రభూ! నీ అధరామృతమెంతగ్రోలినా ఆమె తృప్తి చెందదు. నిన్ను తలచుకొని యెంతసేపు నవ్వినా తృప్తినెరుగదు. తిరుమలేశా! నిన్నెంత కూడినా తృప్తిచెందదు. ఇంకా నీపై ఆమెకెంత తమకమో!!!

★ **వెరవు** – ఆశ్చర్యము ★ **తట్టితట్టి** – కొట్టికొట్టి ★ **ఆని** – ఆస్వాదించి
★ **చిట్టకము** – శృంగారంలో ★ **చిమ్మి** – చెలరేగి ★ **కొచ్చి** – గుచ్చి
★ **తచ్చి** – తలపోసి

సంఖ్య :352 సంపుటము : 28 పుట: 233 రాగం : దేవగాంధారి

**35** చూచి చూచి మీ పెండ్లికి సోబాన వాడేముగాక
మీచేఁత లిట్టివని మే మెంచఁగలమా ॥పల్లవి॥

చెక్కులు నొక్కేవు నీవు సెలవుల నవ్వెనాపె
యిక్కువలు మీలోనివి యెట్టు దెలుసు
తొక్కేవు పాదాలు నీవు దొరకొని మొక్కీనాపె
పక్కన మీ భావా లేరుపరచఁ గఁ గలమా ॥చూచి॥

చెనకఁచూచేవు నీవు సిగ్గులు వడీనాపె
యెనసిన నీసన్న లెట్టు దెలుసు
పెనఁగే వప్పటి నీవు ప్రియములు చెప్పీ నాపె
వెనుకొన్న మీ సుద్దులు వివరించఁగలమా ॥చూచి॥

సరసమాడేవు నీవు చన్నుల నొత్తీ నాపె
యిరవైన మీ చయ్యాటా లెట్టు దెలుసు
గరిమ శ్రీవేంకటేశ కలసితివిటునన్ను
తెరలోని మీరతులు తెలుపఁగఁగలమా ॥చూచి॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని కళ్యాణంలో పాడిన కీర్తన ఇది. తానూ ఒక వనితవలె స్వామిని పొందాలనే తహతహ. మీముగ్గురిని (స్వామి, శ్రీదేవి, భూదేవి) ఈ మీ పెండ్లిలో చూచిచూచీ మంగళగీతాలు పాడుతున్నాము. మీ శృంగార లీలలు ఇటువంటివని వూహించగలమా? ప్రభూ! నీవేమో ఆమె చెక్కిలి నొక్కుతావు. పైగా చిరునవ్వులు చిందిస్తావు. ఆమె స్పందించే స్థానములు నీకే తెలుసును. నీవేమో ఆమె కాలు తొక్కితే ఆమె నీ కాళ్ళకు మొక్కుతుంది. పక్కపక్కనేవున్న మీ భావాలు విడమరచి వివరించగలమా? నీవు చిలిపిగా చూస్తావు. ఆమె సిగ్గుల మొగ్గవుతుంది. నీ సైగలు మాబోంట్లకు ఎలా అర్థమవుతాయి స్వామీ! ఆమె తీపి మాటలు చెబుతుంటే నీవు మరుల ఆమెను పెనవేస్తావు. మావెంటనేవున్న మీలీలలు వివరించగలమా స్వామీ! నీవు సరసాలాడుతావు, ఆమె కుచగిరులనొత్తుచూ చేరికవుతుంది. మీ లీలలు చెప్పగలమా? ఈ మధ్యలో శ్రీవేంకటేశా! నన్నూ కూడినావు. మీ చాటుమాటు రతులు నేనెట్లు వర్ణించగలనయ్యా?

★ **సోబనాలు** – మంగళ గీతాలు ★ **ఇక్కువలు** – కళాస్థానములు
★ **అప్పటి** – మరల ★ **వెనుకొన్న** – మావెంటనేవున్న ★ **చయ్యాటలు** – లీలలు





సంఖ్య :271 సంపుటము : 28 పుట: 181 రాగం : ఆహిరి

**36** ఏమని విన్నవించేము యీపె సుద్దులు
కోమలికోరికె లివి కోటానఁ గోట్లు ॥పల్లవి॥

పడఁతుల నీగుణాలు పలుమారు నడుగును
వుడివోని సంతోసాల నుమ్మగిలును
తడయక కొంతవడి తలఁచు నీరూపము
వడియుఁ జెమటతోడ వలలఁ బొరలును ॥ఏమ॥

నిలుచుండి తొంగి తొంగి నీరాక కెదురుచూచు
పొలసి యడియాసల బొద్దు గడపు
పలుకు నీవుండినట్టే భావించి పానుపు మీఁద
అలరి తననీడ నీవని కాఁగిలించును ॥ఏమ॥

ఆకు మడిచి నీకిచ్చేనని నోర నందిచ్చు
పైకొని వోలలాడును భావరతుల
చేకొని ఇంతలో వచ్చి శ్రీవేంకటేశ కూడితి –
వీకె యలమేలుమంగ ఇప్పు డురమెక్కెను ॥ఏమ॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య, దేవి చెలికత్తెవలె తిరుమలదేవుని చెంత అలమేలుమంగ మదిలో చెలరేగే ఆలోచనలను విన్నవిస్తున్నారు. ప్రభూ! ఈమె సంగతులనేమని విన్నవించెదమయ్యా! ఈ కోమలాంగి మదిలో చెలరేగే కోరికలు, కోటానుకోట్లున్నాయి. మావంటి ఇతర వనితలను రహస్యంగా నీ గుణగణాలెటువంటివని అడుగుతుంది. మేమాయన పురుషోత్తముడని అంటాము. ఆమాట విని అంతులేని సంతోషంతో ఉబ్బిపోతుంది. తృప్తిచెందక కొంతసేపు నీ రూపం తలచుకొంటుంది. అందుచేత చెమటలు యెక్కువవుతాయి. నిలుచుని నీరాక కోసం తొంగి తొంగి చూస్తుంది. నీవు రాకపోతే తన యాస అడియాస అయిందని పరితపిస్తుంది. నీవు వున్నట్లే మాట్లాడుతుంటుంది. నల్లగావున్న తన నీడను చూచి, నీవనుకొని కౌగలించుకొంటుంది. తాంబూలం నీనోటికందిస్తున్నట్లు భావిస్తుంది. భావరతుల మునిగిపోతుంది. అందుకే నీ హృదయరాణి అయిందయ్యా వేంకటేశ్వరా.

★ **ఉడివోని** – నశించని ★ **ఉమ్మగిలును** – ఉబ్బిపోతుంది ★ **వడియు** – కారిపోయే
★ **వలలబొరలును** – చుట్టచుట్టుకొని పొర్లును ★ **పొలసి** – అటూ ఇటూ తిరుగుతూ
★ **ఆకుమడిచి ఇచ్చు** – తాంబూలమిచ్చు

సంఖ్య :351 సంపుటము : 28 పుట: 233 రాగం : పళవంజరం

**37** మెచ్చి రిందరును నిన్ను మేలు మేలే
కచ్చుపెట్టి చెలులము కంటిమే నీమేలు ॥పల్లవి॥

చెలువుఁడు నిన్ను మెచ్చ సింగారించుకొంటి వౌనే
కొలువులో విడెమందుకొంటి వవునే
వలిపె పయ్యద పల్లెవాటు వేసికొంటి వౌనే
మెలఁగి నీ పగటులు మెరసితి వవునే ॥మెచ్చి॥

పతికి నింపులు వుట్ట పాటలు వాడితివౌనే
కతచెప్పి మతిఁ గరఁచితి వవునే
రతికి సన్నలుసేసి రప్పించుకొంటి వౌనే
చతురత లెల్లాను సాదించితి వవునే ॥మెచ్చి॥

మాటాడి శ్రీవేంకటేశు మరిగించుకొంటి వౌనే
కూటములు (ల?) మన్నన చేకొంటి వవునే
తేట తెల్లమిఁ బట్టపుదేవులవైతి వౌనే
నీటున నీతనివద్ద నెలకొంటి వవునే ॥మెచ్చి॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ మధురకీర్తనలో అలమేలుమంగ చెలికత్తెలు ఆమెతో చెప్పిన ప్రోత్సాహక వచనాలు వివరిస్తున్నారు. దేవీ! అందరూ నిన్ను బాగు బాగు అని మెచ్చుకొన్నారమ్మా! నీ చెలులమైన మేమందరము పట్టుదలతో పూరంతా తిరిగి స్వయంగా చూచినాము. అవునే, నీవు చేసికొనిన సింగారము నీ ప్రియునికి నచ్చింది. అందుకనే నిండు సభలో నీచేతికి అంగీకార తాంబూలం ఇచ్చాడు. పైగా నీవు చీటికి మాటికి జారిపోయే వల్లెవాటువేసికొనినావు. అవునే, అందుకే నీవు శోభలీనుతూ మెరిసిపోయావు. ఆయనకు సంతోషం కలిగేట్లు పాటలు పాడినావట. తీయటి మాటలతో ముచ్చట్లు చెబుతావట. నీవు సైగలు చేసి నీ పతిని నీతో రతికి ఆహ్వానిస్తావుట. నీ మగని చతురతతో నీవాడిని చేసికొనినావట. అవునే శ్రీవేంకటేశ్వరునే మరిగించి చేపట్టినావు కదా! నీవాయన పట్టపురాణివై ఆయన హృదయ వాసినివైవనావు.

★ **కచ్చుపెట్టి** – పట్టుదలతో ★ **వలిపే** – జారిపోయే ★ **పగటులు** – శోభలు
★ **కరచితివి** – కరిగించావు ★ **చెలువుడు** – ప్రియుడు ★ **నీటున** – గర్వముతో





సంఖ్య :31 సంపుటము : 29 పుట: 21 రాగం : శంకరాభరణం

**38** ఎచ్చటఁ జూచిన నితఁడై కృష్ణుఁడు
మచ్చిక నలమేలుమంగతో వెలసీ ॥పల్లవి॥

కొట్టరో వుట్లులు గోపాలబాలులు
యిట్టె కృష్ణుని యెదుటను
పట్టరో వారలు పాలు నేతికిని
గట్టిగ జోరునఁ గారీ నవిగో ॥ఎచ్చ॥

కూడరో మూఁకలు కోలలవారలు
వేడుకఁ గృష్ణుని వెంటవెంట
ఆడుచు మెసఁగరో అడుఁకులుఁ జక్కిలాలు
వాడల వాడల వరుసతోను ॥ఎచ్చ॥

నిక్కి తీసుకోరో నెఱవాదికాండ్లు
మక్కువఁ గృష్ణుని మఱఁగునను
యెక్కరో శ్రీవేంకటేశు కొండమీఁద
పెక్కు నురుగులు పెరుగులు నివిగో ॥ఎచ్చ॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన అధ్యాత్మకీర్తన అంటే బాగుంటుంది. ఉట్ల పండగ జరిగే కృష్ణాష్టమినాడు దీనిని చెప్పివుంటారు. ఎందుకో శృంగారం ఆవంత అయినా లేని ఈ కీర్తన రేకు కలగాపులగమయిందేమో బహుశా. మచ్చిక అయిన అలమేలుమంగతో వెలసిన ఈ వేంకటేశుడే కృష్ణుడుగా ఎచ్చట జూచినా తానే అయి వున్నాడు. ఓ గోపాలబాలుల్లారా! ఉట్లను పగులగొట్టండి. ఇట్టే ఈ శ్రీకృష్ణుడు మీ ఎదుటనే వున్నాడు. పాలూ నెయ్యీ కారిపోతున్నాయి జోరుగా ధారగా. దోసిలి పట్టి తాగండి. గుంపుగా కూడి కోలాటాలు వేడుకగా కృష్ణునితో ఆడండి. ఆడుతూనే రేపల్లెలోని ప్రతి వాడకూ పోయి అటుకులు, చక్కిలాలు తినండర్రా. ఓ సామర్థ్యంగల కుఱ్ఱవాండ్లూ! ఎత్తుగా ఎగిరి ఈ ఉట్టిని కొట్టండి. కావాలంటే కృష్ణుడు మీ ముందున్నాడు. శ్రీవేంకటేశ్వరుని కొండ ఎక్కారంటే బోలెడంత పాలనురుగులూ పెరుగులూ దొరుకుతాయి.

★ **వారలు** – ధారగా కారిపోవుట ★ **మెసగరో** – తినరో
★ **నెఱవాదికాండ్లు** – సామర్థ్యంకలవారు ★ **నిక్కి** – ఎత్తుగా ఎగిరి
★ **నురుగులు** – పాలనురుగు ముద్దలు

సంఖ్య :32　సంపుటము : 29　పుట: 22　రాగం : నాదరామక్రియ

**39 ఎంత యెమ్మెలఁ బొరలేవేమే నీవు**
**మంతుకెక్క నిన్నాతఁడు మన్నించీనంటాను** ॥పల్లవి॥

**కప్పురపుఁబల్కు లెన్ని గాదెఁబోసేవే**
**కొప్పు చీఁకట్లెంతేసి కూడపెట్టేవే**
**ముప్పిరి నవ్వు లెందాఁకా మూటగట్టేవే**
**చొప్పు లెత్తి నిన్నాతెఁ (తఁ?)డు చూచీనంటాను** ॥ఎంత॥

**వేడుకసరసా లెన్ని వెదవెట్టేవే**
**తోడనే వలపు లెన్ని తూరుపెత్తేవే**
**మేడెపుఁజూపు లెంతేసి మేళవించేవే**
**జోడుగూడి నిన్నాతఁడు చూచీనంటాను** ॥ఎంత॥

**చక్కఁదనా లెన్నేసి పచారించేవే**
**పెక్కుతరితీపు లెన్ని పెరరేఁచేవే**
**యిక్కడ శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను**
**చొక్కించి నన్నేలె నిన్నుఁ జూచీనంటాను** ॥ఎంత॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగారకీర్తనలో మంతుకెక్కటం, గాదెపోయటం, మూటగట్టటం, వెదవెట్టటం, తూరుపెత్తటం, మేళవించటం, పచారించటం వంటి మాటలు కోకొల్లలు ఈ కీర్తనలో. ఇక నేటికాలం వారికి నిఘంటువులు తెరవక తప్పదు, మరి. ఓ తరుణీ! ఎంత విలాసము చూపుతున్నావే!! నిజమే, నిన్నాతడు మన్నించాడని వార్తలకెక్కిందమ్మా! ముచ్చటైన నీదంతాలు చూస్తే ఎన్ని కర్పూరపు పలుకులు కుప్పబోశావో అనిపిస్తుంది. అలాగే నీ కొప్పులో ఎన్ని చీకట్లు కూడబెట్టితివో అనిపిస్తుంది. ఎన్ని నవ్వులు మూటకట్టుకొన్నావో!! ఎన్ని సరసాలు వెదజల్లావే!! ఎంత వలపు తూర్పారపట్టావే!! దాంట్లో ఎన్ని మేలైన చూపులు కలిపావే!! నీతో తిరుమలేశుడు జోడుకట్టాడనే కదా! నీ ఆర్భాటం. ఎన్ని చక్కదనాలు ప్రకటిస్తున్నావే!! ఎన్ని తమకములు ప్రేరేపించావే!! ఈ శ్రీవేంకటేశుడు అలమేల్మంగను పరవశింపజేసి ఆ తరువాత నిన్నూ నన్నూ కూడా చూశాడు.

★ **ఎమ్మెలు** – విలాసములు ★ **మంతుకెక్కు** – వార్తలలోకెక్కు
★ **చొప్పులెత్తు** – చూపులు నిలుపు (అని నా భావన)
★ **మేడెపు చూపులు** – మేలైన కళలు ★ **పచారించు** – ప్రకటించు





సంఖ్య :461　సంపుటము : 29　పుట: 326　రాగం : దేసాళం

**40 వేగమే యానతీవమ్మా విన వేడుకయ్యీ నాకు**
**యీగతి నున్నవి నీ ఇంగితాకారములు** ॥పల్లవి॥

**కాంతునిమై గురుతులు కంటివో యేమైనాను**
**చెంతనుండి నవ్వేవు చిరునవ్వులు**
**వింత సుద్దు లేమైనా వింటివో యాతనిమీఁద**
**ఇంతలోనే చెలులతో నేకాంతా లాడేవు** ॥వేగ॥

**చేతికి నంగమచ్చాలు చిక్కెనో నీకేమైనా**
**కాతరాన సొలసేవు కమ్మటి నీవు**
**నీ తలపున నేమైనా నెపములు వారెనో**
**పోతరించి లోలోఁ దలపోసుకోనేవు** ॥వేగ॥

**నిక్కముగా నాతని నిజము దెలిసితివో**
**గక్కన శ్రీవేంకటేశు గాఁగిలించేవు**
**ఇక్కువలు గరఁగి నీ యెన్నిక లీడేరెనో**
**వుక్కుమీరి కలలెల్లా నుప్పతిలీ నీకును** ॥వేగ॥ **491**

**పరిచయ పరిమళం :**

ఇంగితాకారము అనే మాట నిఘంటువులో లేదు. అది ఇంగితము కావచ్చును. ఇంగితమంటే అభిప్రాయము అని అర్థం. అన్నమయ్య అదే ఆలోచనతో ఈ కీర్తన చెప్పివుండవచ్చును. దేవీ! నీ చెలియనైన నాకు వినుటకు వేడుక కలుగుతోంది. త్వరగా నీ అభిప్రాయములు ఏవిధముగానున్నాయో చెప్పవమ్మా! నీ నాథుని ఒంటిపై ఏమైనా గుర్తులు చూశావా యేమిటమ్మా? దగ్గరవుండి చిరునవ్వులొలికిస్తున్నావు. ఆయన గురించి యేమైనా కొత్త సంగతులు విన్నావా యేమిటమ్మా? మమ్మల్ని మాట్లాడాలని పక్కకు పిలిచావు. ఆయన శరీరంపై యేమన్నా మచ్చలు కానవచ్చాయా యేమిటమ్మా? అంతవ్యథ చెందుతున్నావు. నీ ఆలోచనలలో ఏమైనా లోపాలు కనబడ్డాయా యేమిటమ్మా? గర్వంతో ఆయనను తూలనాడానని లోలోపల మథనపడుతున్నావు. శ్రీవేంకటేశుని గురించి నిజం తెలిసిందా? ఆయన పురుషోత్తముడని మరీ అంత బిగి కౌగిట ఆయన్ని చుట్టుకొన్నావు.

★ **ఇంగితాకారము** – అభిప్రాయము ★ **అంగమచ్చాలు** – శరీరపు మచ్చలు
★ **కాతరాన** – వ్యథతో ★ **పోతరించి** – గర్వించి

సంఖ్య :374 సంపుటము : 29 పుట: 250 రాగం : బౌళి

**41** **ఎక్కడనుండి వచ్చెనో యేఁకరి నీ రతులకు**
**చిక్కించుక కాఁపరము సేయవయ్యా** ॥పల్లవి॥

**లక్కవలెఁ గరఁగీని లలన నీ మాఁటలకు**
**చొక్కుచు నాపె వలపు చూడవయ్యా**
**మొక్కుచు వినయాన నీ ముందర నిలుచున్నది**
**అక్కర యెంత గలదో అడుగవయ్యా** ॥ఎక్క॥

**జిగురువలె నంటీని చెలియ నీ పొందులకు**
**తెగని చుట్టరికము తెలియవయ్యా**
**నగుతా సారెకు నీతో ననుపులే పచరించీ**
**చిగిరింపుఁ గోరికలు చెల్లించవయ్యా** ॥ఎక్క॥

**తీగెవలె నల్లుకొనీ తెరవ నీ కాఁగిటికి**
**జాగులు సేయ కది విచారించవయ్యా**
**యీగతి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను**
**బాగుగా నన్నేలితి వాపడఁతి నేలవయ్యా** ॥ఎక్క॥

**పరిచయ పరిమళం :**

'ఏకరి' అంటే అధికమైన అనిఅర్థం. అన్నమయ్య కూడా అలమేలుమంగమ్మ చెలికత్తెయే. దేవి శ్రీవేంకటేశునికి తన చెలికత్తె స్వామిని వలచి యెంత తపిస్తున్నదో ఈ కీర్తనద్వారా వివరించి అన్నమయ్యను యేలుకోమని ప్రాధేయపడుతున్నది. ప్రభూ! నీ రతులకోసం యెక్కడినుండి వచ్చిందో పాపం!! ఈ బేలను నీ స్వాధీనం చేసికొని అధికమైన రతులతో కాపురము సేయవయ్యా! ఆమె పారవశ్యంతో నీ మాటలకు లక్కవలె కరిగిపోతుంది. ఇప్పుడు నీకు మొక్కుతూ వినయంగా నీముందు నిలుచున్నది. పాపం!!నీ అవసరం యెంతవున్నదో యేమో! జిగురువలె ఆమె నీకు అంటుకుపోయింది. నీ పొందుకోసం తపిస్తున్న ఆమెకు నీతోగల చుట్టరికం తెలుసుకోవయ్యా! (నీవామె అంతర్యామివి కదా!) ఆమె చిరునవ్వుతో తన అనురాగాన్ని ప్రసరిస్తోంది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీకు తీగెవలె అల్లుకొని కౌగిట్లో కరిగిపోవాలని తపిస్తున్నది. జాగు చేయక ఈమెను విచారించవయ్యా! నేను అలమేల్మంగను. బాగుగా నన్నేలినట్లే ఆమెనూ యేలుకోరాదా?

★ **ననుపులేపచరించు** – అనురాగములు ప్రసారించు ★ **ఏకరి** – మిక్కుటమైన
★ **జిగురు** – బంక ★ **అక్కర** – అవసరం





సంఖ్య :74 సంపుటము : 29 పుట: 50 రాగం : భైరవి

**42** **నీవే మంచితనాలు నెరప నేరుతువమ్మా**
**సేవసేసి రమణుని చిత్తము వచ్చినట్టు** ॥పల్లవి॥

**యిచ్చకము లాడితేనే యితవులైయుండు; నౌనె**
**హెచ్చి వెంగేలాడితేను యియ్యకోలౌనా**
**అచ్చముగ మొక్కితేను అట్టె దయవుట్టు; నౌనె**
**విచ్చనవిడిఁ దిట్టితే వేడుకలౌనా** ॥నీవే॥

**మొగమెత్తి చూచితేను మోహములు రేఁగు; నౌనె**
**తగిలి తలవంచితే తమి వుట్టునా**
**నగవులు నవ్వితేను ననిచివుండు; నౌనె**
**బిగిసి వూరకుండితే ప్రియము గలుగునా** ॥నీవే॥

**పాయక పక్కనుండితే భావము గరఁగు; నౌనె**
**చాయల సన్నలవల్లఁ జవి వుట్టునా**
**చేయార శ్రీవేంకటేశుఁ జెందినది మే; లౌనె**
**కాయకపు సరసాలు కందువలంటీనా** ॥నీవే॥ **74**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య అలమేలుమంగమ్మ ఇష్టసఖియై ఆమెకు హితబోధ చేస్తున్నారు. ఓదేవీ! మీ దాంపత్య జీవితంలో తగిన నేర్పులు నెమ్మదిగా నీకే వస్తాయి. మంచితనమూ వస్తుంది. నీవు చేయవలసినదల్లా ఆయనకిష్టమైనట్లు సేవచేయటమే. ఆయనకు నీవు ప్రియముగా మాట్లాడితే నచ్చుతుంది. ఔనమ్మా! వ్యంగ్యంగా మాట్లాడితే బాగుంటుందా? నీవు నిర్మలమై మొక్కితే నీమీద స్వామికి దయకలుగుతుంది. ఔనే భర్తను ఇష్టంవచ్చినట్లు నిందిస్తే ఆయన నిన్ను క్షమిస్తాడా? నీ భర్తతో ఎప్పుడూ నీవు ముఖముపైకెత్తి మాట్లాడాలి. ఔనే తలవంచుకొంటే కోరిక యెలాపుడుతుందే. భార్య యెప్పుడూ చిరునవ్వుతోవుండాలి. అవునే వూరకనే బింకంగా వుంటే ఏమి అనురాగం కలుగుతుంది? వదలకుండా భర్త వెన్నంటేవుంటేనే భావోద్వేగం కలుగుతుంది. సైగలు చేసికొంటే శ్రీవేంకటపతికి యెలాచెందుతావు?

★ **యితవులైవుండు** – హితముగావుండును ★ **బిగిసి** – మూతిముడుచుకొని
★ **వూరకుండితే** – మౌనంగావుంటే

సంఖ్య :489  సంపుటము : 29  పుట: 325  రాగం : దేసాళం

**43** ఎదుటనే వుండఁగాను యెడమాఁట లేమిటికే
కదిసి పెనఁగులాడే కలయికలే మేలే ॥పల్లవి॥

మచ్చికలు నెరపితే మనసు లేకము లౌను
ఇచ్చకము తెచ్చితేనే యింపులు పుట్టు
ముచ్చటలు గలసితే ముదురు నడియాసలు
మెచ్చులుగా బతితోడి మేలములే మేలే ॥ఎదు॥

నగవు లుప్పతిలితే ననుపులు సమకూడు
మొగమోట గలిగితే మొనయు దమి
తగులాయా లొనరితే దట్టమౌను వలపులు
మగవానితో మంచిమాటలే మేలే ॥ఎదు॥

చూపులు తారసించితే సొంపులు మిక్కుటమౌను
కాఁపురాలు దొరకితే గట్టియౌఁ బొందు
పైపై నీమీఁది బత్తిఁ బాయక నన్నేలినాఁడు
చేపట్టి శ్రీవేంకటేశు సేవలే మేలే ॥ఎదు॥ **489**

**పరిచయ పరిమళం :**

దాంపత్య జీవితం ఎలావుండాలో వివరిస్తున్నారు అన్నమయ్య. ఓ దేవీ! ఆలుమగలు కలిసి జీవిస్తుంటే, వాళ్ళ మధ్య దూరంపెంచే మాటలు యెందుకమ్మా? పోట్లాట తరువాత కలయిక యెంతమధురం తెలుసా? అనుకూలత చూపిస్తే మనస్సులు కలుస్తాయి. ఒకరిపై ఇంకొకరు ప్రీతి తెచ్చుకొంటేనే ఇష్టము కలుగుతుంది. మీ మాటలు కలిస్తే ఆశలు చిగుళ్ళు వేస్తాయి. ముంగిలావుండేకంటే పతితో సరసాలాడితే బాగుంటుంది. నవ్వుతా సంభాషిస్తే అనురాగములు అతిశయిస్తాయి. మొగమోటము (దాక్షిణ్యము) కలిగితే ఆపేక్షలు పెరుగుతాయి. కామసంబంధాలు మీమధ్య వుంటేనే వలపు వృద్ధిచెందుతుంది. భర్తతో మాట్లాడే ఏదైనా మంచి మాటలే మాట్లాడాలి. ఒకరికళ్ళల్లోకి ఇంకొకరు చూస్తూ మాట్లాడాలి. కాపురాలు చేస్తుంటేనే భార్యాభర్తల మధ్య కూటములు కలుగుతాయి. నీమీద యెంతో భక్తివున్నా, నా భక్తిని చూచి నన్నూ అనుగ్రహించాడమ్మా! నీ శ్రీవేంకటేశ్వరుడు.

★ **ఎడమాటలు** – దూరంపెంచే మాటలు ★ **మేలము** – సరసము
★ **ఇచ్చకములు** – ప్రీతిమాటలు ★ **మొనయు** – అతిశయించు
★ **దొరకితే** – చేస్తుంటేనే ★ **తగులాయ** – కామసంబంధం





సంఖ్య :149  సంపుటము : 29  పుట: 100  రాగం : గౌళ

**44** కాంతపై మిక్కిలి బత్తిగలిగిన చెలులాల
పొంత నీపె వేడుకలు పొసఁగఁగఁజేయరే ॥పల్లవి॥

వనములో కోవిలల వట్టి రట్టు సేయనేల
పెనఁగి తుమ్మిదల కోపించఁగనేల
పనివడి చందురునిపై నేరమెంచనేల
వినయాన విభునికే విన్నపము సేయరే ॥కాంత॥

గూటిలోని చిలుకలఁ గొసరి జంకించనేల
నీటునఁ జల్లగాలిని నిందించనేల
పాటించి వసంతునితో పంతాలు దూయనేల
మాటలాడి విభుని నెమ్మదిని రప్పించరే ॥కాంత॥

పంచనున్న పావురాల బదరి తిట్టఁగనేల
పంచసాయకుని నొడఁబరచనేల
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డిదె వచ్చి యింతిఁ గూడె
మంచివాయఁ బనులెల్లా మనవులు చెప్పరే ॥కాంత॥ **149**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ మధురకీర్తనలో అలమేలుమంగ స్వామి జాగుచేశాడేమని చిరుబురులాడుతున్నది. మీరే యేదన్నా వేడుకలు చేయండి అని ఆమె చెలులకు నచ్చజెబుతున్నారు. ఈ దేవిపై మిక్కిలి భక్తివున్న చెలియలారా! దగ్గరకు వచ్చి ఈమెకు యేదన్నా వేడుక చేయండి. మీరే చూడండి. తోటలో కోయిలలు కూస్తున్నాయని వూరకనే యెంత నిందిస్తున్నదెందుకో? తుమ్మెదలపై కోపము చూపిస్తున్నదెందుకో, మరి? అదే పనిగా చంద్రునిపై నేరారోపణలు చేస్తున్నది. వెంటనేవెళ్ళి ఈమె నాథునికి విన్నవించండే. గూటిలోవున్న చిలుకలను కసురుకొని బెదరిస్తున్నది. చల్లగాలికి హాయిగావున్నా, మురిపెంగా తిడుతున్నది. వసంతునితో పంతాలుపెట్టుకొంటున్నది. ఈవిడ విభునితో ఇదంతా చెప్పి వెంటనే తీసికొనివచ్చేయండి. దగ్గరనే వున్న పావురాలను అరుస్తున్నాయని తిట్టటం దేనికే? పంచబాణుడైన మన్మథునితో ఒప్పందాలు చేసికొంటున్నది. ఇదిగో ఇంతలోనే శ్రీవేంకటేశుడు వచ్చి కూడినాడు. ఇక పనులన్నీ చక్కబడ్డాయి.

★ **రట్టు** – నిందించుట ★ **జంకించు** – బెదరించు ★ **నీటున** – మురిపెముతో
★ **పంచసాయకుడు** – మన్మథుడు ★ **మనవులు** – విజ్ఞాపనలు ★ **పాటించి**– పొంది

సంఖ్య :416    సంపుటము : 29   పుట: 306    రాగం : కేదారగౌళ

**45 తప్పులెంచ నే నిన్నుఁ దరుణీ**
**యిప్పుడే చెప్పితిఁ జుమ్మీ యింతిరో నీకు** ||పల్లవి||

**గంద మిచ్చి రావే చెలి కాంతునికి**
**నింద లేమి వచ్చునో నే నోపనమ్మా**
**అందియ్యవే విడెము నీ వాతనికి, నీ పతి**
**చెంది తమ్మ వెట్టితే నేమందువో నీవు** ||తప్పు||

**కమ్మి వేళ చూచి రావే కలికీ**
**నెమ్మి నాతో నవ్వ నేమో నే నోపనమ్మా**
**రమ్మని పిలువవే దూరక చేయివట్టి**
**అమ్మరో మేను సోఁకు నేమందువో నీవు** ||తప్పు||

**ఆముక యెదురుకోవే అదె వచ్చీని**
**నీమారు నన్నంటునేమో నే నోపనమ్మా**
**దోమటి శ్రీవేంకటేశుతోఁ గూడి రావే**
**ఆమఱఁగున నుండి యేమందువో నీవు** ||తప్పు||

**పరిచయ పరిమళం :**

ఇది నాయిక ఆమె చెలికత్తెల సంవాదము. ఏ పాదానికి ఆ పాదము విడిగా అర్ధము చెప్పుకొంటేకానీ అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన అంతుచిక్కదు. నా నాథునివద్దకెళ్ళి ఈ గంధం ఇచ్చిరమ్మంది నాయిక ఇక ఆ చెలికత్తెకీ తిరుమలేశుని రాణికి సంవాదమే. వినండి. ఓ తరుణీ! నేను నిన్ను తప్పుపట్టనులేవే వెళ్ళి నా నాథునికి ఈ గంధమిచ్చిరావే.

ఇంతిరో! ఇప్పుడే నేను వద్దని చెబుతున్నాను, సుమా!! పోవే, నాకాంతుడు మంచివాడు తెలుసా, వెళ్ళిరా.

ఏమోనమ్మా! ఆ తరువాత యేనిందవస్తుందో యేమో?
ఏమీకాదులే, అదే చేత్తో నీవాతనికి ఈ తాంబూలమియ్యవే.
ఒకవేళ మీ ఆయన నాకు తాంబూలం తమ్మ నోట్లోపెట్టితే? అప్పుడు నీవేమంటావోనమ్మా!
పోనీ ఇట్లావెళ్ళి... అట్లా వెంటనే రావే
ఏమోనమ్మా! నన్ను నవ్వుతూ పలుకరిస్తే, నేనాగలేకపోతే?
అలాగైతే దూరక (తిట్టక) నీవే రమ్మని పిలువవే.
అమ్మయ్యో!! ఒకవేళ నా వళ్ళు జలదరించేట్లు తాకితే? అప్పుడు నీవేమంటావోనమ్మా?
అప్పుడు, అధికముగా యెదిరించవే.
వేగంగా వచ్చి నీవనుకొని నన్ను పట్టుకొంటేనో?
ఆయన జగన్నాథుడే శ్రీవేంకటేశుని కూడిరావే.
నీవు అక్కడే దాగివుండి ఏమంటావో యేమో?

★ **ఆముక** – అధికముగా    ★ **కమ్మి** – క్రమముగా
★ **అమ్మరో!** – అమ్మయ్యో!    ★ **దోమటి**– చతురుడైన





సంఖ్య :155    సంపుటము : 29   పుట: 104    రాగం : బౌళి

**46 ఎన్నఁడు నేరిచెనో యింతేసి దంటతనాలు**
**కన్నులపండువుగాను కంటి మీకె చేఁతలు** ||పల్లవి||

**సేసవెట్టి పెండ్లాడిన చెలి నీవద్ద నుండఁగా**
**ఆస లేమి చూపీనే ఆకె నీకును**
**వాసివంతులెంచుకోదు వల పారడిఁబెట్టుక**
**వేసాలెల్లాఁ జేయఁగాను వెరగాయ నాకు** ||ఎన్నఁ||

**కాఁపురము సేసీ ఇంతి కదిసి సేవసేయఁగా**
**ఆడలేక మాటలాడీ నప్పటిఁ దాను**
**యీపె తగ వెఱఁగక యెమ్మెలఁ బొరలుకొంటా**
**పూఁపనవ్వులు నవ్వీని పొద్దువోదోకాని** ||ఎన్నఁ||

**పట్టపు టలమేల్మంగ పాదాలు నీ కొత్తఁగాను**
**యెట్టు నీతోఁ బొందుసేసీ నెంత చుట్టమో**
**యిట్టె శ్రీవేంకటేశ ఇందరి నీ వేలితివి**
**చుట్టి నిన్నుఁ గాఁగిలించీ చూడు మెంతసోద్యము** ||ఎన్నఁ|| **155**

**పరిచయ పరిమళం :**

తానూ ఒక చెలికత్తెయై అన్నమయ్య తనతోటి చెలికత్తెని దుయ్యబడుతున్నారు. ఎన్నడు నేర్చుకొన్నదో ఇంతనేర్పులు? ఈవిడగారి చేష్టలన్నీ మాకన్నులపండుగగా మేమూ జూసినామయ్యా? అవునుగానీ, ఓస్వామీ! శాస్త్రోక్తంగా పెండ్లాడిన మీఆవిడ నీవద్దనేవుంటే, ఆవిడగారు నీకేమి ఆశలు చూపిస్తున్నదయ్యా? దానికి ఉచ్ఛమూ నీచమూ తెలీదా? అది నిన్ను ప్రేమిస్తేమాత్రం ఇంత అల్లరిపెట్టుకొంటారా! ఇటువంటి వేషాలు చూస్తే నాకేభయం వేస్తోందే దీనికింత బరితెగింపేమిటో, మరి. ఒక పక్క కాపురం చేస్తున్న పెళ్ళాం సేవచేస్తుంటే తాను పాత అలవాట్లు మానుకోక ఇంకా నీతో మాట్లాడుతూనే వున్నదయ్యా! స్వామీ! నీకు పొద్దుపోదా యేమిటయ్యా! మీ ఆవిడ యెంత తగవులాడుతుందో తెలియదా? ఏమిటా విలాసవంతమైన నవ్వులు? నీ పాదాలు ఒత్తి సేవచేస్తున్నది నీ పట్టపురాణి ఒకవైపు. ఇదెంతటి చుట్టమయ్య నీకు? దీనితో పొందుచేస్తావా? శ్రీవేంకటేశ్వరా! ఇందరినీ యేలుతున్నావు కాబట్టే ఎంత చోద్యంగా నిన్ను బిగికౌగలిస్తోంది!!

★ **దంటతనాలు** – నేర్పులు ★ **అప్పటి** – పాత అలవాటు

సంఖ్య :193 సంపుటము : 29 పుట: 129 రాగం : సామంతం

**47 భూపతి చెరువుచెంతఁ బొంచుక రతులకును**
**యేపొద్దు సతులకును యెదురు చూచీనే ॥పల్లవి॥**

**నవ్వులసెలవులతో నానిన చెమటలతో**
**పువ్వుల దండలు వేరే బుజాలతోడ**
**జవ్వన పాయముతోడ జారిన తురుముతోడ**
**యెవ్వతెనో కూడివచ్చి యీడ నున్నాఁడే ॥భూప॥**

**అరవిరి బాగులతో నాయముల కరఁగులతో**
**గరిమల నెమ్మొగము కళలతోడ**
**సురత వాసనలతో చొక్కపు సింగారాలతో**
**పురిగొన్న వేడుకతో భోగించీనే ॥భూప॥**

**పుక్కిటి విడేలతోడ పులక జొంపాలతోడ**
**పిక్కటిలఁ దేనెలూరే పెదవితోడ**
**యిక్కువ శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె**
**వెక్కసపుఁ దమకాన వినోదించీనే ॥భూప॥**

**పరిచయ పరిమళం :**

భూపతి చెరువు అనే గ్రామంలో వెలసిన శ్రీవేంకటేశ్వరునిపై సరసకీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. స్వామి భూపతి చెరువు దగ్గర రతిక్రీడల కోసం పొంచుకొనియున్నాడట. ఈ సమయంలో తన సతులైన భూదేవి శ్రీదేవి యెప్పుడు వస్తారాయని యెదురు చూస్తున్నాడట. నవ్వులొలికిస్తున్న, పెదవులతో చెమటల చిత్తడిలో నానిపోతున్నా చిరునవ్వు వదలలేదు. చతుర్భుజుడు కావన వెలుపలి భుజాలపై పూలదండలు వేలాడుతున్నాయట. యౌవనప్రాయములోవున్న స్వామికి కొప్పు జారిపోయిందిట. ఈయనను చూస్తుంటే ఇప్పుడే యెవత్తెనో కూడివచ్చినట్లు సగము వికసించి ఎంతో బాగున్న పూలతో తన రహస్య ప్రియురాండ్లకై వేచియున్నట్లున్నాడు. వారు కరిగి నీరైపోతుంటే తన వదనమున దివ్య కళలతో శోభిల్లుతున్నాడట. సుగంధ పరిమళం అలముకోగా విశేషంగా సింగారాలతో వున్నాడట. అంతులేని భోగాలతో వేడుకగా వున్నాడట. నోట్లో కప్పురవిడెముందట. తేనెలూరే పెదవులతో శ్రీవేంకటేశ్వరుడు నన్నూ యేలుకొన్నాడంటున్నారు.

★ **అరవిరిబాగులు** – సగం వికసించిన పూలు
★ **పులకలజొంపాలు** – పులకించిన నిక్కపొడుపులతో





సంఖ్య :460 సంపుటము : 29 పుట: 309 రాగం : ముఖారి

**48 మచ్చిక గలిగితేనేమి మరఁగు వద్దా**
**పచ్చిదేర నేమిటికి బయలీఁదేవె ॥పల్లవి॥**

**కొలువు లోపల మోము కొచ్చి కొచ్చి చూచుకొంటా**
**మలసి సొలసి యేమి మాఁటలాడేవే**
**నలి నీ యెమ్మెలు చూచి నవ్వేవారి నెరఁగవు**
**యెలమి నీ పగటులు యెంత చూపేవే ॥మచ్చి॥**

**పొట్టఁబొరుగున నుండి బొమ్మల జంకించుకొంటా**
**ఇట్టె బీరాననెంత యెలయించేవే**
**చుట్టుకొన్న వలపుల సుద్దులు దలఁచుకోవు**
**చుట్టరికాలనే యెంత సూడువట్టేవే ॥మచ్చి॥**

**సంగడినే కూచుండి చన్నుల నొరసుకొంటా**
**యెంగిలి మోవినే యెంత యింపురేఁచేవే**
**చెంగటనే నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు**
**ముంగిట నీ యాస లెన్ని మొలవఁ బెట్టేవే ॥మచ్చి॥ 460**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య తానూ ఒక చెలికత్తెయై నాయికను మందలిస్తున్నారు. ఇదేమిటమ్మా? ఆయన అంటే నీకెంత చనువు వుంటే మాత్రం కొంచెమన్నా చాటూ మాటూ వుండవద్దా? నలుగురిలో ఎంత పచ్చిగా వ్యవహరిస్తున్నావమ్మా!!

ఆయన నిండుసభలో వుంటే, ఆయన మొగములో మొగముపెట్టి నయగారాలుపోతూ యేమి మాట్లాడుతున్నావమ్మా? నీ విలాసమును చూచి అంతా ఎలా నవ్వుతున్నారో చూడు. అందరికీ నీ అందచందాలు చూపవచ్చునా? ఇరుగు పొరుగువారు ఇదేమిటని కనుబొమలు లేపి చూస్తుంటే ఎంత బీరాలుపోతున్నావే!! వలపులు ముప్పిరిగొనగా మీ బంధుత్వాలు యేమి నెమరువేసికొంటున్నావే!! పక్కనే కూర్చుని స్వామిని నీ చనుగవతో నొక్కి అధరపానంచేసినావుకదమ్మా! ఆ శ్రీవేంకటేశుడు నన్నూ కూడినాడు. నీ ఆశలెన్ని చిగురింపజేశావే పాపం! స్వామి అందరివాడు.

★ **పగటులు** – శోభలు ★ **ఎమ్మెలు** – విలాసములు
★ **బయలీదేవే** – వ్యర్థంగా ఆశిస్తున్నావే ★ **పొట్టపొరుగు** – ఇరుగుపొరుగువారు

సంఖ్య :309 సంపుటము : 19 పుట: 207 రాగం : హిందోళం

**49 ఇంకానేల దాఁచేవు ఇంతకువచ్చెఁ బనులు**
**సంకలే కానతీరాదా సమ్మతించేఁగాని ॥పల్లవి॥**

**చక్కెరవంటిమాటలు సతి నీతో నాడికాదా**
**చొక్కించెను నిన్ను నిట్టె సులభానను**
**చక్కనిమొగము చూచి సన్నలుసేసేకాదా**
**నెక్కొనుతమకమెల్లా నీకు రేఁగెను ॥ఇంకా॥**

**గాలాలవంటి చూపు లొక్కటఁ దగిలించికాదా**
**తాలిమి నీమనసెల్లాఁ దక్కఁగొనెను**
**మేలిమిచన్నులు నీమే నిట్టె తాఁకించికాదా**
**కీలుకొన్న వలపులు కెరలించెను ॥ఇంకా॥**

**లతలవంటిచేతుల లలి గాఁగిలించికాదా**
**రతిరహస్యములఁ గరఁగఁజేసెను**
**యితవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె**
**కతకారియాపెకాదా కళ లెసఁగించెను ॥ఇంకా॥ 309**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో స్వామిని తిన్నగా కొన్ని ప్రశ్నలడుగుతున్నారు. ఏమయ్యా! ఇంకా మాదగ్గర యేమిదాచిపెడతావు? వ్యవహారం ఇంతవరకు వచ్చాక, ఇంకా శంకలెందుకు? నీవు అనుజ్ఞనివ్వు ఆవిడకూడా సమ్మతిస్తుంది, అంటున్నారు. ఆ నేర్పులన్నీ నీసతికి సహజంగానేవున్నాయి. ఆమె చక్కెరవంటి తీపికబుర్లు నీకు చెప్పే నిను సులభంగా ఇట్టే పరవశింపజేసింది కదా! నీ చక్కని ముఖముజూచీ నీకు మాత్రమే అర్థమయ్యే సౌంజ్ఞలు చేసికాదా? నీకు తమకము రేకెత్తించింది. ఇంకా శంకలెందుకయ్యా? గాలమువంటి చూపులు నీపై ఒకటిగా విసిరేకదా! ధైర్యంగా నీ మనస్సు దక్కించుకొన్నదామె. మేలైన తన చనుగవ నీకు తాకించేకదా, నాటుకొన్న వలపులను ఆమె అతిశయింపజేసినది? లతలవంటి చేతులతో నిన్ను కౌగలించేకదా నిన్ను అనేక రతిరహస్యములలో కరిగించింది? నాకు హితుడవైన శ్రీవేంకటేశ్వరా! నన్ను కూడా ఇట్టే యేలినావు.

★ **నెక్కొను** – నెలకొను ★ **గాలాలవంటి** – గాలమువలె ★ **కతకారి** – గడుసరి
★ **కీలుకొను** – నాటుకొను ★ **కెరలించు** – అతిశయింపజేయు ★ **తాలిమి** – ధైర్యం





సంఖ్య :451 సంపుటము : 29 పుట: 300 రాగం : ఆహిరి

**50 ఇచ్చకమే సేసితేను యీడేరు వలపులు**
**మచ్చికలే చూపవలె మగవానితోను ॥పల్లవి॥**

**శిరసు వంచకువే సిగ్గులు వడకువే**
**తెరదీసి నిన్నతఁడు తేరి చూచీని**
**మరఁగు వెట్టుకొకువే మరి తప్పించుకోకువే**
**విరుల చెండున నిన్ను వేసితే నేమాయను ॥ఇచ్చ॥**

**మొక్కులు మొక్కకువే ముంచి చేయి పట్టకువే**
**పక్కన నీ చన్నులు పట్టీ నితఁడు**
**మిక్కిలి జంకించకువే మీరి యాన వెట్టకువే**
**పిక్కటిల్లఁ గాఁగిటను బిగియించఁగాను ॥ఇచ్చ॥**

**పెనఁగు లాడకువే బెట్టి గోర నూఁదకువే**
**ననుపున నీతోను నవ్వేవేళను**
**యెనసె శ్రీవేంకటేశుఁ డిఁక నేమీననకువే**
**చనవిచ్చి తనమోవి చవి చూపీ నితఁడు ॥ఇచ్చ॥ 451**

**పరిచయ పరిమళం :**

ఈ సరస కీర్తనలో అన్నమయ్య దాంపత్య జీవితం యెలావుండాలో వివరిస్తున్నారు. ప్రీతితో వుంటేనే దాంపత్యం స్వర్గంలా వుంటుంది. వలపులు ఫలిస్తాయి. మగనితో స్త్రీ చనవుగా వుండాలి. పెడసరికట్టెలా వుండకూడదు. అంతచేటుగా శిరసు వంచివుండకు. సిగ్గు ఇతరులవద్దనుండాలి కాని భర్తవద్ద తగదు. నీ మేలిముసుగు తొలగించి నీ వదన సౌందర్యం తేరిపారచూస్తే సిగ్గు అసలే పనికిరాదు. ఆయన నీ మెళ్లో పూదండ వేస్తే యేమయిందమ్మా. దాగి, తప్పించుకొని తిరగకు. అతను నీ చనుగవపై చేయివేస్తే చేయిపట్టుకొని ఆపి మొక్కులు మొక్కవద్దు. ఒకవేళ నీ భర్త నిన్ను తన బిగి కౌగిలిలో బిగిస్తే, ఆయనను బెదిరించుటగాని ఒట్లుపెట్టుకోవటంకానీ చేయకు, యెబ్బెట్టుగా వుంటుంది. ఆయన అనురాగం చూపి నవ్వుతూవుంటే నీవు పోట్లాడకూడదు. ఆయనను గోళ్ళతో గిచ్చి బెదిరించకూడదు. శ్రీవేంకటేశ్వరుడు నీకు తన అధరమునందిస్తే ఏమీ అనకుండా దానినాస్వాదించు

★ **ఇచ్చకము** – ప్రీతి ★ **మరుగువెట్టు** – మేలిముసుగు వేసికోకు
★ **పిక్కటిల్లు** – బిగియు ★ **గోరనూదు** – గోళ్ళతో గీరుట

సంఖ్య :193    సంపుటము : 29   పుట: 128   రాగం : రామక్రియ

**51** నిన్ను జూచెప్పట నుండి నేఁడు నాకు వెరగయ్యీ
పన్నుకొని యెన్నేసి పగటులదానవే ॥పల్లవి॥

చనవులు సేసుకొని సరసము లాడి యాడి
వినయానఁ జెక్కునొక్కి వేఁడుకొనేవు
మనసు రంజిల్లఁ జేసి మచ్చికలు చల్లేవు
యెనసి విభునికెంత యిచ్చకురాలవే ॥నిన్నుఁ॥

సరుసనే కూచుండి సారెకునుఁ గొప్పు దువ్వి
విరులు ముడిచి యిట్టె విడి (డె?) మిచ్చేవు
తెరవేసుకొని మోవితేనియలే కురిసేవు
యిరవై మగని కెంత యితవరి దానవే ॥నిన్నుఁ॥

వేవేగఁ గాఁగిలించి వేడుకలు వెదరేఁచి
కైవసము సేసుకొని కరఁగించేవు
యీవేళ శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
నీవూ నీతని కెంత నెయ్యమైనదానవే ॥నిన్ను॥ **192**

**పరిచయ పరిమళం :**

ఆనాడు అన్నమయ్య కొన్ని విచిత్రమైన పదబంధాలతో సంధులుచేశారు. నినుజూచి + అప్పటినుండి = నిన్నుజూచెప్పగనుండి అని సంధిచేశారు. అన్నట్లు ఇందులో అన్నమయ్య తానూ నాయిక చెలికత్తె అయ్యారు. ఓ దేవీ! నిన్ను జూచియెంతో ఆశ్చర్యంగావుందమ్మా. ఎన్నేసి శోభలు కలదానవైనావమ్మా!! నీస్వామితో యెంతో చనువుగా సరసములాడియాడి వినయంగా ఆయన చెక్కులు నొక్కి (చుబుకముబట్టి) వేడుకొంటావు. మనస్సునుత్సాహపరచుటకు మచ్చికగావుంటావు. ఇట్లా నీ పతికి యెంత ఇష్టమైనదానివయ్యావు? ఆయన దగ్గర కూర్చొని చక్కగా నీ కొప్పు దువ్వుకొని, పూలుపెట్టుకొని, పరిమళ తాంబూలం నోటికందిస్తావు. తెరచాటున నీ మధురాధరమునందిస్తావు. స్థిరముగా నీ మగనికెంత హితురాలవైనావు!! ఆయనను త్వరగా బిగికౌగలించి కైవశము చేసికొని కరగించేస్తావు. దేవి నీవీ వేంకటేశ్వరుని యెంతో నెయ్యముతో నీవాణ్ణి చేసికొనినావు. కానీ ఆ శ్రీవేంకటేశ్వరుడు నా భక్తికి మెచ్చి నన్నూ కూడినాడు.

★ **పన్నుకొని** – గట్టిదానివై    ★ **కరగించి** – మైమరపించి
★ **వెరగయ్యీ** – ఆశ్చర్యం కలుగు   ★ **తెరవేసుకొని** – చాటుగా





*రచయిత:*

# అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు




| | | |
|---|---|---|
| పిలవండి | : | **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు** |
| పుట్టింది | : | **9-6-1945** |
| చదివింది | : | **ఎం.టెక్.** |
| ఉండేది | : | **ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61, సిద్ధార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్.** |
| రంధి | : | **భగవన్నామ సంకీర్తన** |
| నచ్చింది | : | **శాస్త్రీయ సంగీతం** |
| నచ్చంది | : | **నక్కజిత్తులు** |
| మెచ్చింది | : | **సజ్జన సాంగత్యం** |
| లింగండి | : | 00919393021360 |
| చదవండి | : | www.geetadeksha.com |
| ఇవ్వండి | : | e-mail : geetadeksha@gmail.com |

(సంపుటి - II)



# "హరి యేమనెనే అలిగెనో"

## అలమేలుమంగమ్మతో అలనాటి హరి
## అనురాగ పరిమళం

## ఆత్మ పరమాత్మల ఐక్యము

ఇది


అన్నమయ్య పదకవితకు అమరవాది పరిచయం





శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు





# హరి యేమనెనే అలిగెనో

ఎన్నుకొన్న

## అన్నమయ్య మధురకీర్తనలకు

# పరిచయ పరిమళము

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.

# హరి యేమనెనే అలిగెనో

(సంపుటి - II)

మొదటి ప్రచురణ

**మార్చి 2014**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

**ప్రతులకు :**

**ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,**

**హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360**

**డి.టి.పి. ప్రింటింగ్ :**

**కె.వి.ఆర్.**

**98495 79345**





## అంకితము

## నా ఇష్టదైవము, శ్రీ వేంకటరమణునికి
## ఆయనలో ఇమిడిపోవాలని ఆశపడే రమణులకు...



కం॥ **హరియేమనెనే అలిగెనొ**
**వెరపందిన నాయికలును వేదనజెందన్**
**కరిగెడి వేంకటపతికిని**
**తరుణులకిది అంకితమ్ము ధన్యత నిత్తున్.**

తా॥ "హరి యేమన్నాడే, ఒకవేళ నాపై అలిగాడా? ఇక యెన్నటికీ మమ్మల్ని చూడడా" అని భయపడి దుఃఖిత అయిన తన నాయికనావిధంగా చూచి కరిగిపోయే తిరుమల శ్రీవేంకటరమణునికి, ఆయన తరుణులకు ఈ కృతిని నాకు ధన్యత కలుగునట్లు అంకితమిచ్చెదగాక!

# హరి యేమనెనో అలిగెనో

**(సంపుటి - II)**

**ఎన్నుకొన్న అన్నమయ్య మధుర కీర్తనలకు**

**పరిచయ పరిమళము**

## విషయ సూచిక


| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | అంతేసి యెరుగలేము | 8/87 | 44 |
| 2. | అరుదురాముని చేతలి | 19/495 | 13 |
| 3. | అన్నియు నందుయున్నవి | 19/496 | 7 |
| 4. | అప్పుడే యెగ్గులువనలిగితి | 26/183 | 27 |
| 5. | అల్లవాడే భావించరే అంగన | 19/345 | 9 |
| 6. | ఆనసుమ్మి యికనీకునౌబళేశ | 26/184 | 24 |
| 7. | ఇంకామమ్ము జెనకేవు యేరావోరీ | 19/76 | 8 |
| 8. | ఇంట గెలిచికా నీవు | 8/04 | 42 |
| 9. | ఇంతలోనె నీతోనేనేమందురా | 19/341 | 20 |
| 10. | ఇంత చాలదా నాకు | 26/125 | 41 |
| 11. | ఇంతవనికోపుదుమా యిదివో | 19/311 | 4 |
| 12. | ఇదివో నీమహిమలు యేమని | 19/246 | 17 |
| 13. | ఉద్దగిరి కృష్ణుడు వుబ్బరికాడు | 19/174 | 10 |
| 14. | ఊరకుండమనవే | 8/295 | 43 |
| 15. | ఎన్నేసి చేతలు సేసేవిట్టే | 29/224 | 1 |
| 16. | ఎవ్వరువద్దనున్నారో యేమిసేసీ | 19/347 | 21 |
| 17. | ఎత్తరే ఆరతులు | 8/84 | 51 |
| 18. | ఎవ్వరెట్టయినా నుండనీ ఇదివో | 19/75 | 16 |
| 19. | ఏటికి వేగిరపడేవు | 8/294 | 45 |
| 20. | ఏమనివిన్నవించేము యెందాకాను | 19/310 | 3 |
| 21. | ఏమిసేసునాతడు | 26/282 | 39 |
| 22. | ఏమాటకేమాట యేలరా | 26/65 | 25 |







| | | | |
|---|---|---|---|
| 23. | ఏమిసేఇంచుకొంటివి | 26/300 | 34 |
| 24. | ఏలనన్నువేడుకొనేవిటు | 26/56 | 35 |
| 25. | ఏలేయింతేసి చేతయాతామోతా | 26/55 | 23 |
| 26. | ఒయ్యనేదగ్గర రమ్మవూడిగపు | 26/126 | 30 |
| 27. | ఔనేఔనే ఆయబని | 26/41 | 29 |
| 28. | కాంతనీ సంది మోహము | 8/20 | 48 |
| 29. | కానీవే గొల్లెతా కమ్మటి నవ్వకువే | 19/505 | 18 |
| 30. | కోరికలేడేరేనేడు కోనేటిరాయా | 26/299 | 33 |
| 31. | కోరికవీడేరెనిక కూచుండవయ్యా | 19/312 | 6 |
| 32. | చిగురోచేగచూపుజెల్లదే | 19/494 | 14 |
| 33. | చూడబిన్నవాడు గానీ సుద్దులైతే | 26/278 | 38 |
| 34. | జమళిగళ్యాణము సరసుడాడె | 19/568 | 15 |
| 35. | చెప్పవయ్యా నాతో | 26/281 | 13 |
| 36. | నవ్వితినేగొల్లెతా నాయమవుర | 19/514 | 11 |
| 37. | నామేలువాడైయాతడు | 29/462 | 2 |
| 38. | నీవేతెలుసుకొమ్మీ నీవోపిక | 26/63 | 32 |
| 39. | నెలత బాసితే నీకు నిముషమేడవును | 8/282 | 47 |
| 40. | పచ్చిసేసి వెచ్చిసేసి పాయమింత | 26/64 | 31 |
| 41. | పగవారికైనానిట్టే | 8/25 | 49 |
| 42. | బుద్ధి చెప్పవయ్యా నేను | 26/280 | 37 |
| 43. | రట్టడికడపరాయడిట్టెవీడు | 26/298 | 28 |
| 44. | రారే యింకానతని రవ్వ | 18/129 | 50 |
| 45. | లేలేయెక్కడిసుద్ధి | 8/123 | 46 |
| 46. | వచ్చెనునీరమణుడు వసంతమాధవుడై | 26/41 | 22 |
| 47. | వలపేమివెగటా వనితలకు | 19/77 | 12 |
| 48. | విచ్చేయవయ్యా వేగమే ఇక్కడికి | 19/572 | 5 |
| 49. | వెల్లివిరాయ బనులు విట్ఠలేశ్వరా | 19/173 | 19 |
| 50. | వేగిరమా కోనవెంగళేశా | 26/182 | 26 |
| 51. | హరినిన్ను బిలిచీని | 26/112 | 36 |

# ప్రార్థన

కం॥ శ్రీవిభుడు వేంకటేశుడు
ఆ వైకుంఠంబునందు అమరినవాడై
ఏవేళగాచునార్తుల
నీవే దిక్కన్న చాలు నిరుపమ భక్తిన్

ఉ॥ ఈకడ జెప్పబూనెదను యేపుగ వేంకటనాథు గొల్చుచున్
చేకొని అన్నమయ్య తను చెప్పిన యీమధురంపు కీర్తనల్
మూకగ భావమున్ దెలుప ముత్యపు జల్లును బోలు భాషలో
తూకపు ముందుమాట పరితుష్టత బొందగ యెంచి వ్రాసెదన్.

చం॥ సరసములైన కీర్తనల చాలపదంబులు ఒక్కతీరునౌ
విరివిగ అర్థముల్ తెలుప వింతగబుట్టు విరక్తి వీటిపై
మురియుచు తీపియున్ తినగ మొత్తు మొగంబని నేర్వగా వలెన్
పరిచయమందునే తెలుప భావమునీకడ నిశ్చయించితిన్.

సీ॥ శృంగారకీర్తనల్ బంగారు పుట్టమ్ము
కట్టు దేవర కింపు కలుగజేయు
మధుర భక్తికి తల మాధవుందేవూచు
సెలవినవ్వుల జిల్కు సిరిపెనిమిటి
సరసభక్తిని మెచ్చి సతి జూచి కొంటెగా
కనుగీటు తిరుమల కరివరదుడు
అమలిన రసవృష్టి అన్నమయ్య పదంబు
మురిపించు నెల్లరన్ తరతరముల

ఆ.వె॥ మధుర కీర్తననగ మంచి శృంగారంబు
గూడుకొన్నపాట కురియు దేనె
అణువుమాత్రమైన అశ్లీలతుండదు
మనసు నిర్మలముగ మారవలయు.





మత్తకోకిల॥
పరిచయంబును సేయనెంచితి బాగుబాగని మెచ్చగా
పరిమళంబులు చిల్కు కీర్తన భావమున్ కుదియించుచున్
సరసమొప్పెడి మాధురిన్ వెదజల్లు వేంకటనాయకా!
మురిపెమందగ ముద్దుగుమ్మల ముంచుమా రతివేడుకన్.

మ॥ కరిగించెన్ హరి ముద్దుగుమ్మ రతులన్ కళ్యాణమైకూడుచున్
వరపుత్రుండగు అన్నమయ్య అటుపై పాడెన్ భళా! కీర్తనన్
యెరుకన్ గూర్పగ వాటికిన్ పరిచయం బేనెంచి సేతున్ ప్రభూ!
దరికిన్ జేర్చుము నాదు‘నావ’ సుడిలో తాజిక్కి అల్లాడినన్.

శా॥ శృంగారంబన చిన్నచూపు తగునా, సేవింపగా శ్రీపతిన్
బంగారంబగు బాటరా కలుగునా పాపంబు ఆవంతయున్
క్రుంగంబోకుర వేంకటేశ్వరుడు తాగూడంగ గోపెమ్మలన్
సంగంబౌనుర అన్నమయ్య కవికిన్ సంతృప్తి కల్గెన్ గదా!

# తొలిపలుకు

అన్నమయ్య శృంగారకీర్తనలు ఇదివరలో ఏలుకో శృంగారరాయ అనే పేరుతో మున్నుడి, భావవివరణలతో 101 కీర్తనలు అందించాను. ఈనాడు మళ్ళీ అన్నమయ్య సరసకీర్తనలను, శృంగార కీర్తనలను అన్నమయ్య మధుర కీర్తనల పేరుతో అందిస్తున్నాను. వీటికి 'హరి యేమనెనే అలిగెనో' అనే సంపుటిగా వెలువరిద్దామని సంకల్పం.

శ్రీవేంకటేశ్వరుని కృపా కటాక్షవీక్షణముంటే ఈ నాప్రయత్నం వెలుగులోకి వస్తుందని నా అపార నమ్మకం ఆపై కొండలరాయని దయ, నా ప్రాప్తము. నేను ఇదివరలో అన్నమయ్య శృంగార కీర్తనలు తీసుకొన్నప్పుడు "రవ్వా శ్రీహరి" గారి నిఘంటువు నావద్దలేదు. అందువలన ఆనాడు నేను ఎక్కువ శ్రమపడవలసి వచ్చింది. ఈనాడు ఆ కష్టంలో సగం పడితేచాలు గట్టెక్కవచ్చని నా నమ్మకం.

ఆ పురుషోత్తముడే ఏదో ఒక దారిచూపిస్తాడు. దీనిలోనే గాయకులు రాగంకట్టి పాడిన కొన్ని కీర్తనలను యెన్నుకొన్నాను. సాహిత్యపరంగానేకాక సంగీతపరంగా కూడా ఈ సంపుటి అందరినీ అలరిస్తుందని నా ఆశ.

"హరి నీమయమే అంతాను" అనే పేరుతో నేను శ్రీవేంకటరమణుని కృపవలన 375 అన్నమయ్య శృంగార, భక్తి, వైరాగ్య, తత్త్వ చింతన కీర్తనలు 4 సంపుటములుగా వెలువరించాను. శృంగార కీర్తనలన్నీ వివరిస్తే రసికలోకానికి తప్ప, శరణాగతులకు పెద్ద ఉపయోగకరము కాదేమో అని నామట్టుకు నాకనిపించింది. మనకు లభ్యమైన అన్నమయ్య కీర్తనలన్నీ సింహభాగము శృంగార కీర్తనలే. అయినా నేటి సమాజంలో అన్నమయ్య కీర్తనలు వినేవారేకానీ విశ్లేషించిన తాత్పర్యవివరణ చదివేవారు కోటికొక్కరు. ఒకవేళ చదివినా రెండవ పర్యాయం చదివేవారుండరు. మరి అన్నమయ్య అన్నట్లు వరద ఆగిపోయాక అడ్డుకట్టవలన లాభమేమి? కానీ అన్నమయ్య కీర్తనలు పాఠకలోకానికి పరిచయం చేయాలనే నాకోరిక తీరనిది. అందుకనే అన్నమయ్య శృంగార కీర్తనలను పాఠకలోకానికి పరిచయం చేస్తే చాలు అనే సత్సంకల్పంతో నా





ప్రయత్నానికి "హరియేమనెనే అలిగెనో" అని నామకరణంచేసి శ్రీకారం చుట్టాను.

ఒకవేళ ఈ శృంగార కీర్తనలకు విడమరచి భావవిశ్లేషణ చేసినా ఇక్కడ చూపిన విధంగా వస్తుంది.

**భావవిశ్లేషణ:**

ఓ చెలియా! హరి నామాటవిని యేమనెనే (ఏమని అన్నాడే?) కొంపదీసి అలిగెనో (అలిగినాడాయేమే?) విరహినై నేనుండ (నేనింత విరహ బాధతో వేదన చెందుతుంటే) యీవేళ ఇంకా రాడేలనే?

మళ్ళీ మళ్ళీ తనను నా మాటలతో కొసరను (ఆక్షేపించను) అని వేడుకొన్నాను కదా! అతిశయించిన హరి యేమనినాడే. తరుణులందరూ వచ్చేశారు కదా! ఇంకా తాను అక్కడనేవున్నాడు. కారణమేమిటే? ఎరవెరవై (విలక్షణముగా) నున్న ఆతడు అప్పుడు తాను నా గురించి యేమనినాడే?

ఓ చెలీ! నావాకిటిదాకా వచ్చి తిరిగెనట (మరలిపోయెనట), నావిభుడు. కారణమేమైవుంటుంది? తానెందుకలా చేశాడో చెప్పినాడా? ఈ రాకపోకల (వచ్చీపోవుటలోనే) తెల్లవారేటట్లుంది. ఈకడ (ఇప్పుడు) తుదమాట యేమనెనే (తన ఆఖరి మాటగ యేమి చెప్పమంటాడే.)

ఓ చెలియా! నా తలపులో ప్రియము (నా మనస్సులో అతని నెంత ప్రేమిస్తున్నానో) తనకే తెలుసును కదే! తన మనసులో మాట యెలుగెత్తి యేమనెనే (గొంతువిప్పి ఏమీ చెప్పలేదా?) ఇప్పుడు ఆయనగారు నామాట యేమి వింటున్నాడని? తానే బలవంతంగా వచ్చి ఆ శ్రీవేంకటేశ్వరుడు నిన్ను నన్ను కూడినాడు కదా! దాని గురించి యేమనినాడే?

దీనివలన ప్రయాస తప్పించి విశేషఫలితము నాకు కనిపించలేదు. బాగా ఆలోచించి ఒక కృత నిశ్చయానికి వచ్చాను. ఈ "హరియేమనెనే అలిగెనో"లో యెన్ని సంపుటములు చేస్తానో తెలియదు కానీ ప్రతి శృంగార కీర్తనకు "పరిచయపరిమళం" వ్రాసి అన్నమయ్య ఆరాధన కొనసాగిస్తాను. శ్రీవేంకటేశ్వరుని నామస్మరణ యెలాగూ ఇందులో భాగమే కదా!

శృంగార కీర్తనలంటే చదువరిలో శృంగారభావాలను తట్టిలేపేవి. జావళీలు ఆ కోవకే చెందుతాయి. జయదేవుని అష్టపదులవలె, అన్నమయ్య కీర్తనలలో కూడా అశ్లీలతకి తావులేదు. అష్టపదులలో హరి దర్శనమైతే ఇక్కడ శ్రీవేంకటేశ్వరుడు శృంగారరాయుడు. అలమేల్మంగమ్మ, ఆమెచెలికత్తెలు, వేంకటేశుని పరివారంలోని స్త్రీలు కీర్తన పాడుతున్నారు అన్నట్లు వుంటాయి. కొండొకచో అన్నమయ్య తనే నాయికా నాయకులకు సలహాలిస్తారు. అప్పుడూ ఆయనా స్త్రీగా ఆ కీర్తననాలపిస్తున్నారా అనిపిస్తుంది. నాకు ఇవి శృంగారకీర్తనలన్న భావం రాదు. ఇవి అన్నమయ్య మధుర భక్తిని ప్రతిపాదించే మధుర కీర్తనలు. సరసత్వము గలవికాబట్టి సరస కీర్తనలు అనికూడా అనవచ్చును. అన్ని కీర్తనలూ దాదాపు ఒకే పంథాలో నడిచినందువల్ల పునరుక్త భావన కొండొకచో కలుగవచ్చును. మరి మన నాయకీ నాయకులు మానవమాత్రులు కారుగదా! జగత్పిత, జగన్మాతలు వారు.

ఏది యేమయినప్పటికీ ఈ మధుర కీర్తనలకు పరిచయ పరిమళం మాత్రమే అందించడం జరిగింది. కొన్ని తెలుగు మాటలకి కూడా అర్థం చెప్పవలసి వచ్చింది. ఎందుకంటే అది 600 ఏళ్ళ క్రిందట నేటి రాయలసీమ మాండలిక భాష. అటువంటి సందర్భాలలో చదువరుల సౌకర్యార్థం కొన్ని పదములకు నేటి తెలుగు అర్థం ఇవ్వటం జరిగింది. అలాగే కొన్ని కీర్తనలలో తమిళ, కన్నడ పదములు కూడా ఆనాటి వాడుకవలన మనకు కనిపిస్తాయి.

ఈ కీర్తనలు ప్రత్యేకించి రసిక భావనలున్న భక్తులకు. ఇరవైయేళ్ళలోపు వారికి, అరవై యేళ్ళు పైబడిన వారికి కాదు. అలాగని వారు చదువరాదని నా అభిప్రాయము కాదు. పచ్చి మామిడికాయ, బాగా మగ్గి మెతకబారిన మామిడికాయ తినలేం కదా! ప్రౌఢులకు ప్రింటు సన్నగా వున్నా పర్వాలేదని ఈ “హరియేమనెనే అలిగెనో” పేజీకి ఒక్క కీర్తన పరిచయ పరిమళంతో సహా అందిస్తున్నాను. ఆస్వాదించండి.

చివరికి వినండి. కొంతమంది అల్పజ్ఞానంతో అన్నమయ్య బూతుకీర్తనలు చెప్పాడని ఆ రోజుల్లో తమ అక్కసును వెళ్ళబోసుకొన్నారు. అటువంటి వారు నేటికాలంలోనూ వున్నారు. వారందరికీ కనువిప్పే నామాటలివే. పండితులు






అన్నమయ్య శృంగార కీర్తనలను పరిష్కరించి ఆ కీర్తనలలోని నాయకుడు పరమాత్మ, నాయిక పరమాత్మ సంగమం కోరే ఆత్మ అని విశదీకరించారు. జనబాహుళ్యానికి వారు స్త్రీ పురుషులనిపిస్తే వారు భగవంతుని పాఠశాలలో ఎల్.కె.జి. విద్యార్థుల క్రింద లెక్క అన్నమాట. మరి పి.హెచ్.డి. అంటే ఆత్మ పరమాత్మను చేరుకోవటం, జరిగేనా? ఏమో! శ్రీహరికే తెలుసు.

అందుకే మనం ఈ అద్భుత సాహిత్యాన్ని మధురకీర్తనలు అందాము. అన్నట్లు ఇవి సరసము చిందించే సరసకీర్తనలు కూడా.

**తిరుమల తిరుపతి దేవస్థానములవారికి సదా కృతజ్ఞుడను**

***Please visit:*** **geetadeeksha** in google Network,

for my other works











సంఖ్య :224  సంపుటము : 29  పుట: 150  రాగం : కుంతలవరాళి

**1 ఎన్నేసి చేఁతలు సేసే విట్టే మగనితోను**
**నన్నుఁ జూడవే మెప్పించే నయాన నీతనిని ॥పల్లవి॥**

**పక్కన నేల మొక్కేవే పాదము లేల తొక్కేవే**
**చక్కని పతితో సరసము లాడుతూ**
**వెక్కసిం చేమి నవ్వేవే విరులనేల రువ్వేవే**
**తక్కక నీ తొంటిపొందు తలఁపించుకొంటాను ॥ఎన్నే॥**

**చందన మేమి పూసేవే చన్ను లేల రాసేవే**
**చెంది రమణునిసేవ సేసుకొంటాను**
**కందువ లేమి ముట్టేవే కానుక లేల పట్టేవే**
**సందడిలో వలపులు చల్లుకొంటాను ॥ఎన్నే॥**

**చేతు లేల చాఁచేవే సిగ్గు లేల రేఁచేవే**
**యీతల శ్రీవేంకటేశు నెనసుకొంటా**
**కాతర మేలపెంచేవే కాఁగిట నన్నితఁడేలె**
**పోతరిం చ్చాతనిబత్తి పొగడుకొంటాను ॥ఎన్నే॥ 224**

**పరిచయ పరిమళం :**

ఈ శ్రీవేంకటేశ్వరుని నయాన మెప్పించాలికాని భయాన, మెప్పించటం సాధ్యమా, అని అన్నమయ్య ఒక చెలియలాగా దేవికి నచ్చజెబుతున్నారు. నీ మగనితో యెన్నెన్ని పనులు చేస్తున్నావమ్మా? నన్నుజూడు, నయముతో యెలా మెప్పిస్తున్నానో? ఆయన పాదాలు తొక్కటం దేనికి, కాలుమొక్కటం దేనికి? చక్కటి పతితో సరసంగా వుండరాదా? అంతచేటు నవ్వి ఆయనపై గతరాత్రి మీ పొందు తలుచుకొంటూ పూలు యెందుకు చల్లుతున్నావు, మరి? ఎంత చందనముపూసికొని నీ చనుగవతో ఆయన ఆయనను ఒత్తుకుంటూ, సేవచేస్తావు? కందువలు (కళాస్థానములు) ముట్టుకొని సంభ్రమంతో వలపులు చిమ్ముతూ ఆయన నుంచి యెన్ని కానుకలు కైవశం చేసికొనినావు? నీ చేతులు చాచి సిగ్గులు పూచునట్లు ఆ శ్రీవేంకట పతినే తత్తరపరచునట్లు తాకుతావు. ఆయన వూరకవుంటాడా? ఈలోగా నన్నూ కూడి అతడేలుకొన్నాడు. నేను చేసిందల్లా భక్తితో ఆయనను పొగడటమేనమ్మా!

★ **వెక్కసించి** – అధికమై ★ **ఎనసుకొంటా** – తాకుతూ
★ **కాతరము** – తత్తరము ★ **పోతరించి** – గర్వముతో





సంఖ్య :462  సంపుటము : 29  పుట: 307  రాగం : ఆహిరినాట

**2 నా మేలువాఁడై యాతఁడు నావద్దనే వున్నవాడు**
**యీ మతకములు మరి యిఁక నీకుఁ దగునే ॥పల్లవి॥**

**ఆసలు రేఁచుకొంటా నాకెకు నీతనికిని**
**రాసికెక్క నే మాడేవే రాయబారాలు**
**సేసవెట్టిననాపతిఁ జేరి నే నెఱఁగకుండా**
**మూసి దాఁచి పొందుసేయ మున్నేడ నేర్చితివే ॥నా మేలు॥**

**సన్నలు సేసుకొంటా సారె సారె నిద్దరికి**
**యెన్నిమారు లందించేవే యెడమాఁటలు**
**పన్నుక నా కాఁగిటిలో పాయకుండిన యీతని**
**వన్నెల నెలయించ నే వంకఁ గలిగితివే ॥నా మేలు॥**

**కడనుండి నవ్వుకొంటా గలపే వొకరొకరిఁ**
**దడవక మానవే నీ తాపితనాలు**
**యెడయక శ్రీవేంకటేశుడు నన్నేలినాడు**
**అదరి నాకితవరివయ్యెట్టు వచ్చితివే ॥నా మేలు॥**

**పరిచయ పరిమళం :**

అమ్మవారు తన చెలికత్తె అయిన అన్నమయ్యపై రుసరుసలాడుతున్నది. ఈ విధమైన మతకాలు (మాయదారి వేషాలు) నీకు తగునే? స్వామి నామంచి కోరుకునేవాడై నాదగ్గరే వున్నాడు. నీవు నా చెలికత్తెవైయుండీ స్వామి నూతన ప్రియురాలైన దానికీ స్వామికీ మధ్య యేమి రాయబారాలు నడుపుతున్నావే!! నేనెరుగకుండా నాకు మగడైనవానిని, రహస్యం దాచివుంచి వారిరువురినీ పొందుచేయటం ఇదివరకెక్కడ నేర్చినావే? ప్రతిసారీ యేవేవో సైగలు చేస్తూ వాళ్ళిద్దరికీ అవకాశం కల్పించే వ్యవహారం యెంతనడిపినావే? నాపక్కనే వుండినాకౌగిలి వీడని స్వామిని యెన్ని వన్నెలతో మీకెట్లా వశపరచుకొనుట సాధ్యమైనదే? వాళ్ళ దగ్గరవుండి ఒకరొకరితో యేమి కలిపినావే? నీవు వాళ్ళిద్దరినీ తారుస్తూన్నావంటే నమ్మలేకపోతున్నానే. శ్రీవేంకటేశుడు యెన్నడూ విడువక నన్ను కూడునట్టివాడు. నా పుట్టింటి నుంచి నా హితురాలిలా వచ్చావనుకొన్నాను కదే?

★ **రాసికెక్కు** – ప్రసిద్ధికెక్కు ★ **పన్నుక** – ఒప్పుగా
★ **తాపితనము** – తార్పుడు ★ **తడవక** – ఆలశ్యంలేకుండా

సంఖ్య :310 సంపుటము : 19 పుట: 207 రాగం : మాళవిగౌళ

3 ఏమని విన్నవించేము యెందాఁకాను
నీమనసే యెఱుఁగును నేఁడెంతసేసేవు ॥పల్లవి॥

వలపెల్లా నొక్కటే వారివారిలోపల
కొలఁదిమీరినయట్టిగుణాలు వేరు
చెలిమీ నటువంటిదే చెప్పి చూపఁబోఇతేను
వెలలేనినేర్పులు వేవేలు గాని ॥ఏమ॥

మన సందరివంటిదే మరిగివుండేయపుడు
ననుపులసరసాలే నానాగతులు
తనువు లొద్దికైనవేళ తరితీపు లెంచితేను
చెనకులో సన్నలే చిత్రములుగాని ॥ఏమ॥

పొందులు నెప్పటివే భోగించేయప్పుడు
మందలించి కరఁగించేమర్మాలు వింత
చెందితివి నన్ను నిట్టె శ్రీవేంకటేశ్వర
విందుల మోవియీవులే వేడుకలు గాని ॥ఏమ॥ 310

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో నాయిక స్వామితో, అన్నీ తెలిసిన నీకు ఇంకా యేమి విన్నవించాలయ్యా? నీ చేతలెటువంటివో, నీ మనసుకు తెలియదా? అని సూటిగా అడుగుతున్నది. నీకు తెలియనిదా? అందరికీ ప్రేమ వొకేలా వుంటుంది. ఎవరి గుణాలను బట్టి వారి కవి అతిశయించిన విధానం వేర్వేరుగా వుంటుంది. వారి స్నేహభావనా ఒకే తీరున వుంటుంది. కానీ వాళ్ళు అది చూపించే చాకచక్యమే విభిన్నంగా వుంటుంది. ఎవరినన్నా ఆశిస్తున్నప్పుడు, మనస్సు అందరికీ ఒకేలావున్నప్పటికీ అతిశయించిన వారి సరసాలు మాత్రం విభిన్నంగా వుంటాయి. తనువులొకటైనవేళ ఆపేక్షలందరికీ ఒకే విధమైనప్పటికీ, వారి స్పర్శల్లో అనుభూతి మాత్రం చిత్రవిచిత్రంగా వుంటాయి. భోగించేవేళ, వారి సురతములు అనాదివే కదా! మరి వింతగా, విభిన్నంగా వుండేదేమిటి. ఒకరినొకరు పరవశింపజేసే ఆ మర్మములే రకరకములు. నన్ను కూడిన శ్రీవేంకటేశ్వరా! మధురాధరపు విందులే వేడుకగాని, నీకితర వేడుకలెందుకయ్యా?

★ **తరితీపులు** – ఆపేక్షలు ★ **కొలదిమీరిన** – అతిశయించిన





సంఖ్య :311 సంపుటము : 19 పుట: 208 రాగం : నాదరామక్రియ

4 ఇంత వని కోపుదుమా యిదివో నేమొ
మంతనానకు వచ్చితే మరిగించుకొంటివి ॥పల్లవి॥

పొద్దువోనివాఁడవు పొలఁతులఁ గంటేను
చద్దికి వేఁడి కాదేవు జాణతనాలు
వుద్దండీఁడవట మీఁద నొడఁబరచవచ్చితే
కొద్దిమీరి చెలిమేన గోరు దాఁకించితివి ॥ఇంత॥

జూటరివాఁడవు నీవు సుదతు లిచ్చి తేఁజాలు
చీటికిమాటి కంటేవు చేకానికలు
నీటుదొరవు గనక నీకు విందుచెప్ప వచ్చి-
నాఁటదానికొంగువట్టి యాఁడిఁబెట్టేవు ॥ఇంత॥

నిరతి శ్రీవేంకటేశ నెలఁత లెదుట నుంటే
సరికి బేసి కంటేవు చనుమొనలు
సరసుఁడవని నిన్ను సంగడి నే మెచ్చితేను
సొరిది నన్నేలితివి చుట్టమైనదానిని ॥ఇంత॥ 311

**పరిచయ పరిమళం :**

ఏమయ్యా! నువ్వింతపని చేస్తే మేము సహించి వూరుకోమా? ఏదో మంచి సలహా ఇస్తావని వచ్చాము నువ్వేమో మమ్మల్ని నీకు అలవాటుచేసికొనినావు అని అన్నమయ్య మధురకీర్తనలో నాయిక అంటున్నది. నీవేమో పొద్దుపోనివాడవు. పొద్దునా, మధ్యాహ్నం కూడా చలోక్తులు విసురుతుంటావు. ఎంత సాహసివికాకపోతే మిమ్మల్నేదో (మీ సతీపతులనెలాగో) కలుపుదామని నేనొస్తే వచ్చిన ఆ చెలికత్తెపైన నఖక్షతములు చేస్తావా? నీవెంత నయవంచకుడవయ్యా? మావంటి సుదతులకు ఏవేవో చిరు కానుకలనిచ్చేటప్పుడు కావలసి వారిని తాకుతావు. నీవు మా దొరవు కదా! అని నిన్ను విందుకాహ్వానిద్దామని వస్తే ఆ వనిత చీరె కొంగు పట్టుకొని అల్లరిచేస్తావా? ఓ శ్రీవేంకటేశ్వరా! రమణులు నీయెదుటనుంటే, ఐనదానికీ కానిదానికి వారి స్తనాగ్రములపై చేయివేస్తావు సరసుడవని ప్రేమగా నిన్ను మెచ్చికొంటే నాకు చుట్టమైనావు.

★ **చద్దికి వేడికి** – పొద్దునా, మధ్యాహ్నామూ ★ **ఉద్దండీడు** – సాహసి
★ **సరికిబేసికి** – ఐనదానికీ కానిదానికీ ★ **జూటరివాడు** – వంచకుడు

సంఖ్య :572 సంపుటము : 19 పుట: 383 రాగం : ధన్యాసి

**5 విచ్చేయవయ్యా వేగమే అక్కడికి**
**అచ్చమైనకోరికతో నలసీఁ జెలి** ॥పల్లవి॥

**వుప్పరిగెలోన నీవు వున్నాఁడవంటా వచ్చి**
**అప్పుడే రావైతివంటా నడిగీఁ జెలి**
**తొప్పఁదోఁగేచెమటతో తూఁగుమంచముపైఁ బండి**
**ముప్పిరి మోహములోన మునిఁగీఁ జెలి** ॥విచ్చే॥

**వేడుకతో నీకు నిట్టే వీడెమిచ్చేనంటా వచ్చి**
**వీడుపడి యందు నిందు వెదకీఁ జెలి**
**వాడుచు మలగుమీఁద వడి నొరగుండి తాను**
**పాడించుకొనీ నీపై పాటలిన్నీఁ జెలి** ॥విచ్చే॥

**వుట్టిపడి నీవు కొలువున్నాఁడవంటా విని**
**అట్టె నిన్ను రమ్మని చెప్పెంపీఁ జెలి**
**గుట్టున శ్రీవేంకటేశ కూడి యలమేలుమంగ**
**నట్టనడుమ నిందుకే నవ్వీఁ జెలి** ॥విచ్చే॥ **572**

**పరిచయ పరిమళం :**

ఓ శృంగారరాయా! వేగమే అక్కడికి రావయ్యా! నిజమైన కోరికతో మా చెలి వేదనజెందుతున్నది. అని స్వామికి సందేశం తీసికొనివచ్చారు దేవి చెలికత్తె అయిన అన్నమయ్య. తన మేడపై అంతస్థులో నీవు వున్నావని గబగబా వెళ్ళి చూచి నిరాశతో ఇంకా నీవు రాలేదా అని మమ్మల్ని అడిగింది. చెమటతో తడిసి ముద్దఅయిన ఆమె తన తూగుమంచుము (నేటి ఉయ్యాలబల్ల) పైపడి మా చెలి మోహముతో అతిశయించినది. ఇంతకీ ఆవిడ యెందుకు అలా పరుగు పరుగున వచ్చిందంటే మొట్టమొదట తనే నీకు ఆహ్వాన తాంబూలమివ్వాలని. తత్తరపడి అక్కడా ఇక్కడా వెదకినది. నీవు రాలేదని వాడిపోయి నిరాశతో తన దిండుపై వాలిపోయింది. మా చేత నీమీద పాటలు పాడించుకొన్నది. ఒకవేళ నీవు నీ రాజ్యసభలో వున్నావేమోనని నన్నీ సభకు చెప్పి, పంపించింది. చూస్తే ఇక్కడ అలమేల్మంగను కూడివున్న శ్రీవేంకటేశుని చూస్తే మాకు నవ్వు ఆగలేదు.

★ **ఉప్పరిగె** – మేడపైఅంతస్థు ★ **తొప్పదోగె** – తడిసి ముద్దఅయినది
★ **వీడుపడి** – తత్తరపడి ★ **మలగు** – మెత్తటి దిండు





సంఖ్య :312 సంపుటము : 19 పుట: 209 రాగం : తెలుగుగాంబోది

**6 కోరిక లీడేరె నిఁకఁ గూచుండవయ్యా**
**సారె సారె నందుకుఁగా జలపట్టనేఁటికి** ॥పల్లవి॥

**యింతలోనే విభుఁడ నీవింటికి విచ్చేసితివి**
**పంతపుమాఁటల కిఁకఁ బనిలేదు**
**వంతుకు వచ్చినయాపె వద్దనే నిలుచున్నది**
**సంతోసించవలెఁగాని సాదించనేఁటికి** ॥కోరి॥

**దప్పిదేర చెక్కునొక్కి తమ్ముల మిడితివి**
**తప్పులు నీపయి నెంచఁదగవుగాదు**
**చెప్పరానిగుట్టుతోడ చేసన్న చేసీ నాపె**
**వొప్పనాయ నీవలపు వుప్పతించనేఁటికి** ॥కోరి॥

**కన్నులనే నవ్వి నన్నుఁ గాఁగిట నించితివి**
**విన్నపాలుసేయనిది వేళ గాదు**
**వున్నతి శ్రీవేంకటేశ వూరకే మొక్కీ నాకె**
**మన్ననలు దయివారె మతకములేఁటికి** ॥కోరి॥ **312**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరసకీర్తనలో నాయిక శ్రీవేంకటేశ్వరునికి నచ్చజెబుతున్నది. నీ కోరికలన్నీ తీరినవికదా! ఇకనైనా స్థిమితంగా కూర్చొనరాదా? ప్రతిసారీ నీ కోరిక తీరాలంటే పగబూనినట్లు ప్రవర్తించాలా? ఇప్పుడు. ఓ విభుడా! ఇంతలోనే నీవు ఇంటికి వచ్చినావు. ఇక పంతముపట్టినట్లు మాట్లాడవలసిన పనిలేదు. నిన్ను నాతో పంచుకొందామని అదిచూస్తే నిన్ను సుఖపెడుతుందిలే అనుకొని సంతోషించాలిగాని, నిన్ను సాధిస్తే ప్రయోజనమేమిటి చెప్పవయ్యా! ఆమెకు సంతృప్తికలిగేట్లు చెక్కిలినొక్కి సమ్మతితాంబూలమిచ్చావు కదా! నిన్ను ఇప్పుడు తప్పుపట్టి లాభమేమిటి? అదిగో చెప్పలేనంత రహస్యంగా నీకు సైగలు చేస్తున్నది. నీ వలపులకంగీకారం దొరికింది కదా! ఇప్పుడు నేను ఓర్వలేనిదానినవటం దేనికి? ఇప్పుడు ప్రభూ! నన్ను కౌగలించి కరుణించినావు. ఆమె నీ భక్తురాలట నాకు ఆమెపట్ల మన్నన కలిగింది.

★ **చలపట్టి**–పగబూనుట ★ **ఉప్పతించు**–ఓర్వలేకపోవు ★ **దయివారె**–అతిశయించు
★ **మతకము** – మాయలు ★ **దప్పిదేరు** – సంతృప్తికలుగు ★ **చేసన్న** – చేతితోసైగ

సంఖ్య :496 సంపుటము : 19 పుట: 332 రాగం : వేళావళి

**7 అన్నియు నందె యున్నవి అదిగో మాట**
**యెన్నుకొనె దినములు ఇదిగో మాట** ॥పల్లవి॥

**సీత నీకుఁ జెప్పి పంపి శిరోమణి నీకిచ్చె -**
**నాతల నే మెఱఁగము అదేమాట**
**చేతినీవుంగరమును శిరసున నెత్తుకొనె**
**యేతలఁపు లెట్లౌనో ఇదిగో మాట** ॥అన్ని॥

**తాడుపడ్డమేనితోడ తలఁపు నీకొప్పగించి**
**యేడవుతా నెఱఁగదు ఇదివో మాట**
**పాడిదప్ప దించుకంతా పదిల మాకెగుణము**
**ఆడ నేమీఁ జోటులేదు అదిగో మాట** ॥అన్ని॥

**తెఱవ నీకు బాసిచ్చె దేవతలమాట విను**
**యెఱిఁగినదే ఇందరు ఇదిగో మాట**
**గుఱుతై శ్రీవేంకటాద్రిఁ గూడితి రిద్దరు మీరు**
**అఱిముఱి రామచంద్ర అదిగో మాట** ॥అన్ని॥ **496**

**పరిచయ పరిమళం :**

ఈ కీర్తన విశ్లేషణ అనుకున్నంత సులభం కాదు. ఎవరు ఎవరికి చెబుతున్నారో కూడా అంత తేలికగా అర్థంకాదు. పల్లవే ఒకపట్టాన అర్థంకాదు. ఇది హనుమంతుడు శ్రీరామునికి వినిపిస్తున్న లంకలో సీతాదేవి దర్శనం. అన్నమయ్య 'అదిగో' నేటికాలపు (ఇదిగో) రామచంద్రా! ఇదిగో ఈ మాట విను అన్ని భావాలూ ఈ సందేశంలోనే వున్నవి. ఈ ఒక్కమాట విను, సీతమ్మ కడసారి ఆశతో దినములు లెక్కించుకొంటున్నది. సీతమ్మ తన శిరోమణి నా చేతికిచ్చి ఈ సందేశం వినిపించింది. ఆ తరువాత యేమికానున్నదో నేనెరుగను ప్రభూ! నీ చేతి వుంగరం తన శిరసునవుంచుకొని, తన ఆశలేమవుతాయోనని రోదించింది. ఇదిగో ఈమాట విను ప్రభూ! ఆమె కృశించిన మేనితో తలపులన్నీ నీపై నిలిపి రోదించుచున్నది. ఆమె సుగుణరాశి. అణుమాత్రము ధర్మము తప్పని సుశీల. కదలుటకు వీలులేని చోటున వున్నది. ఆ వనితామణి నీకు దేవతల బాసను గుర్తుచేసింది. అందరికీ నీ ప్రతిజ్ఞ రాక్షస సంహారం అని తెలుసు. శ్రీవేంకటాద్రిమీద మీకు ఎడబాటు లేదు. యుగాలపర్యంతం మీకదే స్థిరనివాసము.

★ **అఱిమఱి** – శీఘ్రముగా ★ **తాడుపడ్డ** – కృశించిన
★ **ఏడవుతా** – రోదిస్తూ ★ **తెఱవ** – వనిత





సంఖ్య :76 సంపుటము : 19 పుట: 51 రాగం : గంభీరనాట

**8 ఇంకా మమ్ముఁ జెనకేవు యేరా వోరి**
**కొంకులేక కొసరేవు కొమ్మల నందరిని** ॥పల్లవి॥

**గోవుల మరపినట్టు గొల్లెతల వలపించి**
**కావరించి తిరిగేవు కానీకానీరా**
**వేవేలు ఇండ్లు చొచ్చి వెన్నదినేనంటానే**
**మోవులు చవిగొంటివి ముద్దియల నెల్లను** ॥ఇంకా॥

**పిల్లఁగోవిరాగాలనె పెక్కుమంత్రాలు మంత్రించి**
**కల్లరివై తిరిగేవు కానీకానీరా**
**చల్లదుత్తలంటాను చన్నులపైఁ జేయి చాఁచి**
**కొల్లగొంటివి మానము కోమలులనెల్లను** ॥ఇంకా॥

**మడుగులఁ జొక్కుచల్లి మచ్చిక సేయించుకొని**
**గడుసరివై తిరిగేవు కానీకానీరా**
**నడుమ శ్రీవేంకటేశ నన్ను నిట్టె యేలితివి**
**తొడిఁబడఁ గూడితివి తొయ్యలులనెల్లను** ॥ఇంకా॥ **76**

**పరిచయ పరిమళం :**

ఏమిరా కృష్ణయ్యా! జంకూ గొంకూ లేక కన్నెపిల్లల్నందరినీ విజృంభించి తాకరానిచోట్ల తాకుతూ ఇంకా ఈ ఏడిపించడం మానవా? అంటున్నారు నందవ్రజములోని గోపికలు. అన్నమయ చెప్పిన సరస కీర్తననాస్వాదించండి. ఒక పక్క గోవులను కాస్తూనే ఇంకొక పక్క గొల్లెతలను వలపించి మదించి తిరిగావు. కానీలేరా! కానీ! పలువురి ఇండ్లలో వెన్నతింటాను పెట్టండి అంటూ వచ్చి వాడు చవిచూచేదేమిటో తెలుసా? భామల అధరామృతములు. అనేకములైన పిల్లనగ్రోవి రాగాలను మంత్రాలుగా మంత్రించి అబద్ధాలకోరువై తిరిగేవు కానీలే కానీ. చల్లకుండలలో చల్లతాగుతానని గోపెమ్మ స్తనములను పట్టుకొంటావు. కోమలుల మానము కొల్లగొడతావు. సరస్సులలో స్నానంచేసే జవ్వనులపై మత్తుమందు చల్లి నీకు మచ్చిక చేసుకొంటావా కానీలే కానీ, నీవు శ్రీవేంకటేశ్వరుడవై మమ్ము లొంగతీసుకొని కూడితివి మేము నిన్ను వలచినవారమేనయ్యా

★ **తొడిబడి** – చలించిపోవు ★ **ముద్దియ** – యువతి
★ **కల్లరి** – అబద్ధాలకోరు ★ **చల్లదుత్త** – చల్లదాచేకుండ

సంఖ్య :345 సంపుటము : 19 పుట: 231 రాగం : పాడి

**9 అల్లవాఁడె భావించరె అంగన లిందరుఁ గూడి**
**వుల్లములో తనమాయ లుబ్బెనో శ్రీహరికి ॥పల్లవి॥**

**నేలా మిన్నుఁ గొలవఁగ నిక్కి మిన్నేటినురుగు**
**ఆలరి యీహరిమేన నంటుకొనెనో**
**పాలవెల్లి తచ్చఁబోఁగాఁ బైఁబడెనో తుంపురులు**
**మేలిమి కప్పురకాపు మెత్తిరో యీహరికి ॥అల్ల॥**

**చిత్తగించి రేపల్లెఁ జీఁకటితప్పు సేయఁగా**
**అత్తల చీఁకటినలు పంటుకొనెనేమో**
**వొత్తి కరిఁ గావఁబోఁగా నొలికెనో పైమదము**
**మొత్తమిఁ బుళుగుకాపు ముంచిరో శ్రీహరికి ॥అల్ల॥**

**అలమేలుమంగఁ దెచ్చి అఱుతఁ గట్టుకొనఁగా**
**పొలసి నవరసాలుఁ బొడచూపెనో**
**నెలవైనసొమ్ములెల్లా నిండుకొనె మేననెల్లా**
**అలరి శ్రీవేంకటాద్రి నందమైనహరికి ॥అల్ల॥ 345**

**పరిచయ పరిమళం :**

తిరుమలలో స్వామికి శుక్రవారం అభిషేకం సందర్భంలో అన్నమయ్య చెప్పిన మధుర భక్తి కీర్తన ఇది. ఇందరు భామినులు ఒక్కసారి మీ మనస్సులో భావించండి. అదిగో వాడే అతిశయించిన తన మాయలను ప్రదర్శించే శ్రీహరి. ఆయన ఒంటిపై అంత కర్పూరం అద్దినందువల్ల తెల్లగా మెరయుచున్నాడా? లేక నాడు వామనావతారంలో త్రివిక్రముడై భూమీ నింగీ రెండు పాదాలతో కొలిచిన హరికి ఆకాశగంగతో బ్రహ్మపాదము కడిగాడు. ఆ సురగంగ నురుగువల్ల తెల్లగావున్నాడా? లేక పాలజలధిమధనంనాడు ఆదికూర్మానికి పాలతుంపర్లంటి ఇట్లా అయిందా? ఏమో మరి పునుగు అనే సుగంధ ద్రవ్యం ఒంటికి మెత్తబడిన స్వామి నల్లగా నిగనిగలాడుతున్నాడు. లేదా రేపల్లెలో చీకటితప్పు గొల్లెతలతో చేసీ చేసీ చీకటిలా నల్లబడ్డాడా? లేదా గజేంద్ర ప్రాణసంరక్షణప్పుడు కరిరాజు మదజలం అంటుకొన్నదా? నల్లగావున్నా సువాసన వెదజల్లుతున్నాడు. శ్రీవేంకటేశుడు సిరికాంతను యెదలో పెట్టుకొన్నందువల్ల నవనిధులొచ్చాయో లేక అన్ని ఆభరణాలతో అందంగా అలంకరించినందువల్లనా? వంటినిండా అన్ని శోభలు మెరుస్తున్నాయి.

★ **వుబ్బెను** – అతిశయించెను ★ **తచ్చు** – మథించు
★ **మొత్తమి** – పూర్తిగా ★ **అత్తల** – అక్కడ





సంఖ్య :174 సంపుటము : 19 పుట: 117 రాగం : శంకరాభరణం

**10 ఉద్దగిరి కృష్ణుఁడు వుబ్బరికాఁడు వీఁడు**
**ముద్దులు చూపుతానే ముసుఁగులు దీసేనే ॥పల్లవి॥**

**చెంగట నిద్దిరించేటిచెలువంపుగొల్లెతల**
**దొంగిడుచు వచ్చి వచ్చి తొడ లంటీనే**
**ముంగిటఁ గూచుండఁగాను ముడిచినపోఁకముడి-**
**కొంగులు విడిచి యట్టె కొల్లున నవ్వీనే ॥ఉద్ద॥**

**వేడుకతో గొల్లెతలు వెన్నముద్దలు సేయఁగ**
**చాడెసంది వచ్చి తాను చన్నులంటీనే**
**జోడై యొకరొకరు సుద్దులుచెప్పేటివేళ**
**కోడెకాఁడై యండనుండి కొప్పులు వట్టీనే ॥ఉద్ద॥**

**అట్టె విడేలు సేయుచు నాకులు మడుచుకోఁగా**
**గట్టిగాఁ గళలు రేఁగ కాఁగిలించీనే**
**యిట్టె మమ్మిందరిని యేలి శ్రీవేంకటేశుఁడై**
**దిట్టతనమున మోవితేనె లిచ్చీనే ॥ఉద్ద॥ 174**

**పరిచయ పరిమళం :**

హంపీవద్దనున్న ఉదయగిరిలో నెలకొన్న కృష్ణునిపై సరస శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఈ ఉద్దగిరి (ఉదయగిరి)లో నెలకొన్న కృష్ణుడున్నాడే, వీడు రండగొండివాడు. కన్నెపిల్లలకి ముద్దులు రుచి చూపిస్తూనే చటుక్కున వారి మేలి ముసుగు తొలగించి ఏడిపిస్తాడు. తన ఇంటివద్ద నిద్రిస్తున్న అందమైన గొల్లెతలవద్దకు దొంగలా వచ్చి తొడలని తాకుతాడు. తమ ముంగిటిలో కూర్చుని ముచ్చట్లాడుకొంటున్న గొల్లెతలు కట్టిన చీరెల పోకముడి వున్నట్టుండి వూడపీకి పకపకా నవ్వుతాడు. గొల్లెతలు సరదాగా వెన్నముద్దలు చేసి తీస్తుంటే కుచగిరులు తాకుతాడు. గొల్లెతలు ఒకరితోనొకరు రహస్యాలు చెప్పుకొంటుంటే వెనకనుంచి వచ్చి కొప్పులు వూడబీకుతాడు. వాళ్ళు తాంబూలం వేసికొని భర్తల కోసం యెదురు చూస్తుంటే బిగియార కౌగలించి కామకళలను ప్రకోపింపజేస్తాడు. నేడు శ్రీవేంకటేశ్వరుడై మాబోటి భక్తురాండ్రకు అధరామృతమిస్తాడు.

★ **కొల్లున** – గొల్లుమని ★ **చాడెసంది** – చాటునుంచి
★ **కోడెకాడు** – కౌమారుడు ★ **దిట్టుతనం** – తెంపరితనం

సంఖ్య :514 సంపుటము : 19 పుట: 344 రాగం : లలిత

**11 నవ్వితినే గొల్లెతా నాయ మవుర గొల్లఁడా**
**యెవ్వ రేమనిరే నిన్ను నియ్యకొంటిఁ బదరా** ॥పల్లవి॥

**కానీవే గొల్లెతా కద్దులేరా గొల్లఁడా**
**ఔనా మఱవకువే అట్టే కానీరా**
**నే నేమంటిని నిన్ను నీకే తెలుసురా**
**మానితినే ఆమాట మంచిదాయఁ బదరా** ॥నవ్వి॥

**అదియేమే గొల్లెతా అందుకేరా గొల్లఁడా**
**కదిసెఁ గడుపనులు కల్లగాదురా**
**ఇది నిక్కెమటవే ఇంతకంటె నటరా**
**పదరకువే నీవు పలుమారు నేలరా** ॥నవ్వి॥

**మెచ్చితినే గొల్లెతా మేలు లేరా గొల్లఁడా**
**కుచ్చితిఁ గాఁగిట నిన్నేఁ గూడుకొంటిరా**
**యిచ్చకుఁడ శ్రీవేంకటేశుఁడను నేనే**
**యెచ్చరించవలెనా, యెఱుఁగుదుఁ బదరా** ॥నవ్వి॥ **514**

**పరిచయ పరిమళం :**

ఇది కృష్ణునికి ఒక గొల్లెతకు జరిగిన సరస సంవాదము. పొట్టి పొట్టి సంభాషణలైనందున భావము ఒకింత సందిగ్ధంగా వుంటుంది. అన్నమయ్య భావము అందుకొన్నామో లేదో? ఓ గొల్లెతా! నవ్వువస్తోందే. ఏరా గొల్లడా! నీకు న్యాయంగా వున్నదారా? నిన్నెవ్వరేమన్నారే గొల్లెతా? సరే! ఒప్పుకొన్నానులే పదరా పద. గొల్లెతా! మరైతే కానీవే. గొల్లడా! నాకు నీపై ప్రేమవున్నదిలేరా. ఔనా! అయితే మరి అది మఱచిపోకే గొల్లెతా! అట్లాగే కానీరా గొల్లెడా! ఓ గొల్లెతా! నిన్ను నేనేమన్నానే? నీవేమన్నావో నీకే తెలుసురా గొల్లడా! ఆ మాటలు మానేసానే గొల్లెతా! మంచిదయిందిరా గొల్లడా! ఓ గెల్లెతా! అదేమిటే అట్లా అంటావు. ఓరి గొల్లడా! అందుకే అన్నాను లేరా! నీకు చేరువవటమే నాకు పెద్దపనే గొల్లెతా! ఇది అబద్ధం కాదు ఒప్పుకొంటానులేరా! ఇది నిజమంటావుటే గొల్లెతా! ఇంతకంటే నిజమేముంటుందిరా? గొల్లెతా! తొందరపడకే అన్నిసార్లు బలవంతం యెందుకు చేస్తావురా? ఎలాగైతేనేమి, నిన్ను మెచ్చానే గొల్లెతా! మంచిదైనదిరా గొల్లెడా! నిన్ను గుచ్చి కౌగలించుకొంటానే. నిన్నే కూడినానురా. గొల్లెతా నేనే శ్రీవేంకటేశుడనే. నాకు ముందే తెలుసునురా.

★ **ఇయ్యకొంటిని** – ఒప్పుకొన్నాను ★ **పదరకువే** – తొందరపడకే





సంఖ్య :77 సంపుటము : 19 పుట: 52 రాగం : శ్రీరాగం

**12 వలపేమి వెగటా వనితలకు**
**చిలుకుగోళ్ళనేల చెమట చిమ్మేవే** ॥పల్లవి॥

**అదనెరిఁగి పచ్చి మా టాతఁడు నిన్నాడితేను**
**వదనకమలమేల వంచేవే**
**సదరానఁ గప్పురము చన్నుదాఁక వేసితేను**
**వుదుటున లోలోన వుసురనేవేలే** ॥వల॥

**చవులువుట్టిం చాతఁడు సన్న నీకుఁ జేసితేను**
**అవలివలై యేల అలసేవే**
**తివిరి యట్టె ముసుఁగు దీసి మోము చూచితే**
**జవళిఁ జొక్కుచు నేల జడిసేవే** ॥వల॥

**శ్రీ వేంకటేశుఁడు నిన్నుఁ జేరి కాఁగిలించితేను**
**భావము గరఁగి యెంత పదరేవే**
**కావరపునవ్వుతోడఁ గడుసరసమాడితే**
**చేవదేర నెంతకెంత చెలఁగేవే** ॥వల॥ **77**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య అమ్మవారి చెలికత్తె. ఇదేమిటమ్మా వనితలకు వలపు యెందుకు వెగటవుతుంది? ఇంతకీ చిలుకగోళ్ళవలెనున్న నీ గోళ్ళలో చెమటలెందుకు చిమ్ముతున్నాయి? ఒకవేళ యెవరూ లేని సమయంచూచి యేదో పచ్చిగామాట్లాడాడే అనుకో, దానికి నీ ముఖపద్మమును వంచనేలనమ్మా? కర్పూరపలుకులు నీ స్తనములమధ్య వేశాడని నీ లోలోపల ఉస్సురుమని నిట్టూర్చెదవేలనే? ఆతడు, నీలో ఆసక్తిని రేపి మాకు తెలియని సైగలేవో నీకు చేశాడు. అంతమాత్రానికే అటూ ఇటూ అయిపోయి అగచాట్లెందుకు పడతావమ్మా? ఆయన చిలిపిగా చటుక్కున నీ మేలిముసుగు తీసేసి నీ ముఖపద్మాన్ని చూస్తే నీవెందుకు భయపడతావమ్మా? ఆపైన వేంకటేశుడు నిన్ను కౌగిట చేరిస్తే భావావేశంతో యెందుకు తహతహలాడెదవమ్మా. ఆయన గర్వంగానవ్వుతూ నీతో సరసమాడితే యెంతఅతిశయం చూపిస్తున్నావమ్మా?

★ **ఉదుటున** – ఉద్ధతితో ★ **కావరపునవ్వు** – గర్వంతో నవ్వు
★ **చేవదేర** – ధైర్యముతో ★ **అవలివలై** – అటూఇటై

సంఖ్య :495 సంపుటము : 19 పుట: 331 రాగం : సాళంగనాట

**13 అరుదు రామునిచేఁత లదిగో పుష్పకమును**
**సొరిది మనబాలులే సోద్యము గదమ్మా** ॥పల్లవి॥

**హరునివిల్లు విరిచె అట్టె సీతఁ బెండ్లాడె**
**పరశురాముని బాహుబలము గొనె**
**సురలకు మునులకు సొరిది నభయమిచ్చె**
**వరుస నయోధ్య యేలవచ్చె నటవమ్మా** ॥అరు॥

**వాలిఁ గొట్టి సుగ్రీవువరరాజ్య మిచ్చెనట**
**చాలుగాఁ గొండలనే జలధిగట్టె**
**తీలుగా రావణుఁ జంపి తెగి లంక సాధించి**
**వాలినసేనలఁ గూడి వచ్చెనటవమ్మా** ॥అరు॥

**కాంతయైనసీతఁ గూడి కలుషములెల్లఁ బాపి**
**పంతముతో విభీషణుఁ బట్టముగట్టి**
**ఇంతటా శ్రీవేంకటాద్రి నిరవున వేఁటలాడి**
**వంతులకు రాజ్య మేలవచ్చెనటవమ్మా** ॥అరు॥ **495**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య పాడిన రామగాధనాలకించండి. ఇది నూటికి నూరుపాళ్ళూ అధ్యాత్మకీర్తనే. పొంగలి తింటున్నవారికి మధ్యలో జీడిపప్పు వస్తే ఆనందమే కదా! సరసకీర్తనాస్వాదనలో ఇదీ అలాగే. ఒక భక్తురాలు ఇంకొక ఆవిడకు వినిపిస్తున్న పాటవలె సాగుతున్నది. ఈ శ్రీరాముని చేతలు బహు అరుదు. అదిగో పుష్పక విమానం. ఎంతమంది యెక్కినా దాంట్లో మరొక్కరికి చోటు వుంటుందిట. మన బాలలకి ఇది గొప్ప వింతయే కదా! ఈయన చేతల గురించి యేమిచెప్పను? శివధనస్సు విరిచి సీతను పెండ్లాడినాడు. పరశురాముని బాహుబలం కైవసం చేసికొన్నాడు. మునులు, దేవతలకు అభయమిచ్చాడు. నేడు అయోధ్యను యేలవచ్చినాడట. వాలిని వధించి సుగ్రీవునికి రాజ్యమిచ్చాడు. కొండలతో సముద్రానికి సేతువు కట్టాడు. రావణుని వధించి లంకను సాధించాడు. నేడు అతిశయించిన తన సేనతో విడిసినాడట, చూడవమ్మా! తన సీత పునీత అని నిరూపించి విభీషణునికి పట్టముగట్టాడటమ్మా! శ్రీవేంకటాద్రిపై వేటలాడి ఈ తిరుమల రాజ్యము నేల వచ్చాడటమ్మా! ఈ వేంకటరామయ్యగారు.

★ **వాలినసేన** – అతిశయించిన సైన్యము ★ **సొరిది** – క్రమముగా
★ **తీలుగ** – లోపల అణచిన ఆగ్రహంతో ★ **వంతులకు** – పోటీగా





సంఖ్య :494 సంపుటము : 19 పుట: 331 రాగం : సామంతం

**14 చిగురో చేఁగ చూపఁజెల్లదే నీకు**
**అగపడె నీరమణుఁ డదిగో నీకు** ॥పల్లవి॥

**వలపులే కడుఁబెంచి వాలుకరెప్పలు వంచి**
**సెలవినవ్వులనేల చిందేవే సిగ్గు**
**నిలువునఁ దమిరేఁచి నెయ్యపుటాసలు పూఁచి**
**మలసి యంతలోనే మాననేలే నీకు** ॥చిగు॥

**మాటలతేనెలు చూపి మదనముద్రలు మోపి**
**యీటునఁ దలుపుమాటు కేల పొయ్యేవే**
**గీఁటుచుఁ గన్నుల నవ్వి కిందటిమోహాలు దవ్వి**
**మాటికిమాటికి మేనిమఱపేలే నీకు** ॥చిగు॥

**కాఁగిటిరతికిఁ జొచ్చి కమ్మటి నీకెమ్మోవి ఇచ్చి**
**కాఁగినగుబ్బలనేల ఘాతసేసేవే**
**వీఁగుచుఁ గూడితివి శ్రీవేంకటేశుని వి(ని?)ట్టె**
**మూఁగినపులకల యీమోపేలే నీకు** ॥చిగు॥ **494**

**పరిచయ పరిమళం :**

చిగురు యెంతో మృదువైనదే. కానీ దానిలోనే ఏర్పడ్డ "చేగ" (చేవ) కఠినంగా వుంటుంది. ఈ కీర్తనలో అన్నమయ్య, నాయిక చెలికత్తెయై ఆమెతో దేవీ! చిగురులోని చేగతనం చూపాలంటే అది నీకు చెల్లదమ్మా! అంటున్నారు. అదిగో నీ రమణుడు నీకు అగపడెనమ్మా! ఇంకా నీ విచిత్ర విన్యాసాలు దేనికమ్మా? వలపులను మిక్కిలిగా బెంచునట్లు, వంచిన వాలురెప్పలతో చూడబోకమ్మా! మనోహరమైన లేచిరునవ్వుల నేలచిందించేవమ్మా? నిలువునా సిగ్గుల మొగ్గవై ఆసక్తిని పెంచే స్నేహపు ఆశలు పూయించి అంతలోనే అన్నీ మానివేసి గంభీరంగా వుంటే యేమి బాగుంటుందమ్మా? నీ మాటలలో తేనె లొలికించి దానికి విరుద్ధంగా ఆయన వంటిపై అనేక నఖక్షతములు చేశావు. చేసిన పనికి సిగ్గువడి తలుపుచాటున యేల నక్కెదవమ్మా? కన్నుగీటి నవ్వుతూ కిందటి రేయి కలిగిన మోహాలకు మాటి మాటికీ మైమరపుపొందెదవు. స్వామి కౌగిటిలో చొక్కి అరుణాధరమందించి శ్రీవేంకటేశునిట్టే కూడితివి. నీకు పులకలమొలకలు అతిశయించినవమ్మా!

★ **మలసి** – విజృంభించి ★ **మదనముద్రలు** – నఖక్షతములు

సంఖ్య :568 సంపుటము : 19 పుట: 380 రాగం : ఆహిరి

15 జమళిఁ గల్యాణము సరసుఁడాడె నేఁడు
చెమట లేఁటికి వచ్చెఁ జెప్పరే ॥పల్లవి॥

తూఁగుమంచముమీఁదఁ దొయ్యలు లిద్దరిఁ
గాఁగిలించుకొంటాఁ గరఁగీని
యేఁగుబెండ్లికొడు కెవ్వరిపై మోహము
చేఁగదేర నిది సరిఁ జెప్పరే ॥జమ॥

ఇదె పెండ్లిపీఁటపై యిద్దరి కొకమాఁటే
కదిసి పచ్చడము గప్పీని
యెదుగ దోసిట నించి యెవ్వరిపైఁ దలఁబాలు
చెదరకుండాఁ బోసెఁ జెప్పరే ॥జమ॥

పొలఁతులిద్దరితోడ బువ్వానఁ గూచుండి
చలివాయఁ గళ్ళిచ్చీ సరిగాను
యెలమి శ్రీవేంకటేశుఁ డెనసె నీవేళ నే-
చెలులకుఁ జనవిచ్చెఁ జెప్పరే ॥జమ॥ 568

**పరిచయ పరిమళం :**

శ్రీవేంకటేశ్వరుడు భూదేవిని శ్రీదేవిని పెండ్లాడుతున్నాడు. అది జమళికళ్యాణము. ఇద్దరు జంట పెండ్లికూతుళ్ళతో సరసుడైన తిరుమలదేవుడు పరిణయమాడెను. ఈ వధువులకు చెమటలేలపట్టుచున్నవి అని ప్రశ్నిస్తున్నారు అన్నమయ్య. ఇక పవళింపు సేవ జరిగింది. పడతులిద్దరి పరిష్వంగమున హరివలపులు పరిమళించినవి. ఇరువురిలో ఏతెరువపై మోహమధికమైతే ఆమె వరునిజెంత జేరుతుంది. ఇదిగో పెండ్లి పీటల మీద ఇద్దరికీ ఒకేమారు చదివింపు పట్టుబట్టలు కట్టారు. ఇరువురి దోసిళ్ళలో తలంబ్రాలు పోశారు పురోహితులు. మొట్టమొదట యెవ్వరి శిరసుపై హరి కురిపిస్తాడో ఒరులెట్లెరుగుదురు? అయినా మీరు వూహించండి. ఆపై, తరుణులిరువురితో పెండ్లివిందులో కూర్చున్నాడు వరుడు. సిగ్గు సంకోచము పోవునట్లు సమానంగా చూశాడు. ఈవేళ శ్రీవేంకటేశుడు ఇద్దరికి అనురాగము సరసుడై పంచినాడు.

శ్రియః కాంతాయ కళ్యాణనిధయే... నిధయేర్థినామ్
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసయ మంగళం

★ **చలివాయ** – సిగ్గుసంకోచము పోవునట్లు ★ **కళ్ళిచ్చీసరిగాను** – సమానంగా చూశాడు





సంఖ్య :75 సంపుటము : 19 పుట: 51 రాగం : సాళంగనాట

16 ఎవ్వ రెట్టయినా నుండనీ ఇదివో నేను
నవ్వుతా నీసేవ సేతు నడుమ నేను ॥పల్లవి॥

మనసున నొకమాట మఱఁగున నొకమాఁట
యెనసి నే(న?)నయములు యెఱఁగ నేను (?)
వనితనై నీమీఁదివలపే గతియని
తనివోక బదికేటిదానను నేను ॥ఎవ్వ॥

వొలిసితే నొకటియు నొల్లకుంటే నొకటియు
చలివేఁడివేసాలు జరప నేను
కలికితనాన నీతో కాఁపురమే గతియని
తలఁచి పొందులు సేసేదానను నేను ॥ఎవ్వ॥

వొక్కపరి యిచ్చకము వొక్కపరి మచ్చరము
యిక్కడా నక్కడ యెలయించను నేను
గక్కన శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
మక్కువ నిటువలెనే మరుగుదు నేను ॥ఎవ్వ॥ 75

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య శ్రీవేంకటేశుని వలచిన నెలతయై నిస్వార్థమైన తన వలపు యెటువంటిదో స్వామికి వివరిస్తున్నారు. ఇదిగో స్వామీ! యెవ్వరెట్లావుంటే నాకేమిటయ్యా? నేను మాత్రం మధ్యలో వచ్చి, నీవు కావాలనుకొన్న చిన్నదాన్నే. నవ్వుతూ నీ సేవలోనే నేను తరిస్తాను. నా మనస్సులో ఒకటనుకొని చాటుగా ఒకటి చెప్పి, నీతో కల్లబొల్లి మాటలు చెప్పటం నాకు రాదు. నేను వలచి వచ్చిన వనితనే. కాని నేను తనివి తీరని పొందుకావాలనుకొనేదాన్నికాను. ప్రభూ! నేను కావాలనుకొంటే ఒకమాట, వద్దనుకొంటే వేరొకమాట చెప్పేదాన్ని కాదు. రెండు రకాల ద్వంద్వ పద్ధతిలో వేషాలు వేయను. అతివలకు తగ్గట్లు నీతో కాపురంచేస్తూ అదే నా విధిగా బ్రతుకుతాను. అది కుదరకబోతే నిన్ను నిందించను నాగతి అంతేననుకొని నీ చింతనలోనే వుంటాను. ఒకసారి ఇషం చూపించటం ఇంకొకసారి గర్వంతో తిరస్కరించటం, ఇక్కడా అక్కడా అని చూడక యెక్కడపడితే అక్కడ కూడటం నాకు నచ్చదు. శ్రీవేంకటేశ్వరా! నీపై నా మక్కువ మరుగున వుంటే వుండనీ.

★ **తనివోక** – తనివితీరని ★ **చలివేడివేసాలు** – ద్వంద్వ ప్రవృత్తి
★ **ఎలయించను** – పొందించను ★ **మచ్చరము** – గర్వము

సంఖ్య :246 సంపుటము : 19 పుట: 165 రాగం : నాగగాంధారి

**17** ఇదివో నీమహిమలు యేమని పొగడేమయ్యా
కదిసితేనే యినుము కనకమై మించెను ॥పల్లవి॥

సెలవి నీవు నవ్వితే చిత్తము చీఁకటివాసె
వెలసెను నాలోని వేడుకలెల్లా
చెలిమిసేసి నాపైఁ జేయి నీవు వేసితేను
బలిమితో వలపులపంటలెల్లాఁ బండెను ॥ఇది॥

తప్పక నీవు చూచితే తనువుపై కాఁక మాని
వుప్పతిల్లె జవ్వనము వుదుటునను
కొప్పుదువ్వి నీవు నన్నుఁ గొనగోరు సోఁకించితే
కుప్పళించి తమకపుకొటారులు నిండెను ॥ఇది॥

చేరి నీవు వలికితే సిగ్గులు మూల కొదిగి
కారుకమ్మె నెమ్మోమునఁ గళలన్నియు
యీరీతి శ్రీవేంకటేశ ఇన్నిటా నన్నేలితివి
సారె నా కిట్టె మదనసామ్రాజ్యము హెచ్చెను ॥ఇది॥

**పరిచయ పరిమళం :**

ఓ శృంగారరాయా! నీ మహిమలనేమని పొగడెదమయ్యా! అంటున్నారు అన్నమయ్య. అంటే నేటి భాషలో యెంతని పొగడనయ్యా! చేరువయై పరిశీలిస్తే ఇనుములాంటి అల్పులైన నాబోంట్లు కనకములాగా విశిష్టులవుతారు. నీవు మధురమైన చిరునవ్వులు చిందిస్తే, మనస్సులోని పెను చీకట్లు తొలగిపోతాయి. నాలో వేడుకలు వెల్లివిరుస్తాయి. నాపై స్నేహంగా నీ చేయివేస్తే నా వలపులపంట పండుతుంది. నీవు నన్ను నఖశిఖపర్యంతం చూస్తే నా శరీరం చల్లబడిపోతుంది. యౌవనం ఒక్కసారిగా అతిశయిస్తుంది. నీవు అనురాగంతో చిలిపిగా నా కొప్పు దువ్వి నాకు చిన్న నఖక్షతము చేస్తే తమకంతో తబ్బిబ్బవుతాను. నీవు నన్ను పలుకరిస్తే సిగ్గుతో ఒకమూల నక్కుతాను. నా ముఖంలో కళలు తాండవిస్తాయి. ఓ శ్రీవేంకటేశ్వరా! నువ్వు నన్ను ఇన్నివిధాలుగా వెలకలిగిన రత్నము జేశావు. నా మదన సామ్రాజ్యము అతిశయించింది.

★ **కారుకమ్ము** – దట్టంగా వ్యాపించు ★ **కుప్పళించు** – కుప్పించు
★ **కదిసితేను** – చేరువగా పరికిస్తే ★ **ఉప్పతిల్లు** – ఓర్వలేకపోవు





సంఖ్య :505 సంపుటము : 19 పుట: 338 రాగం : తోండి

**18** కానీవే గొల్లెతా కమ్మటి నవ్వకువే
నానవీవే రేపటికి నయమవును దాఁచవే ॥పల్లవి॥

తీపుచేసి వలపులు తీర నాపైఁ జల్లకువే
పోపో నీగొల్లచల్ల పుల్లనేకాదా
మాపటంత వచ్చేఁగాని మగుడి చూడకువే
చేపట్టి చూడఁజూడఁగ చీఁకటిండ్లే వెలుఁగు ॥కానీ॥

మాటలనే నామీఁద మందులు నూరకువే
మూటగట్టితే గొల్లముంజులేకావా
చీటికిమాటికి నాపై చేతులు చాఁచకువే
వాఁటమైతే నీరు వారు వచ్చే నే నాడకు ॥కానీ॥

చేయివట్టి తియ్యకువే చేరి నన్ను లోనికి
పాయపుగొల్లెతలకు బలువేకాదా
వేయిటికిఁ గూడితి శ్రీవేంకటేశుఁడను నేను
యీయెడ జాతొకటాయ నింటికి వచ్చేనే ॥కానీ॥ **505**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య సృష్టించిన ఈ కీర్తన పాడింది గోపాలకృష్ణుడు. పాడింది ఒక గొల్లెతనుద్దేశించి, ఓ గొల్లెతా! కానీవే. ఇంత కమ్మగా నువ్వు నవ్వితే, ఇబ్బందే. రేపు మనం కలుసుకొనే దాకా వాటిని దాచి వుంచవే. అదే నయము సుమా! నీ నవ్వులను నానబెట్టివుంచు. ఓ గొల్లెతా! మధురమైన, నీ వలపులు నాపై జల్లబోకే. పోపోవే. మీ గొల్లల చల్ల అంతా పుల్లగానే వుంటుంది కదే? అయినా మాపటికి వచ్చేస్తాను కదా! అలా మరల మరల వెనుదిరిగి చూడకే. నీవు నా చేయిపట్టుకొంటే చీకట్లుకూడా వెలుగుతో నిండిపోతాయి. ఓ గొల్లెతా! నా మీద నీ మాటలనే మత్తుమందులు నూరిపోయకు. నీ మాటలను మూటగడితే ఏముంది చెప్పు? అవి గొల్లముంజులు కాబట్టి గొల్లకంపుకొడుతూనే వుంటాయి. చీటికిమాటికి నాపై చేతులు చాచవద్దు. నీవు ఒప్పుకొంటే నీరుపారేచోటికి (యమునానది ఒడ్డుకు) రావే. వయస్సులోవున్న మీ గొల్లెతలకు యేమి బలుపే. చేయిపట్టుకొని రమ్మని మీ ఇంట్లోకి పిలువబోకే. వేయిమందిలో నిన్నెన్నుకొని కూడినానే. నేను శ్రీవేంకటేశుడను. మన జాతి ఒకటేనే రావే. (గోపికలంతా హరిని వాంఛించిన దేవతాస్త్రీలు)

★ **వాటమైతే** – అంగీకారమైతే ★ **పాయపుగొల్లెత** – వయసులోవున్న గోపిక
★ **మగుడమాపటంతవచ్చేగాని** – మాపటివేళకు మరలివచ్చేదాక

సంఖ్య :173 సంపుటము : 19 పుట: 116 రాగం : దేసాళం

**19 వెల్లవిరాయఁ బనులు విట్ఠలేశ్వరా**
**చల్ల జంపుసేఁతల సటకారివాఁడవు** ॥పల్లవి॥

**ననుఁజూచి కొలువులో నవ్వినదే చాలదా**
**వనితల యెడల గర్వపు వాఁడవు**
**చెనకి యప్పటి నన్నుఁ జేఁ(జే?)త నంటవలెనా**
**పొనుగనివలపులపొత్తులవాఁడవు** ॥వెల్ల॥

**ముచ్చికల నాతోడ మాటాడుటే చాలదా**
**కుచ్చితపు బహుపరాకులవాఁడవు**
**విచ్చనవిడి నిప్పుడే విడెమియ్యవలెనా**
**మచ్చువేసితీసేవెడమాయదారివాఁడవు** ॥వెల్ల॥

**సంగడి నాపై సేస చల్లుటే చాలదా**
**సంగ తెరిఁగి నె(న?) న(నె?) రజాణకాఁడవు**
**చెంగట నన్నేలితివి శ్రీవేంకటేశుఁడవై**
**యెంగిలి సేయవలెనా యిచ్చకపు వాఁడవు** ॥వెల్ల॥ **173**

**పరిచయ పరిమళం :**

"చల్లజంపుసేతలు" అంటే చల్లగా గొంతుకోసి చంపే పనులు అని అర్థం. ఇది విట్టలేశ్వరుడైన కృష్ణయ్య మీద అన్నమయ్య చెప్పిన మధుర కీర్తన. స్వామీ! నీపనులు వెల్లివిరైనవయ్యా! అంటున్నారు. పైగా సటకారి వాడట అంటే మాయలమారివాడట. నీవు వనితలంటే చాలా గర్వము ప్రదర్శిస్తావు. నన్ను నీ కొలువులో జూచి అందుకేనేమో నవ్వినావు. మరల నన్ను తాకుటకు చేతులు జాచి ముట్టుకోవాలా? నువ్వేమీ తక్కువవాడవా? ఏమాత్రం తగ్గని వలపు పొత్తులు పెట్టుకొనే వాడివి. ఓ విట్ఠలేశ్వరా! కాస్త మచ్చికతో నీతో మాట్లాడితే చాలు నీవు వనితలపై అత్యంత ఆసక్తి కలవాడవని కుత్సితం కలవాడవని తెలిసిపోతుంది. ఎంత విచ్చలవిడి ప్రవర్తన గలవాడవంటే ఇప్పటికిప్పుడే నాకు తాంబూలమియ్యాలా? నీవు మత్తుమందు చల్లే మాయలమారి వాడవు. నీవు నాసంగతి తెలిసిన నెరజాణవు. నాపై అక్షతలు చల్లితే చాలదా? శ్రీవేంకటేశ్వరుడవై కూడా నన్ను ఎంగిలిచేయాలా?

★ **పొనుగని** – తగ్గని ★ **అప్పటి** – మరల ★ **బహుపరాకు** – అత్యంత ఆసక్తి





సంఖ్య :341 సంపుటము : 19 పుట: 228 రాగం : వరాళి

**20 ఇంతలోనె నీతో నే నేమందురా**
**పొంతనుండి నీవే నాకు బుద్ధిచెప్పఁగదరా** ॥పల్లవి॥

**చెక్కుమీఁదటఁ జేయి చిత్తములోపల నూయి**
**ఇక్కువమాటలు నీతో నే మందురా**
**చక్కనే నీనేరుపులు చల్లీ నావూరుపులు**
**అక్కడిసుద్దు లేమైనా నానతియ్యరా** ॥ఇంత॥

**వంచినది నాశిరసు వలపూఁ గడుబిరుసు**
**ఇంచుకా మొగమోడక యేమందురా**
**మంచిదే నీలోనిగుట్టు మాకే ఇన్నిటా అట్టు**
**కంచపుఁబొత్తుకు నీవే కైకొలుపఁగదరా** ॥ఇంత॥

**ముందుఁ దొక్కితి ముంగిలి మోవిమీఁదనె యెంగిలి**
**యిందరిలోపల నిన్ను నేమందురా**
**అంది శ్రీవేంకటపతి వలమేలుమంగ నేను**
**యిందె కూడితివి నన్ను నిఁక నానతియ్యరా** ॥ఇంత॥ **341**

**పరిచయ పరిమళం :**

దేవి అలమేల్మంగమ్మ స్వామితో ఏమంటున్నదో అన్నమయ్య వినిపిస్తున్నారు వినండి. ఇంతలోనే నేను నిన్నేమన్నానయ్యా? ఒకవేళ అనివుంటే నాదగ్గరకు వచ్చి నాకు బుద్ధి చెప్పవచ్చును గదా! నా చెక్కులపై చేయిజేర్చి యోచిస్తున్నానే కానీ నా మనస్సు పెద్ద నుయ్యిలాగా వున్నది. ఇక నీతో ఇచ్చకపు మాటలు యేమి చెప్పమంటావు? నీవు నేర్చిన అక్కడి సమాచారములు నాకు చెప్పరాదా? నాకు ఊపిరన్నా సరిగా ఆడుతుంది కదా! నా శిరస్సువంచుకొనే వుండవలసివచ్చింది. నా వలపు కూడా కడు కఠినమైనదే సుమా! ఇంచుకైనా దాక్షిణ్యం లేక నిన్నేమనగలనయ్యా? మంచిదయింది నీ గుట్టు నా దగ్గరమాత్రమే రట్టయింది. అయిందేదో అయింది. ఇక మీ పెళ్ళి భోజనం పెట్టించు. స్వామీ! ఒక్కటి మాత్రం మరువకు. మొట్టమొదట వివాహంలో నీ పాదం తొక్కింది నేను. నీ మోవిని యెంగిలిచేసింది నేను. ఇంకా ఇప్పుడు నిన్నేమనగలను? నీవు శ్రీవేంకటపతివి, నేను అలమేలుమంగను నీవు నన్ను కూడిన భర్తవు ఇక నీ చిత్తము, నా భాగ్యము.

★ **కంచవుబొత్తులు** – సహపంక్తి భోజనాలు ★ **ఇక్కువ** – ఇచ్చకపు
★ **కడుబిరుసు** – మిక్కిలి కఠినమైనది ★ **ముంగిలి తొక్కుట** – గృహప్రవేశం చేయుట

సంఖ్య :347 సంపుటము : 19 పుట: 232 రాగం : సామంతం

**21** ఎవ్వరు వద్ద నున్నారో యేమి సేసీనే
దవ్వుల నెదురురాక తా నేమి సేసీనే ॥పల్లవి॥

పచ్చనిచిగురువంటిపాదాల నడచివచ్చె-
నిచ్చకపుఁబతి లోన నేమి సేసీనే
నెచ్చెలిమే నింతలోన నిండాఁ గడుఁజెమరించె
యెచ్చుటఁ బరాకైనాఁ డేమిసేసీనే ॥ఎవ్వ॥

మంచిమాణికాలురాలేమాట లాడీఁ జెలి యీడ
ఇంచుకంతా నెఱఁగడు యేమి సేసీనే
మంచముపైఁ బవ్వళించె మగుళ యలసి వచ్చి
యెంచినయెన్నికలాయ నేమి సేసీనే ॥ఎవ్వ॥

కలువరేకులవంటి కన్నులఁ జూచె చెలి-
నెలమిఁ దాఁ దేరిచూచీ నేమి సేసీనే
బలిమి శ్రీవేంకటాద్రిపతి యింతి నిటు గూడె
యిలఁ దనభాగ్యమాయ నేమి సేసీనే ॥ఎవ్వ॥ **347**

**పరిచయ పరిమళం :**

నాయిక తన చెలికత్తెయైన అన్నమయ్య వద్ద ఎలా వాపోతున్నదో చూడండి. ఆయన వద్ద యెవ్వరున్నారో స్వామివారినేమి చేసెనో యెట్లాగే తెలియుట? నేనెంతో దూరంనుండి వస్తున్నాను కదా! నాకెదురురాకుండా తానేమి చేయుచున్నాడే? నాపతి పాదాలను చూశావా? నిజంగా తానంతదూరం నుంచి నడచి వస్తుంటే మరి అవి లేచిగుళ్ళలా యెలా వున్నాయే? ఇలా ఇచ్చకాలు చెప్పే మొగుణ్ణి నేనేమి చెయ్యాలే? ఎన్ని చెమటలు పట్టాయో చూశావా? ఆయనకన్ని చెమటలెలావచ్చాయే? అదెవ్వతో దానిదగ్గర మాణిక్యాల్లాంటి మాటలు చెబుతాడు. ఇక్కడ మాటలేరావు. ఈయననేం చేయాలే? అలసిపోయినట్లు మంచముపై వాలిపోతాడు. ఎన్నిసార్లు ఇలా జరిగిందో చెప్పలేను. ఇప్పుడు నేనేమిచేయాలి? కలువరేకులవంటి కన్నులున్న ఆ చెలిని అదేపనిగా చూస్తాడు. ఆయననేమి చేయాలే? బలవంతుడైన ఈ శ్రీవేంకటపతి ఆ యింతిని ఇట్లు కూడినాడు. ఇది దాని భాగ్యమని సరిపెట్టుకోనా లేక యేమిసేతునో చెప్పవే.

★ **ఇచ్చకపుపతి** – తీయటిమాటలు చెప్పే మొగుడు
★ **తేరిచూచె** – తదేకంగా చూస్తాడు





సంఖ్య :42 సంపుటము : 26 పుట: 31 రాగం : నాదరామక్రియ

**22** వచ్చెను నీ రమణుఁడు వసంతమాధవుఁడై
ఇచ్చగించి చేకొనవే యెదురేఁగి నీవు ॥పల్లవి॥

పూచెఁబో నీ సెలవుల పున్నమ వెన్నెల నవ్వు
కాచెఁబో చన్నుల నిమ్మకసుఁగాయలు
రాచిలుక లెలిఁగించి రమణి నీ పలుకుల
యేచెను వసంతకాల మిదె నీ పాయమున ॥వచ్చె॥

చిందెఁబో నీమేన నట్టె చెమటల రసములు
అందెఁబో చేతులకు నీ యాయపుఁజన్ను
మందలాయఁ దుమ్మిదలు మరి నీ తురుమునను
చందపు నీ కోరికలే జాజరవసంతము ॥వచ్చె॥

పండెఁబో నీకెమ్మోవిఁ బల్లదొర లింతలోనె
నిండెఁబో చల్లనిగాలి నీ వూర్పుల
అండనె శ్రీవేంకటేశుఁ డంతలోనె నిన్నుఁ గూడె
బొండుమల్లెపానుపువో పులక జొంపములు ॥వచ్చె॥ **42**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య తాను దేవి చెలికత్తెయై అదిగోనమ్మా నీ భర్త వసంతమాధవుడై నీతో వసంతములాడుటకు వస్తున్నాడు. నీ మక్కువ చూపి నీవు ఆయనకు యెదురువెళ్ళి ఆహ్వానించవమ్మా! వసంతకాలం వచ్చేసిందని నిన్ను చూస్తేనే తెలుస్తున్నది. నీ లేత చిరునవ్వులలో వెన్నెలలు పూస్తున్నాయి. కసుగాయలైన నిమ్మలవంటి కుచములు కాయబోతున్నాయి. నీ మాటలు చిలుకలకి 'గుణపాఠాలు'. నీ ప్రాయపు వయస్సుకి కూడా వసంతకాలం వచ్చేసిందమ్మా! ఓ చెలీ! నీ శరీరమంతా స్వేజలం చిలకరించినట్లు చిందినది. మర్మంతో వుంచిన చనుగవ చేతికందబోతున్నది. తుమ్మెదలగుంపువంటి నీ కొప్పు చూచిన ఏమగనికి కోరికలు చెలరేగి వసంతకాలము గుర్తుకురాదు? కెంపువన్నెగల మోవి 'పల్లదొర' పండ్లవలె నున్నవి. నీ ఉచ్ఛ్వాస నిస్వాసలగూడా శీతలములైనవి. అక్కడే దాగివుండి నీ వేదన గమనించిన శ్రీవేంకటేశ్వరుడు చటుక్కున నిన్ను గూడినాడు. బొండుమల్లెల పానుపుకు కూడా పులకల జొంపములు (గుబురులు) వచ్చినవి.

★ **ఎలిగించి** – మాటలు నేర్పుట ★ **ఏచెను** – అతిశయించెను
★ **పల్లదొర** – ఎఱ్ఱని ఒక పండు ★ **జాజరవసంతము** – హోళీనాడు జరిగే రంగుల ఉత్సవం

సంఖ్య :55 సంపుటము : 26 పుట: 40 రాగం : సౌరాష్ట్రం

**23** ఏలే యింతేసిచేఁత యీఁతా మోఁతా
వేళ వచ్చినదాఁకా వెరగులే చాలు ॥పల్లవి॥

తప్పక చూడవెరతు తలవంచుకో వెరతు
అప్పటప్పటి సుద్దులు అవెచాలు
కప్పురము లంటనేల కాఁకలఁ బొరలనేల
తెప్పలచెమటనీఁటఁ దేలుటే చాలు ॥ఏలే॥

దగ్గరి రా నేనోప తప్పించుకొననోప
తగ్గుముగ్గలేనిపాటి తగులే చాలు
వొగ్గి తనవిడె మొల్ల వొగరొగరనవొల్ల
సిగ్గువడ్డ చెక్కుచేతిచింతలే చాలు ॥ఏలే॥

మంతనమాడ నేనొల్ల మర్మము చొక్కించనొల్ల
వంతుకు తాఁ గూడేటివరుసే చాలు
కాంతుఁడు శ్రీవేంకటాద్రి కడపరాయఁడు నేఁడు
పంతమిచ్చి నన్నుఁ గూడె భాగ్యమాయఁ జాలును ॥ఏలే॥ **55**

**పరిచయ పరిమళం :**

దేవి, తన చెలియయైన అన్నమయ్యతో ఇలా అంటున్నది. ఎందుకనే నాకు ఇన్నేసి నానా బాధలు. ఈయన చేసే యింతేసి చేతలతో? చివరి దాకా నాకీయనతో అన్నీ ఉద్విగ్నం కలిగించే చేతలే. నాకు ప్రతిక్షణమూ యేమవుతుందోననే భయమే. ఆయనను తేరిపారచూడాలన్నా లేదా తలవంచి క్రీగంట చూడాలన్నా నాకు సంకోచమే, అప్పుడప్పుడూ ఆయనపై నాకు వినవచ్చే కథలు అట్టి భయాలు రేకెత్తిస్తున్నాయి. ఎప్పుడు కర్పూర తాంబూలమిస్తాడో యెప్పుడు చిరాకు అసహనం చూపిస్తాడో వూహించలేను. కుప్పలు తెప్పలుగా చెమటలు నీట తడిసిపోతాను. అది చాలదా? ఆయనకు చేరువ అవ్వాలంటే సంకోచమే లేదా దూరందూరంగా వుందామన్నా సంకోచమే, హెచ్చుతగ్గుల్లేని సమానప్రవర్తన చూపకూడదా? తాంబూలమూ నాకు వద్దు తన కటువు ప్రవర్తనావద్దు చెక్కిట జేయిచేర్చి చింతించటమే నయము. స్వామీ! నాకు నీతో మంతనాలు వద్దు అంటాను. నీ రహస్య పద్ధతులూ వద్దు. నన్ను కూడే స్వాతంత్రమున్న తన చుట్టరికమే నాకు చాలు. ఓ కడపరాయుడా! శ్రీవేంకటేశ్వరా! పంతముతో నీవు నన్ను కూడేభాగ్యమే నాకు చాలు అంటాను.

★ **ఈతామోతా** – నానాబాధలు ★ **వెరగులే** – ఉద్విగ్నం కలిగించే పనులు
★ **తగ్గుమగ్గులేనిపాటి** – హెచ్చుతగ్గులులేని సమాన నడవడిక
★ **కడపరాయుడు** – దేవునిగడపలో వెలసిన శ్రీవేంకటేశ్వరుడు





సంఖ్య :184 సంపుటము : 26 పుట: 130 రాగం : బౌళి

**24** ఆనసుమీ్మ యిఁక నీకు నౌభళేశ
మోనమేల మాఁటలాడు మొక్కే నౌభళేశ ॥పల్లవి॥

కాయమెల్లఁ జెమరించె కడుబడలితి విదె
ఆయనాయఁ జాలుఁ గోప మౌభళేశ
ఆయములు గరఁగించి అండకు వచ్చితి నేను
మాయలేల నవ్వరాదా మాతో నౌభళేశ ॥ఆన॥

మెఱుఁగుమోవి వాడె మిక్కిలి బుసకొట్టేవు
అటిముటి మఱపేల యౌభళేశ
గుటిగా నీకొనగోరు గుబ్బలు సోఁకించితి నీ-
మఱపులు చెల్లవిఁక మాను మౌభళేశ ॥ఆన॥

కలసితి మిద్దరము కన్నులనె కెంపుదేరె
అలయకు మిఁక నీవు ఔభళేశ
తలపోఁతలు మనకు తారుకాణ లివె వచ్చె
బలిమి శ్రీవేంకటాద్రిపతి యౌభళేశ ॥ఆన॥ **184**

**పరిచయ పరిమళం :**

అహోబల నృసింహునిపై అన్నమయ్య వినిపించిన శృంగార కీర్తన ఇది. శ్రీలక్ష్మి పాడుతున్నది, ఆస్వాదించండి. ఓ ఔబళేశా! నీకు ఇక ఆనపెడుతున్నాను సుమా! నాతో మాట్లాడవయ్యా! నీకు మ్రొక్కెదను. మౌనమేలనోయీ! నీ వళ్ళంతా చెమటలతో నిండిపోయింది. ఎంతో బడలికతో కనుపించుచున్నావు. అయిందేదో అయింది. ఇకనైనా నీ కోపముచాలించు. నేను నీ ఆయములు (మర్మస్థానము) లంటి నిన్ను కరిగించెదను. నీ మహిమలు నాకెందుకయ్యా? నాతో నవ్వుతూవుంటే అదే చాలు నాకు. దివ్యకాంతితో వెలుగులు జిమ్మే దేవదేవుడవు నీవు. నీ ముక్కు పుటములలోంచి నీవు కొట్టే బుస వినిపిస్తోంది. నీవు నా మగడివైన శ్రీహరివి. ఈదనుజుని చంపే తొందరపాటులో నీకు ఇంతమరపు వచ్చిందేమయ్యా? గుటిజూచి నీ కొనగోటతో నా చనుగుబ్బలను తాకితివి కదా! ఇక మానేసేయవలసిందే. నీ మఱపులు ఇక చెల్లవు. మన ఇద్దరి కలయిక యెప్పుడో జరిగింది. నేడు శ్రీవేంకటాద్రిపతివైన ఔబళేశా! మనకు తార్కాణము లెందుకయ్యా?

★ **మోనము** – మౌనము ★ **ఆయనాయ** – అయిందేదో అయింది
★ **అటిముటి** – తొందరపాటున ★ **మఱపులు** – మతిమరపులు
★ **తారుకాణాలు** – నిరూపణలు ★ **అండకువచ్చి** – దగ్గరకు వచ్చి

సంఖ్య :65 సంపుటము : 26 పుట: 47 రాగం : సౌరాష్ట్రం

**25** ఏమాఁట కే మాఁట యేలరా
నామోము చూడవే నవ్వే నేను ॥పల్లవి॥

వద్దు వోరా వాదులు ।వొక్క-
సుద్ది చెప్పే రావే సొలయక
కొద్ది నుండదురా కోపము । అయితేఁ
గదు(ద్దు?) లేవే నిన్నుఁ గలసే నేను ॥ఏమాఁ॥

సారె నేలరా చలము । మరి
కోరికెల్లఁ జెల్లె కొంకువాసెనే
మేరమీరేవేరా మెల్లనే । తొల్లె
తేరపనులకునుఁ దెగువేలే ॥ఏమాఁ॥

చెల్లెరా నీ చేఁతలూ
అల్లనాఁడె నే నంటిఁగదె
వెల్ల విరయితి శ్రీవేంకటేశ । నిన్నుఁ
గొల్లగాఁ గూడితి కొసర నేలే ॥ఏమాఁ॥ **65**

**పరిచయ పరిమళం :**

ఇది నాయికా నాయకుల సంవాదరూపములో కొనసాగే అన్నమయ్య ఆవిష్కరణ. కొంచెం శ్రద్ధగా చదివితేకానీ అర్థంకాదు. సంవాదం మొదలుపెట్టేది నాయిక. ఏమాటకామాట నచ్చుజెబుతావు యెందుకురా? నేను నవ్వుతూ ప్రసన్నంగానే ఉన్నాను. కావాలంటే చూడవే. ★నీతో నాకు వాదములెందుకు పోరా. అదిసరేకానీ ఒక మాట చెబుతాను శ్రమ అనుకోక దగ్గరకురావే. ఓరీ నీపై కోపము కొద్దిగా రాదురా (చెప్పలేనంతవస్తుంది). అయితే అయిందిలేవే, అయినా నిన్ను కలసే తీరుతాలేవే. ★★ప్రతిసారీ నీకీ అతిశయమెందుకురా? మరి, నా కోరికలన్నీ తీరి భయాలు తొలగిపోయాయి కదే. ఓరీ! నీవు మెల్లమెల్లగా హద్దులెందుకు దాటేవురా? నాకు నీపై అనురాగం తొల్లినుంచి వున్నదే కదే, శ్రమలేని పనులకు తెగువెందుకే? ★★★నీ చేతలన్నీ చెల్లినాయిరా. నేను మొదటే చెప్పాను కదే. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవేనాడో వెల్లివిరై విలసిల్లినావు. అందుకే నేను కొల్లగా (కొల్లగొట్టినట్లు) కూడితిని కదే, ఇంకా కోరేదేముంటుందే?

★ **సొలయక** – శ్రమ అనుకోక ★ **కొంకువాసెనే** – భయాలన్నీ తొలగాయి
★ **తేరపనులకు** – శ్రమలేని పనులకు ★ **కొసరనేల** – ఇంకా కోరేదేముంది





సంఖ్య :182 సంపుటము : 26 పుట: 128 రాగం : రామక్రియ

**26** వేఁగిరమా కోనతిరువేంగళేశ । నిండెఁ
దేగపు వలపు కోనతిరువేంగళేశ ॥పల్లవి॥

కాయమెల్లఁ బులకించె గక్కన నీచేయి నాపై
వేయఁగానే కోనతిరువెంగళేశ
బాయిటనే ఇదె నా గుబ్బలపై పయ్యదకొంగు
తీయకుమీ యంత కోనతిరువెంగళేశ ॥వేఁగి॥

కొల్లున నీవు నవ్వితే కొప్పువిరులు పైరాలె
వెల్లవిరిఁ గోనతిరువెంగళేశ
చెల్లెనీకు నామేనఁ జేసినచేఁతలు తేట-
తెల్లమాయ నిదె కోనతిరువెంగళేశ ॥వేఁగి॥

భావించి కూడితి విట్టె పంతములు వచ్చె మాకు
వేవేలుఁ గోనతిరువెంగళేశ
శ్రీవేంకటాద్రి మీఁదఁ చిత్తమెల్లా గంటి నిదె
దేవుఁడ విన్నిటాఁ గోనతిరువెంగళేశ ॥వేఁగి॥ **182**

**పరిచయ పరిమళం :**

నేటి కడపకు నాలుగుమైళ్ళదూరంలోవున్న పాలకొండ కోనయే అన్నమయ్య ఈ కీర్తనలో ప్రస్తుతిస్తున్న కోనవేంగళేశుని ఆవాసమని విజ్ఞుల అభిప్రాయం. ఓ కోనవేంగళేశా! అంతతొందరగావున్నదా? నీకోసం నీ వలపు కోసం నేను దేనికైనా ప్రాణత్యాగానికైనా సిద్ధమే. నీవు చటుక్కున నీచేయి నాపై వేయగానే నా తనువెల్లా పులకించిందయ్యా! ఇదిగో బయటకు వెలువడాలని నా కొంగులోనుంచి యెదురుచూస్తున్న కుచగిరులపై చేయివేయకయ్యా! నాపైట తీయబోకయ్యా కోనవేంగళేశా! ప్రభూ! నీవు అంత పెద్దగా నవ్వితే నా కొప్పులోని విరులు వెల్లివిరై రాలినవి. నా శరీరంపై నీవు చేసిన చేతలు తేటతెల్లమై, స్పష్టంగా కనిపిస్తున్నాయి. చూశావా? ఇటువంటి చిలిపి చేష్టలు నీకే చెల్లెనయ్యా కోనవెంగళేశా! నీవు పంతముపట్టి ఇట్టె నాకు భావప్రేరణ కలిగించి కూడితివి. శ్రీవేంకటాద్రి మీద నీ చిత్తమెల్లా వున్నదేవుడవునీవు. నేను నీదాన్నేనయ్యా కోనవెంగళేశా!

★ **వేగిరమా** – తొందరా ★ **కొల్లున** – గొల్లుమని
★ **పతంము** – పట్టుదల ★ **తేగపువలపు** – త్యాగముకోరే ప్రేమ

సంఖ్య :183    సంపుటము : 26   పుట: 129    రాగం : సామంతం

**27 అప్పుడే యెగ్గులు వట్టీ నలిగితినా**
**తప్పకుండా మెదల సూత్రపు బొమ్మనా ॥పల్లవి॥**

**యేమన్న నూరకుందాన నిఁక నేమి గావలెనే**
**దోమటిఁ దా నవ్వితే నే తోడు నవ్వేదా**
**తా మాటలాడెనంటా దగ్గరి నే మాటలాడ**
**కోమలమయినపెద్ద కొండసెలనా ॥అప్పు॥**

**తలవంచుకున్నదాన తనతో నేఁ గోపమేదే**
**నిలిచి తాఁ జూచెనంటా నిక్కి చూచేదా**
**అలసి తాఁ జేయివేసె అట్టె నేనూఁజేయివేయ**
**బలిమిఁ బంతాలతోడ పందమాడేనా ॥అప్పు॥**

**ఆఁగి తనకొమరాఁక నట్టె వుండఁగ తాను**
**కాఁగిలించినప్పుడే నేఁగాఁగిలించేదా**
**చేఁగదేరఁ గూడె నిట్టె శ్రీవేంకటేశ్వరుఁడు**
**యేఁగించె (చ?) వెంట నే యింత తోడునీడనా ॥అప్పు॥ 183**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య శ్రీదేవి చెలికత్తె. ఆమెతో దేవి యేమని వాపోతున్నదో చిత్తగించండి. మొన్ననే కదే, నేను ఆయన భార్యనయింది. అప్పుడే నా తప్పులెంచుతున్నాడు. నేనెప్పుడైనా ఆయనపై అలిగానా! నేనేమైనా సూత్రముతో కదిలే బొమ్మనా ఆయన ఆడించినట్లు ఆడటానికి? ఇప్పటివరకూ ఊరకున్నదాననే. ఇంకా యేమి కావలెనే? ఆయన మొరటుగా నవ్వితే, నేనూ నవ్వాలా? తాను మాట్లాడితేనే, నేనూ దగ్గరకు వెళ్ళి మాట్లాడాలా? నేనేమన్నా కోమలంగావుండే కొండశిలనటే? ఏమనుకొంటున్నాడు నా గురించి. నేను తలవంచుకొని ఆయనకు వధువునైనదాననే. కాదన్నదెవరు? తనపై నాకు కోపమెందుకుంటుంది? ఆయన నిలిచి నన్ను చూచినప్పుడే నేనూ చూడాలా? ఆయన రతిలో ఆలసి నాపై చేయివేస్తే, నేనూ వేయాలా? బలిమితో పంతాలతో నాతోనే పందేలు కడతాడే. నేనేం చేయనే? తన కట్టుబాట్లెన్నని చెప్పను? తాను నన్ను కౌగలించినప్పుడల్లా నేనూ కౌగలించాలా? ఇంతచేశాడా, ఆ శ్రీవేంకటేశుడు నాకు తోడు నీడై నావెంటే వున్నాడు.

★ **కొమరాకలు** – కట్టుబాట్లు ★ **చేగదేర** – చేవదేరగా
★ **కొండసెలనా** – బండరాయినా ★ **దోమటి** – మొరటుగా





సంఖ్య :298    సంపుటము : 26   పుట: 209    రాగం : దేసాళం

**28 రట్టడి కడపరాయఁడిట్టెవీఁడు**
**గట్టిగా నేఁడిపుడు తగవుదేర్చరే ॥పల్లవి॥**

**చలము సాదించరాదు సముకానఁ గొంచరాదు**
**పలుమారు మాటలాడి పదరీ వీఁడు**
**మొలకచన్నులు నావి మొనలెత్తీఁదనమీఁద**
**చెలులార మాకు బుద్ధిచెప్పఁగదరే ॥రట్ట॥**

**పందెములడువరాదు పంతము విడువరాదు**
**కందువలు చూపి పొత్తుగలసీ వీఁడు**
**అందపు నాచూపు లివి అంటుకొనీఁ దనమీద**
**చందపు మావలపులు చక్కఁబెట్టరే ॥రట్ట॥**

**తమక మాఁపఁగరాదు తాలిమి చూపఁగరాదు**
**అమర గూడె శ్రీవెంకటప్పఁడు వీఁడు**
**చెమటల నామేను చేఁతసేసీఁ దనమీఁద**
**జమళి మమ్మిద్దరిని సారె మెచ్చరే ॥రట్ట॥ 298**

**పరిచయ పరిమళం :**

నాయిక తన చెలులతో తనకీ రట్టడిచేసే కడపవేంకటేశ్వరునితో తగవు వచ్చిందనీ, నేడు గట్టిగా ప్రయత్నించి అది తీర్చమని ప్రాధాయపడుతున్నది. అన్నమయ్య కూడా ఆవిడ చెలికత్తెయే. ఇతనితో మత్సరము చూపలేము, కొంచెం చేసి మాట్లాడితే ఊరకొనడు. నేను కూడా వీని రట్టడి భరించలేకే నా మొలకచన్నులతో గుచ్చాను. ఓచెలులారా! అది నా తప్పే, నన్ను మందలించండి. కానీ వానికి సర్దిచెప్పండి. ఈ కడపరాయనితో పందెము కట్టరాదు. ఒకవేళ కడితే విడువరాదు. తన సామర్థ్యం చూపి, గెలిచి, ఎట్లాగైనా పొత్తున చేరతాడు. నా అందమైన చూపులు వానిపై నాటుకొన్నమాట నిజమే. అందుచేత ఏదోవిధంగా మా వలపును చక్కబెట్టండే. నా చెలియలనుకాక, ఇంకెవరినడుగుతానే? ఇక నా తన్మయత్వము నాపలేను. పోనీ నా అంతట నేనే అడుగుదామంటే ధైర్యం చాలటంలేదు. ఈయనే వేంకటాద్రిపతియై నన్ను చేరి అనుగ్రహించాడు. మరి మా ఇరువురి జంటను మెచ్చండే!

★ **రట్టడి** – అల్లరిపెట్టేవాడు ★ **మొలక చన్నులు** – మొగ్గలవంటి కుచములు
★ **అంటుకొనీ** – నాటుకొన్నవి ★ **తేర్చు** – చక్కబెట్టు

సంఖ్య :41 సంపుటము : 26 పుట: 30 రాగం : రేవగుప్తీ

**29 ఔనేఔనే ఆయఁ బని**
**పూని వలపు మోఁపి పోయీనా తాను** ॥పల్లవి॥

**మగిడిమగిడి మమ్ముఁ జూచీనే**
**మిగులఁ దనాస నామీఁదఁ బారెనా**
**తగవూ నగవూఁ దా నెఱఁగఁడా**
**సగము నవ్వితి నేను జాణవునే తాను** ॥ఔనే॥

**మలసి మలసి మాఁటాడీనే**
**అలరి యంతలో నే నాలనైతినా**
**చలిమి బలిమీ సాదించీనా**
**యెలమి నిన్నాళ్ళదాఁకా నెందుండై తాను** ॥ఔనే॥

**చేరి చేరి చేయి వేసీనే యిట్టె**
**సారెకు ననుఁ గూడి చవిగనెనా**
**రారె వావిలిపాటి రాఘవుడు**
**ఈ రీతి శ్రీవేంకటేశుడే తాను** ॥ఔనే॥

**పరిచయ పరిమళం :**

ఇది అన్నమయ్య భావతరంగజనితమైన అద్భుత సృష్టి. తన మేడపైనుంచి శ్రీరామచంద్రుని జనకరాజ సభకు గురువు విశ్వామిత్రునితో వస్తుంటే తన చెలులతోపాటు ఒక క్షణం చూచింది సీత. అదే సమయంలో తన వదనం పైకెత్తిన రాఘవుడూ ఆమెను లిప్తకాలం చూశాడు. వారు పురాణ దంపతులే కదా! ఆ లిప్తకాలంలోనే దేవి ఆ రఘువీరునికి అంకితమైనది. ఆమె తన చెలియతో ఏమంటున్నదంటే... ఔనేఔనే నేను అనుకొన్న పని అయింది లేవే. ఆ రాకుమారుడు తాను ఇంతలోనే నాలో వలపు మోపి వెడలిపోయినాడే. మమ్ము ఆతడు మరలి మరలి చూచినాడే. తనపై ఆశ నామీద పారినదే. అయినా నాకు తెలియక అడుగుతాను తగవూ నగవూలాంటి వతను యెరగనివాడా యేమి? ముందు నేనే సగము నవ్వితినే. తాను జాణ కావున నవ్వనేలేదు. మలసి మలసి (కదలిపోతూ), నతో మాట్లాడినట్లు భ్రమ కలిగిందే. అలరి అంతలోనే, నేనాతని ఆలనైతినే (అర్ధాంగినైపోయానే). తాను ఇన్నాళ్ళూ యెక్కడున్నాడే, నేడు నన్ను చెలిమితోనూ బలిమితోనూ సాధించినాడే. ఈతడు నన్నుచేరి నాపై చేయివేసేనా? నన్ను కూడునా? ఇటురారే. అన్నట్లు ఈయనే వావిలిపాటి వీరరాఘవుడటమ్మా! ఈ విధంగా తిరుమల వేంకటాద్రివాసుడూ ఈయనేనుటమ్మా!

★ **వలపుమోపి** – ప్రేమ అంకురింపజేసి ★ **ఆలనైతి** – భార్యనైతిని





సంఖ్య :126 సంపుటము : 26 పుట: 89 రాగం : కాంబోది

**30 ఒయ్యనే దగ్గరరమ్మవూడిగపు సతులు**
**అయ్యో విసరరమ్మ అలశున్నవాడు** ॥పల్లవి॥

**మెఱయుఁజెమటలతో మెత్తని పరపు మీఁద**
**వొఱిగి పవ్వళించినాఁ డొత్తగిలి**
**జఱయుమాటలతోడ చాఁచిన పాదములతో**
**గుఱియైన సతులతో గోవిందరాజు** ॥ఒయ్య॥

**తెల్లని కన్నులతోడ తేనె గారేమోవితోడ**
**చెల్లుబడిఁ బవ్వళించె శేషునిమీఁద**
**వెల్లిగొను వూర్పులతో వెన్నెల నవ్వులతో**
**కొల్లవలపులు చల్లీ గోవిందరాజు** ॥ఒయ్య॥

**బొడ్డు పూప కొడుకుతో పుక్కిటి వీడెము తోడ**
**వొడ్డిన రతులలోన నోలలాడీని**
**వెడ్డువెట్టి కూడెను శ్రీవేంకటేశుఁ డింతులను**
**గొడ్డువోని వరముల గోవిందరాజు** ॥ఒయ్య॥ **126**

**పరిచయ పరిమళం :**

గోవిందరాజస్వామి అలిసిపోయి నిదురించుచున్నాడు. అన్నమయ్య మధురకీర్తన వినిపిస్తున్నారు. ఒయ్యారముగా స్వామికి వూడిగము చేసే సతులారా! అయ్యో! కాస్త గట్టిగా విసరండమ్మా! ఆయనకి గాలి వచ్చేటట్లు చూడండి. ఈ గోవిందరాజస్వామి ఎలావున్నాడో చూడండి. మెత్తని పరుపుపై ఒక పక్కకు ఒత్తిగిలపరుండి చాచిన తన పాదములను ముద్దుసతులైన శ్రీదేవి భూదేవి ఒత్తుతుంటే చెమటలతో మెరయుచున్న కాయముతో శోభలీనుతున్నాడు. ఆయన మాటలలో నిందలు దొర్లుతూనే వుంటాయి. ఆయన కన్నులు తెల్లగా విప్పారివున్నాయి. ఆయన అధరాలు తేనెలను వూరిస్తున్నాయి. తనకు చెల్లుబడియైన శేషునిపై పవ్వళించియున్నాడు. ఆయన ఉచ్ఛ్వాసనిస్వాసములు బిగ్గరగా వెలువడుచున్నవి. ఆయన నవ్వులు వెన్నెల వెదజల్లుతున్నాయి. ఈ గోవిందరాజస్వామి కొల్లగొట్టిన వలపులను వెదజల్లుతున్నాడు. బొడ్డులోని కమలమునుండి ఉద్భవించిన తన కొడుకు చతుర్ముఖ బ్రహ్మతో ఆయన విరాజమానమైనాడు. స్థూలమైన రతులలో ఓలలాడే ఈ స్వామియే శ్రీవేంకటేశుడై ఇంతులను పొంది, గొడ్డుపోని వరాలను కుమ్మరించాడు.

★ **వెడ్డువెట్టి** – బుజ్జగించి ★ **గొడ్డువోని** – వ్యర్థముకాని
★ **జఱయుమాటలు** – నిందలు దొర్లే మాటలతో ★ **గుఱియైన** – లక్ష్యమైన

సంఖ్య :64 సంపుటము : 26 పుట: 46 రాగం : ఆహిరి

**31 పచ్చిసేసి వెచ్చిసేసి పాయ మింత నలcచనేలా**
**మచ్చికెల్లc జూతుగాని మాపటంత రారా ॥పల్లవి॥**

**మాcచనోలిచెన్నుcడా మాటలాడి మమ్మునింత**
**రేcచనేల వుండవోయి రేలుcబగళ్లును**
**దాcచలేము మోహమును తమక మింత గలిగితేను**
**యేcచనేల వీదివీది యింటి కింక రారా ॥పచ్చి॥**

**వేణునాదమోహనా వెలిగోరు మోcపి మోcపి**
**జాణతనము లాడనేల చక్కనుండరా**
**ప్రాణ మింత కోపదూను పలుకులేమి గలిగినాను**
**వీణెలోనె తెలుతుగాని వెంటవెంట రారా ॥పచ్చి॥**

**నందగోపనందనా నవ్వినవ్వి మమ్ము నేడు**
**కందువందు చేయివేసి కరcగcజేసితి-**
**విందుగూడినట్టు శ్రీవేంకటాద్రినుండి వచ్చి**
**దిందుపడితి మాcచనోల దినదినంబు రారా ॥పచ్చి॥ 64**

**పరిచయ పరిమళం :**

తాళ్ళపాక సమీపగ్రామమైన మాచనవోలులో వెలసిన చెన్నకేశవ స్వామిపై అన్నమయ్య చెప్పిన మధురకీర్తననాలకించండి. మమ్ము విపరీతంగా, ఆరడిపెట్టి వేదన కలిగించడం నీకు భావ్యమేనా? మమ్మెందుకు పీడిస్తావు? దీని బదులు, మాపటంత (రాత్రి అయ్యాక) ఒకసారి రారాదా? మా మచ్చిక (మోహాతిశయం) చూద్దువుగాని. ఓ మాచనవోలి చెన్నుడా! మమ్మల్ని మాటలతో ఇంత రేకెత్తించే బదులు నీవు రేబవళ్ళూ మాతోవుంటే యేమైనా కాదంటామా? మాకు ఇంతతమకం కలిగితే, మేము మా మోహం దాచు కోగలమా? ఇలా రెచ్చిపోయే బదులు నీవు ప్రతి వీధిలోనూ మా యింటింటికి వస్తే కాదన్నామా? వెలిగోడులో వెలసిన చెన్నుడిగా నీవు వేణుగానలోలుడవు కదా! ఈ జాణతనాలు చూపే బదులు నీవు కూడా ఆయనలాగే చక్కగా వుండరాదా? మా ప్రాణాలిలా తీయకపోతే వీణావాదనా నైపుణ్యంలో తేల్చుకోవచ్చును కదా! స్వామీ! నీవు నందగోపుని నందనుడవు కదా! దొరబిడ్డవు. మా మర్మస్థానముల స్పృశించి మమ్మల్ని నవ్వించి కలవరబెట్ట తగునా? శ్రీవేంకటాద్రిపై రమ్యముగా వెలసి దిందుపడితివి (అందరి అజ్ఞానమును తొలగిస్తున్నావు కదా! ఆ మాచనవోలునుంచి తిరుమలకు ప్రతిరోజూ రారాదా?

★ **పచ్చిసేసి**-ఆఅడిపెట్టి ★ **నలచనేలా**-పీడించుటెందుకు ★ **తెలుతుగాని**-తెలుపుదువుగాని





సంఖ్య :63 సంపుటము : 26 పుట: 45 రాగం : దేసాళం

**32 నీవే తెలుసుకొమ్మి నీ వోపిక**
**యీవల నేcగాదనేనా యింతకోపcగలవా ॥పల్లవి॥**

**చిగురాకుc గెమ్మావి చెంచువారము । నీకు**
**వొగరై తోcచునేమె వొద్దురా నేము**
**సొగసులేళ్లవంటిచూపులు మావి । పెక్కు-**
**వగలై మిన్నులc బారీ వంచుకొనcగలవా ॥నీవే॥**

**సరవి కొండలవంటి చన్నులనేము । నీ-**
**వురమెల్ల నొత్తుcజేసు నొద్దురా నేము**
**కరికుంభములవంటి కటితటము యీ-**
**అరిది నడవివారి నాపc గలవా ॥నీవే॥**

**చిల్లెరతీగెలవంటి చేతులు మావి నీ-**
**వొళ్లెల్ల నరదుcజేసు వొద్దురా నేము**
**మెల్లనే శ్రీవేంకటేశ మేకొలిపి కూడితివి**
**బల్లిదుcడ వౌదుగాక పంతమాడcగలవా ॥నీవే॥ 63**

**పరిచయ పరిమళం :**

తనతో సరసంగామాట్లాడి తన వలపుకు చిక్కిన శ్రీవేంకటేశునితో ఆ చెంచిత యేమి అంటున్నదో అన్నమయ్య మధుర కీర్తనలో వినండి. నీ వోపిక యెంతటిదో నేనెట్లా చెప్పగలను. నీవే తెలుసుకొనే ప్రయత్నం చెయ్యవయ్యా! ఇప్పుడిక నేను కాదంటే నీవు తట్టుకోగలవా? మేము చిగురాకువంటి అరుణాధరములుగల చెంచువారము. మా ప్రవర్తన నీకు తలబిరుసువారమనిపిస్తుంది. మావిలేళ్ళవంటి సొగసైన చూపులు వగలుపోతూ మోహపరచటం మాకు రాదు. మావికొండలవలె పెద్దపెద్ద వక్షోజములేమరి. మమ్మల్ని నీవాలింగనం చేసికొంటే నీవురము బాగా వొత్తుకుపోతుంది. ఒద్దురా, నీకు సరిపడదు. కరికుంభస్థలమువలె జూపట్టు కటి ప్రదేశము గల అడవి చెంచువారమయ్యా! మా ఉద్ధతినాపగలవా? అందుకే వద్దంటున్నాను. ఓ నాయుడా! మావి చిల్లర పాదుతీగలవంటి చేతులు. చూడటానికి కోమలంగావున్నా బలిష్టమైనవి. వాటిపట్టు నిన్ను బాధిస్తుంది. అయినా నా మాట వినక ఓ శ్రీవేంకటేశా! నా కోర్కెలను మేల్కొలిపికూడితివి. నీవు శూరుడవు. ఒద్దుస్వామీ! నీతో నేను పంతమాడగలనా?

★ **సరవి** – అందమైన ★ **ఓపగలవా** – తట్టుకోగలవా
★ **అరదుజేసు** – బాధిస్తుంది ★ **బల్లిదుడు** – శూరుడు

సంఖ్య :299 సంపుటము : 26 పుట: 210 రాగం : సామంతం

**33 కోరికె లీడేరె నేఁడు కోనేటిరాయ । ఇట్టె**
**కూరిముల వూటుకూరికోనేటిరాయ ॥పల్లవి॥**

**కుమ్మరించేవు సిగ్గులు కోనేటిరాయ । యీ-**
**కొమ్మలెల్లఁ జూడఁగాను కోనేటిరాయ**
**కొమ్ముమంటి కొనగోరఁ గోనేటిరాయ । మేను**
**కుమ్మెలుగా నొత్తకుమీ కోనేటిరాయ ॥కోరి॥**

**కొప్పుగడు వెడజారె కోనేటిరాయ । నిండా**
**గుప్పేవు సెలవినవ్వు కోనేటిరాయా**
**కుప్పళింపుఁ జెమటలగోనేటిరాయ । యెంత**
**గొప్పవాఁడవయ్య నీవు కోనేటిరాయ ॥కోరి॥**

**కొండికపాయ మమరెఁ గోనేటిరాయ । పైఁడి-**
**గొండెలపచ్చడముతో గోనేటిరాయ**
**అండనే శ్రీవేంకటాద్రి నలరి నన్నేలితివి**
**కొండలలో నెలకొన్న కోనేటిరాయ ॥కోరి॥ 299**

**పరిచయ పరిమళం :**

వూటుకూరిలో వెలసిన దైవమే కోనేటిరాయడు. ఆయన కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు. కొండలంతవరములు గుప్పెడివాడు. అయితే ఈ తిరుమల రాయడు కూడా కొండలలో నెలకొన్న, కోనేరు (స్వామి పుష్కరిణి) వద్ద వెలిశాడు కాబట్టి, ఈయనా కోనేటిరాయడే అనే భావనలో ఆ కీర్తన పాడి ధన్యులయ్యారు అన్నమయ్య. ఇది నా భావన. ఓ కోనేటిరాయడా! నేడు నా కోరికలన్నీ సఫలములైనవి. ఓ వూటుకూరి కోనేటిరాయుడా! మాకూరిమి సిద్ధించినది. ఓ కోనేటిరాయుడా! నేడు మా సిగ్గులన్నీ కుమ్మరించినట్లు నీవు మా కొమ్మలనందరినీ చూచినావు. వాడియైన నీ కొనగోటితో మా మేనిపై నొక్కులు జేసినావు. ఓ కోనేటిరాయుడా! పెద్దదైన నీ కొప్పు బాగా జారిపోయింది. నిండైన నీ చిరునవ్వుల గుప్పించుచున్నావు. కుప్పలుతెప్పలుగా, చెమటలుకారిపోతున్నాయి. అయినా నీవెంతో గొప్పవాడివి, రసికుడవు. ఓ కోనేటిరాయుడా! నీకు కోడెప్రాయము అమరియున్నది. నీవు బంగారు వన్నెగల పీతాంబరుడవు. శ్రీవేంకటాద్రిపై నీవు నన్నేలితివి.

★ **కుప్పళింపు** – ఎగిరిపడుతున్న ★ **కొండికపాయపు** – పిన్న వయసుగల
★ **పైడిగొండెలపచ్చడము** – గొప్ప పీతాంబరము





సంఖ్య :300 సంపుటము : 26 పుట: 211 రాగం : కాంబోది

**34 ఏమి సేఇంచుకొంటివి యేమందు నిన్ను**
**కామించినవారికెల్లా కాఁతాళము వుట్టదా ॥పల్లవి॥**

**చీటి వ్రాసి యెవ్వతే నీ శిరసునఁ జెక్కినది**
**చాటువగా నేనది చదువుకొంటి**
**తాటించి నీ మోవెల్లా తన యెంగిలేయట**
**ఆఁటది యీ మాట వింటే అంట సిగ్గు గాదా ॥ఏమి॥**

**కోరి ముద్దుటుంగరము కొంగుతోఁ గట్టినది**
**తేరిచూచి ఇది నేఁ దెలుసుకొంటి**
**బోరున నీమేను తానే భోగించినదనియేమో**
**బారచాఁచె నీకాఁగిలిపైఁ బంతము గాదా ॥ఏమి॥**

**పూవులదండ నీ మెడఁ బూఁచి సింగారించినది**
**ఎవేంకటేశుఁడ నేను భావించుకొంటి**
**నీ వొళ్లెల్లాఁ దనకే నిర్మాల్యమనుటిది**
**యీవేళ నన్నేలితివి యిఁకఁ గొత్తగాదా ॥ఏమి॥ 300**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య, స్వామి తనకు కావాలనుకొన్న అన్నులమిన్నగా భావించుకొని, యేమంటున్నదో వినండి. నిన్ను నేనేమనగలను స్వామీ? ఏమిసేవ నాతో చేయించుకొన్నావు? నీ ప్రవర్తన చూస్తే నిన్ను కోరుకొన్న వారికి కోపం రాకపోతే యేమి వస్తుంది? ఎవత్తో చీటీపై యేదోవ్రాసి నీ తలకు అంటించింది. చాటుగా నేను ఆ చీటీ చదివాను కూడా. నీ అధరమునందంతా దాని యెంగిలేనట. ఈ మాట విన్న యే ఆడదానికైనా నిన్ను తాకటానికి కూడా సిగ్గనిపించదా? ఎవత్తో దాని ముద్దుటుంగరము, నీ ఉత్తరీయపు కొంగుకు కట్టింది. అది నిదానంగా చూస్తే యెవ్వరికైనా కనబడుతుంది. ఇచ్చవచ్చినట్లు యెవ్వతో నీతో భోగించిందని ఏ ఆడదానికైనా అర్ధమవుతుంది. చేతులడ్డంగా చాచి ఎవత్తో పంతంతో నిన్ను కౌగలిస్తే నేను సహించాలా? అయినా ఓ శ్రీవేంకటేశ్వరా! నా భావనల్లో నీవే నాకు పూదండవేసి వరించావు. నిర్మాల్యముతో కూడినదైనా, నా తనువు నీదే. అపూర్వంగా నీవు నన్ను యేలుకొన్నావు.

★ **కాతాళము** – కోపము ★ **కామించినవారికి** – కోరుకొన్నవారికి
★ **తాటించి** – కొట్టినట్లు ★ **బారచాచు** – అడ్డముగా చాచి
★ **కొత్తగాదా** – అపూర్వము కాదా ★ **అంటసిగ్గు** – తాకుటకు సిగ్గు

సంఖ్య :56 సంపుటము : 26 పుట: 40 రాగం : శ్రీరాగం

**35** **ఏల నన్ను వేఁడుకొనే విటు నీవే నేఁ గాన**
**తీలుపడనేర నేను తెలివేకాని** ॥పల్లవి॥

**నగి నగి తిట్టినాను నాతో నలిగినాను**
**వెగటులేదు నాకు వేడుకేకాని**
**మొగిసి మాటలాడినాను మోనాన నీవుండినాను**
**జగడములేదు నాకు చనవే కాని** ॥ఏల॥

**కన్నులఁ గొసరినాను కాఁకల విసరినాను**
**చిన్నఁబోదు నామోము చెలువే కాని**
**సన్నలనే తిట్టినాను చాయలనన్నాడినాను**
**యెన్న నెగ్గుగాదు నాకు నితవే కాని** ॥ఏల॥

**పైకొనక మానినాను పరాకు సేసినాను**
**నాకెందు నెరవు లేదు నలుపేకాని**
**శ్రీకాంత నేను నీవు శ్రీవేంకటేశుఁడవు**
**యేకమైతి మెదురేది యిచ్చకమే కాని** ॥ఏల॥ **56**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరసకీర్తనలో దేవి స్వామితో కరాఖండిగా యేమంటున్నదంటే, మన కలయికకు యెదురేలేదుస్వామీ! మన అనురాగమే కనిపిస్తుంది కానీ మరోటి నా దృష్టికి రాదు. నీవు నన్ను వేడుకోవటం దేనికి ప్రభూ? నీవే నేనుగానా? నేను నీ గురించి యెన్ని పుకార్లు విన్నా దుర్బలను కాను. నాకు జ్ఞానం వున్నది. (స్వామి పరమాత్మ, దేవి ఆత్మ అని ఆమె గ్రహించింది). ప్రభూ! నీవు నవ్వుతూ తిట్టినా, పీడించినా నాకు వినోదమే కాని ద్వేషభావం లేదు. పూనుకొని నీవు మాట్లాడినా, లేక మౌనంగా వున్నా నాకు నీవంటే ఇష్టమేకాని మనమధ్య పోట్లాట రాదు, రాబోదు. స్వామీ! నీ కన్నులలో నాపై ఆపేక్ష చూపించినా, లేక మండిపడినా నా మొగము ప్రసన్నంగా వుంటుందేకాని, చిన్నబోదు. సన్నగా తిట్టినా ఛాయగా మాటలనినా నాకు హితమే కానీ చెడుకాదు. నీవేం చేసినా నీ ఇష్టం. నాథా! నీవు నా పొందుకోరినా లేక పరాకు చిత్తగించినా నాకు ఒప్పుగానే తోస్తుంది. తప్పు అనిపించదు. ఎందుకో తెలుసా ప్రభూ! నేను శ్రీకాంతను, నీవు శ్రీవేంకటేశ్వరుడవు.

★ **తీలుపడు** – దుర్బలులగుట ★ **కొసరు** – ఆసక్తి చూపు
★ **నలువు** – ఒప్పు ★ **నెరవు** – తప్పు





సంఖ్య :112 సంపుటము : 26 పుట: 80 రాగం : దేవగాంధారి

**36** **హరి నిన్నుఁ బిలిచీని అదిగో వమ్మా**
**తెరమఱఁ గిఁకనేల తియ్యవమ్మా** ॥పల్లవి॥

**చిత్తరు పతిమవంటి చెలియా**
**యిత్తల పతికి విడె మియ్యవమ్మా**
**కొత్తమెఱుఁగుఁ బోలిన కోమలి**
**మొత్తమి కూరిమిపతిమోము చూడవమ్మా** ॥హరి॥

**బంగారుబొమ్మవంటి పడఁతి**
**అంగవించి పతితో మాఁటాడవమ్మా**
**అంగజు శరమువంటి అతివె । నీకు**
**నంగతన మిది యాల నవ్వవమ్మా** ॥హరి॥

**చంచుల చిగురువంటి జవ్వని**
**కొంచక శ్రీవేంకటేశుఁ గూడితివమ్మా**
**మించుఁదమ్మిలోని యలమేలుమంగా**
**యెంచి యిద్దరును మమ్ము నేలరమ్మా** ॥హరి॥ **112**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య శ్రీపతిని అలమేల్మంగను కీర్తిస్తూ ఇద్దరూ మమ్ము పరిపాలించండమ్మా అని దేవిని వేడుకొంటున్నారు. ఓ అలివేలుమంగమ్మా! అదిగో హరి నిన్ను పిలుస్తున్నాడమ్మా! ఇంకా నీ మేలిముసుగుతో పనేమిటి? తీసివేయవమ్మా! చిత్రపటమువలె పొందికగానున్న ఓ దేవీ! ఇప్పుడు నీ పతికి ఆహ్వాన తాంబూలమందించవమ్మా! నూతనమైన బంగారపు శరీరకాంతిగల ఓ తల్లీ! కోమలమైన నీకు కోమలి అన్నపేరు తగినది. ప్రేమనంతా చూపుతూ నీకిష్టడైన పతిమోమును చూడవమ్మా! బంగారు బొమ్మవంటి పడతీ! దగ్గరయై నీ పతితో మాట్లాడవమ్మా! మన్మథుని బాణమువంటి భామినీ! నీకు యీనంగనాచితనమేలనమ్మా? ఇకనైనా నవ్వవమ్మా! లేచిగురువంటి జవ్వనీ! ఏమాత్రమూ సంకోచించక శ్రీవేంకటేశునికూడితివి. నీవు మేలైన పద్మమున నెలకొనియుండు మా అలమేలుమంగమ్మవు. మీ ఇద్దరూ యెల్లప్పుడు మమ్ముయెంచి కరుణించండి తల్లీ!

★ **చంచుల చిగురు** – మెఱయు లేచిగురు ★ **మొత్తమికూరిమి** – తరచైన ప్రేమ
★ **నంగతనము** – అన్నీ తెలిసినా ఏమీ తెలియనట్లుండుట ★ **అంగవించు** – దగ్గరయగు

సంఖ్య :280   సంపుటము : 26   పుట: 197   రాగం : నాదరామక్రియ

**37** బుద్ధి చెప్పవయ్య నేను పూఁచి వినేను
గద్దరిఁ గా నెపుడు సిగ్గరిదాన నేను ॥పల్లవి॥

ఆ మగువకు నీవు అన్నిటా మోహింతు వంటి
యేమనవలెను నానతీవయ్యా
గామిడిదానఁ గాను కతలు నీవే నేరుపు
కామించి వచ్చిన వాసికత్తెనే నేను ॥బుద్ధి॥

చాయల నాపెకు నీకు సరిఁ బొందుసేసితి
సేయవలసినపని చెప్పవయ్యా
రాయడించేదానఁ గాను రచ్చలఁబెట్టకు నీవే
పాయముతోడిమానాపతిదాన నేను ॥బుద్ధి॥

కూడా నీతోనున్నాపెకూటములు చూచితి
చూడవలసిన వింకాఁ జూపించవయ్యా
వోడక భూపతిచెర్వువొద్ది శ్రీవేంకటేశ్వర
జాడ నన్నేలితివి యిచ్చకురాల నేను ॥బుద్ధి॥ **280**

**పరిచయ పరిమళం :**

"ప్రభూ! నీవు నాకు ఒకింత మంచి చెప్పవయ్యా. నేను వినుటకు సిద్ధముగానే వున్నాను లేవయ్యా! నేను సిగ్గరిదాననేకానీ గద్దరిదాననుగానయ్యా"! అని అంటున్నది వేరెవరో కాదు, భూపతి చెరువు దేవుని ప్రియురాలైన అన్నమయ్య. ఇంకా ఇలా అంటున్నదామె. స్వామీ! నీవు నిస్సిగ్గుగా, ఆవనితను మోహించితినంటున్నావు. నిన్నేమనెదనో నీవే ఆనతీయవయ్యా! కథలు చెప్పటం నీకు వచ్చిన విద్యయేకాని నేను మాత్రం గామిడిదానను (గయ్యాళిని) కానయ్యా! నేను కేవలం నీవే కావాలనివచ్చిన ప్రముఖురాలినేకాని చిల్లరదానను కాను. మాపటివేళ నీవామెతో సమభోగముపొందికూడా వుండవచ్చును. ఇందునాకేమి కొరత? నేను చేయవలసినదేమన్నావుంటే నాతో చెప్పవచ్చును. వలచినవారిని బాధించి రచ్చచేయటం నీ నేర్పరితనం. నేను మాత్రం, ప్రాయములోనున్న మానాపతిదాననే (యౌవనంలోవున్న మర్యాదస్తురాలనే స్వామీ!) నీతో కూడిన ఆమె కూటములు అనేకం చూచాను. ఇంకా నేను చూచి తరించాల్సినదేమన్నా వుంటే చూపించు. నీవు భూపతిచెర్వు శ్రీవేంకటేశ్వరుడవు. నేను మాత్రం యెప్పటికీ నీ యిచ్చకురాలనే ప్రభూ!

★ **గద్దరి** – పొగరుబోతు ★ **రాయడించు** – బాధించు ★ **ఇచ్చకురాలు** – ప్రియవాదిని





సంఖ్య :278   సంపుటము : 26   పుట: 195   రాగం : రామక్రియ

**38** చూడఁ బిన్నవాఁడుగాని సుద్దులైతే వేవేలు
వోడక వింతలు సేసీ వుద్దగిరి కృష్ణుఁడు ॥పల్లవి॥

సెలవినవ్వులతోడ చెలులమోములు చూచి
పలికీ ముద్దుమాటల(లు?) బాలకృష్ణుడు
చలపాదిగొల్లెతల చనుఁగొండలతోడుత
తులఁదూచీఁ వలపులు దొంగాడుఁ గృష్ణుఁడు ॥చూడ॥

తప్పుటడుగులతోడ తరుణలకెల్లాను
చిప్పిల ముద్దులువెట్టీ చెన్నకృష్ణుఁడు
ముప్పిరియాసలఁ బొంది ముదితలవొడిలోన
వొప్పుగఁజేతులు చూఁచీ నుద్దగిరి కృష్ణుడు ॥చూడ॥

గట్టివెన్నముద్దతోడ కాంతలను మరగించి
పట్టపగలేకూడీ గోపాలకృష్ణుడు
ఇట్టె విజనగరాన యెమ్మెలెల్లాఁ జూపీని
చిట్టకపుఁ జేఁతల శ్రీవేంకటకృష్ణుడు ॥చూడ॥

**పరిచయ పరిమళం :**

ఈ కీర్తనలో అన్నమయ్య ఉద్దగిరి కృష్ణుడే విజయనగరంలోని గోపాలకృష్ణుడు అనటంవల్ల ఈ ఉద్దగిరి అసలుకి ఉదయగిరియని భావించారు. కాదు ఇది నెల్లూరు జిల్లాలో ఉదయగిరి దగ్గరవున్న ఉద్దగిరి అని కొందరి వాదన. ఏదియేమైనా నేను ఈ కీర్తన చూశాక ఇది నెల్లూరు ఉద్దగిరి అని భావిస్తున్నాను. ఇది చదవండి. చూచుటకు చిన్నవాడేకానీ వీడికథలే అనంతాలు. ఈ ఉద్దగిరి కృష్ణుడు చేసిన చేతలు మాత్రం వింతలే. ఈ బాలకృష్ణుడు ముద్దు మాటలు పలుకుతూ చెలుల మొగములలోకి చూస్తాడు. గర్వంచూపే గొల్లెతలైతే వారిని, వలపుల ముగ్గులోకి దింపి, కైవశం చేసికొని తన సాంగత్యం అందించే దొంగాట కృష్ణుడీతడే. బాల్యక్రీడలో, తప్పటడుగులువేస్తూ తరుణులకు ముద్దులరుచి చూపి తప్పటడుగులు వేస్తే మానం పోగొట్టుకుంటారని చూపినవాడు ఈ అందాలకృష్ణుడు. ఆశ అధికమైన ముదితలు తమ ఒడిలో చోటిచ్చి ఓడిపోతారని చూపినాడు. కాంతలను తన ఆకర్షణతో మరగించి పట్టపగలే వారిని నగ్నముచేసి, గట్టి వెన్నముద్ద కరిగిపోయినట్లు శీలము కూడా నీరైపోతుందని చూపినాడు. ఈయనే విజయనగరపు గోపాలకృష్ణుడు. ఈతడే తిరుమలవేంకట కృష్ణుడు కూడా.

★ **చిట్టకపు** – శృంగారరాయడు ★ **ముప్పిరి ఆసలు** – మూడురెట్లైన ఆశ

సంఖ్య :282 సంపుటము : 26 పుట: 198 రాగం : సాళంగం

**39 ఏమిసేసు నాతఁడు యెందరికని వోపును**
**నేమములు నేర్పకురే నెలఁతలాల** ॥పల్లవి॥

**అక్కడనుండి వచ్చి ఆ పరాకైవున్నాఁడేమో**
**కక్కసించకురే వో కాంతలాల**
**నెక్కొని యలసి వచ్చి నిద్దురతో నున్నాడేమో**
**పక్కన లేపకురే పడఁతులాల** ॥ఏమి॥

**వలపు చవుల సోఁకి వడిఁ జొక్కివున్నాఁడేమో**
**బలిమి సేయకురే భామలాల**
**యెలమి నాపెకు బాస ఇచ్చి వచ్చినాఁడేమో**
**చలము సాదింకురే జలజాక్షులాల** ॥లల॥

**తగిలి వారి రూపులు తలఁచుకొనీనో యేమో**
**అగడు సేయకురే యంగనలాల**
**జిగి శ్రీవేంకటేశుఁడు సింగారవనములోన**
**నగి కూడెఁ గోనేటిలో నన్ను నింతులాల** ॥ఏమి॥

**పరిచయ పరిమళం :**

తన పతియైన వేంకటపతియే తమపతికూడా అని మొండిపట్టుపట్టిన తన పడతులతో అన్నమయ్యకూడా స్వామిపై జాలికలిగి యేమంటున్నారో వినండి. మీరు ఈనాడు స్వామికి కొంగ్రొత్త నియమాలను నేర్పకండమ్మా! ఆతడు యెందరికని ఒప్పు చేయగలడు? మీరెందరు యేమిచేసినా ఆయన యెప్పటికీ శ్రీకాంతుడే. ఓ నెలతలారా! నామాట వినండి. పోనీ వలపు పారవశ్యముజేత ఒకవేళ సొక్కివున్నాడేమో? కావున ఓ భామలారా! ఆయనను బలవంతం చేయకండి. పోనీ ఒకవేళ వేరొకామెకు వాగ్దానం చేశాడో యేమో? ఓ జలజాక్షులారా! ఎంత అవివేకులు? మీ మత్సరం ఆయనపై చూపవచ్చునా? ఓ అంగనలారా! ఆయనను చిన్నబుచ్చకండమ్మా! శృంగారవనములోకి ప్రవేశించిన ఆ శ్రీవేంకటేశ్వరుని, వెలుగులు చిమ్మే నన్ను కోనేటిలో అలరించడానికి చేరాడు. ఇంతులారా! ఆయన యెప్పటికీ ఇందిరారమణుడే.

★ **కక్కసించకురే** – బాధించకండే ★ **పరాకై** – పరవశుడై
★ **అగడుసేయు** – చిన్నపుచ్చు ★ **నగి** – నవ్వుతూ





సంఖ్య :281 సంపుటము : 26 పుట: 197 రాగం : శుద్ధవసంతం

**40 చెప్పవయ్య నాతోను చెలి నీకెంత చుట్టమో**
**తెప్పల భూపతిచెర్వు తిరువెంగళప్పఁడా** ॥పల్లవి॥

**ముంచి తేనెలుగారేమోవినే మాటలాడీని**
**అంచగమన యెవ్వతో అదె నీతోను**
**చంచుల కనుఁదమ్ముల సారె సన్నలు సేసీని**
**యెంచరానివేడుకతో యిదె నీతోను** ॥చెప్ప॥

**చిప్పిలఁగ నోరూర సెలవుల నవ్వు నవ్వీ**
**అప్పటిని నే దెవ్వతో అదె నీతోను**
**వొప్పుగ శిరసు వంచి వూరకే సిగ్గులువడీ**
**యిప్పు డిందరుఁ జూడఁగ యిదె నీతోను** ॥చెప్ప॥

**మొగిఁ జిమ్మిరేఁగ చన్నుమొనల మోహము చల్లీ**
**అగడుగ నెవ్వతో అదె నీతోను**
**జిగి నన్నుఁ గూడితివి శ్రీవేంకటేశుఁడ**
**చిగురించ మొక్కి మెచ్చీ నిదె నీతోను** ॥చెప్ప॥**281**

**పరిచయ పరిమళం :**

భూపతిచెర్వు అనే గ్రామంలో వెలసిన తిరువేంగళప్పనిపై సరసశృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. భూపతి చెర్వులో తెప్పోత్సవం జరుపుకొనే ఓ తిరువేంకగళప్పడా! ఆ చెలి నీకెంత ఆప్తురాలయిందో నాతో చెప్పవయ్యా! హంసగమనయైన యెవ్వతో తేనేలుజాలువారునట్లు నీతోమాట్లాడింది. చంచలమైన పద్మనయనంబులుగల ఒక చంచలాక్షి యేవేవో సైగలు చేస్తూ చెప్పలేనంత వేడుక పొందుతున్నది. నేడు వేరొకతె నీకు సర్వస్వం అర్పించి, అదిగో నీతో మధురమైన మధురదరహాసవదనయై నీనోరూరేట్లుగా చేసినది. అందరి యెదుట అవనితవదనయై నేడు నీ యెదుట యెంత సిగ్గులు చిందిస్తున్నదో యిదే నీవే చూడవయ్యా! తిట్లు అలవాటున్న మరొకతె నీకు సంచలనం కలిగేట్లు స్తనాగ్రములను తాకించాలనుకొన్నది. వారి తిప్పలు వారివే. కానీ నీవు నా మగనివి. ఓ శ్రీవేంకటేశ్వరా! నిత్యమూ నీకు మొక్కేనన్ను కాదనగలవా?

★ **తెప్పల** – భూపతిచెర్వులో తెప్పోత్సవం జరుపుకొనే ★ **చిప్పిలగ** – జోరుగా
★ **అగడుగ** – అలవాటుగా తిట్టే ★ **అంచగమన** – హంసగమన

సంఖ్య :125 సంపుటము : 26 పుట: 89 రాగం : ముఖారి

**41 ఇంత చాలదా నాకు యిందరిలో రమణుఁడ**
**సంతసాన నీకు మొక్కే సరసుఁడ విందుకు** ॥పల్లవి॥

**చింతలన్నియునుఁ బాసె సిగ్గు లన్నియునుఁ దేరె**
**ఇంతలోనే విభుఁడ నీ వీడకు రాఁగా**
**మంతనాలు సరివచ్చె మర్మములన్నియుఁగొౘ్చె**
**దొంతులైన మాటలు నాతో నాడఁగాను** ॥ఇంత॥

**కపట మింతయుఁ బాసె కాఁకలెల్ల చల్లనారె**
**ఇపుడు నా చెక్కు నొక్కి యెనయఁగాను**
**తపమెల్లా పలిఇంచె తలఁపులు సరిగూడె**
**అపురూపముగ నాతో నంది నవ్వఁగాను** ॥ఇంత॥

**వలపులు దైవారె వాడికెలు తుదమీరె**
**వెలయ నాపై చేయి వేయఁగాను**
**కలికి శ్రీవేంకటేశ కాయము లొక్కటి యాయ**
**సొలపు రతుల నన్నుఁ జొక్కించఁగాను** ॥ఇంత॥ **125**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య విరచితమైన ఈ సరసశృంగార కీర్తనలో నాయిక రమణునితో ఆరాధనగా ఏమంటున్నదో వినండి. ఇందరిలో నాకిట్లా చేశావు కదా! ఇది చాలదా? ఓ సరసుడా! ఇందుకు నాకు పరమానందంగా వున్నది. నీకు మొక్కుతానయ్యా! నేడు నా చింతలన్నియు దీరినవి. నా సిగ్గులన్నియు సిరివంతములైనవి. ఓ విభుడా! నువ్విక్కడకు రాగానే నిన్ను చూడగానే నా ఆలోచనలన్నీ ఆగిపోయాయి. నా మర్మస్థానములన్నీ కూర్చబడ్డాయి. నీవు అదేపనిగా, నాతో మాట్లాడుతుంటే నా ఆనందమేమని చెప్పను? నీవు చెక్కిలి నొక్కి లాలించగానే నాలోని కపట స్వభావము నశించినది. నా కోపమంతా చల్లారింది. నీవు నాకు ఆధీనుడవై అపురూపముగా నవ్వితే నా తపస్సు ఫలించింది. ఆలోచనలన్నీ సక్రమమైనాయి. నీవు నాపై చేయి వేయగానే నా వలపులన్నీ అతిశయించినవి. నీకోసమే దాచిన నా యౌవనం ఆధికత్యనొందింది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నన్ను నీ రతిలీలలో చొక్కించగానే మన తనువులేకమైనవి.

★ **మంతనాన** – ఆలోచనలు ★ **దొంతులైన** – వరుసగా
★ **అంది** – ఆధీనుడవై ★ **దైవారె** – అతిశయించినవి





సంఖ్య :4 సంపుటము : 8 పుట: 3 రాగం : వరాళి

**42 ఇంట గెలిచి కా నీవు యిఁక రచ్చ గెలిచేది**
**వెంటనే ఆనతీరాదా వినవలె నేను** ॥పల్లవి॥

**మాయలెంత సేసినాను మచ్చికెంత వూసినాను**
**ఆయెడ నావలె నిన్ను నాపె నమ్మీనా**
**కాయపు నీ ఘాతలివి కందువ మచ్చములివి**
**యేయింతి సేసినవంటే యేమనేవు నీవు** ॥ఇంట॥

**కల్లలెన్ని ఆడినాను కదిసెంత గూడినాను**
**యిల్లదె నావలెనాపె యియ్యకొనీనా**
**తెల్లనికన్నులతేట దిష్టమైన యాచెమట**
**చెల్లఁబెట్టుకొని యాపె చింతవాపఁ గలవా(దా?)** ॥ఇంట॥

**నెమ్మినెంత పొగడినా నీకు నీకే పొగడినా (?)**
**రమ్మని నావలెనాపె రతిఁ గూడీనా**
**యెమ్మెల శ్రీవేంకటేశ యెనసితివిటు నన్ను**
**సమ్మతించనాడనెట్టు సరసమాడేవు.** ॥ఇంట॥ **4**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ మధురకీర్తనలో ఇంతులకు 'ఈర్ష్య' స్వతస్సిద్ధమని నొక్కి వక్కాణిస్తున్నారు. అందులోనూ తన 'మగనికి' వాంఛరేపగల మగువను భార్య సహించలేదు. నాయిక స్వామితో యేమంటున్నదో చూడండి. స్వామీ! నీవు ఇంటగెలిచాక కదా! రచ్చగెలిచేది? ఆమెతో తమరిపాట్లు వెంటనే ఆనతిస్తే విని నేనూ ఆనందిస్తాను. ఒకటి మాత్రం నిజం. నీవెన్ని మాయలు చేసినా ఎంత చనువు చూపినా నిన్ను ఆవిడగారు నమ్మటమనేది కల్ల. నీవంటిమీద ఈ గాట్లు, మచ్చలు యే ఇంతిసేసినవని ఆమె అంటే 'తమరి' సమాధానమేమిటో? నీవు నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పినా? దగ్గరయై యెంత కూడినా నావలె ఆమె నిన్ను ఇట్లాంటి విషయాలలో నమ్ముతుందా? అది యెన్నటికీ జరిగేపని కాదు. తేటగా తెల్లగా మెరుస్తున్న నీ కళ్ళు, కంటికి కనిపిస్తున్న యీ చెమటలు ఆమె పోనీలే అని సరిపెట్టుకోదు. అది ఆమెని తప్పక బాధిస్తుంది. స్వామీ! నీవామెనెంత పొగిడినా నిన్నురమ్మని నావలె రతికి ఆహ్వానించదు. శ్రీవేంకటేశా! నాకు సుఖమిచ్చినట్లు దానికియ్యలేవు. ఇది నిజం.

★ **ఘాతలు** – గాట్లు ★ **ఇయ్యకొను** – అంగీకరించు
★ **చెల్లబెట్టుకొనుట** – సరిపెట్టుకొన ★ **మచ్చిక** – చనువు

సంఖ్య :295 సంపుటము : 8 పుట: 171 రాగం : ముఖారి

**43 ఊరకుండుమనవే వొక్కటొక్కటే రేఁచక**
**తేరకత్తె నైతేనేమి తిద్దుబడి తనదే ॥పల్లవి॥**

**తగిన నాచెలువము తనకె శలవాయ**
**పొగడఁగవలెనా పొరుగులను**
**నగిన నానగవులు ననుపులకునువచ్చె**
**మగనాలనైతేనేమి మనువెల్లాఁ దనదే ॥ఊర॥**

**పట్టిన నాపంతమిది పైపైఁ దనలోనాయ**
**అట్టె నన్నేల మెచ్చీనె అందరితోను**
**తిట్టిన నాతిట్టులివి దీవెనలై సరిదాఁకె**
**చుట్టమనైతేనేమి సొమ్మయితిఁ దనకే ॥లల॥**

**యిల్లిదె నాజవ్వనము యెప్పుడూఁ దనకెఅబ్బె**
**వెల్లవిరి సేయనేలె వీధివీధిని**
**చెల్లుబడితోఁ దానె శ్రీవెంకటేశుఁడుగూడె**
**గొల్లదాననైతేనేమి కొలువెల్లాఁ దనదే. ॥ఊర॥ 295**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ మధుర కీర్తనలో రేపల్లెలోని ఒక గొల్లెత తనతోటి నెచ్చెలితో యెంతదిట్టతనంతో మాట్లాడుతున్నదో చూడండి. చెలీ! ముందు అవతలాయనను నోరుమూసుకోమనవే. నేను పరస్త్రీనైతేనేమి, నన్నిట్లా చేసింది ఆయనగారే కదా. నన్ను తీర్చిదిద్దింది ఆయనగారే కదా! నా అందమంతా ఆయనగారికే అర్పించాను కదే! నాముందు అదెవ్వతో బాగుందంటాడా? నవ్విన నా ఆనందం యెంత అతిశయించిందో నీవే చెప్పవే. నేను పెళ్ళయినదాన్నైతేనేమి, నాకాపురం తనతోనేకదే! నేను పట్టిన నాపంతము పైపైనదేకదా! అందుకే లోకువ అయిపోయానే. అందరిముందూ నన్ను మెచ్చుకోంగానే మెత్తబడిపోయాను. నేను తిట్టిన నాతిట్లన్నీ తనకు దీవెనెలే అవుతాయి. నేనతని చుట్టమునైతే గొప్పేమీలేదు. అది నాకూ తెలుసు, కానీ నేను తనకు ఆభరణంవంటిదాననే. ఓ చెలీ! ఇదిగో ఈ నాయవ్వనమంతా వానికే అర్పించాను. కానీ ఈ విషయం వీధి వీధీ దండోరావేస్తున్నాడే. ఆ శ్రీవేంకటేశ్వరుడు అంతా తనకే చెల్లించుకొంటాడు. నేను చదువూ సంధ్యాలేని గొల్లదాన్నయితేనేమి, నా సేవ జీవితాంతం తనకే, కదే!

★ **తేరకత్తె** – పరస్త్రీ ★ **తిద్దుబడి** – శిక్షణ
★ **మగనాలి** – పెళ్ళయిన ఆడది ★ **కొలువు** – సేవ





సంఖ్య :85 సంపుటము : 8 పుట: 51 రాగం : వరాళి

**44 అంతేసి యెరఁగలేము ఆడువారము**
**మంతనాన విన్నవించే మన్నించవయ్యా ॥పల్లవి॥**

**నీతో నేమాటాడితే నిజము నిష్ఠూరము**
**నీతెరిఁగి మాటలెల్ల నీవాడవయ్యా**
**చేతి మీఁదనే వుండవి చేకొను నామొక్కులెల్లా**
**మాతలఁపు లీడేరించి మన్నించవయ్యా ॥అంతే॥**

**సారె నీతో నవ్వితేనే సరసమే విరసము**
**నారీతి చూచి నీవే నవ్వవయ్యా**
**గారవపు నాగోళ్ళు నీగడ్డము పైనుండవి**
**మారుకొని వేఁడుకొనే మన్నించవయ్యా ॥అంతే॥**

**చన్నుల నిన్నొత్తితేనే చలములే పలములు**
**వున్నతిఁ గాఁగిట నీవే వొత్తవయ్యా**
**అన్నిటా శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను**
**మన్నించి కూడితివింకా మన్నించవయ్యా. ॥అంతే॥ 85**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో అలమేలుమంగమ్మ యేమంటున్నదో వినండి. ప్రభూ! మేము స్త్రీలము అంతంత విషయములనెరుగము. అయినా నాకు వచ్చిన ఆలోచన విన్నవిస్తాను. దానిని మన్నించవయ్యా! నీతోనేనేమన్నా నిజం మాట్లాడితే నిష్ఠూరంగా వుంటుంది. పోనీ ఒక తీరైన మాట నీవే చెప్పవయ్యా! నీచేతిలో పనేకదా! నా మొక్కులను స్వీకరించి, మా వూహలు సిద్ధించునట్లు మమ్ము మన్నించవయ్యా! నేనూ నిన్ను వలచినదాననే. నీతో యెవరైనా నవ్వుతూ మాట్లాడితే వారి విరసభావనలు నశించి, సరస భావనలు అంకురిస్తాయి. నా రీతులన్నీ నీకు నవ్వు తెప్పిస్తాయేమో!! నా నఖక్షతములు నీ గడ్డముపై కనబడుతున్నవి. నిన్ను 'మారుకొనె'టప్పుడు (యెదుర్కొనేటప్పుడు) జరిగివుండవచ్చును. దయచేసి నన్ను మన్నించవయ్యా! నా స్తనములతో నిన్నొత్తితే నా చలములే పలములు (గర్వాతిశయము ఫలించినట్లే). అన్నిటిలోనూ నా ఆధారమైన ఓ శ్రీవేంకటేశ్వరా! నేను మరెవ్వరో కాదు. నీ హృదయవాసినియైన అలమేలుమంగను. నన్ను మన్నించికూడితివి. అంతకంటే మన్నన యేముంటుంది?

★ **మంతనాన** – ఆలోచన ★ **ఈడేరించి** – సిద్ధింపజేసి
★ **మారుకొని** – ఎదుర్కొని ★ **ఒత్తవయ్య** – హత్తుకొనవయ్యా

సంఖ్య :294   సంపుటము : 8   పుట: 171   రాగం: హిందోళవసంతం

**45 ఏఁటికి వేగిరపడే వింతలో నీవు**
**మేఁటిరమణుఁడ నిన్నెమెప్పించిఁ గాక ॥పల్లవి॥**

**మచ్చిక సేసినచెలి మాటలాడకమానీనా**
**దిచ్చరి నీతలఁపులు దెలిసీఁగాక**
**యిచ్చకము నీవాడఁగా నియ్యకొనకుండీనా**
**కచ్చుపెట్టి కొంతగొంత కైకొనీఁగాకా ॥ఏఁటి॥**

**దగ్గరివచ్చినచెలి తప్పకచూడకుండీనా**
**సిగ్గులు నీపైఁ గొంత చిమ్మీఁగాక**
**వొగ్గి విడెమిచ్చినాపె వోపననీనా యిఁక**
**నిగ్గులవలపు నీకు నేరిపీఁగాక ॥ఏఁటి॥**

**చేకొని కూడినమీఁద సేవసేయకమానీనా**
**యీకడ ముందువెనక లెంచీఁగాక**
**శ్రీకాంతనేలితివి శ్రీవెంకటేశ్వర నేఁడు**
**మాకొరకు నిన్నాపె సమ్మతింపించీఁగాక. ॥ఏఁటి॥ 294**

**పరిచయ పరిమళం :**

రమణుని ఆశించిన రమణి తరపున శ్రీకాంతకు నచ్చచెబుదామని ప్రయత్నిస్తున్నారు ఆమె తరపున అన్నమయ్య. ఈలోపుగ హరి తొందరయెక్కువైనది. అయ్యా! ఇందాకావచ్చాక ఇక ఆగుతుందా? మేము మాట్లాడుతాము కదా! అంటున్నారు. ఓ మేటి రమణుడా! నీవు ఏటికి (దేనికి) ఇంత తొందరపడతావయ్యా? ఎలాగో నీకు ఏర్పాటుచేసి నిన్ను మెప్పిస్తాము కదా! అయినా, నీతో అలవాటైన అతివ మాటలు కలపక మానుతుందా? చెప్పవయ్యా! నీదిచ్చరితలపులు (మాయ ఆలోచనలు) తాను గ్రహించలేదా? నీవంత ప్రేమలొలికిస్తే, యెవ్వతె అంగీకరించదు? కొంత కొంత (అప్పుడప్పుడూ) ఎదిరించి నిన్ను స్వాధీనం చేసికొని తీరుతుంది. నీకు అంత దగ్గరైన ఆడది తప్పక నిన్ను కోర్కెతోనే చూస్తుంది. ఆపైన నీముందు సిగ్గులు కుమ్మరిస్తుంది. ఆపైన అంగీకారతాంబూలమిస్తుంది. ఇక యెవరికైనా ఓపికవుంటుందా? నిగ్గుతేరిన వలపులు నీకు నేర్పించకమానుతుందా? నిన్నుకూడిన సతి నీకు సేవచేయక వదులుతుందా? ఓ శ్రీవేంకటేశ్వరా! మా కొరకు నీవే శ్రీకాంతను సమ్మతింపజేయాలి. మేమూ శ్రీకాంత భక్తులమే కనుక నీ కోర్కె తీరుతుంది.

★ **దిచ్చరితలపులు** – మాయ ఆలోచనలు ★ **ఒగ్గి** – సక్రమముగా ★ **కచ్చువెట్టి** – ఎదిరించి ★ **కైకొనుగాక**–స్వాధీనంచేసికొనుగాక ★ **ఓపననీనా**–చాలు అంటుందా? ★ **మచ్చిక**– అలవాటు





సంఖ్య :123   సంపుటము : 8   పుట: 73   రాగం : పాడి

**46 లేలే యెక్కడిసుద్ది లేమమాట వినవయ్య**
**నాలితో రుక్మిణిఁ దెచ్చేనాఁడు లేదా నీకు ॥పల్లవి॥**

**చెలి నిన్నుఁ బిలువఁగ చెయివట్టి తియ్యఁగాను**
**సెలవి నవ్వులతోడ సిగ్గువడేవు**
**కొలఁదిమీరనీబుద్ధి కొలనిలో గొల్లెతల**
**నలుగడఁ బైకొనేటినాఁడు లేదా నీకు ॥లేలే॥**

**పడతి మోవియ్యఁగాను బలిమి గోరనంటఁగ**
**అదరి తప్పించుకొనేవప్పటి నీవు**
**కడఁగి పదారువేలు కాఁగలించుకొనఁగాను**
**నడుమనే యీబుద్ధి నాఁడు లేదా నీకు ॥లేలే॥**

**కొమ్మ నినుఁ గూడఁగాను కుచముల నొత్తఁగాను**
**దొమ్మి శ్రీవేంకటేశ యిందు నలసేవు**
**యెమ్మెల భువియు సిరి (యు?) యిరువంకఁ బెండ్లాడఁగ**
**నమ్మికతో యీబుద్ధి నాఁడు లేదా నీకు. ॥లేలే॥ 123**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య పాడిన ఈ మధుర కీర్తనలో ఆనాటి స్త్రీలు మాట్లాడుకొనే ధోరణికి అద్దంపట్టినట్లు వున్నది. ఆయన నాయిక చెలికత్తెయై శ్రీవేంకటేశ్వరుని యెదిరించి తనవాదన వినిపిస్తున్నారు. చాల్చాల్లేవయ్యా! యేమి మాట్లాడుతున్నావు? మా నాయిక చెప్పేది విని అప్పుడు మాట్లాడు. ఏమన్నావు? నీకు చాటుమాటు వ్యవహారాలు నచ్చవా? మరి ఆనాడు రుక్మిణిని యెత్తుకొచ్చిన రోజున తమరేమి చేశారు? మా చెలి నీచేయిపట్టుకొని నీతో వచ్చేస్తానంటే చిరునవ్వులు చిందించి మౌనంగా సిగ్గుపడతావా? ఆనాడు కొలనులో జలకాలాడుతున్న గొల్లెతలను తమరు ఆక్రమించుకొన్నప్పుడు నీకీబుద్ధి మటుమాయమైనదా? మాచెలి తనంతట తను నీకు అధరమునందిస్తే అదే ఆవేశంతో యేదో చిన్న నఖక్షతము చేసిందేపో!! నీవు తప్పించుకొని విముఖత చూపినావట కదా! ఏమి సద్గుణాల ప్రోవండీ!! ఈయనగారు. నాడు పదహారువేలమంది భామలను పెండ్లాడి వారందరినీ సమంగా అలరిస్తానన్నప్పుడు, ఈ బుద్ధి యేమయింది? ఓ శ్రీవేంకటేశ్వరా! శ్రీదేవి, భూదేవీలను నిత్యమూ పెళ్ళాడి వంతులవారీగా సుఖిస్తూనేవున్నావు కదా? మరి మా చెలియయేదో నిన్ను తన చనుగవతో వొత్తితే అలిసిపోయానంటావా? జంటపెళ్ళిళ్ళ చక్రవర్తివి అప్పుడేమైంది తమరి బుద్ధి?

★ **నాలితో** – కపటముతో ★ **నలుగడ** – నాలుగువైపులనుంచి

సంఖ్య :282 సంపుటము : 8 పుట: 164 రాగం : ఆహిరి

**47** **నెలంత బాసితే నీకు నిమిష మేఁడవును**
**యెలమి దగ్గరివుంటే నేఁడు నిమిషమవును** ॥పల్లవి॥

**కన్నులఁ బెట్టినయట్టి కాటుకచూపులు నీపై**
**పన్ని చెలి చల్లితేనె పగలు రేయౌ**
**వున్నతి పద్మరాగాల వుంగరాలచేతినిన్ను**
**తిన్నఁగా నంటితే నట్టె తెల్లవారును** ॥నెల॥

**వీడెపుమోవిసెలవి వేడుకతో నవ్వితేను**
**నీడలఁ గాసిన వెల్లా నిండు వెన్నెలౌ**
**పాడితో యించుకవడి ప్రణయకలహమయితే**
**యేడచూచినా నదె యెండగాసును** ॥నెల॥

**శ్రీవేంకటేశ యిట్టె చెలి నిన్నుఁ గూడెఁగాన**
**సోవలుగా మోవిమీఁదఁ జుక్కలు నిండె**
**వేవేలు రతులచేత వెలయఁగా దిక్కులెల్ల**
**కావిరి మాని హృదయకమలము నించెను.** ॥నెల॥ **282**

**పరిచయ పరిమళం :**

దేవి చెలికత్తెయైన అన్నమయ్య వలపు రాయబారం నడుపుతున్నారు. ఎంత పదలాలిత్యం ఈ చిన్ని కీర్తనలో వున్నదో చూస్తే పదకవితాపితామహుని చాతుర్యం తేటతెల్లమౌతుంది. ఓ తిరుమలేశా! నీవెంత విరహవేదన అనుభవిస్తున్నావో నిన్ను చూస్తేనే తెలుస్తున్నది. ఆ రమణికై నిరీక్షించి వేదన చెందుతున్న నీకు నిముషము యేడాది సమయంవలె భారంగా గడుస్తుంది. అదే, ఆమె నీ సందిటనుంటే ఒక్క ఏడాది, నిముషంలాగా గడచిపోతుంది. మా చెలి గురించి యెంత వినినా తనివి తీరదు. మా చెలి నల్లటి తనకాటుక కన్నులతో నిన్ను చూచిందంటే పట్టపగలు రేయివలె మారిపోతుంది. మరి తెల్లవారాలంటే యేమి చేయాలో తెలుసా? పద్మరాగాలు తాపిన తన వుంగరపు చేతితో నిన్ను తిన్నగా ముట్టుకొంటే చాలు భళ్ళున తెల్లారిపోతుంది. ఆమె, తాంబూలపు అధరములతో నిన్ను వేడుకగా చూచి నవ్వితే నీడలలో బిక్కుబిక్కుమంటున్న మనస్సులో వెన్నెలవలె చల్లబడుతుంది. మా చెలి పట్టుదలతో కాసేపు ప్రణయకలహం ప్రదర్శిస్తే యెక్కడచూచినా తపింపజేసే యెండ కాచినట్లే వుంటుంది. మా చెలి అంతా మఱచిఇట్టే నిన్ను కూడిందంటే, ఆమె అధరంపై నీవు చేసిన దంతక్షతాలు పగటి చుక్కలవలె మెరుస్తాయి. ఓ శ్రీవేంకటేశ్వరా! వివిధ రతులలో నీవామెను అలరిస్తే దిక్కులన్నీ వెలుగులు చిమ్ముతాయి... మాదైవం ఒకాయన వున్నాడు.

★ **కావిరిమాని హృదయకమలము నించెను** – నల్లని చెట్టువంటివాని హృదయపద్మములో సౌరభంతో నిండిపోయింది.





సంఖ్య :20 సంపుటము : 8 పుట: 13 రాగం : పాడి

**48** **కాంత నీసందిమోహము గానవచ్చెను**
**చింతదీర బుజ్జగించి చిత్తగించరాదా** ॥పల్లవి॥

**మొగమునఁ గళదేరె మోవిపైకి నవ్వువచ్చె**
**మగువ నీతోనేమని మాట చెప్పెనో**
**సగటున నటునిటు పరాకులేల సేసేవు**
**తగు విన్నపములవధరించరాదా** ॥కాంత॥

**కన్నులఁ దేటలవారె కాయమెల్లాఁ బులకించె**
**కన్నె నీతోనిఁకనేమి సన్న సేసెనో**
**చిన్ని లేఁతసిగ్గులను శిరసేల వంచేవు**
**వన్నెల నేకతాన కవసరమీరాదా** ॥కాంత॥

**నిలువెల్లఁ జెమరించె నిట్టూరుపులు రేఁగె**
**కలికి నిన్నెటువలెఁ గాఁగిలించెనో**
**అలమి శ్రీవేంకటేశ అట్టె నీవు గూడితివి**
**మలసి యిటువలెనే మన్నించరాదా.** ॥కాంత॥ **20**

**పరిచయ పరిమళం :**

శ్రీనివాసుని చెలికత్తె అయిన అన్నమయ్య స్వామితో మీమధ్య ఒకరంటే మరొకరికి యెడతెగని మోహము కానవస్తూనేవున్నది. మరింకా తలపటాయిస్తావెందుకయ్యా? ఆమెదిగులు పోయేట్లుగా అనునయించి ఆమెను స్వీకరించరాదా? నీవు మాట్లాడగానే నీకేమాట చెప్పిందోకానీ ఆమె మొగమున కళలన్నీ తాండవించాయి. అదే నీవు కాస్త పరధ్యానంగా పెడమొగం బెట్టుకొంటే ఆమె తల్లడిల్లిపోతుంది. కాస్త మామాట విని ఆమె చెప్పే విన్నపములు చెవినిబెట్టుకోరాదా? ఆ కన్యారత్నము నీకేమిసైగచేసిందో మేము చూడలేదుగానీ ఆమె తీరు చూచినావా? తనకాయమెల్లా పులకించింది. కన్నులు తేటవారి మిలమిలా మెరుస్తున్నాయి. చిన్నగా సిగ్గులు చిందించే మోముతో తన తల పంకించింది. ఆమె నీతో "యేకాంతసేవ" కోరుతోందని దానికి తగిన అవకాశమియ్యరాదా? స్వామీ! ఆమెను చూచినావా? ఆమె నిలువెల్లా చెమటలే. మాటిమాటికీ నిట్టూరుస్తున్నది. నిన్నెంత బిగికౌగలించిందో చూచితివా? ఆమెను చూచి వేంకటేశ్వరా! నీవు కరిగిపోయి నీవామెను కూడినావు. ఎప్పుడూ ఇలాగే వుండరాదుటయ్యా?

★ **సంది**–మధ్య ★ **పరాకుసేయు**–పెడమొగముబెట్టుట ★ **ఏకతాన**– ఏకాంతమునకు

సంఖ్య :25 సంపుటము : 8 పుట: 16 రాగం : ఆహిరి

**49** **పగవారికైనా నిట్టిపాటు వద్దయ్యా**
**తెగువలు నీవురాఁగాఁ దిప్పుకొంటిఁ గాని** ॥పల్లవి॥

**నీసుద్దులే ఆడుకొంటా నెలఁతలతోడుత**
**ఆసలు మతిఁ బెట్టుక అలసితిని**
**గాసిలినమీఁద కాఁకలు దొట్టించఁగాను**
**వీసమంత పొద్దైనా వేగించరాదాయ** ॥పగ॥

**చొప్పుగా నీకెదురులు చూచిచూచి వాకిటను**
**రెప్పల ముయ్యఁగలేక రేసువడితి**
**వుప్పతిల్లు వలపెల్ల నొక్కమాటె రేఁగఁగాను**
**నిప్పువంటి తమకము నీఁగఁగ రాదాయను** ॥పగ॥

**కందువకు నీవురాఁగా గక్కనఁ గాఁగిట నించి**
**యిందుకా శ్రీవేంకటేశ యిట్టె మెచ్చితి**
**విందుల నీరతులలో వేడుక పిక్కటిల్లఁగా**
**సందడించి కుచములు సదమదమాయను.** ॥పగ॥ **25**

**పరిచయ పరిమళం :**

పరిపరి విధాల వాపోతున్న నాయిక వేదననావిష్కరిస్తున్నారు అన్నమయ్య. ఆమె ఏమంటున్నదో వినండి. పగవారికైనా ఇటువంటి పాట్లు వద్దయ్యా! ఆనాడు ధైర్యంచేసి నీవే నా వద్దకు వస్తే నీవు రాగానే నేను మొగము చాటుచేశాను. దానికీనాడు యెంత చింతిస్తున్నానో ఎలా తెలిపేది? నీ కథలే చెప్పుకొంటూ తోటి వనితలతో నీగురించే మాట్లాడుతూ నీపై యెన్నో ఆశలు నా మదిలో నిలుపుకొని అలిసిపోయాను. ఎంతో బాధపడ్డాక కోపముకూడా వచ్చి నెమ్మదిగా తగ్గింది. ఆ సమయంలో కొంచెం కూడా నాకు పొద్దుగడువలేదంటే నన్ను నమ్ము. బాగుగా నీకోసం యెదురుచూచి చూచీ వాకిట్లోనే నేను నిలబడి నీకోసం యెదురు తెన్నులు చూచాను. అతిశయించిన వలపంతా ఒక్కమాటుగా చెలరేగగా అగడువలె బాధించు పారవశ్యమును అణచలేనాయె. ఇంక దారియేమి? నీవు ఏదోవిధంగా మనం నిర్ణయించుకొన్న చోటునకు రాగానే నిన్ను చటుక్కున కౌగలించినాను. ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను నీవు మెచ్చి అతిశయించిన రతులలో తేల్చినావు. సందడి చేసిన చనుదోయి సదమదమవకతప్పుతుందా?

★ **తెగువలు** – ధైర్యముతో ★ **గాసిలి** – బాధపడి
★ **ఈగగరాదా**– తొలగించరాదా ★ **సదమదమాయె** – నలిగిపోయెను





సంఖ్య :129 సంపుటము : 8 పుట: 76 రాగం : పాడి

**50** **రారే యింకానతని రవ్వసేతురా**
**ధీరుఁడైనవానినంత తెమలించవచ్చునా** ॥పల్లవి॥

**నయగారి వానికిఁ గా నంటుతోడి సరసాలు**
**ప్రియునికిఁ గా మంచిప్రేమమెల్లాను**
**క్రియ గలవానికిఁ గా క్రిందిమీఁది విచారాలు**
**భయము లేనివానికి పట్టినదే పంతము** ॥రారే॥

**ఆసగలవానికిఁ గా అందరితో వినయాలు**
**బాసగల వానికిఁ గా పాలకూళ్ళు**
**వేసరని వానికిఁ గా విచ్చనవిడి నవ్వులు**
**దోసమొల్లనివానికి తోఁచినదే హితవు** ॥రారే॥

**పనిగల వానికిఁ గా పైపై తమకములు**
**యెనసిన వానికిఁ గా యేకాంతాలు**
**ఘన శ్రీవేంకటేశుఁడు గలసె నన్నింతలోనే**
**యెనలేక యీతనికి యెక్కినదే వయసు.** ॥రారే॥ **129**

**పరిచయ పరిమళం :**

ఈ కీర్తనలో నాయిక తన చెలికత్తెలను మందలించి యేమంటున్నదో వినండి. అన్నమయ్య మధుర కీర్తనలలో ప్రతిదానికీ యేదో ప్రత్యేకతవుంటుంది. దీని ప్రత్యేకతేమిటో ఆలోచించి చెప్పండి. నాయిక యేమంటున్నదంటే ఇక చాలించి యిటురండే, అతనినెందుకు ఇట్లా నిందిస్తారే. ధీరుడైన మగవానినింత తెమలించవచ్చునా (ఇబ్బందిపెట్టవచ్చునా)? ఆయన ధీరుడు. భయంలేనివాడు. అటువంటివారికి పట్టినదేపంతము. మృదువైనవాడైతేకదా! సరసాలాడేది. నిజమైన ప్రియునికే కదా! మంచి ప్రేమ అంటే తెలిసేది. ఏదన్నా పనియందుపూనిగలవానికే కదా! అవుతుందా, అవదా అనే విచారము. ఆయన సంగతి ఈనాడు కొత్తకాదుకదా! అయినా మీకు ఈమాత్రం తెలీదా! ఇది చెడు అని ఆలోచించని వానికి తోచిందే హితవు, కదా! దేనిమీద అయినా ఆశవున్నవాడే అందరితో వినయంగా వుంటాడు. ఒప్పుకొన్నవాడికే కదా! పాయసంపెట్టగలము? చింత అంటే తెలియనివాడు విచ్చలవిడిగా నవ్వకపోతే, యేమిచేస్తాడు. వాడేకదా! అలా నవ్వేది? వశమయ్యే వానికేకదా! పారవశ్యము కలిగేది. మోహము అతిశయించినవాడే కదా! ఏకాంతము కోరుకొనేది? నన్నింతలోనే శ్రీవేంకటేశుడు కూడినాడు అయినా, అతనికర్పించినదే కదా! వయస్సు అంటే.

★ **రవ్వసేయు** – నిందించు ★ **నయగారికి** – మృదువైనవానికి
★ **పాలకూళ్ళు** – పాయసాలు ★ **పనిగలవాడు** – వశమయ్యేవాడు

సంఖ్య :84    సంపుటము : 8    పుట: 51    రాగం : శ్రీరాగం

**51 ఎత్తరే ఆరతులీపె కింతులాల**
**హత్తెను శ్రీవేంకటేశుఁ కలమేలుమంగ** ॥పల్లవి॥

**హరి వురముపైసొమ్ము అరతఁగట్టినతాళి**
**సరిలేని దేవుని సంసారఫలము**
**సిరులకుఁ బుట్టినిల్లు సింగారములవిత్తు**
**మెరుఁగుఁబోడి యలమేలుమంగ** ॥ఎత్త॥

**పరమాత్మునికి నాత్మభావములో కీలుబొమ్మ**
**కెరలుచునితఁడు భోగించే మేడ**
**సరసపు సముద్రము సతమైన కొంగుపైఁడి**
**అరిది సంపదలది యలమేలుమంగ** ॥ఎత్త॥

**శ్రీవేంకటేశుని దేవి చిత్తజునిఁ గన్నతల్లి**
**యీ విభుని కాఁగిటిలో యేచిన కళ**
**బూవపు పెండ్లి మేలు పొందిన నిధానము**
**ఆవల నీవల నీపె యలమేలుమంగ.** ॥ఎత్త॥ **84**

**పరిచయ పరిమళం :**

ఇది మంగళగీతము. అన్నమయ్య తేనెవాన. శ్రీవేంకటేశ్వరుడు అలమేలుమంగ, పరమాత్మ ఆత్మలు. వారి సంగమమే జగన్మంగళము. ఓ ఇంతులారా! హారతులనెత్తండి. శ్రీవేంకటేశ్వరుడు అలమేల్మంగను హత్తుకొనినాడు. ఈ దేవి యెవ్వరు? శ్రీహరి ఉరముపైన సొమ్ము. కంఠసీమనలంకరించిన మంగళసూత్రము. సిరులకు కాణాచి. సింగారములకు బీజము. శ్రీహరి సంసారఫలము పైడి ఛాయతో విలసిల్లే అలమేలుమంగ. పరమాత్ముడైన శ్రీహరికి ఆత్మభావనలో కీలుబొమ్మవలె నడుచునది. అతిశయించి ఆయన భోగించే దివ్యసౌధం. సరసాలసాగరము. శాశ్వతమైన శ్రీహరి కొంగుబంగారము. అరుదైన సంపదలందించే శ్రీమహాలక్ష్మి ఈ అలమేలుమంగ. ఈ దేవియే శ్రీవేంకటేశ్వరుని పట్టపురాణి. చిత్తజుడైన మన్మథునికన్నతల్లి. శ్రీవిభుని కౌగిటిలో అతిశయించిన కళ. మేలైన హరి పెండ్లి భోజనము, ఆయన పొందిన నిధానము. అటు వైకుంఠము, ఇటు తిరుమలలోను, ఆమె అలమేలుమంగ.

★ **మెరుగబోడి**–పైడివన్నెశరీరంకలది ★ **బూవపు పెండ్లిమేలు**–మేలైన పెండ్లి భోజనం






రచయిత:

## అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు



| | | |
|---|---|---|
| పిలవండి | : | **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు** |
| పుట్టింది | : | **9-6-1945** |
| చదివింది | : | **ఎం.టెక్.** |
| ఉండేది | : | **ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61,<br>సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్.** |
| రంధి | : | **భగవన్నామ సంకీర్తన** |
| నచ్చింది | : | **శాస్త్రీయ సంగీతం** |
| నచ్చంది | : | **నక్కజిత్తులు** |
| మెచ్చింది | : | **సజ్జన సాంగత్యం** |
| రింగండి | : | 00919393021360 |
| చదవండి | : | www.geetadeksha.com |
| ఇవ్వండి | : | e-mail : geetadeksha@gmail.com |

## అంకితము

### నా ఇష్టదైవము, శ్రీ వేంకటరమణునికి
### ఆయనలో ఇమిడిపోవాలని ఆశపడే రమణులకు...



కం॥ **హరియేమనెనే అలిగెనొ**
**వెరపందిన నాయికలును వేదనజెందన్**
**కరిగెడి వేంకటపతికిని**
**తరుణులకిది అంకితమ్ము ధన్యత నిత్తున్.**

తా॥ "హరి యేమన్నాడే, ఒకవేళ నాపై అలిగాడా? ఇక యెన్నటికీ మమ్మల్ని చూడడా" అని భయపడి దుఃఖిత అయిన తన నాయికనావిధంగా చూచి కరిగిపోయే తిరుమల శ్రీవేంకటరమణునికి, ఆయన తరుణులకు ఈ కృతిని నాకు ధన్యత కలుగునట్లు అంకితమిచ్చెదగాక!





(సంపుటి - III)



# "హరి యేమనెనే అలిగెనో"

## అలమేలుమంగమ్మతో అలనాటి హరి అనురాగ పరిమళం

## ఆత్మ పరమాత్మల ఐక్యము

ఇది
**అన్నమయ్య పదకవితకు అమరవాది పరిచయం**

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు



# హరి యేమనెనే అలిగెనో

ఎన్నుకొన్న

అన్నమయ్య మధురకీర్తనలకు

## పరిచయ పరిమళము

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.





హరి యేమనెనే అలిగెనో

(సంపుటి - III)

మొదటి ప్రచురణ

మార్చి 2014

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

వెల : అమూల్యం

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :

కె.వి.ఆర్.

98495 79345

ఆ.వె॥ మధుర కీర్తననగ మంచి శృంగారంబు
గూడుకొన్నపాట కురియు దేనె
అణువుమాత్రమైన అశ్లీలతుండదు
మనసు నిర్మలముగ మారవలయు.

మత్తకోకిల॥
పరిచయంబును సేయనెంచితి బాగుబాగని మెచ్చగా
పరిమళంబులు చిల్కు కీర్తన భావమున్ కుదియించుచున్
సరసమొప్పెడి మాధురిన్ వెదజల్లు వేంకటనాయకా!
మురిపెమందగ ముద్దుగుమ్మల ముంచుమా రతివేడుకన్.

మ॥ కరిగించెన్ హరి ముద్దుగుమ్మ రతులన్ కళ్యాణమైకూడుచున్
వరపుత్రుండగు అన్నమయ్య అటుపై పాడెన్ భళా! కీర్తనన్
యెరుకన్ గూర్పగ వాటికిన్ పరిచయం బేనెంచి సేతున్ ప్రభూ!
దరికిన్ జేర్చుము నాదు'నావ' సుడిలో తాజిక్కి అల్లాడినన్.

శా॥ శృంగారంబన చిన్నచూపు తగునా, సేవింపగా శ్రీపతిన్
బంగారంబగు బాటరా కలుగునా పాపంబు ఆవంతయున్
క్రుంగంబోకుర వేంకటేశ్వరుడు తాగూడంగ గోపెమ్మలన్
సంగంబౌనుర అన్నమయ్య కవికిన్ సంతృప్తి కల్గెన్ గదా!





# హరి యేమనెనో అలిగెనో

(సంపుటి - III)

ఎన్నుకొన్న అన్నమయ్య మధుర కీర్తనలకు
పరిచయ పరిమళము

## విషయ సూచిక


| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | అందరును వినరమ్మ | 20/29 | 21 |
| 2. | అరయనాపెపైనీకునట్టానె | 12/272 | 9 |
| 3. | అపుడేమనెనే మనుమనెను | 6/97 | 50 |
| 4. | ఆకెకునీకెతెలుసునౌభళేశ | 12/271 | 8 |
| 5. | ఆడే బొమ్మలువారు | 20/392 | 30 |
| 6. | ఆటదైపుట్టినందుకటువలె | 12/284 | 6 |
| 7. | ఇంతకంటేసుద్దులు | 12/188 | 17 |
| 8. | ఇంతటను గరుణించు | 20/474 | 28 |
| 9. | ఇతరము లేదే యింతి | 24/218 | 42 |
| 10. | ఇదెవో నానోముఫలమిక | 12/270 | 16 |
| 11. | ఈ పాటి వుపచారమిది చాలదా | 20/443 | 31 |
| 12. | ఉపకారమింతేకాని | 8/111 | 2 |
| 13. | ఎంతవానికెంతమాట | 8/82 | 1 |
| 14. | ఎందరి వలపించెనో | 6/26 | 48 |
| 15. | ఎఱగడుగాకతన్ను | 20/135 | 20 |
| 16. | ఎఱుగుదు నేనీమోహము | 24/371 | 43 |
| 17. | ఏమయ్యాఆపె మీద | 12/186 | 5 |
| 18. | ఏమిదలచుకొంటివో | 24/56 | 35 |
| 19. | కందువ రేపల్లెలోనే | 12/90 | 7 |
| 20. | గందమందుకోవయ్యా | 20/537 | 24 |
| 21. | చాలునే నీమాటలు | 24/217 | 44 |
| 22. | చూతువు రావయ్యా | 24/267 | 45 |

| | | |
|---|---|---|
| 23. చెన్నలర భూపతిచెరువునున్నాడు | 24/368 | 39 |
| 24. చెలగి కొలువులోన సిగ్గులు | 24/480 | 41 |
| 25. తనకునాకును జంటతానే | 12/349 | 10 |
| 26. తలవంచనేటికి దండనున్న | 20/522 | 26 |
| 27. తానాడిన సరసము తనకు | 12/457 | 4 |
| 28. తారవలచినయపుడె | 6/27 | 49 |
| 29. దిమ్మరిమాటలాడీనే | 20/186 | 23 |
| 30. దేవదుందుభులు నలుదిక్కులందు | 24/30 | 32 |
| 31. నేనేమని విన్నవించే నీమంచితనము | 12/89 | 11 |
| 32. నేనేలకాగిలంచేను నెలత | 8/113 | 3 |
| 33. నిండుకున్నది వలపు | 20/495 | 29 |
| 34. నిండుజాణవన్నిటాను | 24/216 | 46 |
| 35. నిన్నరాని కోపము నేడేటికే | 20/549 | 22 |
| 36. నాటెను నీకూరిమి నారసింహ | 24/481 | 36 |
| 37. నా మనసెఱుగు దొల్లె | 24/169 | 47 |
| 38. పతిమీద తమకానభ్రమసితి | 20/48 | 25 |
| 39. పాయరాని పదివేలపనులు | 6/179 | 51 |
| 40. మగరూపునాడరూపు | 20/308 | 27 |
| 41. మగవానికేటి యెగ్గు | 24/246 | 38 |
| 42. మాతో నేటికి నేను మగువను | 24/192 | 37 |
| 43. మానిపండ్లు మరిమానికింద | 20/279 | 18 |
| 44. ముద్దులుగారీ మోమునను | 24/588 | 33 |
| 45. వలదన నొరులకు వసమటవే | 6/17 | 19 |
| 46. విరహము మీదనే వేడుక | 12/347 | 14 |
| 47. వుత్తమనాయకుడవు వొరపు | 12/189 | 13 |
| 48. వెలలేని గొల్లెతలే వేడుక | 12/187 | 15 |
| 49. వేగిరించి యాతనికివేసట | 12/348 | 12 |
| 50. అట్టుసేయకిక నీవు ఇట్టే | 24/482 | 34 |
| 51. రతి నీపలుకులకు రామ నడపులకు | 24/114 | 40 |






# ప్రార్థన

కం॥ శ్రీధరుడు వేంకటేశుడు
ఆధారం బవనిసతికి అన్నులమిన్నొ
మాధవి అలమేల్మంగకు
రాధమ్మకు హరిని వలచు రమణులకెల్లన్

ఉ॥ ఈకడ జెప్పబూనెదను యేపుగ వేంకటనాథు గొల్చుచున్
చేకొని అన్నమయ్య తను చెప్పిన యీమధురంపు కీర్తనల్
మూకగ భావమున్ దెలుప ముత్యపు జల్లును బోలు భాషలో
తూకపు ముందుమాట పరితుష్టత బొందగ యెంచి వ్రాసెదన్.

చం॥ సరసములైన కీర్తనల చాలపదంబులు ఒక్కతీరునౌ
విరివిగ అర్థముల్ తెలుప వింతగబుట్టు విరక్తి వీటిపై
మురియుచు తీపియున్ తినగ మొత్తు మొగంబని నేర్వగా వలెన్
పరిచయమందునే తెలుప భావమునీకడ నిశ్చయించితిన్.

సీ॥ శృంగారకీర్తనల్ బంగారు పుట్టమ్ము
కట్టు దేవర కింపు కలుగజేయు
మధుర భక్తికి తల మాధవుండేవూచు
సెలవినవ్వుల జిల్కు సిరిపెనిమిటి
సరసభక్తిని మెచ్చి సతి జూచి కొంటెగా
కనుగీటు తిరుమల కరివరదుడు
అమలిన రసవృష్టి అన్నమయ్య పదంబు
మురిపించు నెల్లరన్ తరతరముల

చివరికి వినండి. కొంతమంది అల్పజ్ఞానంతో అన్నమయ్య బూతుకీర్తనలు చెప్పాడని ఆ రోజుల్లో తమ అక్కసును వెళ్ళబోసుకొన్నారు. అటువంటి వారు నేటికాలంలోనూ వున్నారు. వారందరికీ కనువిప్పే నామాటలివే. పండితులు అన్నమయ్య శృంగార కీర్తనలను పరిష్కరించి ఆ కీర్తనలలోని నాయకుడు పరమాత్మ, నాయిక పరమాత్మ సంగమం కోరే ఆత్మ అని విశదీకరించారు. జనబాహుళ్యానికి వారు స్త్రీ పురుషులనిపిస్తే వారు భగవంతుని పాఠశాలలో ఎల్.కె.జి. విద్యార్థుల క్రింద లెక్క అన్నమాట. మరి పి.హెచ్.డి. అంటే ఆత్మ పరమాత్మను చేరుకోవటం, జరిగేనా? ఏమో! శ్రీహరికే తెలుసు.

అందుకే మనం ఈ అద్భుత సాహిత్యాన్ని మధురకీర్తనలు అందాము. అన్నట్లు ఇవి సరసము చిందించే సరసకీర్తనలు కూడా.

**తిరుమల తిరుపతి దేవస్థానములవారికి సదా కృతజ్ఞుడను**

***Please visit:*** **geetadeeksha** in google Network,

for my other works







# తొలిపలుకు

అన్నమయ్య శృంగారకీర్తనలు ఇదివరలో ఏలుకో శృంగారరాయ అనే పేరుతో మున్నుడి, భావవివరణలతో 101 కీర్తనలు అందించాను. ఈనాడు మళ్ళీ అన్నమయ్య సరసకీర్తనలను, శృంగార కీర్తనలను అన్నమయ్య మధుర కీర్తనల పేరుతో అందిస్తున్నాను. వీటికి 'హరి యేమనెనే అలిగెనో' అనే సంపుటిగా వెలువరిద్దామని సంకల్పం.

శ్రీవేంకటేశ్వరుని కృపా కటాక్షవీక్షణముంటే ఈ నాప్రయత్నం వెలుగులోకి వస్తుందని నా అపార నమ్మకం ఆపై కొండలరాయని దయ, నా ప్రాప్తము. నేను ఇదివరలో అన్నమయ్య శృంగార కీర్తనలు తీసుకొన్నప్పుడు "రవ్వా శ్రీహరి" గారి నిఘంటువు నావద్దలేదు. అందువలన ఆనాడు నేను ఎక్కువ శ్రమపడవలసి వచ్చింది. ఈనాడు ఆ కష్టంలో సగం పడితేచాలు గట్టెక్కవచ్చని నా నమ్మకం.

ఆ పురుషోత్తముడే ఏదో ఒక దారిచూపిస్తాడు. దీనిలోనే గాయకులు రాగంకట్టి పాడిన కొన్ని కీర్తనలను యెన్నుకొన్నాను. సాహిత్యపరంగానేకాక సంగీతపరంగా కూడా ఈ సంపుటి అందరినీ అలరిస్తుందని నా ఆశ.

"హరి నీమయమే అంతాను" అనే పేరుతో నేను శ్రీవేంకటరమణుని కృపవలన 375 అన్నమయ్య శృంగార, భక్తి, వైరాగ్య, తత్త్వ చింతన కీర్తనలు 4 సంపుటములుగా వెలువరించాను. శృంగార కీర్తనలన్నీ వివరిస్తే రసికలోకానికి తప్ప, శరణాగతులకు పెద్ద ఉపయోగకరము కాదేమో అని నామట్టుకు నాకనిపించింది. మనకు లభ్యమైన అన్నమయ్య కీర్తనలన్నీ సింహభాగము శృంగార కీర్తనలే. అయినా నేటి సమాజంలో అన్నమయ్య కీర్తనలు వినేవారేకానీ విశ్లేషించిన తాత్పర్యవివరణ చదివేవారు కోటికొక్కరు. ఒకవేళ చదివినా రెండవ పర్యాయం చదివేవారుండరు. మరి అన్నమయ్య అన్నట్లు వరద ఆగిపోయాక అడ్డుకట్టవలన లాభమేమి? కానీ అన్నమయ్య కీర్తనలు పాఠకలోకానికి పరిచయం చేయాలనే నాకోరిక తీరనిది. అందుకనే

అన్నమయ్య శృంగార కీర్తనలను పాఠకలోకానికి పరిచయం చేస్తే చాలు అనే సత్సంకల్పంతో నా ప్రయత్నానికి "హరియేమనెనే అలిగెనో" అని నామకరణంచేసి శ్రీకారం చుట్టాను.

ఒకవేళ ఈ శృంగార కీర్తనలకు విడమరచి భావవిశ్లేషణ చేసినా ఇక్కడ చూపిన విధంగా వస్తుంది.

**భావవిశ్లేషణ:**

ఓ చెలియా! హరి నామాటవిని యేమనెనే (ఏమని అన్నాడే?) కొంపదీసి అలిగెనో (అలిగినాడాయేమే?) విరహినై నేనుండ (నేనింత విరహ బాధతో వేదన చెందుతుంటే) యీవేళ ఇంకా రాడేలనే?

మళ్ళీ మళ్ళీ తనను నా మాటలతో కొసరను (ఆక్షేపించను) అని వేడుకొన్నాను కదా! అతిశయించిన హరి యేమనినాడే. తరుణులందరూ వచ్చేశారు కదా! ఇంకా తాను అక్కడనేవున్నాడు. కారణమేమిటే? ఎరవెరవై (విలక్షణముగా) నున్న ఆతడు అప్పుడు తాను నా గురించి యేమనినాడే?

ఓ చెలీ! నావాకిటిదాకా వచ్చి తిరిగెనట (మరలిపోయెనట), నావిభుడు. కారణమేమైవుంటుంది? తానెందుకలా చేశాడో చెప్పినాడా? ఈ రాకపోకల (వచ్చీపోవుటలోనే) తెల్లవారేటట్లుంది. ఈకడ (ఇప్పుడు) తుదమాట యేమనెనే (తన ఆఖరి మాటగ యేమి చెప్పమంటాడే.)

ఓ చెలియా! నా తలపులో ప్రియము (నా మనస్సులో అతని నెంత ప్రేమిస్తున్నానో) తనకే తెలుసును కదే! తన మనసులో మాట యెలుగెత్తి యేమనెనే (గొంతువిప్పి ఏమీ చెప్పలేదా?) ఇప్పుడు ఆయనగారు నామాట యేమి వింటున్నాడని? తానే బలవంతంగా వచ్చి ఆ శ్రీవేంకటేశ్వరుడు నిన్ను నన్ను కూడినాడు కదా! దాని గురించి యేమనినాడే?

దీనివలన ప్రయాస తప్పించి విశేషఫలితము నాకు కనిపించలేదు. బాగా ఆలోచించి ఒక కృత నిశ్చయానికి వచ్చాను. ఈ "హరియేమనెనే అలిగెనో"లో యెన్ని సంపుటములు చేస్తానో తెలియదు కానీ ప్రతి శృంగార కీర్తనకు





"పరిచయపరిమళం" వ్రాసి అన్నమయ్య ఆరాధన కొనసాగిస్తాను. శ్రీవేంకటేశ్వరుని నామస్మరణ యెలాగూ ఇందులో భాగమే కదా!

శృంగార కీర్తనలంటే చదువరిలో శృంగారభావాలను తట్టిలేపేవి. జావళీలు ఆ కోవకే చెందుతాయి. జయదేవుని అష్టపదులవలె, అన్నమయ్య కీర్తనలలో కూడా అశ్లీలతకి తావులేదు. అష్టపదులలో హరి దర్శనమైతే ఇక్కడ శ్రీవేంకటేశ్వరుడు శృంగారరాయడు. అలమేల్మంగమ్మ, ఆమెచెలికత్తెలు, వేంకటేశుని పరివారంలోని స్త్రీలు కీర్తన పాడుతున్నారు అన్నట్లు వుంటాయి. కొండొకచో అన్నమయ్య తనే నాయికా నాయకులకు సలహాలిస్తారు. అప్పుడూ ఆయనా స్త్రీగా ఆ కీర్తననాలపిస్తున్నారా అనిపిస్తుంది. నాకు ఇవి శృంగారకీర్తనలన్న భావం రాదు. ఇవి అన్నమయ్య మధుర భక్తిని ప్రతిపాదించే మధుర కీర్తనలు. సరసత్వము గలవికాబట్టి సరస కీర్తనలు అనికూడా అనవచ్చును. అన్ని కీర్తనలూ దాదాపు ఒకే పంథాలో నడిచినందువల్ల పునరుక్త భావన కొండొకచో కలుగవచ్చును. మరి మన నాయకీ నాయకులు మానవమాత్రులు కారుగదా! జగత్పిత, జగన్మాతలు వారు.

ఏది యేమయినప్పటికీ ఈ మధుర కీర్తనలకు పరిచయ పరిమళం మాత్రమే అందించడం జరిగింది. కొన్ని తెలుగు మాటలకి కూడా అర్థం చెప్పవలసి వచ్చింది. ఎందుకంటే అది 600 ఏళ్ళ క్రిందట నేటి రాయలసీమ మాండలిక భాష. అటువంటి సందర్భాలలో చదువరుల సౌకర్యార్థం కొన్ని పదములకు నేటి తెలుగు అర్థం ఇవ్వటం జరిగింది. అలాగే కొన్ని కీర్తనలలో తమిళ, కన్నడ పదములు కూడా ఆనాటి వాడుకవలన మనకు కనిపిస్తాయి.

ఈ కీర్తనలు ప్రత్యేకించి రసిక భావనలున్న భక్తులకు. ఇరవైయేళ్ళలోపు వారికి, అరవై యేళ్ళు పైబడిన వారికి కాదు. అలాగని వారు చదువరాదని నా అభిప్రాయము కాదు. పచ్చి మామిడికాయ, బాగా మగ్గి మెతకబారిన మామిడికాయ తినలేం కదా! ప్రౌఢులకు ప్రింటు సన్నగా వున్నా పర్వాలేదని ఈ "హరియేమనెనే అలిగెనో" పేజీకి ఒక్క కీర్తన పరిచయ పరిమళంతో సహా అందిస్తున్నాను. ఆస్వాదించండి.

















సంఖ్య : 457 సంపుటము : 12 పుట: 262 రాగం : గంభీరనాట

**4 తా నాడినసరసము తనకు వెగ్గళ మైతే**
**నే నేమి సేతునే యాల నెపాలు వేసీనే** ॥పల్లవి॥

**మొనలైన నా చన్నుల మొలకలు నాఁటె నంటా**
**కొనచూపులఁ దా నెంత కొచ్చి చూచీనే**
**పెనఁగఁగా నా జడ ముప్పిరిఁ జుట్టుకొనె నంటా**
**వొనరఁగఁ దా నేల వురము దట్టీనే** ॥తానాడి॥

**చెవిలోని నా పునుఁగు చెక్కులపైఁ గారె నంటా**
**తివురుచుఁ దా నేల తిద్ద వచ్చీనే**
**యివల మోవులు సోఁకి యెంగిలాయ నంటాను**
**జవళి బొమ్మల నేల జంకించీనే** ॥తానాడి॥

**కలసి కౌఁగలించఁగా గాజు లొత్తె నంటాను**
**చలపట్టి తా నేల సాదించీనే**
**యెలమి శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను**
**లలి నేలె నన్ను నెంత లాలించీనే.** ॥తానాడి॥ **457**

**పరిచయ పరిమళం :**

ఈ కీర్తనలో అన్నమయ్య, దేవి చెలికత్తె. తన చెలియతో దేవి తన బాధను ఇలా చెప్పుకొంటున్నది. తాను నాతో ఆడిన సరసాలు తనకే మితిమీరినవనిపిస్తే, నేనేమి చేయగలనే? ఇట్లా నామీద నెపముల నెందుకువేస్తాడే ఈయన? మొనదేలిన నా చనుగవ తనకి గుచ్చుకుంటున్నదట. నన్ను తన కొనచూపులతో గుచ్చిగుచ్చి చూస్తూ, అని నవ్వుతాడు. నన్ను పెనవేసికొంటే నా జడ తనకు చుట్టుకొన్నదట. ఈ మాటకూడా వూరకనే చెప్పడు. నా ఉరముపై తట్టుతూ చెబుతాడు. నా చెవిలో వుంచుకొన్న తట్టు పుణుగు నా చెక్కిలిపై కారిందని, దాన్ని దిద్దటానికి వచ్చి నా చెక్కిలినెందుకు పుణుకుతాడే ఈయన. నా పెదవులు తనకు సోకి అంతా యెంగిలిమంగలం అయిందని తన కనుబొమ్మలనుముడివేసి బెదరించినట్లు చూస్తాడు. ఇదేమిటే నన్నిట్లా బెదరగొడతాడు. తనకు దగ్గరయై కౌగలిస్తే నా గాజులు నొక్కేస్తున్నాయని నన్ను సాధిస్తాడేమిటే. ఆయన శ్రీవేంకటేశుడు, నేను అలమేల్మంగను. లాలనగా నన్ను అలరించేనే.

★ **తివురుచు** – కుతూహలంతో ★ **వెగ్గళమైతే** – మితిమీరితే
★ **చలపట్టి** – పగబట్టి ★ **జంకించీనే** – బెదిరించేనే





సంఖ్య : 83 సంపుటము : 8 పుట: 59 రాగం : పెంచబౌళి

**1 ఎంతవానికెంతమాట యేలే యింత**
**మంతనాన నుండియును మాకుదీరదా** ॥పల్లవి॥

**కొప్పు దువ్వితేఁ బతిపైఁ గోపగించుకొనేవేమే**
**తప్పులేని తప్పుమోపి తమకింతురా**
**విప్పుచుఁ బ్రియము చెప్పి వేఁడుకొనీ నాతఁడే**
**దప్పిదేరె మోవిచూచి దయవుట్టదా** ॥ఎంత॥

**ధీరతతోఁ జెక్కు నొక్కితేను విదిలించేవేమే**
**దూరులేని దూరుగట్టి దొమ్మిసేసేవు**
**సారపు నీసుద్దులెల్లా చవిసేసీనాతఁడే**
**ఆరీతినాతనిఁ జూచి ఆయము గరఁగదా** ॥ఎంత॥

**చిప్పిలఁ గాఁగిలించితే జీరవారెననేవేమె**
**చొప్పులేని చొప్పులెత్తి సూడువట్టేవే**
**అప్పఁడు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు**
**చొప్పులుగాఁ బెంజెమట చూచి చింత వాయదా.** ॥ఎంత॥ **83**

**పరిచయ పరిమళం :**

దేవి చెలికత్తెయైన అన్నమయ్య చనువుతో ఆమెను మందలిస్తున్న వైనం పరికించండి. ఏలనమ్మా ఇంత రభస చేస్తావు? ఎంతవానికి (ఇంతటి జగన్నాథుని) ఎంతమాట యేల (ఇంతమాట అనదగునా?) మేము లోపల యేదో సత్వర ఆలోచనలో వున్నాము. మాకు తీరికె లేకపోతే ఇట్లాగైతే యెట్లమ్మా? దేవీ! ఆయన వైనముగా తనకొప్పు దువ్వినాడు. అయితే, దానికే ఆయనపై అలుగుతారటమ్మా? తప్పులేకపోయినా యేదో ఒకతప్పు చూపి తత్తరబెడతారా? తన జాగునకు కారణం వివరించి అనునయంగా వేడుకొంటుంటే ఆతని మోవి చూచి అయినా నీకు దయ కలుగలేదా? ఆయన సానుకూలుడై నీ చెక్కిలనొక్కితే అట్లా విదలించుకోవచ్చునా? నిందలేని స్వామిపై యేవో నిందలు వేసి దొమ్మిచేస్తావేమమ్మా? నీవైనమంతా రుచి చూచికూడా ఆయన సంయమనంతోనే వున్నాడు. అదంతా చూచియైనా నీ ఆయము కరుగదా (నీ బిగువు సడలదా?) ఆయన గుచ్చి కౌగలించితే నొప్పించాడని నెపమునెన్నుతున్నావు. నెపము లేకపోయినా నెపమువేసి విరోధము చూపతగునా? ఆయన శ్రీవేంకటేశుడు, నీవు అలమేల్మంగవు. ఆయన కురిసిపోయే చెమటలైనా నీ చింతబాపవా?

★ **తమకింతురా** – తత్తరబెడతారా? ★ **చవిసేసీ** – రుచిచూచె
★ **జీరవారెనా** – గాయమైనదా? ★ **సూడువట్టేవు** – విరోధించేవే

సంఖ్య : 111   సంపుటము : 8   పుట: 66   రాగం : దేసాక్షి

**2 ఉపకారమింతేకాని వొరటుగాదు**
**కపటాలుమాని సతిఁగాఁగిలించవయ్యా** ॥పల్లవి॥

**మంకుగాదు చెలియ నీమనసు చూచేనంటా**
**వుంకువ సిగ్గులతోడ నూరకున్నది**
**సంకెగాదు నిన్నుఁ దనచన్నులు నాటించితేను**
**అంకెఁ గుమ్మెలయ్యీనంటా నట్టె మూసెఁ బయ్యద** ॥ఉప॥

**తిట్టుగాదు నీగుణము తెలుసుకొనవలసి**
**బెట్టీమాటలనిన్నుఁ బెదవులను**
**అట్టుసేయదాపె నిన్నాఁడిఁ బెనఁగకున్న**
**దిట్టతనము నేరక దిగేవంటాను** ॥ఉప॥

**గబ్బితనములుగాదు కాఁగిలించి పట్టినిన్ను**
**తబ్బిబ్బుగాకుండ రతిఁదనిపేనంటా**
**అబ్బురపు శ్రీవేంకటాధిప నిన్నుఁగలసె**
**జొబ్బిలఁ బ్రేమము నీకుఁ జూపేనంటాను.** ॥ఉప॥ **111**

**పరిచయ పరిమళం :**

ఈ కీర్తన క్లిష్టమైనదే. అన్నమయ్య భావన నావూహకందినంతవరకు ఈ విధంగా నాకు తోచింది. ఓ శ్రీవేంకటేశ్వరా! మా చెలికి ఉపకారబుద్ధేకాని, మొండిపట్టుదల లేదయ్యా! నీకోపము కూడా కపట కోపమే. అదిమాని సత్వరమే మాసతిని కౌగలించవయ్యా! మా చెలియనర్థం చేసికోవయ్యా! మా చెలియది మంకుపట్టుదలకాదు. నీ మనస్సులో తనమీద నీకెంత ప్రేమవున్నదో చూడాలని ఆమె కోరిక. అందుకే నీవామెకు చేరువైనా తెచ్చిపెట్టుకొన్న సిగ్గుతో వూరకున్నది. నిన్ను తన చనుదోయితో కుమ్మినది కూడా నీపై శంకతో కాదు. నీకు వశమై తనకైన నఖక్షతములు తన మూసిన పైట తొలగించి చూపుటకే, సుమా! ఆమె నీతో నిష్ఠూరంగా మాట్లాడినదికూడా, నిన్ను తిట్టాలనే భావంతో కాదు. నీ శాంతగుణము యెంత పటిష్ఠమైనదో యెరుగుటకే. అంత'అట్టు' చేసింది నీతో గొడవ బెట్టుకొనుటకు కాదు. నేరక నీకు తన దిట్టతనం చూపబోయి పొరబాటు చేసింది. రతిలో తను నీవెంత వుబ్బితబ్బిబ్బౌతావో చూద్దామనుకొని నిన్ను తన బిగికౌగిట బిగించినది అంతేకానీ నీకు తన గర్వము చూపించుటకు కాదు. అబ్బురములు చూపించే వేంకటేశ్వరా! ఆమెకు తన ప్రేమ చూపే నేర్పుకూడా లేదయ్యా!

★ **ఒరటు** – మొండిపట్టుదల ★ **ఉంకువసిగ్గులు** – తెచ్చిపెట్టుకొన్న సిగ్గులతో
★ **బెట్టిమాట** – నిష్ఠూరంగా ★ **గబ్బితనము** – గర్వము





సంఖ్య : 113   సంపుటము : 8   పుట: 67   రాగం : ధన్యాసి

**3 నేనేల కాఁగిలించేను నెలఁతనెవ్వతెనైనా**
**కానుకలాయ మోహము కడుమెచ్చవలదా** ॥పల్లవి॥

**మచ్చరములెల్ల మానె మనసొక్కటాయ నాకు**
**లచ్చనలు నీమోవిపై లలినుండఁగా**
**చొచ్చి యధరామృతము సొమ్ము పదిలముగాను**
**పచ్చిముద్రలు వెట్టె నీపని మెచ్చవలదా** ॥నేనే॥

**చింతలిన్నియునుఁ బాసె సెలవుల నవ్వువచ్చె**
**పొంతనుండి నీలోనే బుసకొట్టఁగా**
**దొంతినున్న వలపులు తూరుపెత్తేవేళలకు**
**అంతలో పొలివారించె నది మెచ్చవలదా** ॥నేనే॥

**చేతికి లోనాయ రతి సేస పిడికిటనిండె**
**నీతల నన్ను శ్రీవేంకటేశ కూడఁగా**
**జాతితో నిద్దరమును చద్దికి వేఁడికిఁగాను**
**యేతులఁ దోడు గడించె నిది మెచ్చవలదా.** ॥నేనే॥ **113**

**పరిచయ పరిమళం :**

ఇదికూడా అంత సులభగ్రాహ్యంకాని కీర్తనే. దేవి స్వామితో యేమంటున్నదంటే, నెలత నెవ్వతెనో నేనెందుకు ఆదరిస్తాను నాకు నీపైగల విపరీతమైన మోహమే నాకు కానుకైనది. ఈనా అంకిత భావమును నీవు మెచ్చుకోక తప్పదు. అన్నమయ్య భావనాగరిమ అందలేనేమో? నా మచ్చరమునంతా త్యజిద్దామనుకొంటే, నీ మోవిపై ప్రత్యక్షంగా కనుపించే దంతక్షతములు నన్ను వేధిస్తున్నాయి. నీ అధరామృతము నాసొత్తు. అట్టి నీ అధరములపై ఆ పచ్చిముద్రలు వేసే నీ నేర్పు మెచ్చక తప్పదు స్వామీ! ఎట్టకేలకు నా చింతలన్నియు వైదొలగినవి. పెదవులు మొలకనవ్వులు చిందించసాగితిని. అప్పుడు నా సమీపముననేవుండి నన్ను గమనిస్తున్న నీలో ఏవేవో కోరికలు బుసకొట్టినవి. నాలోదొంతరగానున్న వలపులు తూరుపెత్తినవి (వెదజల్లబడినవి). అంతలోనే ఆ వలపులు విస్తరించినవి. స్వామీ! దానికి నన్ను నీవు మెచ్చవలదా? రతి వాంఛతో నేను నీ చేతికివచ్చి లోనైతిని. తలంబ్రాలు నా గుప్పిట నిండినవి. ఓ శ్రీవేంకటేశ్వరా! ఆపై నన్ను స్వాతంత్రముతో కూడితివి. సొగసుగా రెండుపూటలా ఇద్దరమూ కూడితిమి. ఉద్ధతితో ఇద్దరమూ ఒకరికొకరు తోడైతిమి.

★ **పొలివారించు** – విస్తరించినవి ★ **లచ్చనలు** – గుర్తులు
★ **జాతితో** – సొగసుగా ★ **చద్దికీవేడికీ** – పొద్దునా మధ్యాహ్నం

సంఖ్య : 271   సంపుటము : 12   పుట: 155   రాగం : రామక్రియ

**8 ఆకెకు నీకుఁ దెలుసు నౌభళేశా**
**యేకతాననే యరసి యెఱుఁగుకో రాదా** ॥పల్లవి॥

యెదురుఁ గొండ లెక్కి యేటి కొల కే మమ్మ
అదిగో సొలసి మాటలాడీ నిన్ను
పొదిగి పొదిగి యట్టె బొమ్మల జంకించు కొంటా
తుదలేని వేడుకలఁ దొంగి చూచీని ॥ఆకెకు॥

చల్లని మాకులనీడ సమదిష్టితో నీకు
వొల్లని ప్రియాలు చెప్పి వొరసీ నిన్ను
తెల్లమిగా సెలవులఁ దెగ నవ్వు నవ్వుకొంటా
పల్లదాన నీపైఁ బూబంతి వేసీని ॥ఆకెకు॥

మిక్కుటపుఁ దమకము మించఁగా నీతొడ యెక్కి
గక్కునఁ జన్నుల నొత్తి కలసీ నీతో
తక్కక యహోబలానఁ దగ శ్రీవేంకటాద్రిని
వొక్కటై నిన్నుఁ బెండ్లాడి వొద్దికె చూపీని. ॥ఆకెకు॥ **271**

**పరిచయ పరిమళం :**

అహోబలనృసింహునిపై అన్నమయ్య గానంచేసిన ఈ సరస శృంగారకీర్తనలో ఉగ్రనృసింహుని చల్లబరచిన శ్రీలక్ష్మిని కూడా కొనియాడుతున్నారు. తొలుదొల్త నరసింహునితో ఓ ఔభళేశా! ఆమెకు నీకే తెలుసు నిన్ను వశము చేసికొనుటకు ఆమె యెంతకష్టపడినదో మేమెట్లు చెప్పగలము. ఏకాంత సమయం చూసి నీవే ఆమెకు చేరువై తెలుసుకోరాదా? దేవీ! ఈ నృసింహుడు యేమిచేశాడో చూడు. నీ ఎదురుగానున్న కొండలపై తానూ యెక్కివున్నాడు కదా! ఇంకా వైరం దేనికి? అదిగో తానలసిపోయేవరకు నీతో మాట్లాడి నీకు చేరికయై కనుబొమ్మలను వేగముగా కదలించుచు అంతులేని వేడుకతో నీకొరకు తొంగిచూస్తున్నాడమ్మా ఈ ఔభళేశుడు. దేవీ! చల్లని తరుఛాయలలో సమదృష్టితో నీకు ప్రియవచనములు చెప్పి నన్ను తనకు ఒత్తుకొంటాడు. తేట తెల్లముగా నవ్వులొలికిస్తూ గర్వముతో నీపై పూదండ వేస్తాడమ్మా ఈ ఔభళేశుడు. ఓ నృసింహా! ప్రతిక్రియగా ఈ దేవి యేమిచేసిందో చూశావా! మిక్కుటమైన పారవశ్యముతో నీతొడపైనెక్కి కూర్చొనినది. చటుక్కున తన చనుగవతో నిన్నొత్తి అహోబలముననేకాక శ్రీవేంకటాద్రిపైకూడా నిన్ను పెండ్లాడినది.

★ **ఒరసీనిన్ను** – నిన్ను ఒత్తుకొనును ★ **పల్లదాన** – గర్వముతో
★ **తక్కక** – విడువక ★ **ఆకెకు** – ఆమెకు





సంఖ్య : 186   సంపుటము : 12   పుట: 107   రాగం : ఆరభి

**5 యేమయ్యా ఆపె మీఁద నింత బత్తి గలిగితేను**
**కామించి పెండ్లాడరాదా కా దనేరా నిన్నును** ॥పల్లవి॥

పలచఁగా నవ్వు నవ్వి పాపట దువ్వుకొంటా
కొలువు సేసే యాపెఁ గోరి చూచేవు
వలిదపయ్యదలోని వట్రువ గుబ్బలమీఁద
కలువపువ్వులు వేసి కాంతాళించేవూ ॥యేమ॥

వీడెపు సెలవితోడ వీఁగి సిగ్గువడుకొంటా
కూడిమాడివున్న యాపెఁ గొంగు వట్టేవు
జాడతోడ నిట్టే మేనిచక్కఁదనాలకు మెచ్చి
చేడెలతోఁ బొగడుతాఁ జెలరేఁగేవూ ॥యేమ॥

యింతుల సన్నలు సేసి యేకతము లాడుకొంటా
చెంత నున్న యాపెమీఁదఁ జేయివేసేవూ
యింతలోనే శ్రీవేంకటేశ మమ్ము నేలితివి
పొంత నీ చెలికొఁగిట భోగించేవూ. ॥యేమ॥ **186**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో తనబోటి భక్తురాండ్రను అనుగ్రహిస్తూనే తన దేవేరికి కూడా విధేయుడైన శ్రీవల్లభుడు వలచి వచ్చిన వారితో భోగిస్తుంటాడని చెబుతూ స్వామిని మందలిస్తున్నారు. ఏమయ్యా! ఆమె మీద అంత వలపు వుంటే కోరి పెండ్లాడరాదా? నిన్ను వద్దు అనేవారెవ్వరు? స్వామీ! లేతచిరునవ్వులు చిందిస్తూ నీ పాపిట చక్కగా దువ్వుకొని, నీ కొలువు చేస్తూనే ఆమెను కోరిక విరజిమ్ముతున్న విధంగా చూస్తావు. ఆమె పైటలోని చనుగుబ్బలమీద చిలిపిగా నీచేతనున్న కలువపుష్పములను తాకునట్లు విసురుతావు. పైగా రవ్వంత ఈర్ష్యతో చూస్తావు. ప్రభూ! తాంబూలం సేవించిన తన చిరునవ్వులలోనే సిగ్గులు పూయిస్తున్న సభలో నీతో కలుపుగోరుతనంతోవున్న ఆమెను చటుక్కున కొంగుపట్టి లాగినావు. నిగ్గుతేలిన ఆమె శరీర సౌందర్యాన్ని మెచ్చుకొంటూ, కొలువులోని ఇతర స్త్రీలముందు ఆమెని పొగడుతూ చెలరేగిపోతావు. దేవా! నీ కొలువులోని ఇతర కాంతలకు సైగచేసి పంపివేస్తూ ఆమెతో ఏకాంతము ఆమెకు తెలియకుండా కల్పించి ఆమె మీద చేయివేస్తావు. మళ్ళీ ఇంతలోనే నాబోటి భక్తురాండ్రనూ అనుగ్రహించే శ్రీవేంకటేశ్వరా! నీ భోగాన్ని అడ్డేదెవరయ్యా?

★ **బత్తి** – వలపున్న భక్తి ★ **కాంతాళము** – ఈర్ష్య
★ **కూడిమాడి** – కలిసి మెలిసి ★ **చేడెలు** – స్త్రీలు

సంఖ్య : 284 సంపుటము : 12 పుట: 163 రాగం : కురంజి

**6 ఆఁటదై పుట్టినందు కటువలెఁ గాకుండితే**
**యేఁటి జన్మమయ్యా మమ్ము నేలుకొనవలదా ॥పల్లవి॥**

**పానుపుపైఁ గూచుండి నీపాదములు చేత నొత్తి**
**ఆనించి గుబ్బలమీఁద నందుకొంటాను**
**నానుపుఁజెమట నీపై ననుపునఁ జిందుకొంటా**
**కానుకగా మోవి యిచ్చి కరఁగఁగ వలదా ॥ఆఁటదై॥**

**కొనగోర నీ కురులు కూడగీరి దువ్వి దువ్వి**
**చెనకి చెక్కుఁ జెక్కు చేర్చుకొంటాను**
**పెనఁగి నీ బుజాలపై ప్రియానఁ జేతులు వేసి**
**తనివార మోము చూచి దైవారవలదా ॥ఆఁటదై॥**

**వొయ్యనే కౌఁగిట నించి వొత్తగిలి పక్కనుండి**
**తియ్యని నీ మోవితేనె దీసుకొంటాను**
**ఇయ్యెడ శ్రీవేంకటేశ ఇదే నీ దేవుల నైతి**
**పయ్యెదఁ గప్పి ఇట్టె తెప్పలఁ దేలవలదా. ॥ఆఁటదై॥ 284**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ మధుర కీర్తనలో నాయిక యేమంటున్నదో ఆలకించండి. ఓ తిరుమలరాయా! ఆడదై పుట్టిన తదుపరి ఆ విధముగా వుండకబోతే ఇక అదియేమి జన్మయ్యా? ఇంత చెప్పుట యెందుకు? మమ్ము కనికరించి, యేలుకోవయ్యా! మరియెట్లా వుండాలో తెలియాలంటే పరిచయ పరిమళమునాస్వాదించాల్సిందే. స్వామీ! ఆడజన్మ అన్నాక, నీవు పానుపుపై కూర్చుంటే తన ఒడిలోకి నీ పాదములు తీసికొని వొత్తకపోతే, అట్లా వొత్తుతూ అప్పుడప్పుడూ చిలిపిగా తన కుచద్వయమును నీకు ఆనించి దేనినో అందుకొంటేనే కదా! ఆనందం. కావాలని నా చెమట చేతితో నీపై చిందించి అటువలె నిన్ను ఇబ్బందిపెట్టినందుకు తీయని అధరామృతమునిచ్చి నిన్ను కరిగించవలదా? నాకొనగోళ్ళతో నీ జుట్టు లాలనగా దువ్వి, నీ చెక్కిలిని పుణుకుతూ దానికి నా చెక్కిలి ఆనించుకొంటూ నీ భుజములపై చేతులువేసి ప్రేమగా తనివిదీరా నీ మొగములోకి పారవశ్యంగా చూడకపోతే అదేమి జన్మయ్యా? ఓ శ్రీవేంకటేశ్వరా! ఒయ్యారంగా నీపక్కన ఒత్తిగిలి పరుండి నీమోవితేనెనందుకోకపోతే నాదేమి జన్మ? నీదేవేరినై నీవు కప్పిన పమిట కొంగులో ఆనందసాగరములో తేలవలదా?

★ **కూడగీరి** – ఒకటిగా దువ్వి ★ **దైవారవలదా** – అతిశయించవద్దా
★ **ఒయ్యన** – మెల్లగా ★ **తెప్పలదేలవలదా** – తేలిపోవద్దా





సంఖ్య : 90 సంపుటము : 12 పుట: 52 రాగం : నాదరామక్రియ

**7 కందువ రేపల్లెలోనే కానవచ్చె నీ సుద్దులు**
**అందుకొని పొగడ ని న్నలవి గాదు ॥పల్లవి॥**

**వారికి వారికి నీవు వలచిన ట్టున్నాఁడవు**
**యీరీతి నీ జాణతన మెటువంటిదో**
**కోరి నీ వెందరినైనాఁ గొలువు సేయించుకొందు**
**చేరి నీ యోపిక యెంతో చెప్పరాదు ॥కందు॥**

**భావింప నెవ్వరికైనా పక్కనున్నట్టున్నాఁడవు**
**తావగు నీ విటరాయతన మెట్టిదో**
**వేవేలు సతులతోడ వేసారక మాటాడుదు**
**యేవల్లా నీ నేరుపు యెంచరాదు ॥కందు॥**

**అందరికౌఁగిటఁ గూడి నట్లానే వున్నాఁడవు**
**అందిన నీ చుట్టరిక మది యెంతో**
**అందపు శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను**
**పొందితివి నీగుణాలు పొగడరాదూ. ॥కందు॥**

**పరిచయ పరిమళం :**

రేపల్లెలో శ్రీకృష్ణుని తత్వాన్ని ఆవిష్కరిస్తున్నారు అన్నమయ్య. వారి వారికి హరి నావాడనిపించినా ఆయన నిజమైన భక్తికి శరణాగతికి మాత్రమే కట్టుబడతాడు. అందరికౌగిట గూడినట్లున్నా ఆయన చుట్టరికమదియెంతో యెవ్వరూ చెప్పజాలరు. యెన్ని రాసలీలలు చేసినా ఆయన శ్రీవేంకటేశ్వరుడు, కనుక అలమేలుమంగ సొత్తు. ఈ కీర్తనలో కూడా ఆమె అదే నొక్కివక్కాణిస్తున్నది. రేపల్లెలో అతిశయించిన నీ సుద్దులు అనేకము చూశాము. అవన్నీ గ్రహించి అర్థంచేసికోవటం మావల్ల అవుతుందా ప్రభూ! అన్నదే ఈ పల్లవి సారాంశం. నీజాణతనమేమని వర్ణించను? వారికి వారికి నీవు వారిని వలచినట్లే భ్రమ కలుగజేశావు. అందరితోనూ కొలువు సెయించుకొన్నావు. నీ ఓపికయెంతటిదో చెప్పుట సాధ్యమా? ఏవనితయైనా నీవు తనింట తన పక్కనే వున్నట్లు భ్రమించింది. నీ విటరాయతనము అనుపమానము. పదియారువేల సతులను చేపట్టి సమానముగా యేలుకోగలిగిన కృష్ణతత్వము ఆయన నేర్పు యేవిధముగానూ యెంచరానిది.

★ **కొలువసేయించుకొనుట** – సేవలుపొంది ★ **ఓపిక** – ఓర్మి
★ **విటరాయతనము** – విటశ్రేష్ఠుని లక్షణం ★ **చుట్టరికము** – సంబంధము

సంఖ్య : 348 సంపుటము : 12 పుట: 199 రాగం : ఆహిరి

**12 వేగిరించి యాతనికి వేసట సేయకురే**
**నాగుఱు తెఱఁగుఁ దానే నన్ను నేలీఁ గాని** ॥పల్లవి॥

**ఆసకొలిపినవాఁడు ఆఱడిఁబెట్టినవాఁడు**
**సేసవెట్టి నాపై దయసేయ నేరఁడా**
**వాసి యెఱిఁగినవాఁడు వలపు చల్లినవాఁడు**
**లాసుకొన్న నన్నుఁ గూడి లాలించీఁ గాక** ॥వేగి॥

**చనవు లిచ్చినవాఁడు చవి మరపినవాఁడు**
**చెనకి సంతోసించఁ జేయ నేరఁడా**
**వినయ మెఱిఁగినవాఁడు వేడుకకు లోనై నవాఁడు**
**మన సెఱిఁగి నన్నిట్టే మన్నించీఁ గాక** ॥వేగి॥

**చెలిమిసేసినవాఁడు చేతికి లోనైనవాఁడు**
**తలఁచినప్పుడే నా దండకు రాఁడా**
**యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁ గూడే**
**పలుమారు నారతులఁ బాయకుండీఁ గాకా.** ॥వేగి॥ **348**

**పరిచయ పరిమళం :**

ఈ కీర్తనలో నాయిక విన్నపము వినండి. ఆమె తన చెలికత్తెలతో యేమంటున్నదంటే ఆయనను విసిగించి శ్రమపెట్టకండే. నావేదన నర్థంచేసికొని తానే నన్ను యేలుకొంటాడు. ఆయనకు తెలియనిదేదన్నావుంటుందా? అంటున్నది. ఇది ఒకటికి రెండుసార్లు చదివితేకానీ అంతుబట్టని అన్నమయ్య మధురకీర్తన. నాలో ఆశరేపినవాడు, నన్ను ప్రేమలో ముంచి అల్లరిపెట్టినవాడు నా చేతికి మంగళాక్షతలనిచ్చి నన్ను అనుగ్రహించలేడా? ఔన్నత్యంగలవాడు, నన్ను వలచినవాడు నన్ను కోరుకొన్నవాడు కూడి లాలించనేరడా? నాకు చనువునిచ్చినవాడు, ప్రేమానుభవం కలిగించినవాడు నన్ను సంతోషపెట్టుటనెరుగడా. వినయమువున్నవాడు, వేడుకకులోనైనవాడు నామనసెరిగి నన్ను మన్నించలేడా. నాతో స్నేహంచేసినవాడు, నేను చెప్పినట్లు చేసేవాడు తలచుకోగానే నా సముకానికి రాలేడా? శ్రీవేంకటేశ్వరుడు ఇంతలోనే నన్ను అతిశయముతో కూడినాడు అట్టివాడు నా రతిని వదలకుండుగాక!

★ **వేగిరించి** – తొందరపెట్టి ★ **వేసట** – శ్రమ
★ **లాసుగొన్న** – కోరుకొన్న ★ **దండకు** – దరికి





సంఖ్య : 272 సంపుటము : 12 పుట: 156 రాగం : నారాయణి

**9 అరయ నాపెపై నీకు నట్లానె కాఁబోలు**
**గరిమ మీ గుణములు కడుఁ గొత్తలయ్యా** ॥పల్లవి॥

**మొగము చూచి చూచి మోహములు చల్లి చల్లి**
**చిగురుమోవితేనె చింది చింది**
**పగటున మాటలాడి పచ్చిదేరఁ దమకించీ**
**మగువ వేడుకలు యేమని చెప్పేమయ్యా** ॥అరయ॥

**చేతులు చాఁచి సెలవుల నవ్వు నవ్వి**
**పోతరపు సరసాలు పూసి పూసి**
**రాతిరిఁ బగలుఁ బొంచి రతులకే యాసగించీ**
**యీ తరుణి కోరిక లెన్ని లేవయ్యా** ॥అరయ॥

**చనుఁగవ నొత్తి యొత్తి జవ్వాది మెత్తి మెత్తి**
**పెనఁగి పెనఁగి సిగ్గు పెంచి పెంచి**
**యెనసెను శ్రీవేంకటేశ నిన్ను నింతలోనే**
**వనితచందము లివి వసమా నేఁడయ్యా.** ॥అరయ॥ **272**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ మధురకీర్తనలో తిరుమలరాయనితో స్వామీ! చూడబోతే ఆమెపై నీకు కూడా అట్లాగే విపరీతమైన మోహము వుందని అనిపిస్తోంది. మేము మానవమాత్రులము. మధ్యలో నాబోటి అతి సామాన్యుడికి నీ మనస్సు యెలా అవగతమవుతుందయ్యా? జగన్మాతాపితలు మీరు. దేవీ! నీ మగువ, నీమొగములోనికి ప్రేమగా చూస్తూ చూస్తూనే మోహములను నీపై చల్లీ చల్లి, తన లేచిగురువంటి అధరముల మధురిమ చిందించీ చిందించి నీతో మురిపెముగా మాట్లాడుతూ పచ్చిగా మైమరపిస్తూవున్నది. ఆమె వేడుకల నేమని వివరించగలమయ్యా? ప్రభూ! నీ తరుణిని గమనించావా? ఆమె నిన్ను కౌగిలికి ఆహ్వానిస్తున్నట్లు నీకై చేతులు చాచీ చాచి, చిగురుపెదవులతో నవ్వీ నవ్వి, గర్వముతో సరసములాడుతూ ఆడుతు రేయింబవళ్ళు నీరతి పారవశ్యానికి ఆశపడుతున్నది. ఆమె కోరికలెన్నిలేవయ్యా? ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ వనిత జవ్వాది తన స్తనములపై మెత్తీమెత్తి, పరిమళము లెసగగా వాటితో నిన్నొత్తీ ఒత్తి, ఆపై పెనగీ పెనగి నీకూ సిగ్గులు పెంచినది. స్వామీ నేడామెచందము వివరింప మావశమా?

★ **పగటున** – మురిపెముతో ★ **పోతరము** – గర్వము

సంఖ్య : 349 సంపుటము : 12 పుట: 200 రాగం : సాళంగం

10 తనకు నాకును జంట తానే యెఱుఁగు నిది
అనిశముఁ జెలులాల అడుగరే యతని ॥పల్లవి॥

కనుచూపులకు జంట కడలేని యాసలు
మనసుకు జంట నెమ్మదిఁ గోరిక
తనువుకు జంట కాంతాళపుఁ దమకము
ననుపులకును జంట నానాభోగములు ॥తనకు॥

చక్కఁదనానకు జంట సరసవిహారము
అక్కరకును జంట అతిమోహము
చొక్కపురతికి జంట సొలపుల చిరునవ్వు
జక్కవ చన్నులకును జంట నిండుఁగౌఁగిలి ॥తనకు॥

కలయికలకు జంట కట్టిన కంకణము
నిలుకడలకు జంట నెక్కొన్న భక్తి
యెలమి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలే
తలపోఁతలకు జంట తనివోని వేడుకా. ॥తనకు॥ 349

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ మధుర కీర్తనలో నాయిక రకరకాల జంటల గురించి ప్రస్తావిస్తున్నది. అన్నిటికంటే శ్రేష్ఠమైన జంట తనకూ నాకూ అనే సంగతి తానూ యెరుగును. ఓ చెలులారా! యేనాడైనా, యిది సత్యమే కావాలంటే అతనిని మీరే అడగండి అంటున్నదామె. అంతటితో ఆగక ఇంకా యేవేవి జంటలో వివరిస్తున్నది. కనుచూపుకు తగిన జంట అంతులేని ఆశలే. మనస్సునకు జంట నెమ్మదిలోని కోర్కె. ఈ తనువుకు జంట వ్యాకులత కలిగించు మోహము. అనురాగమునకు జంట భోగము. చక్కదనమునకు జంట సరసన నుండి విహారము సలుపుట. అవసరమునకు జంట, అతిమోహము. చొక్కించు రతిక్రీడకు జంట విలాసవంతమైన చిరునవ్వు. జక్కువ పిట్టలవంటి చనుదోయికి జంట నిండు కౌగిలి. సతీపతులకూటములకు జంట పెండ్లినాడు కట్టిన కంకణము. స్థైర్యమునకు జంట అచంచలభక్తి. ఓ శ్రీవేంకటేశ్వరా! అన్ని విధములా నీవే నా యేలికవు. అంతులేని ఆలోచనలకు జంట తనివి తీరని కుతూహలమే కదా!

★ **కాంతాళపుతమకము**–వ్యాకులత కలిగించే మోహము ★ **సొలపుల**–విలాసవంతమైన ★ **నిలుకడలకు** – స్థైర్యము ★ **తనివోని వేడుక** – తనివితీరని కుతూహలము





సంఖ్య : 89 సంపుటము : 12 పుట: 51 రాగం : ధన్యాసి

11 నేనేమని విన్నవించే నీమంచితనమునకు
అనుకొన్న నాలోని అయిక దేర్తువు ॥పల్లవి॥

నీ మనసు దెలియక నేఁ గూరిమి గొసరితే
నా మొగము చూచి నీవు నవ్వుదువూ
ఆముకొన్న తమకము లటు నీకుఁ జూపితేను
ప్రేమ మెఱఁగి నాతో గాఁపురము సేతువూ ॥నేనే॥

నీడ నుండి చెమటతో నిన్నుదప్పక చూచితే
వేడుక మిగుల నన్ను వేఁడుకొందువు
వోడక నీపై బత్తిని వొడివట్టి తీసితేను
కూడ వచ్చి పానుపుపైఁ గూచుండుదువు ॥నేనే॥

అక్కర గలిగి నీపై నాసల నే నుండితేను
గక్కన నందుకు నీవు కౌఁగిలింతువు
యిక్కువ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
మక్కువ న న్నేలితివి మరియు మన్నింతువు ॥నేనే॥ 89

**పరిచయ పరిమళం :**

ఈ కీర్తన కొంచెం నిదానంగా అర్థంచేసికోవాలి. అన్నమయ్య చెప్పిన ఈ మధురకీర్తన అలమేలుమంగమ్మ ఆలపిస్తున్నది. ఓ తిరుమలరాయా! నీమంచితనమునకు నేనేమని విన్నవింతును?నీవెటువంటి దయామయుడవంటే నాలోని అణచిపెట్టిన శ్రమ అంతటినీ తొలగింతువు. నీ మనస్సు నెరుగక నేను నీనుంచి కూరిమిని కోరుకొంటే నీవు నా మొగములోనికి జూస్తూ చిరునవ్వు లొలికింతువు. గాఢమైన నా పారవశ్యమును జూపితే నా ప్రేమనర్థంచేసికొని నాతో కాపురము చేతువు. నీవు యెండలో సుదూరమునుండి వచ్చినప్పుడు, నీడపట్టునవున్న నేను దప్పకవున్న నిన్ను చూచితే విసుగుకొనక వేడుకతో నన్ను దప్పిదీర్చ వేడుకొందువు. అంతేకాదు ఓటమినెరుగక, నీపై ఆరాధనతో నిన్ను నిలువరించితే నన్ను కూడుటకు నిశ్చయించుకొని పానుపుపై కూర్చుందువు. నీ సమాగమమునకు నేను నా ఆతృత తెలిపితే వెంటనే నన్ను బిగి కౌగిలింతువు. ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీదేవేరి అలమేల్మంగను. నీవు నన్ను మక్కువతో యేలి మన్నింతువు.

★ **అలయికదేర్తువు** – శ్రమతొలగింతువు ★ **ఆనుకొన్న** – అణచిపెట్టిన ★ **ఒడివట్టి తీసితేను** – నిలువరించితే ★ **ఇక్కువ** – వేదవిహితముగా

సంఖ్య : 270 సంపుటము : 12 పుట: 155 రాగం : శ్రీరాగం

**16** యిదెవో నా నోముఫల మింఁక నే వెరపు లేదు
పదిఁబదై యాసలు నాపైఁ దన కున్నవి ॥పల్లవి॥

యెప్పుడూ మరుబాణాలెంత వాఁడియైనా నేమి
తప్పదుగా నామీఁద తనకరుణ
వొప్పుగఁ గోవిల లెంత వొరటుతో నుండినాను
చొప్పులుగాఁ దాఁ జూచిన చూపులు నా కున్నవి ॥యిదెవో॥

అల చందురుని వెన్నెలంత వెట్టయైన నేమి
కలదుగా యీ చుట్టరికము తనది
చిలుకలు కొరకొరై చిమ్మి రేఁగఁ బలికినా
చెలరేఁగి తాఁ బెట్టినసేసలు నా కున్నవి ॥యిదెవో॥

మందానిలుఁడు యెంత మందటాడినా నేమి
అందరిలోఁ దన పొందు లబ్బెఁగా నాకు
యిందు శ్రీవేంకటేశుఁడు యిట్టె తా నన్నేలినాఁడు
చందాన నా రెచ్చినట్టి చనవు నాకున్నది. ॥యిదెవో॥ **270**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య పాడిన ఈ మధురకీర్తనలో నాయిక తనకు మదనుని పంచబాణములుగానీ శుకపికములవంటి పక్షుల కూజితములుగాని, రాకాచందురుని వెన్నెలగాని మందపవనములుగానీ ఏ వ్యాకులతా కలిగించలేవనీ శ్రీవేంకటేశునితో తన కూటమి తథ్యమంటున్నది. ఇదిగో నా నోముఫలమైన వేంకటేశుని కరుణ నాకు లభించింది. ఇక నాకే జీవనోపాయమూ అవసరం లేదు. నాపై తనకు కూడా నూరింతలై ఆశలు కలిగినవి. మరుని బాణములు యెంత వాడిగలవైనా తిరుమలేశుని కరుణ నాపై వుండగా నన్నేమీ చేయజాలవు. కోకిల కూజితములు గర్వంతో బాధాకరమే విరహిణులకు. కాని రమణుని ప్రేమ చూడ్కులు నాకున్నవి. చంద్రుని వెన్నెల వెట్ట (వేడిమి) యైననేమి? శ్రీనివాసుడే నా చుట్టమైనాడు కదా? చిలుకలు కొరకొరై (చెలరేగి) మిక్కిలి విజృంభించినవి. అయినప్పటికీ వల్లభుడు నాకు పెట్టిన అక్షతలు నాకున్నవి. కావాలని మంద పవనుడెంత మందంగా వీచినా అందరిలోనూ అతని పొందు నాకే దక్కినది. ఓ శ్రీవేంకటేశ్వరుడా! నన్నేలినందున అతని చనవు నాకు లభించినది.

★ **వెరపు** – జీవనోపాయము ★ **పదిపదై** – నూరింతలై ★ **చొప్పులు** – చూడ్కులు





సంఖ్య : 189 సంపుటము : 12 పుట: 109 రాగం : బంగాళం

**13** వుత్తమనాయకుఁడవు వోరుపు గలవు నీవు
చిత్తగించి నా బత్తి చేకొనవయ్యా ॥పల్లవి॥

ఇంగిత మెఱఁగ నైతి నేడలేనివి గడించి
వెంగెము నిన్నాడితి వెనకకును
సంగ తెఱిఁగితి నిట్టే సమ్మతించితి నీ మాట
చెంగలించి నీకు మొక్కేఁ జేకొనవయ్యా ॥వుత్త॥

విరహఁపుఁగాఁకఁ జెంది వేఁడుకోఁగానే నిన్ను
విరులఁగొని వేసితి వేమారును
సరవు లెల్లాఁ గంటి సంతోసించుకొంటి నిన్ను
సిరులఁ బంతము లిచ్చేఁ జేకొనవయ్యా ॥వుత్త॥

మిక్కిలి మోహముతోడ మేనవాఁడ వనఁగానే
వెక్కసాన జంకించితి విచ్చనవిడి
యిక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
చెక్కు నొక్కి నవ్వించేఁ జేకొనవయ్యా. ॥వుత్త॥ **189**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో నాయిక శ్రీవేంకటేశ్వరునితో ఏమంటున్నదో వినండి. స్వామీ! నీవు ఉత్తమమైన నాయకుడవు నీవు ఓర్పుగలవాడివి. నా ఆరాధనను దొడ్డమనసుతో స్వీకరించవయ్యా! నేను ఇన్నాళ్ళూ దేవదేవుడవనే కొద్దిపాటి ఇంగితముకూడా కనబరచలేకపోయాను. ఎక్కడాలేని మాటలనలవరచుకొని నీ వెనకకును (పరోక్షముగా) నీపై వ్యంగెముగా, మాట్లాడాను. అసలు సంగతి తెలిసిన తరువాత నా సమ్మతిని తెలిపాను. అతిశయించి నీకు మొక్కెదను. నా మనవి చిత్తగించవయ్యా! స్వామీ! విరహాగ్నిననుభవించి, ఇక భరించలేనని నిన్ను వేడుకోగానే నీవు కరుణతో పూవులను నాపై పలుమార్లు, కురిపించితివి. నీ తీరులెల్లా గమనించి సంతోషించాను. నేను సిరులరాణిని. నిన్నే చేపడతాననే నా పంతమును స్వీకరించి నన్ను చేకొనుమయ్య. ప్రభూ! మిక్కిలి మోహముతో విడిగా నన్ను బెదరించి అధికముగ బాధించితివి. ఇక్కడ శ్రీవేంకటాద్రిపైనా యేలికవై నన్ను చేకొని చెక్కిలి నొక్కి నవ్వించితివి.

★ **చెంగలించి** – అతిశయించి ★ **సరవి** – తీరు
★ **మేనవాడవు** – మేనబావవు ★ **వెక్కసాన** – అధికముగ

సంఖ్య : 347 సంపుటము : 12 పుట: 199 రాగం : శ్రీరాగం

**14** విరహము మీఁదనే వేడుక వెల్లివిరిసీ
నిరతి నెండలలోనే నీడలు గలిగేనే ॥పల్లవి॥

చెక్కునఁ బెట్టినచేయి సెలవి నవ్విన నవ్వు
వొక్కమాటే నీకు నెందుంటి వచ్చెనే
లక్కవంటి దీ మనసు చొక్కు వంటిదీ వలపు
గక్కనఁ బతిఁ గంటేనే కల భెరుకాయనే ॥విర॥

మోవిమీఁది వసివాడు మొగముపై చెంగలింపు
యీవల రెండూ జవళి నెట్టు గల్గెనే
పూవువంటిది యాస పూఁపవంటిది పొందు
నీ విభుఁడు రాఁగాను నిండు దోమ టాయనే ॥విర॥

చన్నులఁబయ్యద జారు సరిఁగన్నుఁగవ సిగ్గు
యెన్న నొకటొకటికి నెనయు టెట్టే
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్నుఁ గూడె
సన్నల నితనివల్ల సరిబేసు లాయనే. ॥విర॥ **347**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనకి నిజంగా ఆయన భావము వివరించగలవారెవరైనా వుంటే, వారు తెలుగు భాషాకోవిదులని నేను పాదాభివందనం చేస్తాను. నేను వూరకనే అనటంలేదు. ఈ విధంగానేను భావిస్తున్నాను. ఓలలనా! విరహము అనుభవించటం లోనూ, వేడుక అతిశయిస్తుంటుంది. ఎండలోనుంచి వస్తేనే కాని నీడలోవున్న సుఖంపై ఆసక్తి కలుగదు కదా! చెక్కిలిపై చేయివుంచి చింతించటం, లే చిరునవ్వులు నవ్వటం నీకొక్కమాటేయెలా వచ్చాయే? మనస్సేమో లక్కవంటిది, గట్టిగా కనుపించినా వూరకనే కరిగిపోతుంది. వలపేమో, మోహాతిశయంకలిగించేది. నీ పతిని చూస్తూనే నీకు మీ కలయిక గుర్తుకొస్తుంది. ఓ భామినీ! నీమోవి బాగా వాడిపోయింది. మొగము మాత్రం హసించుచున్నది. ఈ రెండూ జంటగా నీకు ఒకమాటే యెలా వచ్చాయే? ఆశయేమో పూవువంటిది, ఇంతలో వాడిపోతుంది. పొందు పిందెవంటిది. అది పండితేకాని లాభం లేదు. నీ ప్రియుడు రాగానే నీకు పెళ్ళి భోజనం తిన్న తృప్తి కలుగుతుంది. శ్రీవేంకటేశుని చూడగానే నీ చనుగవపై పయిట జారిపోతుంది. కనుగవ సిగ్గుతో వాలిపోయాయి. ఇక ఆయననెట్లు కూడెదవు? చీకటి పడగానే మంచీ చెడూ మాట్లాడుకోరా?

★ **చెంగలించు** – హసించు ★ **పూప** – లేతపిందె
★ **దోమటి** – పెండ్లి విందు ★ **సరిబేసులు** – మంచీచెడ్డ





సంఖ్య : 187 సంపుటము : 12 పుట: 107 రాగం : సామవరాళి

**15** వెలలేని గొల్లెతలే వేడుక గాక
పిలువక వచ్చేవారు ప్రియమయ్యేరా ॥పల్లవి॥

దొంతరచూపులు చూచి తొరలింపుమాట లాడి
పంతాలుగొనే సతులు బాఁ తెయ్యేరా
వింతగా నవ్వులు నవ్వి వేడుకలు నీకు రేఁచి
చెంతఁ గాచుకుండేవారు చిత్తము వచ్చేరా ॥వెల॥

పచ్చిదేరఁ జెనకుచు బాగాలు చేతి కిచ్చి
యిచ్చకము సేసేవారు ఇత వయ్యేరా
కొచ్చి కానుక లొసఁగి కొలువులు సారెఁ జేసి
ముచ్చట లాడేవారు మచ్చి కయ్యేరా ॥వెల॥

కన్నులనే నీకు మొక్కి కందువ నెదురు చూచి
సన్నల మెలఁగేవారు సమ్మ తయ్యేరా
మన్నించి శ్రీవేంకటేశ మమ్ము నిట్టే యేలితివి
వున్నవారల్లా నీకు నొద్ది కయ్యేరా. ॥వెల॥ **187**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో తిరుమలేశునికొక చిక్కుప్రశ్న వేస్తున్నారు. స్వామీ! ఆనాడు రేపల్లెలో గొల్లకంపు గొల్లెతలను వలపించావంటే, నీకు అదొక వేడుకలే అని సర్దిచెప్పుకొన్నాం. నేడు నీవు పిలువకనే వచ్చేవారు ప్రియమయ్యేరా? ఇదేమి వింత? ప్రభూ! మిక్కుటమైన చూపులు చూచి, అనాలోచితంగా మాట్లాడి, నీతో పంతముపట్టే భామినులు నీకు ప్రియమయ్యేరా? వింతగా నవ్వుతూ నీలో వేడుకలు రేపేవారు నీచెంతజేరి నీ పొందుకోసం కాచుకొనివుండేవారు నీకు మనసుకు నచ్చేవారయ్యారా? పచ్చిదేర జెనకుచు (అశ్లీలముగా తాకి, నొక్కుచు) బాగాలు చేతికిచ్చి అందాలను అందించి) ఇచ్చకములు మాట్లాడేవారు హితులయ్యారా? విరివిగా కానుకలొసగి నీతో గోష్ఠిలో పాల్గొని ముచ్చటలు జెప్పేవారు దగ్గరవారయ్యారా? నీకు కన్నులతోనే మొక్కి, కందువలో (సంకేతస్థలం) యెదురుచూచేవారు నీ కనుసన్నలలో మెలిగేవారు సమ్మతి కలిగించేవారయ్యారా? వారెంతవారైతే నాకేమి? ఓ వేంకటేశ్వరా నన్నూ సమ్మతించి కూడినావు. భక్తిగలవారంతా నీకు ఒద్దికయ్యేరా?

★ **బాతి** – ప్రీతి ★ **తొరలింపుమాటలాడి** – అనాలోచితంగా మాట్లాడి
★ **ఒద్దిక** – ప్రియము ★ **కాచ్చి** – విరివిగా

సంఖ్య : 135 సంపుటము : 20 పుట: 91 రాగం : శంకరాభరణము

**20 ఎఱఁగఁడు గాక తన్ను నిందరు నాడుకొనేది**
**తటితో నామాఁట తానే తలఁచుకొమ్మనవే** ॥పల్లవి॥

**తగునా పొలుసుమేనఁ దట్టుపుణుగు**
**సొగయుబట్టతలకు చుట్టు తపారమేలే**
**అగడుసెలసుమోర కమరునా చిరునవ్వు**
**సగముమానిసికేలే చక్కఁదనాలు** ॥ఎఱఁ॥

**పుట్టుతిరిపేనకేలే భూషణములు**
**యిట్టె బ్రహ్మచారికేలే యింతులపొందు**
**నెట్టన యెంగిలీ నోఁట నిచ్చల ఘటనలేలే**
**తిట్టులఁబడేవానికి దీవనలేలే** ॥ఎఱఁ॥

**సిగ్గువిడిచినమీఁద చీర గట్టవలెనా**
**వెగ్గళమై గెరదాఁటేవిచారమేలే**
**నిగ్గుల శ్రీవేంకటాద్రినిలయుఁడు నన్నుఁ గూడె**
**యెగ్గులెల్లాఁ బాసె నిఁక యెడమాఁటలేలే** ॥ఎఱఁ॥ **135**

**పరిచయ పరిమళం :**

ఇది శ్రీహరి దశావతారములను సమన్వయపరచిన అన్నమయ్య శృంగారకీర్తన. నాయిక తన చెలికత్తెతో యేమంటున్నదో వినండి. తనను అందరూ యేమనుకొంటున్నారో తానెరుగడు కాబోలు. నా మాట తానే కాస్త ప్రయత్నించి తలచుకొమ్మని చెప్పవే. అంత తట్టుపుణుగు దట్టించుకొంటే పొలసుల శరీరంలా వున్నదాయనకు **(మత్స్యావతారం).** బట్టతలకి తలపాగా చుట్టుకొంటే మాకు తెలీదుటే. **(తాబేలు–కూర్మావతారము).** ఇంత పెద్ద "మోర" పెట్టుకొని చిరునవ్వొకటి **(వరాహావతారము).** అతగాడు సగమే మనిషి దానికి చక్కదనము కూడానా. **(నరసింహావతారం).** పుట్టినదగ్గరనుంచి ముష్టివాడే మరి నగలెక్కడివే? **(వామనావతారం).** హాయిగా బ్రహ్మచారిగా వుండిపోక స్త్రీ పొందు యెందుకే తనకు? **(పరశురామావతారం).** ఎదురుగా, యెంగిలిపెట్టిన నోటిలో వద్దనడు **(శబరి యెంగిలితిన్న రఘురామావతారం).** ఎవరితో పడితే వారితో తిట్లుతినేవానికి ఆ తిట్లే దీవెనలు లేవే **(కృష్ణావతారం).** సిగ్గులన్నీ విడిచిపెట్టాడు. ఇంకా చీరెకూడా యెందుకు? **(బుద్ధావతారం).** అతిశయముతో హద్దులు దాటేవానికి విచారమెందుకే? **(ఊచకోత కోసిన కల్కి అవతారం).** సఖీ! ఎన్ని వేషాలు వేసినా శ్రీవేంకటాచలపతియై నన్ను తప్పక కూడుతాడు, తప్పులేనివాడవుతాడు. ఇక నేనెందుకు కాదంటూనే?

★ **తటితో** – ప్రయత్నంతో ★ **గెరదాటే** – హద్దులుదాటే





సంఖ్య : 188 సంపుటము : 12 పుట: 108 రాగం : కోకిలపంచమం

**17 యింతకంటే సుద్దులు నే మెఱఁగము**
**వింత లెల్లా నీకు విన్నవించఁగ వచ్చితిమీ** ॥పల్లవి॥

**మనసెల్లా నీమీఁద మంతనాలు చెలులతో**
**తనువు పానుపుమీఁదఁ దరుణికిని**
**కనుఁగొంటే దయ వుట్టు కడ నున్నవారికైనా**
**వినవయ్య నీకు విన్నవించఁగ వచ్చితిమి** ॥యింత॥

**గుటిగాఁ జేయి చెక్కుపై కొనచూపు నీ రాకపై**
**జఱయు నిట్టూర్పులు చన్నులమీఁద**
**కఱకురా యైనాను కరఁగుఁబో నీకువలె**
**వెఱగంది యిదే విన్నవించఁగ వచ్చితిమి** ॥యింత॥

**అలయిక తనలోన ఆసలు నీ కౌఁగిటిపై**
**సెలవుల లేనగవు శ్రీవేంకటేశ**
**కలిసితి వింక మేడకంబమైనా నిగిరించు**
**వెలసే వేడుక విన్నవించఁగ వచ్చితిమి.** ॥యింత॥ **188**

**పరిచయ పరిమళం :**

దేవి చెలికత్తెలు శ్రీనివాసునికి విన్నవించుకొంటున్నారు. అన్నమయ్య వారిలో దేవికి ముఖ్యురాలు. స్వామీ! ఇంతకంటే ఆమె 'కతలు' వివరించలేమయ్యా! అన్నీ వినడానికి వింత వింతగా వుంటాయి. ఆమె విరహవేదన చూడలేక నీకు విన్నవించుదామని వచ్చాము. ప్రభూ! తానొకపక్క చెలులతో మంతనాలు చేస్తున్నా ఆమె మనస్సంతా నీమీదే వున్నదయ్యా! ఆమె శరీరమే పాన్పుమీదవున్నది. ఆ తరుణిని కనులారా చూస్తే పరాయివారికైన దయపుడుతుంది. నీవు స్వతహాగా కరుణానిధివని నీకు విన్నవించ వచ్చాము. దేవా! ఆమెను గమనించు. తన చేయి చెక్కిలిపై జేర్చి క్రీగంట నీ రాకకెదురు చూస్తూనే వున్నది. ఆమె నిరాశతో నిట్టూరుస్తుంటే ఆ వేడికి చనుగవ వేడెక్కుతున్నాయి. ఆమెను చూస్తే నీవంటి రాతిహృదయం కలవారి గుండెయైనా కరిగి తీరుతుంది. మేము కూడా ఆమెను చూచి భయపడి నీవద్దకు వచ్చాము. తనలో శ్రమజేత ఆమె అలసిపోయింది. అయినా నీ కౌగిలికి నిరీక్షిస్తున్నది. ఆమె పెదవులపై చిరునవ్వు మాయలేదు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఒంటి స్తంభపు మేడలోని యువరాణివలె నీవు ఆమెను కూడితే పొందే వేడుక వివరించవచ్చామయ్యా!

★ **అలయిక** – శ్రమ ★ **మేడకంబమైనా** – ఒంటిస్థంభపు మేడపై

★ **నిగిరించు** – నిరీక్షించు ★ **జఱయు** – జాస్తిగా

సంఖ్య : 279 సంపుటము : 20 పుట: 187 రాగం : బౌళి

**18** మానిపండ్లు మఱి మానికిందనే వుండు
తానేమన్నా తనకే యనరే ॥పల్లవి॥

చిగురులమాఁటల చిల్లులువోయను
తగుఁ బెదవులపై తనకే అది
మగటిమి యింకా మాతో నేఁటికి
జగడము లడిచీఁ జాలించు మనవే ॥మాని॥

కారపుఁజూపుల కాలువలాయను
దారలచెమటలఁ దనమేన
ఓరుచు మాతో బొంకఁగ నేఁటికి
దూరులఁబడితిమి తొల తొలమనవే ॥మాని॥

కొనగొనచేతులు గురులయి తగిలెను
తననాకాఁగిట తనఁదనకే
యెనసెను శ్రీవేంకటేశుఁడు నన్నిటు
మనికయి అలమేల్‌మంగ నేఁ గదవే ॥మాని॥ **279**

**పరిచయ పరిమళం :**

ఇది అలమేల్మంగమ్మ తన చెలులతో చెప్పుకొన్న ఆమె మనోవేదన. అన్నమయ్య కూడా దేవి చెలికత్తెలలోనివారే. విసిగిపోయిన దేవి యేమంటున్నదంటే... చెట్టుమీదవున్న పండ్లు, పడితే ఆ చెట్టు క్రిందనే కదా! పడేది. తాను నన్ను యేమని తిట్టినా, అన్నీ తనకే తగులుతాయని చెప్పండే. నాకేమి నష్టం? లేత చిగురులవలె మృదువుగా మాట్లాడే ఆయన నేడు చిల్లులు పడేలా మాట్లాడుతున్నాడు. ఆ పలుకులు పలికిన ఆయన పెదవులు సిగ్గుపడాలి. నాకేమినష్టమే? ఆయన మగతనం అలాచూపిస్తే మాకెందుకే? ఇకనైనా, ఆ జగడాలు చాలించమనండే. చెలులారా! ఆయన కటువైన చూపులు మిక్కుటమాయెను. తన శరీరమంతా చెమట ధారలు కట్టినది. ఇంకా నాతో బొంకుతాడు, రగడ చేస్తాడు. ఈ రోజుతిట్లూ తినవలసి వచ్చింది. ఇదింక చాలుచాలు అని ఆయనకు చెప్పండే. కావలెనని అతని చేతులు తన దేహమున పలుచోట్ల తగులగా, తన నాకౌగిట తనువు తనువు ఒకటైనవి. శ్రీవేంకటేశుడు ఇట్టే తాను నన్నేలినాడు. నేను మన్నించబడిన అలమేల్మంగను కదటే.

★ **కారపుజూపుల** – కటువైన చూపులు ★ **కాలువలాయను** – మిక్కుటమాయెను
★ **తొలతొల** – చాల్చాలు





సంఖ్య : 17 సంపుటము : 6 పుట: 13 రాగం : సామంతం

**19** వలదన నొరులకు వసమటవే
తలఁచినట్ల నిది దైవమె చేసె. ॥పల్లవి॥

తరుని కుచములను తామరమొగుడలు
విరిసేనోయని వెరపునను
సరగునఁ బతి నఖ చంద్రశకలములు
దరులఁ గలుగ నివి దైవమె చేసె. ॥వలదన॥

పొలిఁతి వదనమను పున్నమచంద్రుఁడు
బలిమి నెగయునని భయమునను
మెలఁత చికుర ధమ్మిల్లపు రాహువు
తలఁజెదరఁగ నిదిదైవమె నేసె. ॥వలదన॥

వనితకు వాడునొ వలపు తాపమున
తనులతికయనుచుఁ దమకమున
ఘనవేంకటపతికౌఁగిట చెమటలఁ
దనివిదీర్చనిది దైవమె సేసె. ॥వలదన॥

**పరిచయ పరిమళం :**

సరిగ్గా ఇటువంటి అన్నమయ్య కీర్తన ఇదివరలో ఒకటి చూశాము. పల్లవి మాత్రం మార్పుచెందిన సౌరభమే. దైవము యెట్లా తలచుకొంటే అట్లాగే అవుతుంది. మనము కాదంటే వీలుపడుతుందా? ఒరులకు దానిని కాదనుట సాధ్యమా? ఆ, తరుణి వక్షోజములనే తామరమొగ్గలు విరిసి ఆమెకు నొప్పికలుగుతుందేమోనని ఆమె పతి వెంటనే ఆ కుచములపై నఖక్షతములు అర్థచంద్రాకారములో చేసినాడు. ఇటువంటి సమయస్ఫూర్తిని అరుదుగా చూస్తాము. దైవము అనుకూలిస్తేనే ఇట్టిపతి దొరుకుతాడు. ఆ, పొలతి (వనిత) వదనమను పున్నమిచంద్రుడు వెలుగులు జిమ్ముతాడేమో అనే భీతితో ఒత్తైన వెంట్రుకలుగల కొప్పు అనెడి రాహువు దానిని కప్పివేసి కబళించినది. ఆమె తల చెదిరిపోవుటచే అట్లు జరిగినదా లేక దైవఘటనా? ఆ, వనితకు వలపుతాపము కలిగించినది తానే కదా! కానీ దాని వలన ఆమె తనువు అనే లత వడిలిపోతున్నదనే తత్తరపాటులో శ్రీవేంకటపతి అంతటివాడు బిగియార కౌగలించి తన చెమటలలో ఆమెను తడిపినాడు. ఇది తప్పక దైవము చేసిన చేతయే కదా!

★ **చికురధమ్మిల్లము** – ఒత్తైన వెంట్రుకలున్న కొప్పు ★ **తనులతిక** – శరీరమను లత
★ **దరులన్ కలుగ** – ఎక్కడనో కలిగే

సంఖ్య : 537 సంపుటము : 20 పుట: 359 రాగం : పాడి

**24 గందమందుకోవయ్య కలికి నీ కొసఁగీని**
**అందుకునందుకే సరి అధికము వలపు** ||పల్లవి||

**దవ్వులనుండినపతి దగ్గరివచ్చినప్పుడు**
**రవ్వలైనకోపము రాకుండదు**
**నవ్వులునుఁ దోడనే నయములు చూపకుండదు**
**యెవ్వరికి నిందుకుఁగా నెగ్గులేల యెంచను** ||గంద||

**తలవంచుకొన్నవాఁడు తప్పకచూచితేను**
**మొలకపంతాలు గడుమోవకుండవు**
**అలరి అంతటిలోనే ఆసలు రేగకుండవు**
**చలము లిందుకుఁగాను సాదించనేఁటికి** ||గంద||

**మెడఁగట్టుకొన్నవాఁడు మేలములాడితేను**
**అడియాలములు మేన నంటకుండవు**
**అదరి శ్రీవేంకటేశ ఆపె యలమేలుమంగ**
**వొడికమై కూడితిరి వోసరించనేఁటికి** ||గంద|| **537**

**పరిచయ పరిమళం :**

భర్త తనుద్యోగ నిర్వహణలో వేరే వూరువెళ్ళి చాలాకాలానికి రావటం ప్రతిజంటకు అనుభవమే. ముందు చిరాకుపడిన భార్య అంతలోనే అనుకూలవతి అవటం సర్వసాధారణమే. అట్టి అనుభవాన్ని ఆవిష్కరిస్తున్నారు అన్నమయ్య. ఆదిదంపతులకీ అనుభవం రుచిచూపటం, నభూతో నభవిష్యతి. ఓ తిరుమలరాయా! గంధమునందిస్తున్న నీ దేవేరి వద్ద దానిని స్వీకరించి ఆమె ఆహ్వానాన్ని మన్నించు. దానితో మీ విరహానికి సరి. ఇక మీ వలపు దినదినప్రవర్ధమానము. ఆమె అలిగిందని అపార్థం చేసికోవద్దు. దూరముననున్న పతి చేరువైతే "రవ్వలైనకోపము రాకుండునా?" అంతలోనే నవ్వి అనురాగం చూపించదా? ఇందులో ఎవ్వరినీ తప్పుపట్టలేమయ్యా. ఆడవాళ్ళంతే. తలవంచుకొనివున్న భర్త తప్పక చూస్తాడని ఆమె ఆకాంక్ష. ముందు ఎవరు మాట్లాడాలి అనే పట్టుదలకూడా సహజమే. అంతలోనే ఆమెలో ఆశలు కలుగకమానవు. మళ్ళీ నువ్వు అంతలోనే పట్టుదలలకు పోకూడదు. సరియే కదా? సాధింపెవరితోనయ్యా? ఆమె నీది. అప్పుడు మొగుడు పరాచికాలాడితే ఆమె సులభంగా నీకు అంటుకుపోతుంది. ఒడికమై కూడితిరి (మనసుపడి ఒకటయ్యాక) తోడు విడువవచ్చునా? నీవు వేంకటపతివి, ఆమె అలమేల్మంగ, అవునా?

★ **రవ్వలైన** – తిట్టేంత ★ **మెడగట్టుకొన్నవాడు** – మొగుడు
★ **అడియాలము** – సులభముగా ★ **ఓసరించనేటికి** – విడచుటదేనికి





సంఖ్య : 29 సంపుటము : 20 పుట: 20 రాగం : తెలుగుగాంబోది

**21 అందరును వినరమ్మ ఆమాఁట**
**అందాలు చెప్పఁగవచ్చీ నమ్మరోయమ్మా** ||పల్లవి||

**యీతల నన్ను రమ్మని యేఁటికిఁ బిలిపించెనో**
**ఆతని నడుగరమ్మా ఆమాఁట**
**రాతిరెల్లా జాగరాలే రవ్వకెక్కెఁ బగలెల్లా**
**చేఁతలేమి సేయవలెఁ జెప్పరోయమ్మా** ||అంద||

**పనిలేనిపనికేల పంతమిచ్చెనో కాని**
**అనఁడా తా నావేళ ఆమాఁట**
**తనిసె నామనసెల్లాఁ దలకెక్కె వలపెల్లా**
**అనుమానా లేమిగల్లా నాడుమనరమ్మా** ||అంద||

**యేకతానఁ జెప్పేనంటా నిందరి మిమ్ముఁ బొమ్మనె**
**ఆకడ నప్పుడే వింటి నామాఁట**
**పైకొని శ్రీవేంకటాద్రిపతి యింతసేసి కూడె**
**మీకుమీకే యిఁకనైనా మెచ్చుకోరేయమ్మా** ||అంద|| **29**

**పరిచయ పరిమళం :**

ఆతడు నన్నెందుకు రమ్మని పిలిచాడో మీరేతనని అడగండమ్మా! అందరూ ఆ మాట వినండి. అమ్మమ్మో! నా అందాల గురించి యేదో చెబుతాడటమ్మా! అని గట్టిగా అడుగుతున్నది నాయిక. పాపం అన్నమయ్య కూడా ఈ గొడవ తానూ నాయిక సఖియై వింటున్నారు. ఇటువైపుకి నన్ను రమ్మని యెందుకు పిలిచాడో ముందుకనుగొనండి. ఆ మాట ఆయన నోటినుండే విందాము. రాత్రంతా జాగరణ చేయాల్సివచ్చింది. పగలంతా వాళ్ళతో వీళ్ళతో నిందలు పొందటం నాపని. ఇటువంటప్పుడు నేనేం చేయాలో మీరేచెప్పండి. పనిలేని పనియట నాదగ్గరకు రావటం. మరి అంతదానికి నాకోసం పంతమెందుకు పట్టాడే. తానావేళ ఆ మాట అన్నాడో లేదో కనుక్కోండి. ఏది యేమైనా, నా మనస్సు తృప్తి జెందింది. ఆతనిపై నాకున్న వలపంతా తలకెక్కింది. తనకేమన్నా అనుమానాలుంటే చెప్పమనండమ్మా! ఆమాట ఏకాంతంలో నాతో మాత్రమే చెబుతానని మిమ్మల్నందర్నీ పొమ్మన్నాడు కదా! అప్పుడే నేనూ ఆమాట విన్నాను. ఇంతాచేసి ఆ శ్రీవేంకటపతి నన్ను ఆక్రమించినాడు. మీకు మీకే అదీ నచ్చితే, మరి ఆయనను మెచ్చుకోండి.

★ **రవ్వకెక్కె** – నిందలుపొందుటే ★ **తనిసె** – తృప్తిపడింది
★ **ఏకతాన** – ఏకాంతంలో ★ **పైకొని** – ఆక్రమించి

సంఖ్య : 549 సంపుటము : 20 పుట: 367 రాగం : పాడి

**22** నిన్నరానికోపము నేఁడేఁటికే
పన్ని నీచేఁతలచే భ్రమయించరాదా ॥పల్లవి॥

మొగము చూచి నీపై మోహ మాతఁడు చల్లఁగా
నగరాదా కొంతైనా నాలి యేఁటికే
బిగువు చూపకుండితే పిరిదీసినట్లుండు
తెగువతో దీమసము తెచ్చుకోరాదా ॥నిన్న॥

దగ్గర వచ్చి విభుఁడు తమకము రేఁచఁగాను
సిగ్గులు విడువరాదా చింతలేఁటికే
కగ్గుదేరి యంటకున్న కైకోనియట్లుండు
వెగ్గళించి మచ్చికలు వెదచల్లరాదా ॥నిన్న॥

శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జిత్తగించి కూడఁగాను
భావించి మెచ్చఁగరాదా పంతమేఁటికే
మోవితేనె లియ్యకున్న మొరఁగినయట్లనుండు
సావధానాన నన్నిటా చనవియ్యరాదా ॥నిన్న॥ **549**

**పరిచయ పరిమళం :**

దేవి చెలికత్తెయైన అన్నమయ్య ఆమెతో వాదిస్తున్నది. నిన్నంతా నీ విభునితో సఖ్యతగానేవున్నావు కదటమ్మా! నిన్నరాని కోపము నేడు దేనికి వచ్చింది? ఒకవేళ ఆయన నిన్ను నొప్పిస్తే నీవలపు చేష్టలచే ఆయనను మోహింపజేయరాదటమ్మా? ఆయన అదేపని చేశాడు కదా! నీ ముఖములో తనముఖముపెట్టి సూటిగా చూస్తూ మోహము రేకెత్తించాడు. మరి, నీవు కొంచెమైనా నవ్వవచ్చునుకదా! కపటమెందుకమ్మా? అలాగని ఆడది బిగువు చూపకపోతే వలపు జగడములో పారిపోయినట్లవుతుంది. ధైర్యంతో ఉపాయముగా, వ్యవహరించాలి. నీ విభుడు దగ్గరకువచ్చి నీకు తన్మయత్వము కలిగించాలని ప్రయత్నిస్తాడు. అప్పుడు ఈ పనికిరాని సిగ్గులు విడిచిపెట్టెయ్యాలి. ఎవరు ముందు లొంగినారని ఆలోచించరాదు. కోపంతో కందిపోయి ఆయనను తాకనంటే నీవే సమ్మతించినట్లుంటుంది. అతిశయించి మచ్చిక చూపవమ్మా! శ్రీవేంకటేశరుడే ప్రేమభావముతో నిన్ను చేరితే వెంటనే కూటమికంగీకరించాలి. నీ అధరపుతేనెలు అందించకపోతే పోట్లాడినట్లుంటుంది. సావధానంగా అనుకూలమవ్వాలి.

★ **భ్రమయించు**–మోహపరచు ★ **పన్ని**–పూని ★ **నాలి**–కపటం ★ **కగ్గుదేరి**–కందిపోయి
★ **కైకొను** – సమ్మతించు ★ **మొరగినట్లుండు** – పోట్లాడినట్లుంటుంది





సంఖ్య : 185 సంపుటము : 20 పుట: 125 రాగం : శంకరాభరణం

**23** దిమ్మరిమాట లాడీనే తిమ్మరాయఁడు
కొమ్మని వరము లిచ్చీఁ గొండలరాయఁడు ॥పల్లవి॥

గద్దెమీఁద నల్లవాఁడే కంటిరటే చెలులాల
పొద్దొకసింగారాలభోగరాయఁడు
యిద్దరుసతులమీఁదా నిమ్ములఁ జేతులు చాఁచి
సుద్దులు చెప్పీఁగదే సుగుడరాయఁడు ॥దిమ్మ॥

నిక్కిచూచీ నేఁటికో నెలఁత లదేమనరే
చక్కనిమోవినవ్వులజాణరాయఁడు
వెక్కసపురాజసాన విఱ్ఱవీఁగీఁ గొలువులో
చెక్కులచెమటతోడ చెలువరాయఁడు ॥దిమ్మ॥

మెండుగుకళలమేనిమెఱుఁగులు చల్లీని
నిండుసరసములకోనేటిరాయఁడు
దండిగా నురముమీఁదితరుణికాఁగిట వాఁడే
వెండిపైఁడిమేడలో శ్రీవేంకటరాయఁడు ॥దిమ్మ॥ **186**

**పరిచయ పరిమళం :**

ఈ తిమ్మరాయుడు శ్రీవేంకటేశుడు దిమ్మరిమాటలాడీని (భ్రమజెందినవానిలా) మాటలాడుతున్నాడు. ఈ కొండలరాయుడు తీసికోండిరా అని పెక్కు వరములిచ్చుచున్నాడు. మధురభక్తి మాంత్రికుడు అన్నమయ్య. ఆయనకాయనే సాటి. చెలులారా! సింహాసనంపై ఆసీనుడైన స్వామి పూటకొక్క అలంకారం ధరించుతూ భోగరాయుడని పేరుబడ్డాడు. తన ఇద్దరు భార్యలమీద నిశ్చింతగా చేతులు చాచి ఆ సుగుడరాయుడు (సరసుల్లో శ్రేష్ఠుడు), వారికి యెన్నో ముచ్చట్లు చెబుతున్నాడు. ఎందుకోగానీ ఆయన నిగిడి చూస్తున్నాడు. ఆ నెలతలను రమ్మనరే. చక్కని మనోహరమైన నవ్వుల జాణరాయుడాస్వామి. తన కొలువులో అంతులేని రాజసముతో విఱ్ఱవీగుచున్నాడు. ఆయన చెక్కిళ్ళపై చెమటలు అందంగా మెరుస్తున్నాయి. అందగాడు కాబట్టే అందరూ చెలువరాయుడంటున్నారు. మెండైన కళలతో తన శరీరం మెరుస్తుంటే పూర్తిగా సరసాలలో నిమగ్నమయ్యాడు ఈ కోనేటిరాయుడు. దండిగా తన ఉరముపైనున్న కాంతను కౌగిటచేర్చి వెండి బంగారము నిండిన భవంతిలోనివాడే, శ్రీవేంకటరాయుడు.

★ **నిమ్ముల** – నిశ్చింతగా ★ **విఱ్ఱవీగీ** – అతిశయించి
★ **దండిగా** – ధైర్యంగా ★ **మెరగులు చల్లీ** – కాంతులీనుతూ

సంఖ్య : 474 సంపుటము : 20 పుట: 317 రాగం : శ్రీరాగం

**28** ఇంతటనుఁ గరుణించు ఇదె విన్నపము నీకు
ఇంతి యలమేలుమంగ ఇరవై నీకున్నది ॥పల్లవి॥

చేతుల నీరూపు వ్రాసి చెలరేఁగివుండేయాస
గాతల నీసతి పొద్దుగడపీ నదె
నీతితోడ వీనులను నీకతలు వినేయాస
రాతిరిఁబగలును బీరము సేసుకున్నది ॥ఇంత॥

తలపోఁతలను నిన్ను దగ్గరివుండేటియాస
పెలుచై నదేహము పెంచీ నదె
కలలోననైన నిన్నుఁ గాఁగిలించుకొనేయాస
బలువుగాఁ బ్రాణము పట్టుకున్నదదివో ॥ఇంత॥

యిట్టె నీవు వచ్చేవని యెదురుచూచేయాస
నెట్టుకొని వేడుకతో నిలుచున్నది
గట్టిగా శ్రీవేంకటేశ కైకొని కూడితి విదె
వొట్టుక నిన్నుఁ బాయక వొద్దికై తానున్నది ॥ఇంత॥ **474**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో నూతన వధువైన అలమేల్మంగకున్న యెన్నో ఆశలను స్వామికి విన్నవిస్తున్నారు. ఆమెను కరుణించమంటున్నారు. స్వామీ! నీకు ఇదే మా విన్నపము. ఆ ఇంతి అలమేల్మంగను ఇంతటితో కరుణించుము. నీకు అనుకూలవతియై అమె వున్నదయ్యా! తన అరచేతులలో నీ రూపము వ్రాసుకొని చెలరేగే ఆశలతో నీసతి పొద్దుగడుపుచున్నది. తన చెవులతో నీ కథలు వినాలనే ఆశతో రేయింబవళ్ళు, ఆమె శక్తి కూడగట్టుకొని వింటున్నది. నీయొక్క తలపులలోనైనా నీకు దగ్గరయ్యే ఆశతో బలహీనపడ్డ దేహముతోవున్నది. అదిగో ఆమె నిన్ను కలలోనైనా కౌగలించే ఆశతో బలవంతాన తన ప్రాణాలను నిలుపుకొని, ఆమె నీకోసం వేచివున్నది. నీవు ఇదిగో వచ్చేస్తున్నావనే ఆశతో వేడుకగా నీకోసం నిలుచునివున్నదా? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు చేతులతో స్వీకరించి ఆమెను కూడితివి. ఆమె నిన్ను వీడక వొద్దికగా వున్నది.

★ **గాతల**–గాథలతో ★ **బీరముసేసుకొను**–శక్తి తెచ్చుకొన్నది ★ **నెట్టుకొని**– పూనుకొని
★ **ఒట్టుక** – ప్రతిజ్ఞతో ★ **నీతితో** – నియమం తప్పక ★ **పెలుచైన**– బలహీనపడ్డ





సంఖ్య : 48 సంపుటము : 20 పుట: 33 రాగం : హిందోళవసంతం

**25** పతి మీఁది తమకాన భ్రమసితివింతే నీవు
అతివరో వెఱపేలే అవే నీవు గావా ॥పల్లవి॥

చందురుఁ డితఁడు గాఁడే సతి నీనెమ్మోముగాని
పొంది నీనీడ జలధిఁ బొడచూపెను
మందానిలుఁడు గాఁడె మగువ నీవూర్పు గాని
గందపుఁగొండఁ దాఁకి కమ్మరా నేతెంచెను ॥పతి॥

కోవిలకూఁతలు గావె కొమ్మ నీయెలుఁగు గాని
యీవలఁ బ్రతిధ్వనులై యెగసె వనానను
పూవుల మొగ్గలు గావె పూఁపనీచన్నులు గాని
తావుల వసంతమాడఁ దలలెత్తెఁ బొదల ॥పతి॥

చిక్కుల మరుఁడు గాఁడె శ్రీవేంకటేశుఁడు గాని
తక్కి నీమనసు చూచి దగ్గరె భావమున
యిక్కువ లంటి కూడితి రిద్దరూఁ బానుపుమీఁద
మొక్కుగాదు మోపు గాని ముంచి నీపై వేసెను ॥పతి॥ **48**

**పరిచయ పరిమళం :**

ఈ మధురకీర్తనలో అన్నమయ్య, దేవి చెలికత్తె. దేవితో తానేమంటున్నదంటే, తల్లీ! అంతా నీ భ్రమ. అతివరో! నీ పతిమీద నీకువున్న తమకము (మోహము) వలన నీకు వెఱపు (భీతి) కలుగుతున్నది. నీవు చూసేవన్నీ ప్రకృతి సహజమే. చంద్రునివలె కనబడుతున్నా అది నీ ముఖమేనమ్మా! జలధివలెనున్న నీ "నీడ" అట్టి ఆలోచనకు బలంచేకూరుస్తున్నది. అంత మెల్లగా వీస్తున్నది మందముగా వీచే గాలి అనుకొన్నావా? కానేకాదమ్మా అవి నీ ఉచ్ఛ్వాసనిస్వాసలే. గంధము మెత్తిన నీమేనిని తాకినందువల్ల ఆ భ్రమ కలుగుతున్నది. కోయిల కూజితమువలెనున్న నీ కంఠస్వరం ఈ వనములలో (తోటలో) ప్రతిధ్వనించి, ఆ భ్రమ కలుగుతున్నది. నీకు పూమొగ్గలవలె భ్రమకలుగుతున్నా అది నీ చనుగవ అని గ్రహించు. అవి నీతోనే వసంతమాడదలచెను (పరాచికమాడుతున్నాయి). అదిగో ఆ వస్తున్నవాడు చిక్కులు పెట్టే మన్మథుడు కాడు నీ పతి శ్రీవేంకటేశ్వరుడు. నీ మనస్సు గ్రహించి నీకు చేరువ అయ్యాడు. శరీరములు తాకుతూ మీ సతీపతులు ఒండొరులతో పాన్పుపై కూడితే తన భారం ఆమె నీపై మోపింది. స్వామీ! నీవు జగమునే భరించువాడవు కదా!

★ **ఇక్కువలు** – సంకేతస్థలములు ★ **తలలెత్తె** – పొడచూపెను

సంఖ్య : 522 సంపుటము : 20 పుట: 349 రాగం : మాళవిగౌళ

**26** తలవంచనేఁటికి దండనున్న వారిఁ జూచి
వెలయఁగ నేమెల్లా వింతవారమా ॥పల్లవి॥

సిగ్గువడ్డదానవు చింతతోటిదానవు
యెగ్గులుఁ దప్పులు నిఁకనేఁటికమ్మా
దగ్గరి యాతఁడేమైనాఁ దడవినా చేఁతలకు-
నగ్గమైతి విఁక నీకు నంకెలాయనమ్మా ॥తల॥

జవ్వనపుదానవు సతమైనదానవు
యెవ్వరిబుద్దులు వివేఁటికమ్మా
పువ్వుల వేసి యాతఁడు పూఁచి సన్నలు సేయఁగ
నవ్వితివి నీకు నిఁక ననుపాయనమ్మా ॥తల॥

మంతనపుదానవు మాటలోనిదానవు
యెంతసేసినాఁ జెల్లె నేమమ్మా
చింతదీర నింతలోనె శ్రీవేంకటేశుఁడు గూడె
అంతరంగమెల్లా నిండె ననువాయనమ్మా ॥**522**॥

**పరిచయ పరిమళం :**

దేవి చెలికత్తెయైన అన్నమయ్య ఆమెకు యేమని నచ్చజెబుతున్నారో వినండి. నీ సమీపమునవున్నవారిని జూచి తలవంచుటదేనికమ్మా? నేము యెల్లా (మేమంతా) నీకు వింతవారమా (ముక్కుమొగము తెలియని కొత్తవారమా?) నీవు సిగ్గరివి. నీ భర్త సరసుడని కొంత జంకూ నీకున్నది. మరి ఇంకా దోషారోపణలు చిన్నబుచ్చుటలు యెందుకమ్మా? ఆయన నీ దగ్గరయై తడవినా (స్పృశించినా) ఆయన చేతలనేనాడో సమ్మతించావు. ఆయనకు పూర్తిగా వశమయ్యావు అవునా? దేవీ! నీవు యౌవన గర్వంతో వున్నావు. ఆయనకు శాశ్వతమైన హృదయవాసినివి. నీకింకొకరు బుద్ధులు నేర్పవలెనా? అయినా యెవ్వరు నీకు చెప్పినా నీవు వింటావా? ఆయన నీపై పూవులు జల్లి నీకు సైగలు చేస్తే అప్పుడు నీకు నవ్వులు వచ్చాయి. నీవు ఆయన కనుకూలమయ్యావు. దేవీ! నీవు ఆయనకే ఆలోచన చెప్పగలదానవు. ఆయన మాట వినేదానవు. ఎంతచేసినా ఆమె కూడా నీకు చెల్లెలువంటిదే కదా! నీ చింతదీరునట్లు శ్రీవేంకటేశుడు నిన్ను కూడినాడు కదా! ఆయన నీ అంతరంగముననే వున్నాడమ్మా!

★ **అగ్గమైతివి** – అనుకూలమయ్యావు ★ **అంకెలాయె** – వశమైనావు
★ **సతమైనదానవు**–శాశ్వతమైనదానవు ★ **అనువాయనమ్మా**–అంగీకారమైనదమ్మా





సంఖ్య : 309 సంపుటము : 20 పుట: 207 రాగం : వరాళి

**27** మగరూపు నాఁడురూపు మారుచుకొని రిద్దరు
సొగి సెద్దము చూపరే చూచుకొనే రిద్దరు దామే ॥పల్లవి॥

కలికి కస్తూరిబొట్టు కాంతునినొసల నంటె
నిలువునామము పైపై నెలఁత కంటె
అలివేణికొప్పు జారి ఆతనికొప్పుపై వాలె
అలరె నీతని (న్వి?) సిక ఆతనిపాపటపైని ॥మగ॥

కుంకుమగుబ్బలపూఁతగురుతు విభుని కంటె
అంకెఁ బతిరొమ్ముబొచ్చు ఆకె కంటెను
కంకణాలగాజులచేయి ఘనునిసందిటఁ జిక్కె
అంకపుసాములచేయి ఆకెసందిఁ జిక్కెను ॥మగ॥

మట్టెలపాదము లవె మగిడె నాతనిమీఁద
నిట్టపెద్దపాదాలు నిలిచె నందు
యిట్టె శ్రీవేంకటేశుఁ డింతిఁ గూడి పానుపుపై
పట్టపగ లిందరిని భ్రమయించి రిదివో ॥మగ॥ **309**

**పరిచయ పరిమళం :**

శ్రీ వేంకటేశ్వరునికి అలమేలుమంగమ్మకు ఒకరోజు ఒక చిలిపి కోరిక కలిగింది. స్వామి ఆడరూపు, శ్రీదేవి మగరూపు ధరించారు. ఇది అన్నమయ్య భావనాకాశంలో తళుక్కుమని మెరసిన తటిల్లత. దాని సొబగులు నాలకించండి. ఆ ఇద్దరు మగరూపు నాడరూపు మార్చుకొనిరి. సొగిసి వారిరువురికీ అద్దము చూపండి అంటున్నారు. తామే చూచుకొనేరిద్దరు అని చనువుగా చమత్కరిస్తున్నారు. అప్పుడేమి జరిగిందో వినండి. కలికి కస్తూరిబొట్లు కాంతుని నొసటన తళుకుమనెను. స్వామి నిలువునామములు ఆమెనొసట జేరెను. అలివేణికొప్పు జారి అతని కొప్పుపై వాలెను. ఈ తన్వి (దేవి) సిగ ఆయన పాపిటపైన చేరెను. అది ఒక మరపురాని మార్పు. దేవి కుంకుమాంకిత చనుగవ స్వామికి వచ్చెను. ఆమె పతికున్న విశాలవక్షముపైని కేశములు దేవి చనుగుబ్బలపై చేరెను. కంకణములు ధరించిన గాజుల చేతులు ఘనుని కబ్బెను. సాము చేసినట్లున్న బలిష్టబాహువులు దేవికి చిక్కెను. మరల పరిశీలిస్తే మట్టెలు ధరించిన పాదములు స్వామికి వచ్చాయి. పొడుగాటి పెద్ద పాదములు దేవికి వచ్చెను. అప్పుడేమయింది! పాన్పుపై వేంకటరమణుడు, రమణినిట్టే కూడినాడు. ఇదిగో పట్టపగలే మాబోటి భక్తుల భ్రమించారు.

★ **అంకపుసాముల** – శూరత్వముతో సాముచేసిన ★ **మగిడె** – మరలినవి

సంఖ్య : 30 సంపుటము : 24 పుట: 21 రాగం : శ్రీరాగం

**32 దేవదుందుభులు నలుదిక్కులందు**
**తావులనే వేవేలు ధ్వనులియ్యఁగాను** ॥పల్లవి॥

**వేంకటాద్రిదేవుఁ డదే వేడుకతోఁ బెండ్లాడీ**
**లంకెల నిప్పుడే కమలాదేవిని**
**కొంకక ముప్పదిమూఁడుగోట్లదేవతలాల**
**వుంకువ విచ్చేయరో మహోత్సవవేళ** ॥దేవ॥

**వనజనాభుఁడు నిత్యవైభవానఁ జేకొనె**
**అనయము నిదివో యాదిలక్ష్మిని**
**మునులాల భు(ఋ?)షులాల ముంచినభూసర(రు?) లాల**
**సొనిసి యిందరుఁగూడి సుముహూర్త మనరో** ॥దేవ॥

**సురకన్యలాల భూసురనాగకన్యలాల**
**మరిగికూడీ నలమేలుమంగ నితఁడు**
**నిరతి శ్రీవేంకటనిలయుని నీకెను**
**యిరవుగ దీవించి యిందరునుఁ బాడరో** ॥దేవ॥**30**

**పరిచయ పరిమళం :**

శ్రీవేంకటేశ్వరుని పెండ్లి వూరేగింపు తిరువీధులగుండా సాగిపోతున్నది. మన అన్నమయ్య పరవశించి చక్కటి కీర్తననందుకొన్నారు. ఆ మహానుభావుడికి, నలుదిక్కులా దేవదుందుభుల నినదం వినిపిస్తోంది. అవి అనేక వేల ధ్వనులై వినిపిస్తున్నాయి. అదిగో వేంకటాద్రి దేవుడు వేడుకతో పెండ్లాడుతున్నాడు. కమలాదేవిని (లక్ష్మీదేవిని) జంటయై పెండ్లాడబోతున్నాడు. ఓ ముప్పదిమూడుకోట్ల దేవతలారా! ఈ మహోత్సవమునకు కట్నకానుకలతో మీరంతా విచ్చేయండి. పద్మనాభుని పరిణయము తిరుమలలో నిత్యవైభవము. ఎల్లప్పుడూ పెండ్లికూతురు ఇదిగో ఈ ఆదిలక్ష్మియే. ఓ మునులారా! ఓ ఋషులారా, శ్రేష్ఠులైన భూసురులారా! ఇదే సుముహూర్తానికి అందరూ గుంపుగా రండయ్యా! ఓ దేవకన్యలారా! బ్రాహ్మణ, నాగకన్యల్లారా! ఈ శ్రీవేంకటేశుడు తన దేవేరి అలమేలుమంగను ఇష్టుడై కూడినాడు. సంతుష్టుడై స్వామి తన భక్తులను దీవించుచున్నాడు. అందరూ స్వామిపై కీర్తనలు పాడండయ్యా!

★ **సొనిసి** – పూని ★ **అనయము** – అవశ్యము
★ **కొంకక** – సంకోచించక ★ **ఉంకువ** – కట్నము





సంఖ్య : 495 సంపుటము : 20 పుట: 331 రాగం : పాడి

**29 నిందుకున్నది వలపు నీమీఁద**
**పండివున్నవి ఆసలు పైపై నామీఁదను** ॥పల్లవి॥

**చెక్కులు నీవు నొక్కఁగ చింతలన్నియునుఁ బాసె**
**మొక్కులు నే మొక్కఁగాను మోహము నిండె**
**ఇక్కువలు గరఁగితి మిద్దరము నిందువంక**
**తక్కినమాటలేమియుఁ దడవకు మింకను** ॥నిందు॥

**చేయి నీవు వేయఁగాను చెమరించె దేహమెల్ల**
**చాయల నేఁ జూడఁగాను చవివుట్టెను**
**పాయపువేడుక లబ్బె పలుమారు నిందువంక**
**పోయినసుద్దులు వోనీ బొంకకుమీ ఇఁకను** ॥నిందు॥

**చెనకి నీవు గూడఁగ సిగ్గులు పొత్తుకు వచ్చె**
**తనిసి నే మెచ్చఁగాను తమివుట్టెను**
**యెనసితిమి శ్రీవేంకటేశుఁడ నేఁ డిందువంక**
**చనవులెల్ల నీడేరె సాధించకు మింకను** ॥నిందు॥**495**

**పరిచయ పరిమళం :**

ఈ కీర్తనలో అన్నమయ్య "ఇందువంక" అనే పదాన్ని అనేకమార్లు వాడతారు. అన్నమయ్య కాలంనాటి రాయలసీమ మాట అది. ఇందువంక అంటే 'చంద్రవంక' కాదు 'దీనిమూలంగా' అని అర్థం. ఓ శ్రీవేంకటేశ్వరా! నీమీద నా వలపు పూర్తిగా వ్యాపించి పొంగిపొర్లుతున్నది. నామీద నీకున్న పైఆశలు (అతిశయించిన ఆశలు) పండివున్నది (ఫలించబోవుచున్నవి) ప్రభూ! నీవు ప్రేమగా నా చెక్కిలి పుణుకగానే నా దిగులు మటుమాయమైనది. నీకు నమస్కరించునంతలోనే మోహముతో మనస్సు చైతన్యమునొందినది. ఇద్దరమూ ఇక్కువల (మన సంకేత స్థలములో) ఒండొరుల అనురాగంలో కరిగిపోయాము. దీనిమూలంగా తక్కిన మాటల ఆవశ్యకతయే లేదు. ప్రభూ! నీవు నాపై చేయి వేయగానే నా దేహము చెమరించినది, చీకట్లు ముసురుచుండగా నీవు కనిపించగానే కోరికెలతిశయించినవి. పాన్పు వేడుకలపై అనేకమార్లు ఆలోచనలు మళ్ళినవి. దీనిమూలంగా అయిందేమో అయినది కానీ ఇకనైనా అసత్య ప్రమాణములనాపుము. ప్రభూ! నన్ను స్పృశించి నీవు కూడగా సిగ్గులు కరిగి పొత్తులు కుదిరినవి. నేను మెచ్చునట్లుగా తమకము పుట్టినది. ఓ శ్రీవేంకటపతీ! ఇందుమూలంగా నీపై అధికారం వచ్చింది. నన్నిక సాధించకు.

★ **ఇందువంక** – దీనిమూలంగా ★ **పాయపువేడులు** – యౌవన కుతూహలం
★ **చనవులు ఈడేరినవి** – నీపై అధికారము వచ్చినది ★ **తనిసి** – తృప్తి

సంఖ్య : 392 సంపుటము : 20 పుట: 262 రాగం : కాంబోది

**30 ఆడేబొమ్మలు వారు ఆడించేసూత్రము నీవు**
**యేడో ఇన్నాళ్లు నేను ఇదెఱఁగనైతిని** ॥పల్లవి॥

**నీవు చెప్పిబుద్ధుల నెలఁతలు నడవఁగా**
**ఆవలివారి దూరితి నయ్యో నేను**
**చేవదేర తాలముచేయి నీచే నుండఁగాను**
**వేవేలుచోట్లను వెదకితి నేను** ॥ఆడే॥

**కన్నుగీఁటి నీవు వారి కైకొని మొక్కించఁగా**
**సన్నల వారి దొబ్బితి సాదించి నేను**
**పన్నినకూఁకటివేరై పారి నీవు వుండఁగాను**
**వున్నతిఁ గొనలకు నీ రొగ్గి నేఁ బోసితిని** ॥ఆడే॥

**కోరి పెండ్లాడినపెండ్లి కొడకవు నీవుండఁగా**
**గారవించితిని వారిఁ గరుణ నేను**
**యీరీతి నన్ను శ్రీవేంకటేశ నీవు గూడుండఁగా**
**కారణ మిందరునంటాఁ గడల మెచ్చితిని** ॥ఆడే॥ **392**

**పరిచయ పరిమళం :**

ఓ జగన్నాటక సూత్రధారీ! నీ కాంతలంతా నీవు ఆడించినట్లు ఆడే తోలుబొమ్మలు, నిజమైన సూత్రధారివి నీవేననే సత్యం గ్రహించలేక వారినిన్నాళ్లూ యేదేదో నిందించాను. ఔరా! యెంత పొరబడ్డాను? నా అంతతెలివి తక్కువదుంటుందా? అంటున్నది దేవి, ఈ అన్నమయ్య కీర్తనలో. నీవు చెప్పిన విధంగానే వారంతా నడుచుకొన్నారు. ఇది తెలియక నేను అవతలి వారిని తిట్టాను. అసలు "తాళం చేయి" నీ చేతిలో వుందని తెలియక వూరంతా వెదకితిని. నీవు కన్నుగీటి వారందరి చేత నాకు మొక్కించావని తెలియక, వారందరికీ నాపై భక్తివుందని నమ్మాను. ఎంత వెఱ్ఱిబాగులదాన్ని!! పైగా వారిని సాయం సమయమున దుర్భాషలాడాను, వారి వినతులను తోసివేశాను. అన్నిటికీ మూలము నీవని గ్రహించలేక, అనవసరంగా చిగుళ్ళకు నీరుపెట్టినట్లు అయింది నా వ్యవహారం. నన్ను కోరి నీవు పెళ్ళాడావని తెలియక వారందరూ నిన్ను ఒప్పించారని వారిపట్ల విధేయతతో వున్నాను. వారి కరుణను గౌరవించాను. ఈ విధంగా ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను కూడుటకు వారు కారణమనుకొన్నాను. చివరికి మెచ్చుకున్నాను కూడా. కానీ..

★ **దొబ్బితిని** – త్రోసివేశాను ★ **కూకటివేరు** – మూలము





సంఖ్య : 443 సంపుటము : 20 పుట: 296 రాగం : దేసాళం

**31 ఈపాటివుపచార మిది చాలదా**
**చేపట్టి నే నిఁక నిన్నుఁజేసేదేమీ** ॥పల్లవి॥

**అందరితోనుఁ జెప్పక అట్టె మనపొందులెల్లా**
**అంది ఆకెతోఁ జెప్పితి వది చాలదా**
**చెంది యాఁటదాని కీసిగ్గులే సింగారములు**
**నిందలమగవాఁడవు నీ కేమయ్యా** ॥ఈపా॥

**అంగపుమేనిగురుతు లాపెకే చూపితిగాని**
**అంగడిఁ బెట్టవైతి వది చాలదా**
**ముంగిట నిల్లాలికి ముంచినసొ మ్మణఁకువ**
**చెంగట నీవు దొరవు చెప్పనేఁటికయ్యా** ॥ఈపా॥

**అంకెల మాతోసాటికి ఆకెనే యేలితి గాని**
**అంకిం చితరులనేల వది చాలదా**
**మంకులేని నేర్పరికి మానమే మూలధనము**
**యింక శ్రీవేంకటేశ నన్నేలితివి మేలయ్యా** ॥ఈపా॥ **443**

**పరిచయ పరిమళం :**

ఉపచారము అంటే సమ్మానము అని అర్థం. అన్నమయ్య చెప్పిన ఈ మధుర కీర్తనలో నాయిక శ్రీరమణుని దెప్పుతున్నది. స్వామీ! ఇంతటి సమ్మానము చేశావు నాకు. ఇది చాలదా? ఇంతయ్యాక నిన్ను నేను చేపట్టి (తప్పుపట్టి) ఇంకా చేసేదేమున్నదయ్యా? మనపొందు (కూటమి) గురించి అందరితో (ఎవరితోనూ) చెప్పనన్నావే? ఇవ్వాళ ఆమెతో (నీ ప్రియురాలితో) చెప్పినావు. అది చాలదా? కులస్త్రీకి సిగ్గులే సింగారము (అందము) కదా! నీవు మగవాడవు. ఎవరు యెంత మాట అనినా దులపరించుకొనిపోతావు. నీకేమయ్యా? సిగ్గులేక నీవంటిమీద మన కలయిక గుర్తులన్నీ ఆమెకు చూపిస్తావా? నన్ను బజారులో పెట్టకపోయావా? నీవు చేసిన ఆ ఘనకార్యం చాలదా? మర్యాదకల ఇల్లాలికి శ్రేష్ఠమైన సొమ్ము ఆభరణాలా? కాదయ్యా "అణకువే" ఆమెకు అసలైన ఆభరణం. నీవు దొరవు (సర్వేశ్వరుడవు). నీకివన్నీ చెప్పవలెనా? నేను నీ దేవేరినయ్యా! మంకుతనంలేని నేర్పరికి (సమర్థులకి) మర్యాదేమూలధనము మాతో సాటిగా ఆమెని కూడా మన్నించావు. నీ భక్తురాలు (అన్నమయ్యయే) అన్నావు. సరే!! ఇతరులను యేలవు కదా? అట్లయితే అది చాలదా? శ్రీవేంకటేశా! నాకు ఏలికగా వుండు. అది చాలు

★ **చెంగట** – సమీపము ★ **అంకెల** – అధీనముచేసికొని
★ **అంకించి** – పొగిడి ★ **ముంచిన సొమ్ము** – మేలైన ఆభరణం

సంఖ్య : 481 సంపుటము : 24 పుట: 311 రాగం : సాళంగనాట

**36** నాటెను నీకూరిమి నారసింహా
నాటకములెల్లాఁ గంటి నారసింహా ॥పల్లవి॥

కోమలు లిందరు నీపైఁ గోరి సేసలు చల్లఁగ
నామొగ మేమిచూచేవు నారసింహా
వేమరు వాడవారెల్లా విన్నపాలు సేయఁగాను
నామాటే చవులాయ నారసింహా ॥నాటె॥

యేతులఁ జెంచెత నీతో నేకతమాడినసుద్ది
నాతో దాఁచఁగనేల నారసింహా
జాతులఁ బెట్టుచు నీవు సారెనేల చెనకేవు
నాతులు నీకేమిబాఁతి నారసింహా ॥నాటె॥

పనితో నిద్దరమునుఁ బాయక కూడుండఁగా
ననిచె మనపొందులు నారసింహా
తనిసి నీరతుల దయఁజూచి యేలితివి
నను శ్రీవేంకటగిరినారసింహా ॥నాటె॥ **481**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తననాలపిస్తున్నది ఆదిలక్ష్మి. నారసింహుని దేవేరియైన ఆమె స్వామితో చెంచులక్ష్మి విషయం యెందుకుదాచిపెట్టావని నిగ్గదీస్తున్నది. మనిద్దరమూ, ఆదిదంపతులముకదా! మనపొందు నీ భక్తులకనువిందు. నీ ప్రేమ నాలో నాటుకుపోయింది. కానీ నీవేమో ఆ చెంచుదానితో నీ నాటకములు మానుటలేదు. అవి మా కంట్లోనూ పడ్డాయి. నీలీలలన్నీ తెలిసిన కోమలులందరూ నీపై అక్షతలు చల్లుతుంటే నామొగముకేసి యెందుకు చూస్తున్నావు? నారసింహా! వాడలోని వారి విన్నపాలు స్వీకరించవు నీకు నా మాటలేనచ్చుతున్నాయి. గర్విష్ఠ అయిన చెంచెత నీతో ఒకటైనదనే వార్త నాతో ఎందుకు దాస్తున్నావు నారసింహా! నన్ను ఎగతాళికి గురిచేసెదవేల? ఆమె నేలతాకితివి? అటువంటివారిపై నీప్రీతి వింతగానున్నది నరసింహా! మనిద్దరమూ పూనికతో కూడి యుంటిమి. మనపొందు ప్రీతికలిగినది, నరసింహా! నన్ను నీ రతులతో అతిశయింపజేసి కూడితివి. నన్ను ఆ విధంగా ఏలుకొన్నావు వేంకటనారసింహా!

★ **ఏతుల** – గర్విష్ఠి అయిన ★ **ననచి** – అతిశయించి





సంఖ్య : 588 సంపుటము : 24 పుట: 393 రాగం : శంకరాభరణం

**33** ముద్దులుగారీ మోమునను
వొద్దిక నేమైన నొసగరె చెలులు ॥పల్లవి॥

చెక్కులవెంటాఁ జెమటలు గారీ
యెక్కడ నాడెనో యిందాఁకా
చక్కఁ గృష్ణునికి జలకము సేయరె
నెక్కొని కాఁగిట నించరె చెలులు ॥ముద్దు॥

పొరిఁబొరి నిట్టూర్పులు గదురేఁగెను
పరువులు వెట్టెనో పడుచులతో
సరుగన శైత్యే(త్యో?)పచారము సేయరె
యిరవుగ నుయ్యల నిడరే చెలులు ॥ముద్దు॥

చుట్టుకొన్నజడ చొల్లెము జారెను
వుట్టులు గొట్టెనొ వుదుటునను
పట్టి యలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁ-
డిట్టిపనులవా రెంచరె చెలులు (?) ॥ముద్దు॥ **588**

**పరిచయ పరిమళం :**

చిన్నారి మోహనకృష్ణుని కీర్తిస్తున్నారు అన్నమయ్య. తొలిచరణాల్లో బాలకృష్ణుని, రెండవచరణంలో వుయ్యాలలోవుంచండి అనటం. మూడవ చరణంలో వుట్లుకొట్టటం ప్రస్తావించటం వల్ల కొద్దిపాటి తికమకకు ఆస్కారంవున్నా చక్కటికీర్తన ఇది. ఆస్వాదించండి. గోపికలేమనుకొంటున్నారంటే.. ఓ చెలులారా! ముద్దులు కారుతున్న ఈ మోహనకృష్ణునికి ఏమైనా ఇవ్వండమ్మా! ఓ చెలులారా! ఇందాకా వీడు యెక్కడ ఆడివచ్చాడో తెలీదు కానీ చెక్కిళ్ళపై చెమట యెట్లా కారిపోతున్నదో చూడండి. ఈ కృష్ణునికి చక్కగా స్నానం చేయించండి. నిండా కౌగలించి గుండెలకద్దుకోండి. ఓ చెలియలారా! ఏ గోపికవెంట పరుగులు పెట్టాడో అన్నట్లు మాటిమాటికీ ఉచ్ఛ్వాసనిస్వాసలు యెంతవేగముగా, యెంత బరువుగా తీస్తున్నాడో చూడండి. తొట్టెలో బాలునికి చేయవలసిన శైత్యోపచారములనన్నింటినీ చేసి, వీడిని వుయ్యాలలో వుంచండమ్మా! ఓ చెలులారా! కొప్పులా చుట్టుకున్న జడవూడిపోతుంటే రేపల్లెలో అనేకమైన వుట్లను ఒక్కదెబ్బతో కొట్టి ఎలా పారిపోతున్నాడో చూడండి. అలమేల్మంగపతియైన ఈ శ్రీవేంకటేశుడు ఇట్లాంటి పనులు చేస్తాడని వూహించగలరా?

★ **నెక్కొని** – నెలకొని ★ **పొరిపొరి** – మాటిమాటికి
★ **సరుగున** – వేగముగా ★ **ఉదటున** – ఉద్ధతితో

సంఖ్య : 482 సంపుటము : 24 పుట: 322 రాగం : రామక్రియ

**34** అట్టుసేయ కిఁక నీవు ఇట్టె రాఁగదే
పట్టపుదేవులవైన బలవంతురాలవు ॥పల్లవి॥

యెదురుఁగొండ లెక్కితివేమే వోచెలియా
యెదురఁ గొండలచన్ను లెద నుండఁగా
వదలక నల్లఁగలువల వేసే వదియేమే
కదిసి నీచూపులే కలువలై వుండఁగా ॥అట్టు॥

యేరు నడుమఁ బెట్టుక యెలయించే విదియేమే
యేరువంటియారు నీకు నిదె వుండఁగా
సారెకు లేఁతతీగెలు జళిపించే విదియేమే
గారాపుతీఁగెలే నీకరములై వుండఁగా ॥అట్టు॥

పొంది వొక్కచోఁ దరితీపులు వుట్టించేవేమే
ముందుముందే తీపులు నీమోవి నుండఁగా
అందపుశ్రీవేంకటాద్రి నహోబలమునను
ఇందిరవు నీకు నేనే ఇరవైనుండఁగను ॥అట్టు॥ **482**

**పరిచయ పరిమళం :**

ఈ కీర్తనలో నరసింహుని దేవేరియైన శ్రీలక్ష్మితో అహోబలనృసింహుడు, నీవు ఇంత అట్టుసేయబోకు. ఇట్టేరాగదే నీవు పట్టపు దేవేరివి బలవంతురాలవు అని అంటున్నాడు. అన్నమయ్య భావనా పరిధి ఊహకందనిది. ఆయన కీర్తనలు నిరుపమానము. ఓ చెలియా! భవనాశి యేఱు అద్దరిలో నున్న కొండనెక్కి కూర్చున్నావెందుకే. కొండలవంటి చనుయుగమున్న నీవు నాపై నల్లకలువపూలను వేయుచున్నావెందులకే. నీ కనులే కలువలు కదా! నన్ను చూచి నీవు చేయుచున్నదీ అదేపని కదటే. మన మధ్య అంత పెద్ద భవనాశి ఏఱు పారుతుండగా నాకు చేరిక అవ్వాలని చూస్తావేమే? పవిత్రమైన ఆ ఏఱు (నది) వంటి తిరుమంగళకర లక్షణములు నీకున్నవని నేను మురుస్తుంటే లేత తీగెనొకదాన్ని పట్టుకొని నన్ను బెదిరించే మేమే నీచేతులే గారాపుతీగెలవలెనున్నాయి, కదే. నన్ను నీవానిగా పొంది తరితీపులు (ఆపేక్ష) కలిగించుటకు అంత శ్రమపడ్డావేమే? తీపులన్ని (మాధుర్యములన్నీ) నీ అధరముననే వున్నవికదే. ఇటు అహోబలమున, అటు శ్రీవేంకటాద్రి మీదా ఇందిరాదేవివైన నీకు వల్లభుడను నేనేనే.

★ **ఎలయించు** – చేరికయగు ★ **జళిపించు** – బెదిరించు
★ **తరితీపు** – ఆపేక్ష ★ **గారాపుతీగె** – వలపులత





సంఖ్య : 56 సంపుటము : 24 పుట: 38 రాగం : తోండి

**35** ఏమి దలఁచుకొంటివో ఇన్నాళ్లకు
నీమన సింతటనే తనివిఁబొందెనా ॥పల్లవి॥

వూరకే కొలనిలోన నోలలాడేమగువల-
చీరలేల తీసితివి చిన్నారివాఁడా
చేరి యంతటనుఁ బోక చేతులెత్తి మొక్కుమనే-
వేర యెంతకెత్తుకొంటి వేడ కొత్తరా ॥ఏమి॥

బాలుఁడవై మాఇండ్ల పాలారగించి ఇంకా
పాలిండ్లపై చూపు పచరించేవా
చాలదంటా మాకేలు చాఁచి యందుకొమ్మనేవు
మేలుమేలు నీగుణాలు మెచ్చితిమిరా ॥ఏమి॥

ఇంతులున్నారన కిట్టె యీఁదులాడే విందు వచ్చి
ఇంతలోనె శ్రీవేంకటేశుఁడ నీవు
పంతము చేకొని మమ్ముఁ బచ్చిగాఁ గూడితివిట్టె
ఇంతచేసి మరి చీర లిచ్చితివి చాలదా ॥ఏమి॥ **56**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ మధురకీర్తనలో భావసౌందర్యం వర్ణనాతీతము. గోపికలకి కృష్ణుడు లేని క్షణమే ఒక దినమనిపిస్తుంది. విరహవేదన అంత కఠినమైనది. ఇన్నాళ్ళకు మమ్మల్ని యేమన్నా తలచుకొంటావోలేదో!! పోనీ అంతటితో నీతనివితీరుతుందా? మమ్మల్ని తలచకొంటే చాలా? ఓ చిన్నారికృష్ణయ్యా! ఊరకనే కొలనులో స్నానము చేయుచున్న మగువల చీరెలేల తీసి దాచెదవు? అంతటితో పోనివ్వక చేతులు పైకెత్తి మొక్కితేనే చీరెలిస్తానంటావా? వేరే మేము చేతులెత్తితే నీవు మాలో చూడనిదేమిటిరా? బాలునిగా మా ఇళ్ళలో పాలు ఆరగించావు, బాగానేవున్నది. కానీ నీ చూపులు మా పాలిండ్లపై పడ్డాయేమినాయనా? చాలదు ఇంకాసిని పాలుకావాలి చేతులుచాచి అందుకొమ్మంటావా? ఎంత రండగొండివాడివిరా!! మేలుమేలురా కృష్ణా! ఎంత సుగుణరాశివిరా!! ఆడవాళ్ళు స్నానం చేస్తున్నారనికూడా లేదా నీకు? నీవూ దీంట్లోనే ఈదులాడెదవా? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు పంతముతో ఇంతులను కూడినా స్త్రీలకి చీరెలిస్తావు అది చాలునయ్యా!

★ **తనివిబొందేనా** – తృప్తి కలుగుతుందా ★ **పచ్చిగా** – మొరటుగా
★ **ఏడకొత్తరా** – ఇందులో నీకు తెలియనిదేమిటి

సంఖ్య : 114 సంపుటము : 24 పుట: 77 రాగం : సామంతం

**40 రతి నీపలుకులకు రామనడపులకు**
**గతిగూడఁ గడమ రాగము సేయుమీ** ॥పల్లవి॥

**పిల్లఁగోవిరపములు బెరయించఁగా నదే**
**గొల్లెతలమట్టెలకుఁ గూడె సుతి**
**పల్లవపుఁబదముల పాటలు వాడుచుఁ**
**గల్లగాదు కడమ రాగము సేయుమీ** ॥రతి॥

**ముందు నీసంకపురవ మునకు గోపికలెల్ల**
**కుందణపు టందెలకుఁ గూడె సుతి**
**చిందుల రాగములు చిలికించి చిలికించి**
**కందువులఁ గడమ రాగము సేయుమీ** ॥రతి॥

**పెనఁగేనేవూరుపులు పెరుగమ్మేకాంతల-**
**కొనగోరితాఁకులకుఁ గూడె సుతి**
**చెనకితి విందరిని శ్రీవేంకటేశ్వర**
**కనుచొక్కి కడమ రాగము సేయుమీ** ॥రతి॥ **114**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య కీర్తనలో నాట్యపుతాళము, గతులు అమర్చటం ఇదివరలో చూచినాము. ఈ శృంగార కీర్తనలో సంగీతపరమైన నడపులు, రాగము, సుతి (శృతి), గతి, పల్లవి, పాట, రవము, అందెలు వంటి పదములమర్చి రసవత్తరంగా వినిపించారు. ఈ కీర్తన పల్లవే క్లిష్టముగానున్నది. ఈ పల్లవికి ప్రభూ! తన్మయత్వంలో నీవు చెప్పే మాటలకు ఆ జవ్వని ప్రవర్తనకు, ఒక విధానము కుదరగా, కడమరాగము సేయుమీ (చిట్టచివరి ప్రణయలీల చేయుమీ) సంగీతపరంగా... అంతిమ రాగం వినిపించుమా అని అర్థం. దేవా! నీ పిల్లనగ్రోవి రవములు వినిపిస్తుంటే, అవి గొల్లపడుచుల మట్టెల సవ్వడితో శృతిబద్ధంగా వినిపిస్తున్నాయి. పల్లవపు పదముల (లేచిగురువంటి పాదములతో) సంగీతపరంగా... పల్లవిలోని పద ప్రయోగముతో అని అర్థం, పాటలు పాడుతూ ఇది కల్లకాదనేట్లు "కడమరాగము సేయమా". స్వామీ! శంఖనాదమువంటి నీ కంఠ స్వరముతో ఆ గోపికల బంగారు అందెలరవళులు శృతి కలిపి నర్తించురాగములుగా (నృత్య గీతికలుగా) సంగీతపరంగా... అతిశయించిన రాగములై వినిపించీ వినిపించీ ఏకాంతములో "కడమరాగము సేయుమీ". ప్రియా! పెనుగులాటలో నీ ఉచ్ఛ్వాస నిస్వాసములు పెరుగులమ్మేకాంతల కొనగోటితాకులతో కూడి శృతిబద్ధమైనవి. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవందరినీ అలరించి అలసితివి. "కడమరాగముసేయుమీ".

★ **బెరయించగా** – కలుగగా ★ **చిలికించి** – చల్లి



హరి యేమనెనే అలిగెనో

సంఖ్య : 192 సంపుటము : 24 పుట: 129 రాగం : ముఖారి

**37 మాతో నేఁటికి నేను మగువ నింతే । నీ-**
**చేఁతలెల్ల యేడనైనాఁ జేయవయ్యా** ॥పల్లవి॥

**జలధి యీఁదేచోట, శైలము మోచేచోట**
**సొలసి నీబలిమెల్లఁ జూపవయ్యా**
**యిల దవ్వఁబోవుచోట, హిరణ్యునిఁ జంపుచోట**
**పలుకుఁబంతాలెల్లఁ బచరించవయ్యా** ॥మాతో॥

**నీవు మిన్నందేచోట, నెత్తుటఁ దోఁగేచోట**
**సోవల నీమురిపేలు చూపవయ్యా**
**దీవుల కేఁగేచోట, తెగి వెన్న దినుచోట**
**చేవదేర మాయలెల్లాఁ జేయవయ్యా** ॥మాతో॥

**సిగ్గులుదేరుచోట, చెంతలఁ బారేచోట**
**యెగ్గులుదప్పులుఁ బోయి యెంచవయ్యా**
**అగ్గమైతి శ్రీవేంకటాధిప నన్నుఁ గూడి**
**వెగ్గళపుకపటాలు విడువవయ్యా** ॥మాతో॥ **192**

**పరిచయ పరిమళం :**

దేవి స్వామితో అంటున్నది. మాతో నీ చేతల సామర్థ్యము చూపటం ఇప్పుడెందుకయ్యా? నేను మగువను ఇంతేకదా? నీ చేతలు ఇంకెవరికైనా చూపిస్తే సంతోషిస్తారు కదా! అద్భుతమైన ఈ దశావతార కీర్తననాలపిస్తున్నారు అన్నమయ్య. జలధిని ఈదులాడేచోట **(మత్స్యావతారము),** కొండను మోసేచోట **(కూర్మావతారము)** నీ బలమంతా చూపించు ఎవరు వద్దన్నారు? నేలను తవ్వేచోట **(వరాహావతారం)** హిరణ్యుని చంపేచోట **(నరసింహావతారం)** నీ మాటల్లో గట్టిదనమేదో చూపించవయ్యా! మావంటి మగువలవద్ద కాదు. నీవు ఆకాశాన్ని అంటుకొనేచోట **(త్రివిక్రమావతారం)** నెత్తుటిలో దోగాడేచోట **(పరశురామావతారం)** నీ మురిపాలన్నీ చూపించొచ్చు కదా? ద్వీపాల్లో తిరుగాడేచోట **(లంకాద్వీపం చేరిన రామావతారం)** బాగా వెన్నమెక్కె చోట **(కృష్ణావతారం)** నీ మహిమ చూపే మాయలు చేయరాదా? దేవా! సిగ్గులు కడతేరే చోట **(బుద్ధావతారము)** చెంత నుండి పారిపోయేచోట, పోయి యెగ్గులు తప్పులు యెంచవయ్యా? **(కల్కి అవతారం).** ఓ శ్రీవేంకట శైలనాథా! అతిశయించి నన్ను కూడి అధికమైన కపటములను మానరాదా?

★ **వెగ్గళపు** – అధికమైన ★ **సోవల** – సుదీర్ఘమైన
★ **పచరించు** – ప్రకటించు ★ **మోచేచోట** – మోయుచోట

సంఖ్య : 246 సంపుటము : 24 పుట: 165 రాగం : మంగళకౌశిక

**38** మగవాని కేఁటియెగ్గు మాపుదాఁకాను
తగిలి భోగించినదే దక్కినదిగాక ॥పల్లవి॥

మునుకొని యాపెగుణములు నాతోఁ బొగడేవు
వనితఁ దెచ్చుకొనఁగా వలదనేనా
మనసొకతెఁ గోరఁగా మాటలు నాతోనాడఁగా
యెనసినట్టయ్యీనా యేఁకరేది దోసము ॥మగ॥

వెలి నాపె నీకిచ్చినవిడెము నాకిచ్చేవు
వలపెంతగలిగినా వలదనేనా
చెలిమి నీ కందుండఁగా చేయి నాపైఁ జాఁచఁగాను
ఫలమేవంక వచ్చునో పచ్చారేది దోసము ॥మగ॥

జోడుగా నాపెఁగలసి చుట్టరికాలు చెప్పేవు
వాడికె సేసుకొనఁగా వలదనేనా
ఆడ నాపె రాఁగా నన్నుఁ గూడితి శ్రీవేంకటేశ
వేడుక నట్టె మొకము వేలించేది దోసము ॥మగ॥ **246**

**పరిచయ పరిమళం :**

శ్రీవేంకటేశ్వరుని వలచి వలపించుకొన్న ప్రేమిక అన్నమయ్య. ఆ స్వామి మెచ్చిన వాళ్ళందరూ ఆయనకు దగ్గరవారే. అన్నమయ్యపై అక్కసును వెళ్ళబెడుతున్నది, ఇంకొక వలపుకత్తె. రభస వినండి, మరి. స్వామీ! మగవానిదేమి తప్పువుంటుంది? ఎవ్వతె కోరితే దానితో మాపుదాకా భోగిస్తాడు. వాడికి దక్కినదే సుఖము మంచేమిటి చెడేమిటి? నీవు మాత్రం తక్కువ వాడివా? మునుముందుగానే ఆమె సుగుణాల రాశి అని నాదగ్గరే పొగిడేవు. నీవు కోరి యే వనితను తెచ్చుకొన్నా అది నిన్ను కాదని అంటుందా? నీ మనస్సు ఒకదానిమీద మాటలు మాత్రమే నాతో నీకు నచ్చినట్లు చేయవయ్యా! “ఏఁకరేదిదోసము” (నీకోసం ఉవ్విళ్ళూరటం నాదే తప్పు.) స్వామీ! అదెవత్తో నీకిచ్చిన ఆహ్వానతాంబూలం నీవు నాకు ఇచ్చావు. నిన్ను వలచినదెవ్వతైనా వద్దంటుందా? నీ చెలిమి దానిపైవున్నది. కానీ నాకోసం చేయిచాస్తావు. దీనివల్ల ఫలమేమి వస్తుందయ్యా? “పచ్చారేదిదోసము” (నీకోసం అనవసరంగా అటూ ఇటూ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాను. ఇదంతా నాదే తప్పు). స్వామీ! ఆమెతో జంటగా మీ చుట్టరికాలు తిరగవేస్తావు. నీవు దాన్ని వాడుకచేసికొంటే ఈనాడు యెందుకు వద్దంటుంది? అది నీదగ్గరకు వచ్చింది. ఓ వేంకటేశా! నీవేమో నన్ను కూడినావు. ఇక నా మొకము వేడుకతో “వేలించితేదోసము” (వెలుగులు చిమ్మితే నాదేతప్పు).

★ **మునుకొని** – మునుముందుగానే ★ **వాడికె** – మచ్చిక





సంఖ్య : 368 సంపుటము : 24 పుట: 246 రాగం : రామక్రియ

**39** చెన్నలర భూపతిచెరువుకాడ నున్నాఁడు
వెన్నెలబాయిట నాడీ వేంకటేశుఁడు ॥పల్లవి॥

వాడలవాడలవెంట వనితలపొందు చేసీ
వేడుకకాఁడుగదమ్మ వేంకటేశుఁడు
జాడలు మీరి యప్పటి జాణతనాలాడీని
వీడెపుమోవితోడ వేంకటేశుఁడు ॥చెన్న॥

సాదువలె నందరిచన్నులపైఁ జేయిచాఁచీ
వీదరవెల్లితనాల వేంకటేశుఁడు
ఆదిగొని గొల్లెతల నాసలఁబెట్టీఁ దాను
వేదవేద్యుఁడై నట్టివేంకటేశుఁడు ॥చెన్న॥

నను పైనసతులెల్ల నంటునఁ గానుకియ్యఁగా
వినయాల(న?) చేకొనీ వేంకటేశుఁడు
యెనసి నన్నునేలి యిప్పుడు నావిన్నపాలు
విన నవధరించె శ్రీవేంకటేశుఁడు ॥చెన్న॥ **368**

**పరిచయ పరిమళం :**

భూపతిచెఱువువద్ద నెలకొనిన వేంకటేశ్వరునికి చక్కటి శృంగారగీతిక వినిపిస్తున్నారు అన్నమయ్య. చెన్నలర (సొంపుమీర) భూపతి చెరువు వద్ద వెన్నెల విరజిమ్మే ఆరుబయట శ్రీవేంకటేశుడు ఆడుచున్నాడు అని కీర్తిస్తున్నారు. ప్రతివాడలోనూ వనితలతో పొందు జరిపిన ఆ శ్రీవేంకటేశుడు వేడుకకాడుగదమ్మా? (శృంగారరాయడు కదుటమ్మా?) తాంబూలము చేత ఎఱ్ఱదొండపండులాంటి పెదవులున్న ఆ శ్రీవేంకటేశుడు, ఎక్కడాలేని ఉపాయాలు ప్రదర్శిస్తూ మాటిమాటికీ రసికత్వం ప్రదర్శిస్తున్నాడు. సజ్జనునివలెనున్నప్పటికీ అందరి చన్నులపై చేయివేసే వెఱ్ఱిముదిరిన చేష్టలుచేసే శ్రీవేంకటేశ్వరా! బేలలైన గొల్లెతలకు ఆశలు కలిగించి నీవు వేదవేద్యుడవు గీతాచార్యుడవు అయ్యావు. మరి వారి గతేమిటయ్యా? నీపై అనురాగబద్ధులైన, సతులందరూ చెలిమితో కానుకలీయగా వినయముతో స్వీకరిస్తావు, శ్రీ వేంకటేశ్వరుడు. అతిశయించి నన్నేలిన తిరుమలేశుడు, నా విన్నపాలు విని, స్వీకరించాడు.

★ **వీదురవెల్లితనాల** – వెఱ్ఱిముదిరన ★ **అవధరించు** – స్వీకరించు
★ **నంటున** – చెలిమితో ★ **అప్పటిజాణతనాల** – మాటిమాటికి రసికత్వంతో

సంఖ్య : 217 సంపుటము : 24 పుట: 143 రాగం : లలిత

44 చాలునే నీమాఁటలు చాలు మూలకెక్కెరా
వేలఁ జూపేవా పదారువేలవాఁడ వౌదురా ॥పల్లవి॥

వొంటినుందాన వదేమే వొంటియు నొంటకె పోరా
అఁటఁగా వోచెలియ గోరంట కౌనౌరా
గొంటుజాణతనమేలే కూళతనాలేలరా
కంటినే నీజాడ బండికంటిజాడలటరా ॥చాలు॥

వీడనాడేవేమే నీవీడనాడ నుండఁగఁబో
జోడుగదే నేను అవురా జోడగుటౌళి (ల?)
మేడిసేసేవటే నీవు మేడిపండె నీగుణాలు
వోడ వేమిటాను నీవావోడతో దూలమురా ॥చాలు॥

యింతయేలే నాతోఁ గారింతలు నీవల్లనే పో
సంతమైతినే వో వసంతకాఁడవా
పంతపు శ్రీవేంకటాద్రిపతి నేఁ గూడితిఁగదే
పంతము పాడియుఁగలపడఁతిరా నేను ॥చాలు॥ 217

**పరిచయ పరిమళం :**

నాయకుడు నాయికా వాదులాడుకుంటున్నారు. ప్రేక్షకపాత్ర వహించిన అన్నమయ్య ఆలూమగల పోరుతాటాకుమంట అని మిన్నక వుండి చూస్తున్నారు. మనం కూడా విని తరిద్దాం. నాయకుడే మొదట "చాలించవే ఇక నీ మాటలు" అన్నాడు. **"నీవు మాటలు మూలబడ్డ మాటలు గావారా?"** అన్నదామె.

"ఏమిటీ నామాటలనే వేలుపెట్టి చూపగలవటే"?. **"పదహారువేలమంది వాడవౌదువా లేదా చెప్పవయ్యా!".** "అవునూ, ఒంటిగా వున్నావేమిటే" అని అతనడిగితే, **"ఒకటి అనే సంఖ్యకూడా ఒంటరిదేపోరా"** అన్నది. "కఠినత్వం నీకంతగా బాగుండదే" **"నీవు కుటిలుడివనే నేనూ అలావున్నానురా"** అని జవాబిచ్చిందామె. "నీ జాడకంటిని లేవే" అని దెప్పిపొడిచాడతను. **"బండి చక్రము జాడలేలేరా నీవు చూచేది"** అని అతని రసికత్వం గుర్తుచేసిందామె "నన్నెందుకు విడనాడేవే" అంటే **"నీ వీడు అక్కడెక్కడో వున్నది పోరాదా?"** అని బదులిచ్చింది. "నేను నీకు జోడు కదే" **"నేనూ జోడు కట్టిన ఆలినేరా"** "మేడెక్కినట్లు చేస్తావేమే" **"నీది మేడిపండు గుణమే కదరా... లోపల అన్నీ పురుగులే కదా!"** అన్నదామె ఘాటుగా. "నీవెందులోను ఓడవేమే?" అని అతను విసుగుకొంటే **"నీవూ ఓడదూలమువంటివాడివే కదరా"** అని బదులిచ్చింది. "ఇంతెందుకు చేస్తావే?" **"నాతో బాధలు నీవల్లనేరా"** "స్వంతమైతిని కదే" **"ఓహో!! వసంతాలాడేవాడివా?"** నేను పంతముగల వేంకటపతినై కూడితిని కదే. **"నేనూ పంతమూ న్యాయమూ వున్న అలమేలుమంగనురా"**





సంఖ్య : 480 సంపుటము : 24 పుట: 321 రాగం : సామంతం

41 చెలఁగి కొలువులోన సిగ్గులువడఁగవద్దా
బలువుఁడవైతేనే ప్రహ్లాదవరదా ॥పల్లవి॥

వడియుఁజెమటతోడ వంచినమోముతోడ
తొడమీఁదఁగూచున్న తొయ్యలితోడ
జడిసేనీవలపులు సరికి బేసికిఁ జూచి
పడఁతులెల్లా నవ్వేరు ప్రహ్లాదవరదా ॥చెలఁ॥

నిట్టూరుపులు మీర నిద్దుర గన్నులఁ దేర
గుట్టుతో నిన్నాపె గోర గీర
గట్టిగా నీవాపెను కాఁగిలించి వదలక
పట్టుకుండఁగా నవ్వేరు ప్రహ్లాదవరదా ॥చెలఁ॥

సింగపుమోము మెఱయ చిమ్ముఁజూపులు బెరయ
అంగన కాఁగిట నొయ్యన దొరయ
రంగుగ శ్రీవేంకటాద్రిరాయఁడవై మన్నించఁగా
పంగెనల నవ్వేరు ప్రహ్లాదవరదా ॥చెలఁ॥ 480

**పరిచయ పరిమళం :**

బొమ్మిరెడ్డిపల్లి చెఱువులో వెలసిన ప్రహ్లాదవరదునిపై సరసశృంగారకీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఈ స్వామినిట్టూర్పులు విడుస్తుంటాడని, అవి వినపడతాయని ప్రతీతి. ప్రహ్లాదవరద నృసింహుని ప్రణయమూర్తిగా ఆవిష్కరించిన అన్నమయ్య ధన్యుడు. కొలువులోకూడా దేవేరితో శృంగార భావాలు చిలికించే ప్రహ్లాదవరదా! సిగ్గులు పడవలదా? నీవు బలవంతుడవైతేనేమి? కొద్దిగా వంచిన ముఖముతో, చెమటలలో దోగుచూ, తొడపై కూర్చొనియున్న ఆదిలక్ష్మితో భీకరమూర్తి సరసుడైన విధానమును చూచిన పడతులు మంచిచెడ్డలు విచారించి ప్రహ్లాదవరదుని చూచి పకపక నవ్వేరు. నిద్ర కళ్ళతోవున్నట్లు అనిపించే ఈ స్వామి ఉచ్ఛ్వాసనిస్వాసముల రవము వినబడుచున్నది. ఈ ధ్వనిని విని నీ దేవేరి రహస్యముగ (మెల్లగా) తన కొనగోటితో గీరింది. దానికి నీవు ప్రతిక్రియగా ఆమెను బిగికౌగలించగా అదేపడతులు మరల నవ్వేరు ప్రహ్లాదవరదా! దట్టమైన చూపులతోవున్న సింహవదనముతో ఆదిలక్ష్మిని కౌగలించి ఆమె తత్తరపడగా వేంకటాద్రిరాయని రూపు ఆ తొయ్యలికి చూపిన ఆ పడతులే బింకముగా నవ్వేరయ్యా! ప్రహ్లాదవరదా!

★ **సరికిబేసికి** – మంచికీ చెడుకూ ★ **గుట్టుతో** – రహస్యముగా
★ **పంగెన** – బింకము ★ **దొరయ** – అంటుకొని

సంఖ్య : 218 సంపుటము : 24 పుట: 146 రాగం : తోండి

**42 ఇతరము లేదే యింతి నీపతికి**
**ప్రతిదినదినమును ప్రభాతవేళ ॥పల్లవి॥**

**అంగన నీమోము అద్దము విభునికి**
**కంగుదేరి మేల్కనువేళ**
**పొంగేటికుచములే పూర్ణకుంభములు**
**వింగళమై వెలివెడలెడివేళ ॥ఇత॥**

**అతివ నీతొడలే యరఁటికంభములు**
**చతురునికిఁ బ్రవేశపువేళ**
**రతిఁగరములే తోరణపుఁజిగు రలరె**
**అతనుముహూర్తపుటావేళ ॥ఇత॥**

**సుదతి నీకెమ్మోవి సూడిదెఫల మిది**
**అదన మీరహస్యపువేళ**
**కదిసిన శ్రీవేంకటపతికిని నీ-**
**వెదిటినివిధానమ నెప్పటివేళ ॥ఇత॥ 218**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య అనుంగు చెలికత్తెవలె, దేవిని యేమంటున్నారో ఆలకించండి. ఓ ఇంతీ! నీపతికి నీవే సర్వస్వము. ఆయనకి ఇతరముయేదీ అక్కరలేదు. ప్రతిదినము ఉషోదయమునుండి ఇదే ఆయన దినచర్య. ఓ అంగనా! నీ పతికి అద్దము నీవదనమేనమ్మా! దానిని చూడక నిదురలేవడు సుందరముగా అలంకరించుకొని వెలివడువేళ దిష్టితీసే పూర్ణకుంభములు పొంగిన నీ కుచగిరులే. ఆయన బయటిపనులు చూసుకొని తిరిగి గృహమును చేరినపుడు ఆ చతురునికి నీవూరువులే ఆయన మంటపమున ముఖద్వార అరటి కంభములు. రతిలో అలరించు నీకరములే సుముహూర్తపువేళ ప్రవేశద్వారమున కట్టిన తోరణముల జిగి. ఓ సుదతీ! కెంపువంటి నీ అధరము మీ రహస్యవేళ నీవాయనికిచ్చే సూడిదెఫలము (కానుక ఫలితము). ఓ శ్రీవేంకటేశ్వరా! నీవెప్పుడూ యెదుటనే వుండే నిక్షేపమువంటివాడవు.

★ **వింగడమై**-సుందరముగా ★ **తోరణపు జిగురు**-మందముగా కట్టిన తోరణము
★ **సూడిదెఫలము** – కానుకల ఫలితము ★ **ప్రభాతవేళ** – వేకువజామున





సంఖ్య : 371 సంపుటము : 24 పుట: 248 రాగం : ముఖారి

**43 ఎఱుఁగుదు నే నీమోహ మింతిఁ బిలుచుకోరాదా**
**మొఱఁగి వేసా లింత నాముందర నేఁటికి ॥పల్లవి॥**

**వెలఁదిమాటలు నీకు విన నింపులౌఁగాని**
**చలముతోడుత మొగచాటు గాదు**
**తలకొని మొక్కితేను దయ వుట్టుఁగాని మరి**
**యెలమిఁ బరాకుసేయ నెంతైనా గొలుపదు ॥ఎఱుఁ॥**

**ఆపెనవ్వినవ్వులు అందములై యుండుఁగాని**
**రాపుల నెగసక్కెలై రచ్చకెక్కవు**
**చూపులఁ దరితీపులు సోద్యములై తోఁచుఁగాని**
**కైపులై యెంతైనాను కడుఁ జప్పఁగావు ॥ఎరుఁ॥**

**నీదేవులు చెనకితే నేరుపులై మించుఁగాని**
**ఆదిగొని వేసటలై యలపు గాదు**
**యీదెస శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి**
**పోది నెంతైనా తనపొం దెప్పుడు వీడదు ॥ఎఱుఁ॥ 371**

**పరిచయ పరిమళం :**

తిరుమలనాథుడు యెప్పుడూ తన పతియే. అయితే తనబోటి అసంఖ్యాకుల పతి ఆ వేంకటాచలపతియే. ఎవరి వలపు వారిది. ప్రస్తుతం ఆమె శ్రీదేవి చెలికత్తెకూడా ఆమెదేవి తరపున స్వామితో యేమంటున్నదో ఆలకించండి. ప్రభూ! నీమోహము నేనెరుగుదును. నిన్ను కాదనేదెవరయ్యా? ఆ ఇంతిని పిలిపించుకోరాదా? నా ముందు వంచనకూడిన మాటలెందుకయ్యా? ఆ వెలది మాటలు నీకు చెవికింపులని నాకు తెలుసు. తన అహంకారముతో నీకు మొగము చాటుచేయుటలేదు. పూని మొక్కితే పతికి దయ కలుగుతుంది కాని, పరాకు చేస్తే చిరాకు కలుగుతుంది. నాకు తెలుసు కానీ ఆమె చూపునది పరాకుగాదయ్యా! ఆమె నవ్వులో ముగ్ధత్వమే కానీ యెకసెక్కెము కనబడుతుందా చెప్పు స్వామీ! ఆమె చూపులు తరితీపులై (ఉపేక్షించునట్లు కనబడుతాయి గాని చోద్యముగా అది ఉపేక్ష కాదయ్యా! అవి చెప్పలేని ఆపేక్షనే తెలుపుతాయి. నీ దేవేరిని తాకితే ఆమె జాణతనము నీకే తెలుస్తుంది. అలుపుతో నీవిసుగు ఆమెపై చూపకు. నన్నే ఏలినావు కదా!! మరి ఆమె వేంకటపతి రాణి నీ పొందు ఆమె యెన్నటికీ వీడదు.

★ **తలకొని** – పూని ★ **పోది** – వైభవముతో

సంఖ్య : 25 సంపుటము : 6 పుట: 19 రాగం : లలిత

**48 ఎందరి వలపించెనో యంటనింట**
**చిందుల పాటలు వింట సిరులు చేకొంట. ॥పల్లవి॥**

**తుంగభద్ర యేటికాడ తోరమైనకొండనీడ**
**రంగుమీరి పైఁడి గోడ రాతిమేడ**
**అంగడి నున్నాఁడు చూడ నదివో పెడతల**
**చుంగుల పించెపు గూడ చుట్టుఁ బాగతోడ. ॥ఎందరి॥**

**పండరంగినుండి వచ్చి పామరుల నెల్ల మెచ్చి**
**యెండలేని నీడలోన యెచ్చి యెచ్చి**
**వెండిఁ బైఁడిఁదడంబడ విభవాలఁబ్రొద్దు వుచ్చి**
**కొండనుచు వరములు కోరికలిచ్చి. ॥ఎందరి॥**

**చక్కని యావిట్ఠలుండై జవ్వనానఁ జెలువుండై**
**ప్రక్కనున్న సతితోడఁ బ్రబలుండై**
**మక్కువ వేంకటగిరి మాయధారి దేవుండై**
**యెక్కడా నెదురులేక యీడ నున్నాఁడిడివో. ॥ఎందరి॥**

**పరిచయ పరిమళం :**

బళ్ళారి జిల్లా హోస్పేట తాలూకాలో పండరిపురంనుంచి పండరంగి విట్ఠలుని తెచ్చి ప్రతిష్ఠించిన దేవాలయంలో అన్నమయ్య కాలంలో పూజించి వుంటారు. ఆయననే గోపాలకృష్ణుడుగా కొలిచేవారేమో? ఈ విట్ఠలుని కీర్తన ఆ స్వామిపై చెప్పినదే. ఈ విట్ఠలుడు యెందరిని వలపించునో? ఇంటింటా నర్తిస్తూ పడతులు పాడే పాటలు వింటూ వారి వలపు సిరులను చేకొంటూ అతిశయించినాడు. తుంగభద్రానది ఒడ్డున, ఉన్నతమైన కొండనీడలో అతిశయించిన వెండి బంగారములుగల రాతిగోడల భవంతిలో ప్రస్ఫుటమైవున్నాడు. అతనికి పెద్ద తల, ఉంగరాల జుట్టు, చక్కని కొప్పుతో, చుట్టుకొనిన తలపాగతో వున్నాడు. ఈ పండరంగి విట్ఠలుడు, పండరి పురంనుంచి వచ్చి, పామరులనందరిని మెచ్చి, నీడ దట్టంగా వున్నచోట నెలకొనినాడు. వెండి బంగారములు వెల్లువెత్తిన వైభవములతో పొద్దుపుచ్చుతాడు. కొండలవంటి వరములనిచ్చి కోరికలు తీరుస్తాడు. చక్కని ఈ విట్ఠలుడు నిండుయౌవనంలో వున్నాడు. ఈయన పక్కనే దేవేరి రుక్మిణి వున్నందున ప్రబలుడైవున్నాడు. వేంకటగిరిపైనున్న మాయదారి దేవుడు, ఎక్కడా ఎదురులేనందున, ఇదివో ఇక్కడావున్నాడు.

★ **మాయధారి** – మాయావి ★ **ఎచ్చి** – అతిశయించి





సంఖ్య : 267 సంపుటము : 24 పుట: 179 రాగం : లలిత

**45 చూతువు రావమ్మా నీసుతుని యశోదమ్మ**
**బూతులఁ దిట్టీ వద్దంటే పొలఁతులనెల్లను ॥పల్లవి॥**

**పొడవాటివుట్లెక్కి బుడుగులతోడివెన్న**
**తొడికిపెట్టీఁ దనతోడివారికి**
**కడవలపాలమీగడలు దేవుకతిని**
**కడకుఁ బాలెల్లాఁ గార కంతలుసేసీని ॥చూతు॥**

**అక్కజపురోళ్లెక్కి అట్టుగపై దాఁచిన-**
**చక్కిలాలు నురుఁగులుఁ జవిగొనీని**
**వెక్కసానఁ బట్టరాక వీదులఁ బారాడుతాను**
**మొక్కలాన నెత్తుకొంటే ముద్దులువెట్టీని ॥చూతు॥**

**పన్నారుదొంతు లెక్కి బానలపెరుగు నేయి**
**చెన్నుమీర నారగించి చేరి నవ్వీని**
**అన్నిటా శ్రీవేంకటేశుఁ డలమేల్‌మంగవిభుఁడు**
**వన్నెలఁ గ్రిష్ణుఁ డింటింటివాకిటఁ బొంచీని ॥చూతు॥ 267**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో గోపికలు యశోదవద్ద మొత్తుకుంటున్నారు. నీ కొడుకు బూతులు వుపయోగిస్తున్నాడని మేము వద్దురా అని మందలిస్తే మమ్మల్నీ బూతులతో తిట్టి రభస చేస్తున్నాడమ్మా నీ కొడుకు. వద్దురా అన్న స్త్రీలని యెలా తిడుతున్నాడో చూతువురావమ్మా! మీవాడి అకృత్యం చూడవమ్మా! ఎత్తుగా కట్టిన వుట్లను బుడతలసహాయంతో పట్టుకొని వెన్నతాను తిని తన మూకకు పంచిపెట్టాడు. కడవలలో దాచిన పాలమీగడ దేవుకుని తిన్నాడు. అంతా అయ్యాక పోయేవాడు పోతూ పాల కుండలకి బొక్కలుపెట్టి పాలన్నీ కారిపోయేట్లు చేశాడు. ఆశ్చర్యంగా పెద్దపెద్ద రోళ్ళెక్కి మేము అటకపై దాచిన చక్కిలాలు, నురుగులు కాజేసి తిన్నాడు. చాకచక్యంతో పట్టుకోబోతే పారాడుతూనే యేదో వీధిలోకి పారిపోతాడు. పిల్లవాడు బాగున్నాడని యెత్తుకుంటే అధరాలపై ముద్దులు పెట్టుకొంటాడు. పిడతలదొంతినెక్కి బానలలో దాచుకొన్న పెరుగుతిని నెయ్యి తాగుతాడు. చక్కగా స్వాహా చేసి నవ్వులు చిందిస్తాడు. ఇటు చూద్దామంటే అలమేల్మంగ విభుడైన వేంకటపతి వీడేనాయె. మా ఇంటింటా వాకిటిలో పొంచిన కృష్ణుడు వాడేకదా!

★ **మొక్కలాన**–ఉత్సాహంతో ★ **వెక్కసాన**–ఆశ్చర్యంగా ★ **పన్నారుదొంతులు**–పిడతలదొంతి

సంఖ్య : 216 సంపుటము : 24 పుట: 145 రాగం : నాదరామక్రియ

46 నిండుజాణ వన్నిటాను నీవే యెఱుఁగుదువు
అండనుండి సతులచే నాడించుకోరాదు ॥పల్లవి॥

తలఁపుకొలఁదినే తమి రేఁచవలెఁగాని
వలపంతఁబెట్టరాదు వనితలను
పులక లెసఁగఁ గుచములు ముట్టవలెఁగాని
బలిమిఁ బిసికి తడఁబరచఁగరాదు ॥నిండు॥

కూరిములు దలకొన కురు లంటవలెఁగాని
బారెఁడేసివెంట్రుకలు పట్టఁగరాదు
నేరుపుతోనే కాఁగిటనించి కూడవలెఁగాని
బీరానఁ గుదించి పిరివీకు సేయరాదు ॥నిండు॥

మోహముకొలఁదినే మోవి యానవలెఁగాని
సాహసాన పలు సోఁకించఁగరాదు
యీహల శ్రీవేంకటేశ ఇంతి నిట్టె యేలితివి
బాహుమూలా లంటి కదుఁబచ్చిసేయరాదు ॥నిండు॥ 216

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో అవధులు మించినట్లు అనిపించినా, స్వామి లీలల్లో తన్మయత్వం చెందిన భక్తులకి అవధియే లేదనిపించి ఈ మధుర భావలహరిని యెన్నుకొన్నాను. "స్వామీ! నీవు అన్నిటిలో పరిపూర్ణుడైన జాణవు. ఇది నీకూ తెలుసు. నీ అండలోవుండే తరుణులతో నీకేళి కొనసాగించరాదా?" అంటున్నారు. ప్రభూ! నీ ఆలోచనలలోనే, తమిరేచవలె (వలపు రేకెత్తించవలె) గాని, వనితలను బలవంత పెట్టరాదయ్యా? తనువు పులకరించేట్లు కుచములనంటవలెగాని బలముగా ఒత్తి తడబడేట్లు చేయరాదు. దేవా! ప్రేమతో కేశపాశమును తాకవలెనుగాని బారెడంత పొడవున్న ఆమె జుట్టును పట్టుకొని మోటుగా లాగరాదు. నూతన వధువును నేర్పుతో కౌగిళ్ళనించి ఆపైన కూడవలెను. అంతేకాని వీరత్వంతో కుదించి, బాధతో పారిపోయేట్లు చేయరాదయ్యా! మహానుభావా! ఓ శ్రీవేంకటేశ్వరా! ఆమెను చుంబించునప్పుడు, మోహముతో అధరామృతమునాస్వాదించవలె గాని సాహస వీరునిలా పళ్ళతో కొరకరాదు. ఈహల (ఈ విధముగా చివరకు) ఆ దేవిని సులభంగా ఏలుకొన్నావు ప్రభూ! ఒకటి గుర్తు పెట్టుకో యెన్నడూ ఆమె బాహుమూలలనంటిగాని పదిమందిలోగాని శృంగారము జరుపరాదు.

★ **వలవంతము** – బలవంతం ★ **పిరివీకు** – బాధించు
★ **పలు** – పళ్ళు/దంతములు ★ **బాహుమూలలు** – చంక





సంఖ్య : 169 సంపుటము : 24 పుట: 145 రాగం : ఆహిరి

47 నామన నెఱుఁగుఁ దొల్లె ననిచినదాననౌత
కామించి యేఁచఁగవద్దు గక్కన రమ్మనవే ॥పల్లవి॥

యెడమాట లాడించి యెంతపొద్దు జరపీనే
అడియాసలనే యెంత అలయించీనే
వుడివోనిచూపులను వురులొడ్డీ నిది యేమే
చిడియనివలపులఁ జిమ్మిరేఁగేదానను ॥నామ॥

మొగమొగా లెదుటను మోహ మెంతరేఁచీనే
నగవునఁ గాఁక లెట్టు నటియించీనే
పగటుఁజేఁతలు చూపి బయలేల యీఁదించీనే
మిగులాఁ దమకముల మించివున్నదానను ॥నామ॥

మన్ననలు నాకు నిచ్చి మద మెంత యెక్కించీనే
కన్నుసన్నలనే యేమి గారవించీనే
వున్నతి శ్రీవేంకటేశుఁ డుద్దగిరికృష్ణుఁడై
నన్నుఁ గూడె తనపొందు నమ్మికైనదానను ॥నామ॥ 368

**పరిచయ పరిమళం :**

ఉద్దగిరిలో వెలసిన శ్రీకృష్ణునిపై మధురకీర్తన వినిపిస్తున్నారు, అన్నమయ్య. ఆయన శృంగార పురుషుడని యెరిగిన నాయిక తన చెలికత్తె అయిన అన్నమయ్యతో కృష్ణుని ప్రేయసి యేమని అంటున్నదంటే... మొదటినుంచీ నామనసుకు తెలుసు నేనాతనికి ఇష్టమైనదానను. మరి, ఇష్టపడ్డాక బాధపెట్టడం యెందుకు? వెంటనే రమ్మనవే. పుల్లవిరుపు మాటలు మాట్లాడి యెంతపొద్దు గడుపునే? అడియాసతో యెంత అలసట కలిగెనే? తొలగని చూపులతో నిశితంగా చూచునేమే? చిరాకేలేని వలపులతో మైమరువజేసేదానను కదా! ముఖములు కలియగానే మోహమెంత రేపెనే? నవ్వుతూనేవున్నా యెంతకోపము నటించేనే? మురిపించే చేతలు ప్రదర్శించి, నీళ్ళెండిపోయిన చెఱువులో ఈదులాడినట్లు చేయనేలనే అసలే అంతులేని తమకముతో మైమరిచివున్నదానను కదా! నాకు అంతులేని మన్ననయిచ్చి యెంత గర్వమెక్కించెనే? నన్ను తనకనుసన్నలలోవుంచుకొంటూనే యెంత గౌరవమిచ్చెనే? తిరుమల శ్రీవేంకటేశ్వరుడే ఉద్దగిరి కృష్ణుడై నన్ను కూడినాడే. తన పొందుమీద యెంతో నమ్మకమున్నదానను కదా!

★ **ననిచిన** – ఇష్టమైన ★ **ఏఁచు** – బాధించు ★ **ఉడివోని** – తొలగని
★ **చిడియని** – చిరాకేలేని ★ **పగటు** – మురిపించు ★ **కాకటి** – తాపములు

రచయిత:

## అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు



| | | |
|---|---|---|
| పిలవండి | : | **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు** |
| పుట్టింది | : | **9-6-1945** |
| చదివింది | : | ఎం.టెక్. |
| ఉండేది | : | ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61, సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్. |
| రంథి | : | భగవన్నామ సంకీర్తన |
| నచ్చింది | : | శాస్త్రీయ సంగీతం |
| నచ్చంది | : | నక్కజిత్తులు |
| మెచ్చింది | : | సజ్జన సాంగత్యం |
| రింగండి | : | 00919393021360 |
| చదవండి | : | www.geetadeksha.com |
| ఇవ్వండి | : | e-mail : geetadeksha@gmail.com |





సంఖ్య : 27 సంపుటము : 6 పుట: 20 రాగం : సామంతం

**49 తార వలచినయపుడె తరుణిరతుల**
**తారసము లెట్లుండు తగవు లెట్లుండు.** ॥పల్లవి॥

**తరితీపు లెట్లుండు తాలుము లెట్లుండు**
**గరువంబు లెట్లుండు కసరు లెట్లుండు**
**పొరపొచ్చె మెట్లుండు పొలయలుక లెట్లుండు-**
**నెరవరిక లెట్లుండు నెఱుక లెట్లుండు.** ॥తార॥

**ఓపికలు నెట్లుండు నొల్లములు నెట్లుండు**
**చూపోప మెట్లుండు సొలపు లెట్లుండు**
**దాఁపరము లెట్లుండు తగుమాన మెట్లుండు**
**కోపంబు లెట్లుండు కొఱంత లెట్లుండు.** ॥తార॥

**సిరిదొలఁకు లెట్లుండు శేషాద్రిపతికరుణ-**
**కిరవైన సతిమనసు నెపుడు నెట్లుండు**
**మురిపమది యెట్లుండు ముద్దుఁజనుఁగవమీఁద-**
**నరచందురుని రేక లపుడెట్లులుండు.** ॥తార॥ **27**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ మధురకీర్తనలో వలచిన తరుణుల మనస్సును ఆవిష్కరిస్తున్నారు. అచ్చతెనుగు పదముల వెల్లువ అర్థం కావాలంటే ఓపికగా నిఘంటువులు వెతకాలి. తార (సమీపించి) వలచినప్పుడు తరుణి రతులు, తారసముగా (ఎదురుకొన్నట్లు ఉధృతంగా) వుంటాయి. ఇక తగవులెట్లుంటాయి. ఆమెకు తరితీపులు (మోహములు), తాలుము (ధైర్యము), గర్వము, విసుగు, పొరపొచ్చము, పొలయలుక (ప్రణయకోపము), ఎరవరిక (రోత), ఎఱుక (స్పృహ) ఇత్యాది లక్షణములు ఎట్లుంటాయి? విరహతప్తులకవి లోపిస్తాయి. ఆమెకు ఓపికెట్లుంటుంది? ఒల్లములు (వలపులు), చూపోపము (చూస్తే సహించలేనితనము), సొలపులు (పరవశములు), దాపరము (ప్రాప్తము) ఇత్యాది లక్షణములెట్లుంటాయి? తగుమానమూ లోపిస్తుంది? కావున ఇక కోపమూ వుండదు, కొఱతా వుండదు, ఆమెకు సిరిదొలకులు (సిరిలోపించుట) ఎట్లుంటుంది? శేషాచలపతి కరుణ పుష్కలంగావున్నది కదా? ఆయనను వాంఛించే సతి మనస్సు ఎప్పుడెట్లుంటుందో తెలియదు. ముద్దు చనుగవమీద అర్థచంద్రాకారాలుంటాయి. మురిపాలుంటాయి.

★ **తగుమానము** - తగిన మర్యాద ★ **ఎరవరిక** - రోయుట

సంఖ్య : 97 సంపుటము : 6 పుట: 71 రాగం : ఆహిరి

50 అపు దేమనె నేమను మనెను.
తపమే విరహపుఁదాపమనె. ॥పల్లవి॥

పవనజ యేమనె పడఁతి మతేమనె
అవనిజ నిను నేమను మనెను
రవికులేంద్ర భారము ప్రాణంబనై
ఇవల నెట్ల దరియించే ననె. ॥అపుదే॥

యింకా నేమనె యింతి మతేమనె
కొంకక యేమని కొసరుమనె
బొంకులదేహము పోదిది వేగనె
చింకవేఁట యిటు చేసె ననె. ॥అపుదే॥

నను నేమనె ప్రాణము మన కొకటనె
తనకు నీవలెనె తాపమనె
మనుకులేశ ప్రేమపుమనకూటమి
ఘనవేంకటగిరిఁ గంటి ననె. ॥అపుదే॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ విలక్షణమైన మధురకీర్తన రామాంజనేయుల సంవాదము. సీతాదేవిని దర్శించిన హనుమకు ఆతృతతో ప్రశ్నలేస్తున్న రామచంద్రునికి మాటలు వేగంగా వస్తున్నాయి. ఎంతైనా వివరించగల పల్లవి. ఓ హనుమా! ఆమె అప్పుడేమన్నది? ఏమనుమన్నది నాతో? ప్రభూ! తాను నీకోసం పడే విరహమే తన తపము అన్నది. పావనీ! పడతి సీత యేమన్నది మరొకమారేమన్నదో చెప్పు. నిన్ను నాతో ప్రత్యేకించి ఏమన్నా అన్నదా? ప్రభూ! రవికులేంద్రా! తనకు ప్రాణమే భారమైనదని రోదించినది. ఇకపై ఈ తనువును యెట్లు దాల్చెదనని అడిగినదయ్యా!

ఓ కేసరినందనా! ఇంతి ఇంకా ఏమన్నది? మరేమన్నది? జంకక ఏమనుమన్నదో కొసరి వినిపించవయ్యా! ప్రభూ! నిరుపయోగమైన తన దేహము, వేగమే ఎందుకు పోదని విలపించింది. మూగజీవియైన లేడికి అపకారం తలపెట్టిన తనకు తగిన శాస్తి జరిగినదన్నదయ్యా!

కపిశ్రేష్ఠా! నన్నేమన్నా అన్నదా? స్వామీ! తనువులు వేరైనా మీ జంటకు ప్రాణం ఒక్కటే అనమని చెప్పింది. తనకూ నీవలెనే ఈ విరహము తాపమన్నదయ్యా! ఆఖరిమాటగా, ఓ మనుకులేశా! ప్రేమాస్పదమైన మన కూటమిని ఘనమైన వేంకటగిరిపై కంటినయ్యా! అని అన్నది ప్రభూ!

★ **చింకవేట** – లేడిని కొట్టుట ★ **దరియించేనననె** – ధరింతును అనెను





సంఖ్య : 179 సంపుటము : 6 పుట: 129 రాగం : ఆహిరి

51 పాయరాని పదివేలు పనులు నీకు యీ
కాయము నీ విప్పుడైన కౌఁగిలించుమీ. ॥పల్లవి॥

చిత్తజుతాపముచేత చిక్కవడ్డ దానం గాన
వొత్తి నీతో విన్నవించ నోపం గాని
యెత్తిన నీవిరహాన యే మౌదునో నన్ను
చిత్తగించి యెప్పుడైనాఁ జేరంగరమ్మీ. ॥చిత్త॥

తరి నిన్నుం బాసి మాట తడఁబడే దానం గాన
నెరి నిన్నుం దూరనాడ నేరం గాని
యెరగొని తలచీర యెరంగకున్నప్పుడైన
కరఁగి మఱవక నాకడ చూడుమీ. ॥చిత్త॥

దవ్వుల నిందాఁక నీకు తమకించే దానం గాన
జవ్వన మంటకు మనం జాలం గాని
రవ్వైన వేంకటరమణ నావద్ద నిట్టే
పవ్వళించి నేఁడైనాఁ బాయకుండుమీ. ॥చిత్త॥ 179

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ మధుర కీర్తనలో దేవి శ్రీవేంకటేశ్వరునితో ప్రభూ! నీకు విడువరాని పనులు పదివేలు (అనేకము). అయినా నీవు నా యీ కాయము నిప్పుడే కౌగలించరాదా? ఒకమాట గుర్తుంచుకో. నేను మన్మథ తాపముచే మరిగిపోతున్నదానను కాదు. బలవంతంగా నీకు విన్నవించలేను. విజృంభించిన నీ విరహంతో నేనేమవుతానో తెలియదు. నన్ను చిత్తగించి యెప్పటికైనా చేరరావయ్యా! స్వామీ! నీకు వేరైతే నామాటకూడా తడబడుతుంది. నీపై ఆగ్రహం వచ్చినా నిన్ను నిందించనశక్తురాలనయ్యా! నిశ్చయించి నన్ను ముఖ్యురాలుగా గుర్తించినా, గుర్తించకపోయినా, కరిగినవాడివై నాకేసి చూడు. నన్ను మరువకు. ప్రభూ! నీకు దూరంగా వుండి తమకమురేపేదాననుగాదు. ఈ యౌవనాగ్నినిసైపలేను. వజ్రమువంటి వేంకటరమణుడా! నావద్ద పవ్వళించి నేడైనా నన్ను విడనాడకుమా.

★ **ఎరగొని** – పరవశించి ★ **ఎత్తిన** – విజృంభించిన

## అంకితము

### నా ఇష్టదైవము, శ్రీ వేంకటరమణునికి
### ఆయనలో ఇమిడిపోవాలని ఆశపడే రమణులకు...



కం॥ హరియేమనెనే అలిగెనొ
వెరపందిన నాయికలును వేదనజెందన్
కరిగెడి వేంకటపతికిని
తరుణులకిది అంకితమ్ము ధన్యత నిత్తున్.

తా॥ "హరి యేమన్నాడే, ఒకవేళ నాపై అలిగాడా? ఇక యెన్నటికీ మమ్మల్ని చూడడా" అని భయపడి దుఃఖిత అయిన తన నాయికనావిధంగా చూచి కరిగిపోయే తిరుమల శ్రీవేంకటరమణునికి, ఆయన తరుణులకు ఈ కృతిని నాకు ధన్యత కలుగునట్లు అంకితమిచ్చెదగాక!





(సంపుటి - IV)



# "హరి యేమనెనే అలిగెనో"

## అలమేలుమంగమ్మతో అలనాటి హరి అనురాగ పరిమళం


## ఆత్మ పరమాత్మల ఐక్యము

ఇది

అన్నమయ్య పదకవితకు అమరవాది పరిచయం

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు





# హరి యేమనెనే అలిగెనో

## ఎన్నుకొన్న

## అన్నమయ్య మధురకీర్తనలకు

# పరిచయ పరిమళము

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.

కం॥ శ్రీధరుడు వేంకటేశుడు
ఆధారం బవనిసతికి అన్నులమిన్నై
మాధవి అలమేల్మంగకు
రాధమ్మకు హరిని వలచు రమణులకెల్లన్





## హరి యేమనెనే అలిగెనో

(సంపుటి - IV)

మొదటి ప్రచురణ
**మార్చి 2014**

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :
**కె.వి.ఆర్.**
98495 79345

తరలము॥

వలను కానిది మోహమేనను భావనమ్మిక నిక్కమే!!
చెలువమొప్పగ వేంకటేశుని చింతతోరగిలేను రా
తలచినంతనె కూడవచ్చెడి తాను నేడిటరాడుగా
కొలిచి యెవ్వతెకాగిలించెనొ కోటియాసలుతీరగా

సీ॥ చదువుల దిట్టనంచెదురేది యనుకొంటి
తిరుమలేశా! నీకు శరణు శరణు

నిపుణుండ నేనంచు నీల్గితి చితికితిన్
మురవైరి శ్రీహరీ! శరణు శరణు

ధనమదంబెక్కంగ తాలిమి అడుగంటె
సప్తగిరీంద్ర! నీ శరణు శరణు

తే.గీ.॥ కండ్లు విచ్చెను పొరలన్ని కరిగిపోయె,
వెనక జన్మల కవనంబు వెలికి వచ్చె
కరుణ నీ దారి బట్టితి దారులందు
స్థిరమువేంకటనాయకా! శరణుశరణు.





# హరి యేమనెనో అలిగెనో

(సంపుటి - IV)

ఎన్నుకొన్న అన్నమయ్య మధుర కీర్తనలకు
పరిచయ పరిమళము

## విషయ సూచిక


| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | అంతేసి మేమెరగము ఆడువారము | 27/327 | 28 |
| 2. | అందరి కొక్కటే జాలు | 22/63 | 42 |
| 3. | అన్నిటాజాణడు అలమేలంగపతి | 27/562 | 14 |
| 4. | అలమేలు మంగపతియన్నిటా | 22/537 | 47 |
| 5. | ఆడుజన్మమే మాకు | 22/128 | 37 |
| 6. | ఆడుజన్మమే మేలు అందరికిని | 27/399 | 17 |
| 7. | ఆడేనంటా వచ్చె నారగించలే | 22/139 | 33 |
| 8. | ఆనతీయవయ్యా యేమిటానడ్డము | 27/396 | 22 |
| 9. | ఇంకనైన మొక్కవే నీవిన్నిటికీ | 27/397 | 18 |
| 10. | ఇంతవుపకారినైతినిదినీకు | 27/389 | 29 |
| 11. | ఇంతగా జేసెగా యింతి కన్నుల నగవు | 6/20 | 8 |
| 12. | ఇన్నిటా నీతని చిత్తమెరిగి | 27/478 | 16 |
| 13. | ఈడేరని యట్టివలపేటికమ్మా | 6/21 | 10 |
| 14. | ఊరకుండవే చెలియా | 22/281 | 44 |
| 15. | ఎంత మాయలవాడే యెంచిచూడ | 6/22 | 1 |
| 16. | ఎంత సింగారించేదే | 22/130 | 35 |
| 17. | ఎక్కినవానికి జూడయేనిగె | 27/177 | 19 |
| 18. | ఎటువంటిమోహంబు యెటువంటి | 6/178 | 6 |
| 19. | ఎట్టు గడిపీనోదైవ | 22/29 | 34 |
| 20. | ఎట్టు గడియించెనమ్మ | 6/23 | 2 |
| 21. | ఏమి నోము నోచినదో యీయింతి | 22/520 | 46 |

| | | |
|---|---|---|
| 22. ఏమిసేయగ వచ్చు నిట్టుండు | 6/38 | 7 |
| 23. ఓయమ్మ నీలిలుడడే | 22/69 | 38 |
| 24. ఓయమ్మ యశోదవద్దన్న మానడు | 27/395 | 26 |
| 25. కపటములిక నేలే కన్నులెదుట | 27/225 | 27 |
| 26. కానీవయ్యా అందుకేమికాదనేన | 27/179 | 20 |
| 27. గాడిదిగూడకుండ | 22/92 | 40 |
| 28. గొల్లదోమటాయనేడు | 27/365 | 13 |
| 29. చిత్తగించు నీవాపెను చెన్నరాయ | 27/328 | 25 |
| 30. చీరలియ్య గదవోయీ చెన్నకేశవా | 27/317 | 12 |
| 31. చెల్లుబడిగలవాడు సేసిన | 22/76 | 36 |
| 32. తామొకరినాడుదురు తమనేరాలెంచు | 22/17 | 32 |
| 33. దొడ్డదోరతానైతే | 22/38 | 39 |
| 34. నడివిడి మాటలు నాయమా | 22/304 | 48 |
| 35. నాకు నిన్ను చూచినవ్వు | 22/503 | 50 |
| 36. నీపాపమావోరీనిచ్చుగాల | 22/122 | 41 |
| 37. నీవేల తిట్టేవు నన్ను నీచేతలే | 22/275 | 49 |
| 38. నేరుతువు కరియమాణిక్కెదేవుడా | 27/145 | 23 |
| 39. నిచ్చనిచ్చ జేకొనునివాళి | 22/129 | 31 |
| 40. ప్రేమముతో నిందరిని బెండ్లాడితివి | 27/104 | 24 |
| 41. బయలీదించకురే తమకపు | 6/177 | 9 |
| 42. మగవానితోటి బలిమి మగువల | 22/511 | 45 |
| 43. మచ్చికల మఱపులకు మదన | 6/38 | 4 |
| 44. వద్దు వద్దు కోపము వదిన | 27/178 | 21 |
| 45. వారిగో వీరిగో వాడలవాడల | 27/388 | 30 |
| 46. వావిగాదు నీకు నాకు వద్దు | 6/137 | 3 |
| 47. వీనులు చల్లగా ఇట్టే వినేగాక | 27/477 | 15 |
| 48. వెఱవక యింత విన్నవించు | 6/37 | 5 |
| 49. సుదతులు తీరే సోబనము | 22/89 | 43 |
| 50. సోబనము సోబనము చూడరె | 22/538 | 51 |
| 51. క్షితినిట్టి నేరుపు సీతాదేవికి | 27/57 | 11 |






# ప్రార్థన

కం॥ శ్రీకర వేంకటరమణా!
సాకారము నీదు రూపు సాధుమునులకున్
చేకొని యీనా రచనను
నాకీయవె తిరుమలేశ! నయమున్ జయమున్.

చం॥ నెలతలపైన మోహమున నీరజనాభుడు వేంకటేశుడై
కొలువయినాడురా భళిర! కొండలకోనల నిల్చినాడురా,
చెలువపు భక్తకోటికిని చిందెడి కోర్కెలదీర్చు రాయుడై
వెలసెను జెప్పెదన్ గొనుడు విందగు కైతల సౌరభంబులన్.

ఉ॥ ఎవ్విధిలోతు బావిగని యెన్నడు జెప్పగలేమొ లోతు ఆ
రవ్వల వేంకటేశ్వరుని లాగులు జెప్పటు యేరికౌనురా
నవ్వులు నిండువేళ మన నాథుడు వాడని నమ్మలేము, పో!
క్రొవ్వు కరంగినన్ శరణుకోరుట తథ్యము, నన్ను నమ్ముడీ.

ఆ.వె॥ ఎన్నరానివాడు ఏడు కొండలవాడు
ఎవని మొదట గాచు నెట్లు తెలియు?
శరణు శరణు యనుట సర్వోత్తమంబైన
దారివాని నరయ తగినదదియె.

కం॥ మదమెక్కి హరిని మఱతురు
వదలని వైభవములున్న వదలనదదియే,
వదిలెద వలదని సంపద
పదగాతువు వేంకటేశ! పదములబడితిన్.


చివరికి వినండి. కొంతమంది అల్పజ్ఞానంతో అన్నమయ్య బూతుకీర్తనలు చెప్పాడని ఆ రోజుల్లో తమ అక్కసును వెళ్ళబోసుకొన్నారు. అటువంటి వారు నేటికాలంలోనూ వున్నారు. వారందరికీ కనువిప్పే నామాటలివే. పండితులు అన్నమయ్య శృంగార కీర్తనలను పరిష్కరించి ఆ కీర్తనలలోని నాయకుడు పరమాత్మ, నాయిక పరమాత్మ సంగమం కోరే ఆత్మ అని విశదీకరించారు. జనబాహుళ్యానికి వారు స్త్రీ పురుషులనిపిస్తే వారు భగవంతుని పాఠశాలలో ఎల్.కె.జి. విద్యార్థుల క్రింద లెక్క అన్నమాట. మరి పి.హెచ్.డి. అంటే ఆత్మ పరమాత్మను చేరుకోవటం, జరిగేనా? ఏమో! శ్రీహరికే తెలుసు.

అందుకే మనం ఈ అద్భుత సాహిత్యాన్ని మధురకీర్తనలు అందాము. అన్నట్లు ఇవి సరసము చిందించే సరసకీర్తనలు కూడా.

**తిరుమల తిరుపతి దేవస్థానములవారికి సదా కృతజ్ఞుడను**

***Please visit:*** **geetadeeksha** in google Network,

for my other works







# తొలిపలుకు

అన్నమయ్య శృంగారకీర్తనలు ఇదివరలో ఏలుకో శృంగారరాయ అనే పేరుతో మున్నుడి, భావవివరణలతో 101 కీర్తనలు అందించాను. ఈనాడు మళ్ళీ అన్నమయ్య సరసకీర్తనలను, శృంగార కీర్తనలను అన్నమయ్య మధుర కీర్తనల పేరుతో అందిస్తున్నాను. వీటికి 'హరి యేమనెనే అలిగెనో' అనే సంపుటిగా వెలువరిద్దామని సంకల్పం.

శ్రీవేంకటేశ్వరుని కృపా కటాక్షవీక్షణముంటే ఈ నాప్రయత్నం వెలుగులోకి వస్తుందని నా అపార నమ్మకం ఆపై కొండలరాయని దయ, నా ప్రాప్తము. నేను ఇదివరలో అన్నమయ్య శృంగార కీర్తనలు తీసుకొన్నప్పుడు "రవ్వా శ్రీహరి" గారి నిఘంటువు నావద్దలేదు. అందువలన ఆనాడు నేను ఎక్కువ శ్రమపడవలసి వచ్చింది. ఈనాడు ఆ కష్టంలో సగం పడితేచాలు గట్టెక్కవచ్చని నా నమ్మకం.

ఆ పురుషోత్తముడే ఏదో ఒక దారిచూపిస్తాడు. దీనిలోనే గాయకులు రాగంకట్టి పాడిన కొన్ని కీర్తనలను యెన్నుకొన్నాను. సాహిత్యపరంగానేకాక సంగీతపరంగా కూడా ఈ సంపుటి అందరినీ అలరిస్తుందని నా ఆశ.

"హరి నీమయమే అంతాను" అనే పేరుతో నేను శ్రీవేంకటరమణుని కృపవలన 375 అన్నమయ్య శృంగార, భక్తి, వైరాగ్య, తత్త్వ చింతన కీర్తనలు 4 సంపుటములుగా వెలువరించాను. శృంగార కీర్తనలన్నీ వివరిస్తే రసికలోకానికి తప్ప, శరణాగతులకు పెద్ద ఉపయోగకరము కాదేమో అని నామట్టుకు నాకనిపించింది. మనకు లభ్యమైన అన్నమయ్య కీర్తనలన్నీ సింహభాగము శృంగార కీర్తనలే. అయినా నేటి సమాజంలో అన్నమయ్య కీర్తనలు వినేవారేకానీ విశ్లేషించిన తాత్పర్యవివరణ చదివేవారు కోటికొక్కరు. ఒకవేళ చదివినా రెండవ పర్యాయం చదివేవారుండరు. మరి అన్నమయ్య అన్నట్లు వరద ఆగిపోయాక అడ్డుకట్టవలన లాభమేమి? కానీ అన్నమయ్య కీర్తనలు పాఠకలోకానికి పరిచయం చేయాలనే నాకోరిక తీరనిది. అందుకనే

అన్నమయ్య శృంగార కీర్తనలను పాఠకలోకానికి పరిచయం చేస్తే చాలు అనే సత్సంకల్పంతో నా ప్రయత్నానికి "హరియేమనెనే అలిగెనో" అని నామకరణంచేసి శ్రీకారం చుట్టాను.

ఒకవేళ ఈ శృంగార కీర్తనలకు విడమరచి భావవిశ్లేషణ చేసినా ఇక్కడ చూపిన విధంగా వస్తుంది.

**భావవిశ్లేషణ:**

ఓ చెలియా! హరి నామాటవిని యేమనెనే (ఏమని అన్నాడే?) కొంపదీసి అలిగెనో (అలిగినాడాయేమే?) విరహినై నేనుండ (నేనింత విరహ బాధతో వేదన చెందుతుంటే) యీవేళ ఇంకా రాడేలనే?

మళ్ళీ మళ్ళీ తనను నా మాటలతో కొసరను (ఆక్షేపించను) అని వేడుకొన్నాను కదా! అతిశయించిన హరి యేమనినాడే. తరుణులందరూ వచ్చేశారు కదా! ఇంకా తాను అక్కడనేవున్నాడు. కారణమేమిటే? ఎరవెరవై (విలక్షణముగా) నున్న ఆతడు అప్పుడు తాను నా గురించి యేమనినాడే?

ఓ చెలీ! నావాకిటిదాకా వచ్చి తిరిగెనట (మరలిపోయెనట), నావిభుడు. కారణమేమైవుంటుంది? తానెందుకలా చేశాడో చెప్పినాడా? ఈ రాకపోకల (వచ్చీపోవుటలోనే) తెల్లవారేటట్లుంది. ఈకడ (ఇప్పుడు) తుదమాట యేమనెనే (తన ఆఖరి మాటగ యేమి చెప్పమంటాడే.)

ఓ చెలియా! నా తలపులో ప్రియము (నా మనస్సులో అతని నెంత ప్రేమిస్తున్నానో) తనకే తెలుసును కదే! తన మనసులో మాట యెలుగెత్తి యేమనెనే (గొంతువిప్పి ఏమీ చెప్పలేదా?) ఇప్పుడు ఆయనగారు నామాట యేమి వింటున్నాడని? తానే బలవంతంగా వచ్చి ఆ శ్రీవేంకటేశ్వరుడు నిన్ను నన్ను కూడినాడు కదా! దాని గురించి యేమనినాడే?

దీనివలన ప్రయాస తప్పించి విశేషఫలితము నాకు కనిపించలేదు. బాగా ఆలోచించి ఒక కృత నిశ్చయానికి వచ్చాను. ఈ "హరియేమనెనే అలిగెనో"లో యెన్ని సంపుటములు చేస్తానో తెలియదు కానీ ప్రతి శృంగార కీర్తనకు



హరి యేమనెనే అలిగెనో

"పరిచయపరిమళం" వ్రాసి అన్నమయ్య ఆరాధన కొనసాగిస్తాను. శ్రీవేంకటేశ్వరుని నామస్మరణ యెలాగూ ఇందులో భాగమే కదా!

శృంగార కీర్తనలంటే చదువరిలో శృంగారభావాలను తట్టిలేపేవి. జావళీలు ఆ కోవకే చెందుతాయి. జయదేవుని అష్టపదులవలె, అన్నమయ్య కీర్తనలలో కూడా అశ్లీలతకి తావులేదు. అష్టపదులలో హరి దర్శనమైతే ఇక్కడ శ్రీవేంకటేశ్వరుడు శృంగారరాయడు. అలమేల్మంగమ్మ, ఆమెచెలికత్తెలు, వేంకటేశుని పరివారంలోని స్త్రీలు కీర్తన పాడుతున్నారు అన్నట్లు వుంటాయి. కొండొకచో అన్నమయ్య తనే నాయికా నాయకులకు సలహాలిస్తారు. అప్పుడూ ఆయనా స్త్రీగా ఆ కీర్తననాలపిస్తున్నారా అనిపిస్తుంది. నాకు ఇవి శృంగారకీర్తనలన్న భావం రాదు. ఇవి అన్నమయ్య మధుర భక్తిని ప్రతిపాదించే మధుర కీర్తనలు. సరసత్వము గలవికాబట్టి సరస కీర్తనలు అనికూడా అనవచ్చును. అన్ని కీర్తనలూ దాదాపు ఒకే పంథాలో నడిచినందువల్ల పునరుక్త భావన కొండొకచో కలుగవచ్చును. మరి మన నాయకీ నాయకులు మానవమాత్రులు కారుగదా! జగత్పిత, జగన్మాతలు వారు.


ఏది యేమయినప్పటికీ ఈ మధుర కీర్తనలకు పరిచయ పరిమళం మాత్రమే అందించడం జరిగింది. కొన్ని తెలుగు మాటలకి కూడా అర్థం చెప్పవలసి వచ్చింది. ఎందుకంటే అది 600 ఏళ్ళ క్రిందట నేటి రాయలసీమ మాండలిక భాష. అటువంటి సందర్భాలలో చదువరుల సౌకర్యార్థం కొన్ని పదములకు నేటి తెలుగు అర్థం ఇవ్వటం జరిగింది. అలాగే కొన్ని కీర్తనలలో తమిళ, కన్నడ పదములు కూడా ఆనాటి వాడుకవలన మనకు కనిపిస్తాయి.

ఈ కీర్తనలు ప్రత్యేకించి రసిక భావనలున్న భక్తులకు. ఇరవైయేళ్ళలోపు వారికి, అరవై యేళ్ళు పైబడిన వారికి కాదు. అలాగని వారు చదువరాదని నా అభిప్రాయము కాదు. పచ్చి మామిడికాయ, బాగా మగ్గి మెతకబారిన మామిడికాయ తినలేం కదా! ప్రౌఢులకు ప్రింటు సన్నగా వున్నా పర్వాలేదని ఈ "హరియేమనెనే అలిగెనో" పేజీకి ఒక్క కీర్తన పరిచయ పరిమళంతో సహా అందిస్తున్నాను. ఆస్వాదించండి.

















సంఖ్య : 36 సంపుటము : 6 పుట: 26 రాగం : శంకరాభరణం

**4 మచ్చికల మఱపులకు మదనబాధల మేను**
**వెచ్చినా నేమిటను విడువదీబాధ. ॥పల్లవి॥**

**తను వయో మదమునకుఁ దమకములచే బాధ**
**గొనకొన్న తమికి రతికోర్కి బాధ**
**అనుభవనరతికిఁ బాయని ప్రేమముల బాధ**
**ఘనకూటమికి వియోగములచే బాధ ॥తను॥**

**తఱి విరహ వేదనకు తలపోఁతచే బాధ**
**పఱచుఁదలఁపులకుఁ దాపముల బాధ**
**తఱచు తాపంబులకుఁ దడఁబాటుచే బాధ**
**పఱివోనినేర్పులకు పరవశము బాధ. ॥తను॥**

**అలరు సింగారముల కలపుఁ జెమటల బాధ**
**చెలియ చెమటకుఁ దావిచేతి బాధ**
**కలికితనములకు వేంకటవిభుని రతిఁ గూడి**
**కొలఁదికిని మిగులు సిగ్గులచేత బాధ. ॥తను॥**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ మధురకీర్తనలో విరహబాధ యెంత సహింపలేనిదో నానా బాధలను వివరిస్తున్నారు. మచ్చిక (మోహము), మఱపు, మదనబాధలు మనిషి దేహానికున్న బలహీనతలు. ఈ దేహము. వెచ్చినా (కాలిపోయినా) ఈ బాధ విడువదు. ఏమి చెప్పగలము? యౌవన మదమునకు తమకములచే బాధ తప్పదు. మరి ఆ తమకమునకు రతికోర్కెచే బాధ తప్పదు. రతి అనుభవానికి విడువలేని ప్రేమచే బాధ తప్పదు. మరి ఆ ప్రేమవలన కూటమి ఆపైన కూటమికి వియోగబాధా తప్పవు సుమీ! ఇక వియోగమువల్ల వచ్చే విరహవేదనకు తలపోత (ఆలోచనలు) బాధ కలిగిస్తాయి. ఆ తలపోతలకేమో తాపములచే బాధ కలుగుతుంది. ఆ తాపమునకు తడబాటు (తత్తరబాటు) వలన బాధ తప్పదు. ఆ తడబాటుచేత క్షీణించని నేర్పులకు పరవశత్వంతో బాధ తప్పదుగాక తప్పదు. ఇకపోతే పరవశించి చేసే శృంగారములకు అలసట వలన వచ్చే చెమటలతో బాధ తప్పదు. ఆ చెమటలకు తావితో బాధ. దానివలన కలికితనమూ చెడుతుంది. అది కలిగిన వేంకటేశ్వరునకు మితిమీరిన చెలియసిగ్గులచే బాధ.

★ **తఱి**–తరువాత ★ **పఱివోని**–క్షీణించని ★ **తావి**–వాసన ★ **కలికితనము**–దిట్టతనము





సంఖ్య : 22 సంపుటము : 6 పుట: 17 రాగం : శుద్ధ వసంతం

**1 ఎంతమాయల వాఁడెంచి చూడఁగ వీఁడు**
**ఇంతి యీతనిరూప మెవ్వరెఱుఁగుదురు. ॥పల్లవి॥**

**తెలుపు జలములలోన తెప్పవలెఁదేలీనే**
**తలఁకి పాతాళమున దాఁగియుండీనే**
**కెలసి తనకన్నులను కెంపువగాఁ జేసీనే**
**నెలఁత భీకరముగా నేఁడు నవ్వీనే. ॥ఎంత॥**

**ఒరపుగా భూదాన మొకరిఁదా నడిగీనే**
**తరుణి భూమొక్కరికి ధారవోసీనే**
**మరలి పద్మజుని మనుమనినైనఁ జంపీనే**
**పరచుఁదనమున వృథా పాలుమాలీనే. ॥ఎంత॥**

**పలుమారు తన సిగ్గు బయటఁ బడవేసీనే**
**కలికితనమునఁ దాను గడవఁబాసీనే**
**వెలఁది వేంకటగిరివిభుఁడు నా కౌఁగిట**
**తొలఁగక చెమటలఁ దొప్పఁదోఁచీనే. ॥ఎంత॥**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ దశావతార కీర్తనతో ఈ సంపుటి మొదలుపెట్టడం నా సుకృతమే. నిజంగా మధుర కీర్తన ఇది. ఎంచి చూడగా వీడెంత మాయలవాడే!! ఓ ఇంతీ సాకారుడూ, నిరాకారుడూ అయిన ఈతని రూపమెవ్వరెరుగుదురమ్మా? పాలజలనిధిలో తెప్పవలె తేలియాడెనే వీడు **(మత్స్యావతారము),** పాతాళమున తలముడిచి దాగియుండెనే **(కూర్మావతారము),** కన్నులు కెంపులవలె జేసి దనుజుని చంపాడే **(వరాహావతారము),** ఓ నెలతా! నేడు భీకరముగా నవ్విన మొనగాడు వీడేనే **(నరసింహావతారము).** ఉపాయముతో ఒకరిని భూదానము నడిగెనే **(వామనావతారము),** భూమినంతా గెలిచి మరొకరికి దానంచేసేసినాడే **(పరశురామావతారం).** మళ్లీ చింతిస్తే కరుణామూర్తియేకాని బ్రహ్మదేవుని మనుమడిని కూడా చంపినాడే **(రావణుని జంపిన శ్రీరామావతరాము),** యౌవనమంతా వృథాగా వనితలకు లొంగిపోయాడే **(కృష్ణావతారము).** త్రిపురాసురుల స్త్రీల వద్ద నగ్నముగా అయ్యాడే **(బుద్ధావతారము),** కలికితనమంతా కడవ బాసీనే, వ్యర్థమైనదే **(కల్కి అవతారము).** ఓ వెలదీ! వేంకటగిరి విభుడు నా కౌగిట విడువక చెమటలలో దొప్పదోగీనే.

★ **పాలుమాలీనే** – లొంగిపోయాడే ★ **తొప్పదోచీనే** – మిక్కిలి తడిసెనే

సంఖ్య : 23 సంపుటము : 6 పుట: 17 రాగం : సౌరాష్ట్రం

**2 ఎట్టు గడియించె నమ్మ యీవలపు**
**పుట్టించి నటువంటి పూఁటకాఁపుమరుండు.** ॥పల్లవి॥

**తడఁబాటు నాలికకు తలఁకు మానంబునకు**
**నొడఁబాటు మఱపులకు నుదుటుఁ దలఁపులకు**
**కడువేడుకలు కోరికలకు భయ మాసలకు**
**బెడిదంపుఁ గోపంబు బిత్తరి చూపులకు.** ॥ఎట్టు॥

**అతిముదము చింతకును అలపు గర్వంబునకు**
**మితిలేని తాపంబు మెత్తని తనువునకు**
**రతి గమ్మచెమటలకు రచన విరహంబునకు**
**ధృతి లేమి మనసునకు గతి గమనమునకు.** ॥ఎట్టు॥

**కురులు నెన్నుదుటికిని గుఱుతు లధరంబునకు**
**మురిపెంపుఁ జిఱునగవు ముద్దు మోమునకుఁ**
**దిరమైన వేడుకలు తిరువేంకటేశునకుఁ**
**బరిణాపుమాటలివి పడఁతులిందటికి.** ॥ఎట్టు॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో దేనికియేది కారణమో, వివరిస్తున్నారు. పరిశీలిస్తే ఈ కీర్తన అనుకొన్నంత సులభగ్రాహ్యం కాదు సుమండీ! మీరే చూడండి. ఓ దేవీ! ఈ 'వలపు' అనేది యటెఎల్ల కల్పించబడిందమ్మా!! దీన్ని పుట్టించటానికి బాధ్యుడు మాత్రం మన్మథుడే సుమా! ఒక్కసారి అది పుట్టాక ఇక్కడ చెప్పబోయేవన్నీ ఒకదానికింకొటి కారణంగా పుట్టుకొస్తాయి. ఇది నిజమమ్మా! దేవీ! తడబడెరోగం నాలికకు, మన యొక్క తల మర్యాదకు, సమ్మతించడం మరపునకు, ఉద్ధతి తలంపులకు, అంతులేని వేడుకలు కోరికలకు, భయము ఆశలకు, అధికమైన కోపము మదవతి చూపులకు కారణమవుతున్నాయి. ఓ దేవీ! అమితమైన సంతోషము చింతకు, అలసట గర్వమునకు, మితిలేని తాపము శరీరానికి, రతికేళి కమ్మే చెమటలకు, ఊహా నిర్మాణము విరహమునకు, ధృతి లేకపోవుట మనస్సునకు, నిర్దేశించబడిన గతి గమనమునకు కారణమవుతున్నాయి. దేవీ! నెన్నుదిటి శోభకు చక్కటి కురులు, దంతక్షత గుర్తులు అధరములకు ముద్దు లొలికే ముఖములకు మురిపించే చిరునవ్వు, అతిశయించిన వేడులు శ్రీవేంకటేశ్వరునకు, స్త్రీలందరికీ సంతోషమునిచ్చే మాటలు అలంకరణమవుతున్నాయి.

★ **పూటకాపు** – బాధ్యుడు ★ **ఉదుటు** – ఉద్ధతి ★ **బెడిదంపు** – అధికమైన
★ **రచన** – నిర్మాణము ★ **పరిణాపు** – సంతోషమునిచ్చే ★ **గడియించె** – కల్పించె





సంఖ్య : 137 సంపుటము : 6 పుట: 99 రాగం : ఆహిరి

**3 వావి గాదు నీకు నాకు వద్దు వద్దు నీ**
**తోవరా వెఱుతు మన్నా దోసాలు గట్టకురా** ॥పల్లవి॥

**చక్కనివాఁడ ననుచు సారెసారె నీవు వోరి**
**లెక్కలేని నొయ్యారములే చల్లేవు**
**తక్కుల మొన్న నామఱందలితోడ నీవు వోరి**
**తొక్కులాడితివి చాలు దోసాలు గట్టకురా** ॥వావి॥

**చూడకురా నావంక సోయగపునీవు యీ**
**వేడుకచిఱునగవే వెదచల్లేవు**
**కూడితి నాచెలిమి మక్కువ నిన్న నీవు వోరి**
**తోడనే యింతేసి నాకు దోసాలు గట్టకురా** ॥వావి॥

**రాఁగినది నీచిత్తము రంతుకాఁడ నీవు వోరి**
**మాఁగిననామనసుపై మచ్చు చల్లేవూ**
**కౌఁగలించి నన్ను వెంకటరాయ నీవు వోరి**
**తూఁగు మంచానకుం దీసి దోసాలు గట్టకురా!** ॥వావి॥

**పరిచయ పరిమళం :**

ఈ మధుర కీర్తన చెబుతున్న గోపిక అన్నమయ్య. ఆమె కృష్ణునికి వరుస కాదు. వావి వరుస లేక తనతో ప్రణయం తగదురా, వోరీ నామాట వినరా అంటున్నది. వద్దు వద్దు, నీకూ నాకూ వావి వరుస కుదరదు. నీవు నాకు అన్నవు. ఈ తోవలో రావాలంటేనే భయంవేస్తుంది. నాకు దోషము (పాపము) అంటగట్టకురా. ఓరీ! నేను చక్కని వాడనంటూ, నీవు ప్రతిసారీ లెక్కలేని నయగారములు చూపుతావు. మొన్న నా మరదల్ని తగులుకొన్నావు. మరి నీకు చెల్లెల్ని కానుటరా! నాతో తొక్కులాడితే దోసమురా! ఓరీ! వేడుకతో చిరునవ్వులు వెదజల్లుతూ, నావంక సోయగముతో (అందముగా) చూడకురా! నిన్న నీవు నా స్నేహితురాలితో శృంగారం జరిపావు. నేడు నన్ను కావాలంటున్నావు. అది తప్పు పని అవుతుందిరా! నాకు దోషం అంటకట్టకురా! ఓరి! రంతుకాడా! (రతిక్రీడాసక్తుడా!) నాపై నీ చిత్తము రాగినది. పరి పక్వత చెందిన నా మనస్సుపై కూడా మత్తుమందు చల్లావురా! శ్రీవేంకటేశ్వరుడవై నన్ను కౌగలించరా! అప్పుడు వూగే మంచముపై పడుకొన్నా దోసము లేదురా!

★ **రాఁగినది** – అనురాగబద్ధమైనది ★ **మాఁగిన** – పరిపక్వత చెందిన
★ **తొక్కులాడితివి** – సంబంధముపెట్టుకొన్నావు ★ **తూఁగు** – వూగే

సంఖ్య : 20 సంపుటము : 6 పుట: 15 రాగం : ఆహిరి

**8 ఇంతగా జేసెఁగా యింతి కన్నుల నగవు**
**సంతరించగరాని చనుదోయి బిగువు.** ॥పల్లవి॥

**తనివిమాలిన తలఁపు తడవోరువనిబులుపు**
**అనువెఱుంగని కెలపు అడియాసమెలపు**
**కనుఁగలువలో సొలపు కాఁకదీరని యలపు**
**వనితచిత్తములోని వడిగొన్న వలపు.** ॥ఇంత॥

**ఒడలెఱుంగని నెగులు నుల్లంబులోఁదగులు**
**వడియుఁగన్నీటిలో వగలు**
**పొడలువెట్టెడిపొగులు పొందువాసినదిగులు**
**పడఁతికి నిది యెల్ల బరికించఁబగలు.** ॥ఇంత॥

**వెరవెఱుంగని పురపు వింతలాగులయొరపు**
**మిరుమిట్లు గొనుమేనిమెరుపు**
**తిరువేంకటాచలాధీశ్వరుని కనుగిరుపు**
**తరుణి కిటువంటి మెత్తని పూవుఁబరపు.** ॥ఇంత॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య యెంత తెలుగుభాషా కోవిదుడో ఇటువంటి కీర్తనలు వక్కాణిస్తాయి. ఒక చేతి వేళ్ళతో లెక్కించగలమటువంటి వారిని. మీరే చూడండి. ఈ ఇంతి తన కన్నులతోనే మనోహరంగా నవ్వుతుంది. దానికితోడు సైపలేని ఈమె చనుదోయి బిగువుతోడై ఇంత ఇబ్బందులపాలు చేసింది. ఎంత తలచినా తృప్తి చెందని స్మృతులు, వాటివల్ల కలిగే అంతులేని బులుపు (సుఖము), అవకాశం దొరికిన కెలపు (అనురాగము), అడియాసలవల్ల కలిగే మెలపు (చాంచల్యము), ఆమె కలువ కన్నులలోని పారవశ్యము, తాపము తీరిన తరువాత వచ్చే అలసట, ఆవనిత మనస్సులో అంకురించిన తొందరబెట్టే వలపు – ఇంత చేసాయి. ఆ తరుణి యొక్క ఒళ్ళు తెలియని సెగలు (దుఃఖము), మనస్సులో పుట్టిన తగులు (ఆసక్తి) రాలే కన్నీటిలోని వగలు (శోకము), పొర్లుబెట్టించే పొగులు (కుమిలిపోవుట), పట్టపగలే ఈమె స్థితి ఇలావుంటే చీకటి పడితే యేమవుతుందో!!! ఆమె పురపు (ఆపేక్షకు) ఒక విధము అని లేదు. వింతగొలుపు అనురాగపు ఒరపు (సొబగు), మిఱుమిట్లు గొలిపే శరీరకాంతి, శ్రీవేంకటేశ్వరుడు కన్నుగీటుట ఆమెకు మెత్తని పూలపానుపువంటిది.

★ **తడవోరువని** – అంతులేని ★ **వెరవు** – విధము

★ **కనుగిరుపు** – కన్నుగీటుట ★ **పూపరపు** – పూలపాన్పు





సంఖ్య : 37 సంపుటము : 6 పుట: 27 రాగం : రామక్రియ

**5 వెఱవక యింత విన్న వించఁగలమా నీ**
**మొఱఁగులు మానర మొక్కేము నీకు.** ॥పల్లవి॥

**దేవతలిందఱు నీకుఁ దిరిగి తిరిగి మ్రొక్కి**
**దేవుండవు నిన్నుఁ దిట్ట వచ్చునా**
**గోవిందుఁడవైన నీకొయ్యతనాలకుఁ గడు**
**మోవనాడ వెఱతుము మొక్కేము నీకు.** ॥వెఱ॥

**చెలువుగ నజుఁడు పూజించె నీపాదాలు**
**తొలఁగక కాల నేఁ ద్రొక్క వచ్చునా**
**కలికితనముల వికారపుచేతల నా**
**మొలనూలు వట్టకురా మొక్కేము నీకు.** ॥వెఱ॥

**ఒక్కటై శ్రీసతిఁ బాయకుండ నీవురమున**
**మొక్కలపు నాగుబ్బలు మోవ వచ్చునా**
**చక్కని వేంకటగిరి స్వామి నన్నుఁ గూడితివి**
**మ్రొక్కిన మొక్కుల మారుమ్రొక్కెము నీకు** ॥వెఱ॥

**పరిచయ పరిమళం :**

తానుకూడా స్వామిని వలచిన తరుణి అని అన్నమయ్య చెప్పిన మధుర భక్తి కీర్తన ఇది. స్వామీ! నిలువెత్తున్న నిన్ను చూస్తే నాకు జంకు. నీకు ఏదన్నా విన్నవించాలంటే భయంగానే వుంటుంది. నీకుమ్రొక్కెదనయ్యా! మొఱగులు (వంచనలు) మానరా! తిరిగి తిరిగి నీవెక్కడనున్నావో కనుగొని దేవతలందరూ నీకు మ్రొక్కుతారు, దేనికి నీవు జగన్నాథుడవనేకదా! అట్టి నిన్ను తిట్టితే నాకు పాపము. కానీ నీవు గోవిందుడవై కూడ మూర్ఖశిఖామణివలె ప్రవర్తిస్తున్నావు. కానీ నీతో మోవనాడ (నీ మనస్సు నొచ్చేట్లు మాట్లాడాలంటే) కొంచెం బెరుకుగానే వుంది. నీకొక నమస్కారం చేస్తాను స్వామీ! మరి శృంగారంలో నీకాలు తొక్కుతుంటాను. అవేమన్నా మామూలు పాదాలా? బ్రహ్మదేవుడు ఆకాశగంగతో నిత్యమూ కడిగే పాదాలు. నీవేమో నీ కలికితనముతో (గడుసుతనంతో) వికారపు చేష్టలు చేస్తావు. నా మొలనూలు పట్టిలాగకురా! నీకు దండంపెడతాను. అసలు నా స్థనములు నీ వురముకేసి ఒత్తాలంటే నాకు జంకుగా వుంటుంది. ఆ వురము సిరుల రాణి లక్ష్మీదేవి నివాసమైవుండేది. నీవేమో వేంకటగిరి స్వామివై నన్ను కూడితివి. నీవు శృంగారంలో నన్ను మొక్కుతావు స్వామీ! ఆ మొక్కులన్నిటికీ బదులు ఇదే మ్రొక్కెదను ప్రభూ!

★ **కొయ్యతనము** – మూర్ఖత్వము ★ **మొలనూలు** – స్త్రీలు ధరించే మొలత్రాడు

★ **మొక్కలము** – మోటుతనం ★ **వెఱతును** – భయపడతాను

సంఖ్య : 178 సంపుటము : 6 పుట: 128 రాగం : శ్రీరాగం

**6 ఎటువంటి మోహంబు యెటువంటి పరిణతలో**
**అటువంటి సతి పొందు లవి నీకె తగురా. ॥పల్లవి॥**

**చక్కని జవరా లొకతె జారెడికొ ప్పొకచేతఁ.**
**జెక్కుచు సన్నపునవ్వు చిలికి చిలికి**
**చెక్కునఁ జెదరిన కమ్మం జెమటల తావులను**
**చొక్కుచు నిన్నరగంటం జూచె నెవ్వతెరా. ॥ఎటు॥**

**గద్దరికన్నుల కలికి కమ్మనిచల్లగాలి**
**అద్దినదేహముతోడ నలసి యలసి**
**ముద్దుల రెప్పలు దెరచి ముందటి నీ తనవలపు**
**సుద్దులు దెలుపుచు నిన్నుం జూచె నెవ్వతెరా. ॥ఎటు॥**

**కొండల రాయండ నీకొమరైన చెలిచన్నుఁ**
**గొండల నీ కెంగేలం గులికి గులికి**
**నిండిన కౌఁగిటిలోన నీవుం దానుం గలశుండి**
**వుండినటువలెం గూడి వుండె నెవ్వతెరా. ॥ఎటు॥**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో రాగబద్ధంగా పదములున్నా మనకు అర్థం కావాలంటే, ఇలా ప్రయత్నించండి. ఓ తిరుమలనాథా! ఈ సతికి ఎట్లాంటి మోహము నీపైనవుందయ్యా! అయినా ఎట్లాంటి విధమున నీకు నమస్కరిస్తున్నది!! అటువంటి దేవి పొందు నీకే తగియున్నదిరా! స్వామీ! ఒక్క చక్కని జవరాలు, జారిపోతున్న తన కొప్పునొక చేత రొంటిలో చెక్కచూ సన్నగా చిరునవ్వు చిలికిస్తోంది. ఆమె చెక్కిళ్ళపై చెదురుబొదురుగానున్న చెమటలు ఆయా చోట్ల అద్దుకొంటూ ఓరకంటితో నిన్ను చూస్తున్నది ఎవరయ్యా ఆవిడ? గడుసురి చూపులతో ఒక కలికి (అందాల చిన్నది) బాగా అలిసిపోయిన తన దేహమును కమ్మని చల్లగాలికి ఆరబెట్టుకొంటున్నది. ముద్దులొలికే తన కనురెప్పలు తెరచి మునుపటి నీవలపు తనవలపు జ్ఞప్తికి తెచ్చుకొంటూ నిన్ను ఓరకంటితో చూస్తున్నది ఎవరయ్యా ఆమె? ఓ కొండలరాయడా! నీ యువతి చనుగొండలపై నీ ఎఱ్ఱని అరచేతులుంచి కులుకుచూ, నీ నిండు కౌగిట మీరిరువురు కలిసివున్నట్లుగానే నీలో ఒదిగివున్నది. ఆ జవ్వని ఎవ్వరురా?

★ **పరిణ (ణు)తులు** – వందనములు ★ **గద్దరికనులు** – గడుసు చూపులు
★ **కెంగేల** – ఎఱ్ఱని అరచేతి ★ **కొమరైన చెలి** – యువతి





సంఖ్య : 35 సంపుటము : 6 పుట: 26 రాగం : ఆహిరి

**7 ఏమి సేయఁగ వచ్చు నిట్టుండు భాగ్యవశ –**
**మామనియుఁ దాఁ గూడెఁ నక్కటా చెలికి. ॥పల్లవి॥**

**తుడువరే కమ్మఁ గస్తురి బొట్టు నొస లెల్ల**
**కడుఁ గ్రాఁగి పొక్కె నదె కటకటా చెలికి**
**కడుగరే శిర సెల్లఁ గ్రాఁగి జవ్వాదిచే**
**జెడగట్టె ముంగురులు చెల్లఁబో చెలికి. ॥ఏమి॥**

**తియ్యరే నునుఁగౌనుఁ దీగ యొడ్డాణంబు**
**నొయ్యనె యిఁకనైన నొప్పదీ చెలికి**
**ముయ్యరే కుచకుంభములు బయలు పడకుండ**
**పయ్యదయు సవరించ భారమీ చెలికి. ॥ఏమి॥**

**చూపరే నాయకుని సుదతికి మేనెల్ల**
**ఆపసోపము రేఁగె నద్దిరా చెలికి**
**ఏపుమీఱఁగ వేంకటేశు డింతట వచ్చి**
**తాప మింతయు మాన్చి దక్కఁగాఁజెలికి. ॥ఏమి॥**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ మధురకీర్తనలో దేవి విరహము వర్ణిస్తున్నారు. ఈ చెలి (దేవి) భాగ్యవశమును యేమిచెప్పవచ్చును? అక్కటా! వసంతముకూడా ఈమెను బాధించుటకే వచ్చెనా యేమి? అంటున్నారు. అయ్యయ్యో! ఈ చెలికి నొసట బెట్టిన కస్తూరి తిలకము నొసలెల్లా కమ్ముకుపోయింది. అధికముగా తపించి ఆ నొసలు పొక్కిపోయింది. వెంటనే ఆ కారిన కస్తూరిని కడిగేయండమ్మా! అదే విధంగా శిరసెల్లా కాగిపోయి ముంగురులపై జవ్వాది జడలవలె కట్టింది. హతోస్మి! వెంటనే ఈ చెలికి శిరసంతా కడగండమ్మా! ఒక తీగె (లత) వడ్డాణములా ఈ చెలినడుముకు చుట్టుకుంది. నున్నటి నడుము ఒత్తుకుపోయి బాధిస్తుంది. ఇకనైనా అది లాగేయండి అది ఆమెకు ఒప్పదు. ఈ చెలి భారమని పమిట కూడా సవరించుకొనుటలేదు. ఈమె కుచకుంభములు బయపడకుండా మీరే మూసేయండమ్మా! అద్దిరా! (ఔరౌరా!) ఈ చెలికి ఇబ్బంది యెక్కువై మేనెల్లా కుతకుతలాడిపోతోంది. వెంటనే తిరుమలనాయకుని చిత్రపటము తెచ్చి చూపండమ్మా! ఇంతలోనే శ్రీవేంకటేశ్వరుడ వచ్చి ఆమె తాపమంతా చెలికి తీసివేసి మనకు దక్కించాడు.

★ క్రాఁగి – తపించి ★ **నునుఁగౌను** – నున్నటి నడుము
★ **ఆపసోపము** – ఇబ్బంది ★ **ఆమని** – వసంతము

సంఖ్య : 314 సంపుటము : 27 పుట: 212 రాగం : సామంతం

**12 చీరలియ్యఁగదవోయి చెన్నకేశవా! చూడు**
**చేరఁడేసి కన్నుల వో చెన్నకేశవా!** ॥పల్లవి॥

**పొత్తుల మగఁడవై పోరచినవ్వు నవ్వేవు**
**చిత్తిడిగుణములే లో చెన్నకేశవా**
**చిత్తరు పతిమలమై సిగ్గు నీ కొప్పించితి! నీ-**
**చిత్తము నా భాగ్యము చెన్నకేశవా** ॥చీర॥

**యెమ్మెలకు జవ్వనాన ఇంతగాఁగ నోమితిమి**
**చిమ్మవోయి నీకరుణ చెన్నకేశవా**
**కమ్మటి నవ్వేవు మాతో కడలేదు నీయాస**
**చిమ్ముఁ జెమటల వో చెన్నకేశవా** ॥చీర॥

**గరిమ నందరి నొక్కగాఁడిఁగట్టి కూడితివి**
**శిరసుపూవులు రాల చెన్నకేశవా**
**ఇరవై శ్రీవేంకటాద్రి యిదియంటాఁగూడితివి**
**గొరబు చేఁతలఁ గండిగోట చెన్నకేశవా** ॥చీర॥**314**

**పరిచయ పరిమళం :**

మధురకీర్తనలు చెప్పటంలో మంచి దిట్ట అయిన అన్నమయ్య గోపికలు చెన్నకేవవుని తమ చీరెలు తమకిచ్చేయమని వేడుకోవటం, కీర్తనగా చెబుతున్నారు. కడప జిల్లా జమ్మలమడుగు వద్దనే, చెన్నకేశవుడు వెలసిన గండికోట గ్రామం వుంది. అన్నమయ్య కాలంలో అన్ని వైభవాలతో తులతూగిన ఈ స్వామి నేడు చరిత్రపుటల్లోనే మిగిలాడు. ఓ చెన్నకేశవా! మా చీరెలు మాకు ఇయ్యగదవో. చేరడేసి కన్నులున్న స్వామీ! దయచూచి మావి, మాకిచ్చెయ్యి. నీవు మా అందరి పొత్తుల మగడివై పోరచినవ్వులు (విపరీతంగా నవ్వేవు) నీకీ చిత్తడి గుణములెందుకయ్యా? చిత్తరువులో ప్రతిమవలె మా సిగ్గులు నీకర్పించాము. ఇక నీ చిత్తము, మా భాగ్యము. మా యౌవనములో విలాసంగా నోచినదాని ఫలం ఇప్పుడనుభవిస్తున్నాము. ఓ చెన్నకేశవా! మాపై కాస్త కరుణ వెదజల్లవోయీ. నీ ఆసకు అంతులేదయ్యా! మాతో అంతులేకుండా కమ్మటి నవ్వులు వెదజల్లే చెన్నకేశవా! నీవు చిమ్మే చెమటలతో శోభిస్తున్నావు. ఓ చెన్నకేశవా! ఈమధ్య మా గోపికలనందరినీ ఒకేకాడిగట్టి కూడినావయా! నీవట్లా చేస్తుంటే మా శిరస్సులలోని పూలన్నీ రాలిపోతున్నాయి. వింతచేష్టలు కలిగిన ఓ గండికోట చెన్నకేశవా! నీవు మాతో ఇదే శ్రీవేంకటాద్రి, అని కూడినావు.

★ **చిత్తడి** – చిత్తకార్తెవాన ★ **చిమ్ము** – వెదజల్లు ★ **గొఱబు** – వింత
★ **ఒక్కగాడిఁగట్టుట** – అన్నీ ఒకేదానితో జమిలికట్టుట





సంఖ్య : 177 సంపుటము : 6 పుట: 127 రాగం : ముఖారి

**9 బయలీఁదించకురే పలుమారు ఈ**
**ప్రియునిపేర నిందరినిఁ బిలిచీఁ జెలియా** ॥పల్లవి॥

**తడవి తవ్వకురే తమకపుఁజెలమ**
**వుడుకుచు నువ్విళ్లూరీని**
**పుడికి పెంచకురే పులకల నారూ**
**వొడలి బడలికల నొరగీఁ జెలియా.** ॥బయలీ॥

**దరికొలుపకురే తలపోఁతదాలి**
**కరసాన కాఁకలఁ గనలీని.**
**పురికొలుపకురే పుక్కిటి పూరుపూలూ**
**శిరసు నొప్పుల చేతఁ జిమిడీఁ జెలియా.** ॥బయలీ॥

**మంతన మాడకురే మతిలోని యలపులు**
**వంతలనే వదనము వంచీని**
**చెంతల విసరరె శ్రీవేంకటపతి**
**సంతపు లేఁజెమటల జడిసీఁ జెలియా.** ॥బయలీ॥

**పరిచయ పరిమళం :**

ఈ మధురకీర్తనలో అన్నమయ్య ఒక చెలికత్తెయై తోటి చెలికత్తెలను మందలిస్తున్నారు. బయలీదించకురే (వట్టి ఆశలు ఈ దేవికి కల్పించకండమ్మా!) తన ప్రియుని ధ్యాసలోనే వుండటం వలను, ఆమె మనలందరినీ కూడా తన ప్రియుని పేరుతో పిలుస్తోంది, ఈ చెలియ. ఈమె తమకము (మోహము) చెలమలాంటిది. తవ్వినకొలదీ పూరుతుంటుంది. ఎక్కువసేపు తవ్వకండే, ఈమె వుడుకుతూ వువ్విళ్ళురిపోతుంది. ఈ చెలియ ఒడలంతా అలసటతో వొడిలిపోయింది. ఇప్పుడు మీరు ఈమెను స్పృశించి పులకలు పెంచిన పులకలతో నిండిపోయి ఇంకా అలసిపోతుంది ఈ చెలి. ఓ సఖియలారా! మీరు ఆమెకు అవకాశం ఇవ్వకండి. ఆతని తలపోతలతో కాకలుపుట్టి కనలిపోయింది. ఈమె తాపానికి గందందీసే సానలు కూడా యెండిపోయి గంధం తీయటం కష్టంగా వుంది. ఈమెను తలపోతలకు పురికొలిపారంటే ఆమె నిట్టూర్పులకు శిరోవేదన కలిగి ఈ చెలియ బాగా వుడికిపోయింది. ఆమెతో మంత్రాంగము చేయకండి. మనస్సులోనే పరితపిస్తూ వదనము వంచి ఇంకా వడిలిపోయింది. శ్రీవేంకటపతిరాదేయని, లేజెమటలవల్ల ఈ చెలియ తడిసిపోయింది. కాస్త విసనకఱ్ఱతో విసరండమ్మా!

★ **పుక్కిటిపూర్పులు** – ఆవులింతలు ★ **సంతపు** – మననముతో

సంఖ్య : 21 సంపుటము : 6 పుట: 16 రాగం : సౌరాష్ట్రం

**10 ఈడేరని యట్టి వలపేఁటికమ్మా**
**యీడుజోడుగాని వలపేఁటికమ్మా.** ॥పల్లవి॥

**తనువు తనువు గూడి తమకముమీఁదమీఁద**
**నినుమడించని వల పేఁటికమ్మా**
**మనసు మనసు తోడ మక్కళించి సందు లేక**
**యెనసివుండని వలపేఁటికమ్మా.** ॥ఈడే॥

**మచ్చికల చేఁతల మతిలోలురై తా**
**మిచ్చ యెఱుఁగని వలపేఁటికమ్మా**
**తచ్చనయలుకలతో ధన్యత ప్రేమల**
**యెచ్చుకున్న యట్టి వలపేఁటికమ్మా.** ॥ఈడే॥

**పంతముచెరిచివాఁడు పానుపుమీదికి వచ్చి**
**యింతసేయలేని వలపేఁటికమ్మా**
**కంతు నిఁకేలని శ్రీవేంకటపతి నన్ను గూడె**
**నింత పెచ్చులేని వలపేఁటికమ్మా.** ॥ఈడే॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య తాను దేవి చెలికత్తెయై ఆమెతో దేవీ! ఈడేరని (సఫలముకాని) వలపెందుకమ్మా? సఫలమైనా ఈడూజోడూ కుదరని వలపులు కూడా నిరుపయోగమేనమ్మా! అంటున్నారు. తనువులు కలిసి తమకములినుమడించని వలపూ యెందుకమ్మా? ఒకరి మనస్సు ఇంకొకరితో కుదురుకొని సందులేని బిగికౌగిట అతిశయించి వుండని వలపూ నిరుపయోగమే. దేవీ! మచ్చిక కలిగిన మతికి, లోలురై (లొంగినవారై) తాము కోరికలేని వలపు యెందుకమ్మా? పరిహాసాలతో కూడిన చిట్టిపొట్టి అలుకలతో కడతేరని వలపూ ధన్యతగల ప్రేమగా ఫలించదు. అదికూడా దండుగే దేవీ! అతివ పంతము చెడగొట్టి, పాన్పుపై చేర్చలేనివాడు యెందుకమ్మా? వాడికి వలపూ యెందుకమ్మా! దండుగే కదా! మన్మథునేమించిన అందగాడైన శ్రీవేంకటేశ్వరుడు నన్ను కూడినాడు. ఆయనకు నీవూ నేనని బేధము లేదు. భక్తిలేని వలపు ఆయన మెచ్చడు. ఆయనే మెచ్చని వలపు మనకెందుకమ్మా!

★ **మక్కళించు** – కుదురుకొను ★ **తచ్చన** – పరిహాసానికి





సంఖ్య : 57 సంపుటము : 27 పుట: 39 రాగం : గౌళ

**11 క్షితి నిట్టినేరుపు సీతాదేవికిఁ గలిగె**
**తతితోడ దశరథ తనయుని యెడను** ॥పల్లవి॥

**పతి చిత్త మెరిఁగి తప్పక వూడిగము చేసి**
**అతనినే తన దైవమని తలఁచి**
**సతమై యనేక వుపచారములఁబోషించి**
**వ్రతము గైకొని యుండవలయు సతికిని** ॥క్షితి॥

**పరపురుషుఁ జూడక ప్రాణేశ్వరునే కోరి**
**సరవితో నతని ప్రసాద జీవియై**
**దొరసి యెడవాయక తోడు నీడయై యుండి**
**వరుస మీరకు యుండవలయు సతికిని** ॥క్షితి॥

**యెదురాడక శ్రీ వేంకటేశ్వరు కిందిరవలె**
**కదసి యతని కిచ్చకముగ గూడి**
**అదనెరిఁగి యేపొద్దు నంకెకు లోనైవుండి**
**వదలక బత్తి సేయవలయు సతికిని** ॥క్షితి॥ 57

**పరిచయ పరిమళం :**

పతివ్రతయైన పడతి యెట్లుండవలెనో వివరిస్తున్నారు ఈ కీర్తనలో అన్నమయ్య. ఇట్టి నిజమైన నేర్పుగల స్త్రీ ఈ క్షితి (భూమి) మీద సీతాదేవి వుండేది. దశరథ తనయుడైన శ్రీరామచంద్రునిపై ఆమె ఇట్టి తతితో వుండేది. భర్త మనస్సు యెరిగి వదలక సేవజేసి ఆతనినే తన దైవముగ భావించి, ఆతనికి శాశ్వతమైన అనేక ఉపచారములు చేసి పోషించు వ్రతమును స్వీకరించి వుండవలెను. పతివ్రత అని పిలువదగ్గ ఆ వనిత పర పురుషుని కన్నెత్తి చూడక తన ప్రాణేశ్వరునే కోరి, సరవితో జీవితము ఆతడు ప్రసాదించినదే అని భావించవలెను. సతికి ఏనాడూ పతిని వీడక తోడు నీడై విధివిధానములను అతిక్రమించక వుండవలెను. తన పతికెదురు మాట్లాడక శ్రీవేంకటేశ్వరునకు, ఇందిరాదేవివలె ఆతనికి ప్రీతితో గూడి వుండవలెను. ఏ సమయముననైన తగినట్లు అనుకూలురాలై సతి, పతి భక్తి వదలక అంకెకు లోనై వుండవలెను.

★ **తతి** – యుక్తము★ **వూడిగము** – సేవ ★ **సరవితో** – ఒప్పుగా
★ **దొరసి** – అంటుకొని ★ **అంకెకులోనై** – వశమై

సంఖ్య : 478 సంపుటము : 27 పుట: 324 రాగం : లలిత

**16** ఇన్నిటా నీతనిచిత్త మెఱిఁగి చేకొనవమ్మ
యెన్నటికి నలుగకు ఇచ్చకాలే వలెను ॥పల్లవి॥

సిగ్గులేలే యితనితో చెలియ
సిగ్గుల గొల్లెతలను చేతులెత్తించె
వెగ్గళించకువే వీని వేమూరు తొల్లి
వెగ్గళించిన సతిని వెసఁబిన్నఁజేసెను ॥ఇన్ని॥

యింటిలో దాఁగకువే యీత నెదుట
యింటిలోని గొల్లెతల నెంగిలి సేసె
దంట తనమేఁటికే తగ వీనితో
దంటల సురసతులఁ దానె లోఁగొనఁడా ॥ఇన్ని॥

ఆఱడిఁ బెట్టకువే యీతనిని
ఆఱడి గొల్లెతలను ఆండ్లఁజేసె
మీఱి శ్రీవేంకటేశుఁడు మెచ్చి నిన్నేలె
మీఱినవారే కారా మెలుఁత లీతనికి ॥ఇన్ని॥ **478**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో మధురమైన ఒక సందేశాన్నిస్తున్నారు. స్వామిని అనన్యభక్తి కొలిచే వారికి ఆత్మాభిమానం ఆవంతున్నా ఇబ్బందే. అన్ని విధములా ఈతని మనసెఱిగి నీపతిగా భావించు. నీవాడే అనుకొని యెన్నడూ అలుగకు. ఇదివరలో ఇంతులిట్లా అహంకరించి గర్వభంగం పొందారు. ఓ చెలియా! సర్వము నెరింగిన జగన్నాథుని ముందు సిగ్గెందుకమ్మా? అతి సిగ్గు ప్రదర్శించి చేతులతో మానం కప్పుకొన్న గొల్లెతలతో చేతులెత్తించాడు. వీనిని పలుమార్లు చిన్నబుచ్చకమ్మా. లక్ష్మీ ఆవసమైన తనహృదయాన్ని 'తన్ని' అహంకరించిన సతిని (సత్యభామను) తొల్లి అమితముగా చిన్నబుచ్చి గర్వభంగం చేశాడు కదా! ఇతడు నీదగ్గరకు వస్తే ఇంట్లో దాగవద్దు. వాళ్ళ ఇళ్ళల్లోనే గొల్లెతలనందరినీ యెంగిలిచేసినాడుకదా! ఇతని ముందు ఇంత దిట్టతనం ప్రదర్శించకే. అలా చేసిన దేవకాంతలందరినీ గోపికలవలె పుట్టించి తన కోసం అలమటింజేశాడు. దేవీ! ఇతనినింత అల్లరిబెట్టుట తగదు. అల్లరి బెట్టిన గొల్లెతలనే ఆండ్లను (పెండ్లాలను) చేశాడు కదా! శ్రీవేంకటేశ్వరుడు మెచ్చి నిన్నేలినాడు. ఆ మెలత (వనిత) లందరు ఇతను మెచ్చినవారేకదా!

★ **వెగ్గళించు** – చిన్నబుచ్చు ★ **దంటతనము** – దిట్టనము ★ **ఆరడి** – అల్లరి





సంఖ్య : 365 సంపుటము : 27 పుట: 247 రాగం : ముఖారి

**13** గొల్ల దోమటాయ నేఁడు కొమ్మలకు నీతో పొందు
మెల్లనే సరసమాడ మేము నిట్టె వలెనా ॥పల్లవి॥

వాసులకే మాటలాడి వట్టి చనవు సేసుక
రాసి కెక్కె రదివో నీరామలెల్లను
వేసరినఁ బోనీక వేడుక నవ్వులు నవ్వి
నీ సరికే వచ్చిరిగా నేఁడు వీరెల్లాను ॥గొల్ల॥

సందడి జాణతనాలు సారెకు నీపై వేసి
కందువకే వచ్చిరిగా కాంతలెల్లాను
విందుల మోవులు చూపి వేమారుఁ గొలువుసేసి
యిందరైరిగా నీకు నిల్లాండ్లు ॥గొల్ల॥

వసంతములాడుతూనే వడి నిన్నుఁ గాఁగిలించి
యెసరెత్తిరిగా మోహాలింతు లెల్లాను
యెసఁగ శ్రీవేంకటేశ ఇదె నన్నుఁగూడితివి
దొసకులు వేసిరిగా తొల్లిటివా రిపుడు ॥గొల్ల॥ **365**

**పరిచయ పరిమళం :**

ఈ మధురకీర్తనలో అన్నమయ్య ఒక గోపికయై కృష్ణునితో యేమంటున్నారో వినండి. ఓ నల్లనయ్యా! నేడు కొమ్మలకు (గొల్లెతలకు) నీతో గొల్లదోమటాయె గొల్లెతల "పెళ్ళివిందు" అయినదిరా. ఆ విందే నీ పొందు. వారికి రతుల విందా. మరి మాకేమో మెల్లాలోనే సరసమా? మాకు ఇదంతా కావలెనా? స్వామీ! నీ ఆధిక్యము చూపుటకే మాటలాడి వట్టి చనువులు పెంచుతూ నీ రాములు (ప్రియురాళ్ళు) అదిగోనయ్యా ప్రసిద్ధి చెందారు. మాకు వేసరినా (విసుగు కలిగినా) వేడుకగా నవ్వులొలికిస్తావు. కానీ మమ్మల్ని పోనీయవు. నేడు వీరంతా నీ సరికే (నీకు తగినట్లే) వచ్చారు కదా! సంరంభము చూపే జాణతనాలను నీపై జూపి ఆ గొల్లకాంతలందరూ నీకందువకే (నీతో ఏకాంతమునకే) వచ్చారు కదా! తేనెలూరే నీ మోవులు (అధరముల) విందుచేసి అనేకములైన సమాగమములతో నీకు అంతమందీ ఇల్లాండ్రైపోయారయ్యా! స్వామీ! నీతో వేగముగా వసంతములాడుతూనే ఆ ఇంతులందరూ మోహముతో విజృంభించిరి. ఇదిట్లు జరుగుతుండగానే, ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను ఇట్టే కూడితివి. నీ పూర్వీకులైన రామకృష్ణులుఇప్పుడుంటే నీతో ఇబ్బందులు పడేవారే.

★ **వాసులు** – ఆధిక్యము ★ **రాసికెక్కేరు** – ప్రసిద్ధి చెందారు
★ **ఎసరెత్తిరి** – విజృంభించిరి ★ **కందువకు** – ఏకాంతమునకు

సంఖ్య : 562 సంపుటము : 27 పుట: 380 రాగం : లలిత

**14 అన్నిటా జాణఁడు అలమేలుమంగపతి**
**పన్ని నీకు మేలువాఁడై పరగివున్నాఁడు ॥పల్లవి॥**

**పట్టినదే పంతమా పతితోడ నీ కిప్పుడు**
**యిట్టె నిన్ను వేఁడుకోఁగా నియ్యకోరాదా**
**వొట్టి యప్పటనుండి నీవొడి వట్టుకొన్నవాఁడు**
**గట్టువాయ తనమేల కరఁగవే మనసు ॥అన్ని॥**

**చలములే సాదింతురా సారె సారె నాతనితో**
**బలిమిఁ బిలువఁగాను పలుకరాదా**
**కలపుకోలు సేసుక కాఁగలించుకున్నవాఁడు**
**పెలుచుఁదనములేల పెనఁగవే రతిని ॥అన్ని॥**

**చేరి ఇట్టె బిగుతురా శ్రీవేంకటేశ్వరునితో**
**మేరతో నిన్నేలఁగాను మెచ్చఁగరాదా**
**యీరీతి నిన్నుఁ బెండ్లాడె యెడయక వున్నవాఁడు**
**వీరిడితనములేల వెలయవే మరిగి ॥అన్ని॥ 562**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో అలమేలుమంగమ్మతో తల్లీ! నీవు అన్నిటిలోనూ మిక్కిలి నేర్పరివి. నీపతి పన్ని (ఒప్పి) ఆయన నీశ్రేయోభిలాషిగా వున్నాడమ్మా! తల్లీ! నీవు పట్టినదే పంతమా? అందులోనూ జగదేక పతితోనా? ఆయనే నిన్ను వేడుకొంటున్నాడు కదా! ఇకనైనా అంగీకరించరాదా? నీవు ఒడిగట్టుకొన్నవాడు (భర్త) అప్పటినుండి పాపం వూరకనే వున్నాడమ్మా! నీకింత గట్టువాయతనము (గట్టినోరు గయ్యాళితనము) యెందుకమ్మా? నీ మనస్సు కొంచెము కరిగించుకోరాదుటమ్మా? అమ్మా! సర్వేశ్వరునితో చలములు (మత్సరములు) సాధించవచ్చునా? అందులోనూ సారెసారెకు (మాటిమాటికీ). నిన్ను బలిమి (పెద్దగా) పిలుస్తున్నాడు కదా? కొంచెము పలుకరాదటమ్మా? నీవల్లభుడు కలుపుకోరుతనముతో కౌగలించుకొంటున్నాడు కదా! ఇంత పెంకితనము నీకెందుకమ్మా? ఆయనతో రతిని గూడవమ్మా! జననీ! ఆయన శ్రీవేంకటేశ్వరుడమ్మా! ఆయనతో బిగిసిపోవచ్చునా? మర్యాదతో ఆయన నిన్నేలుతుంటే ఆయన శాంతమును మెచ్చుకోరాదా? ఆయన నీకు నిత్యపెళ్ళికొడుకు కదా! నీకింత వీరిడితనము (వివేకశూన్యత) దేనికమ్మా? స్వామికి స్వాధీనమై శోభిల్లవమ్మా!

★ **ఇయ్యకోరాదా** – అంగీకరించరాదా ★ **ఒట్టి** – వూరకనే
★ **పెలుచుదనము** – పెంకెతనము ★ **మేరతో** – మర్యాదతో





సంఖ్య : 477 సంపుటము : 27 పుట: 323 రాగం : ఆహిరి

**15 వీనులు చల్లఁగా ఇట్టె వినేఁగాక**
**యీనయగారి నీతో యెదురాడేనా ॥పల్లవి॥**

**చందురుఁడు నీ చూపు ఆ చాయలది నామోము**
**సందడి నిందుకే యెట్టు సరియౌదును**
**చెంది నన్ను మన్నించి చెప్పేవు యీసమ్మంధము**
**ఇందు నీ చిత్తము కొలఁ దెదురాడేనా ॥వీను॥**

**పాము నీ పరపు ఆబాగులది నా యారు**
**సామివి యిందుకే యెట్టు సరి యౌదును**
**చేముట్టి చుట్టరికాలు చెప్పి నన్నుఁ బొదిగేవు**
**యేమనినా నీమాట కేదురాడేనా ॥వీను॥**

**చుట్టుఁ జక్రము కత్తి యా సూటివే నా కుచములు**
**జట్టిగా నిందుకే యెట్టు సరి యౌదును**
**గుట్టున శ్రీవేంకటేశ కూడితివి వావులకె**
**యెట్టు నన్నేలినా నీకు నెదురాడేనా ॥వీను॥ 477**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ మధుర కీర్తనలో శ్రీదేవి తిరుమలేశునికి తనకు గల పోలికల నెత్తిచూపుతూ అవివున్నంతమాత్రాన ఎట్టు (ఎట్లు) సరియౌదును? ఏదో నన్ను సంతోషపెట్టటానికి మన చుట్టరికాలు తిరగేస్తున్నావు కాని, నీవెక్కడ నేనెక్కడ? నిన్నెదిరించేటంతటి దాననా నేను? అంటున్నది. వినండి. నా వీనుల విందుగా నీవు చెప్పేది వింటానులే. కాని ఈయనగారి (మంజులభాషిణి) నీకెదురాడగలదా? నీ చూపులు చంద్రునివలె చల్లనైనవి, నా మోము చంద్రునివలె కాంతివంతమైన ఛాయ గలది. ఇంతమాత్రం పోలికతో నీకు సరియౌదునా? ఏదో నన్ను మన్నించి యీ సమ్మంధము వుందంటున్నావుగానీ, నీ మనస్సును కించపరచి యెదురాడగలనా? దేవా! ఆదిశేషుడు అనే సర్పము నీ తల్పము. నా కొప్పుడకూ సర్పము చుట్టవంటిదే. ఈ పోలిక వున్నంతమాత్రాన స్వామివైన నీతో నేనెట్లు సరియౌదును? నన్ను స్ప్రుశించటానికి ఈ చుట్టరికాలు చెబుతున్నావు గాని అలా చెప్పి నన్ను పొదిగేవు (ఆక్రమిస్తావు). నేనేమనినా నీమాటకెదురాడగలనా? ప్రభూ! నీ సుదర్శన చక్రము గుండ్రనిదిగా కోసుగలది. నా కుచములనూ కోసుగా గుండ్రనైనవి. జతగా ఇంతదానికే నేను నీకు సమమవుతానా? ఓ శ్రీవేంకటేశా! నన్ను నీవు కూడి నన్నేలినంతమాత్రాన నిన్నెదిరించగలనా?

★ **ఆబాగులది** – సర్పపు చుట్టవంటిది ★ **ఆరు** – కొప్పు

సంఖ్య : 179 సంపుటము : 27 పుట: 120 రాగం : ఆహిరి

**20** కానీవయ్యా అందుకేమి కాదనేనా
మోనాన నుండఁగ నిన్ను మోవనాడేనా ॥పల్లవి॥

పొత్తుల మాఁటలలోనే బువ్వమారగించితిరి
అత్తి మోవులనే విడే లందుకొంటిరి
యెత్తిన చలముతోడ యేల నాతో బొంకేవు
కొత్తలుగ వేరే నిన్నుఁ గోపగించేనా ॥కానీ॥

తెలినవ్వు సిగ్గులనే తెరలు వట్టించితివి
తలఁబాలు వోసితివి తమకముల
చలము సాదించి యేల సారె నానలు వెట్టేవు
వెలినుండి వేరే నిన్ను వెంగెమాడేనా ॥కానీ॥

గొప్పకుచముల బూజకుండలునుఁ బట్టితివి
పిప్పిఁగాఁగ రతులను పెండ్లాడితివి
ఇప్పుడే శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
నెప్పున నాపెకు నీకు నింద గట్టేనా ॥కానీ॥ **179**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో స్వామితో ఏమంటున్నారో వినండి. కానీయవయ్యా! ప్రభూ! దానికేమి అభ్యంతరం వుంటుంది? నీవు మౌనంగావుంటే, మోవనాడేమా (నీ మనస్సు నొచ్చునట్లు మాటలాడెదమా?) ఎన్నడూ అలా చేయము. మీరిరువురూ మాటలాడుకొంటూనే జతగా వివాహ భోజనం చేసినారు. అతిశయించి పెదవులు తాంబూలముచే ఎఱ్ఱబారినవి. పెచ్చుమీరిన పట్టుదలతో ఎందులకు అసత్యమాడేవు? ఇప్పుడు కొత్తగా నిన్ను కోపించేవారెవరు? స్వామీ! నీ లేత చిరునవ్వులతో ఆమె సిగ్గుల తెరలు దించితివి. తమకములతో తలబ్రాలు ఆమె సిరసుపై పోసితివి. మాటనెగ్గించుకొనిన తరువాత ఇంకా ఆంక్షలుపెట్టేవేలనయ్యా? బయట నుంచి నీతో ఎకసక్కెము లాడుదుమా? ఐరేని కుండలవంటి అతివ ఘనస్తనములను పట్టితివి. పిప్పి జేయురతులదేల్చుట కామెను బెండ్లాడితివి. ఇదే అదనని, ఓ శ్రీవేంకటేశ్వరా! నన్నునూ (అన్నమయ్య అనువలపుకత్తెను) కూడితివి. మరి ఇక ఆ దేవిని గాని నిన్నుగాని యేమని నిందించగలను?

★ **చలము** – పట్టుదల ★ **బూజుకుండలు** – ఐరేని కుండలు





సంఖ్య : 399 సంపుటము : 27 పుట: 270 రాగం : ఆహిరి

**17** ఆఁడు జన్మమే మేలు అందరికిని
పోఁడిమితో నీవంటి పురుషుఁ డుండఁగను ॥పల్లవి॥

గోపికల కొరకె కొండ గొడ గెత్తితివి
గోపికల కొరకె గోవులనుఁ గాచితివి
యీపాటి వాఁడవు ఇంతులఁ గంటేఁ జాలు
యేపనియైనాఁ జేతువు యెరిఁగితిమయ్య ॥ఆఁడు॥

పొంచి సత్యభామకుఁగా పువ్వులమాఁకు మోఁచితి
పొంచి సత్యభామవద్ద పోటుబంటవై మించితి
ఇంచుకంతా లోఁగవు ఇంతు లొద్దనుంటేఁ జాలు
యెంచ కన్నియుఁ జేతువు యెరిఁగితిమయ్య ॥ఆఁడు॥

మిన్ను సాదించి తెచ్చితి మెరసి పదారువేల
మిన్ననేలఁ గూడపెట్టి మించి రుక్మిణిఁ జేకొంటి
ఇన్నిటా శ్రీవేంకటేశ ఇరవైతివి మాపాల
యెన్నియైనాఁ జేతువు నిన్నెరిఁగితిమయ్యా ॥ఆఁడు॥ **399**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య భావనల పరిమళం ఇట్లా పరిచయం చేయటం సుకృతంగాక మరేమిటి? నీవంటి మగాడితోడు దొరికితే నాకు ఆడుజన్మే కావాలి. అదే యెంతో మేలు అంటున్నారు. ఎందుకుటా? గొల్లకంపుకొట్టే గోపికల కోసం కొండ (గోవర్ధన పర్వతం) గొడుగుగా పట్టుకొన్నావు. ఆ గోపికల కొరకే గోవులను కాచావు. నువ్వేపాటివాడవో అవగతమైనది. ఇంతులు కంటబడితేచాలు యేపనినైనా చేస్తావు. నీ ముద్దు భార్య సత్యభామ కోసం పువ్వులమాకు (పారిజాతవృక్షం) స్వయంగా మోసి తెచ్చావు. ఆ సత్యభామ వద్ద పోటుబంటవై (శూరుడవై) నిలిచితివి. వశమయ్యే వనితలను చూస్తే చాలు మంచీచెడ్డా చూడక ఏమైనా చేస్తావు. ఇదిమేమెరిగితిమయ్యా నరకాసురుని పురము ముట్టడించి వాని చేతిలోనున్న పదియారువేల రాచకన్నెలను విడిపించి వారి కోర్కెపై ఆనాడు రుక్మిణిని పెండ్లాడినట్లే పెండ్లాడినావు. నేడు శ్రీవేంకటేశ్వరుడవై మాపాల నెలకొంటివి. మాకోసం యెన్నైనా చేతువని యెరిగితిమయ్యా!

★ **పోడిమి** – అందము ★ **లోఁగవు** – వశమయ్యే

సంఖ్య : 397 సంపుటము : 27 పుట: 268 రాగం : బౌళి

**18** ఇంకనైనా మొక్కవే నీ విన్నిటికి శలవుగా
కంకి సేసేవు వలపు కటకటా యేమే ॥పల్లవి॥

యేకతానఁ బతితోడ నేమన్నా నమరుగాక
వాకుచ్చి ఇందరిలోనా వా దడతురా
ఆకడ నవ్వీ నతఁడు ఆనలు వెట్టేవు నీవు
కాకు సేసేవు వలపు కటకటా యేమే ॥ఇంక॥

చెంతనుండే యట్టే వేళ చెనకఁగఁ జెల్లుఁ గాక
పంతమునఁ గొలువులోఁ బచ్చి సేతురా
సంతసించె నిన్ను నాతఁడు జంకించేవు నీవైతే
గంత గట్టేవు వలపు కటకటా యేమే ॥ఇంక॥

కూడిన యప్పటి వేళ కొసరఁ దగవు గాక
యేడనైనా రట్టుసేసి యెచ్చరింతురా
యీడనె శ్రీవేంకటేశుఁ డితవాయఁ గలసేవు
గాడిఁ బెట్టేవు వలపు కటకటా యేమే ॥ఇంక॥ **397**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ మధురకీర్తన నేటితరం వారికి నిఘంటువులేకపోతే మింగుడు పడదు. ఆయన దేవి చెలికత్తెవలె ఆమెకేమి చెబుతున్నారో వినండి. అయ్యయ్యో! ఇదేమిటమ్మా? "వలపునింత కంకిసేసేవు" (ప్రణయంలో ఇంత దురుసుగా ప్రవర్తిస్తావు). నీవు ఇన్నిటికీ (చేసినవాటన్నిటికీ) శలవుగా (అర్పణగా) స్వామికి మొక్కవమ్మా! నీవు నీపతితో ఏకాంతంలో వున్నప్పుడు నీవేమనినా చెల్లిపోతుంది గాక ! ఇందరిలో నోరువిప్పి వాదడతురా? అతడు నవ్వి సుముఖుడైతే నీవు ఆంక్షలు పెట్టవచ్చునా? వలపు నింత కాకు (అవమానం) చేస్తారా? అయ్యయ్యో! ఇదేమిటమ్మా? దేవీ! ఆయన నీదగ్గరే వున్నప్పుడు నీవెంత చెనకినా (నొక్కినా) చెల్లుతుంది. ఆయన కొలువులో వుండేటప్పుడు పచ్చిసేతురా (ఆఅడి పెట్టెదరా)? నిన్నాతడు సంతోషపెట్టాలని చూస్తుంటే నీవేమో బెదిరిస్తున్నావా? అయ్యయ్యో? వలపు నింత గంతగట్టేవా? (కళ్ళకు గంత కట్టవచ్చునా)? అతడు నిన్ను కూడినప్పుడు ఆపేక్ష చూపించాలి. రభస చేయవచ్చునా? శ్రీవేంకటేశ్వరుడు, హితుడై కలిస్తే... వలపులో, గాడిబెట్టేవా (క్షోభపెడతావా) అయ్యయ్యో!

★ **వాదడతురా** – వివాదం పడెదరా? ★ **ఎచ్చరింతురా** – హెచ్చరిస్తారా?





సంఖ్య : 177 సంపుటము : 27 పుట: 119 రాగం : సాళంగం

**19** ఎక్కినవానికిఁ జాడ యేనిగె గుజ్జుమాట
నిక్కముగా భువిలోన నీవల్ల గంటిమి ॥పల్లవి॥

మొగము చూడఁగానే మూటమాటలాడేవు
తగునా ఆతనితోడ దంటతనము
నగేవానితోడ నీవు నంటుసేసి గొణగేవు
అగపడితేఁ బతి అలసతే నీకు ॥ఎక్కి॥

దగ్గరి రాఁగానే నీవు తలవంచుకొనియేవు
యెగ్గా ఆతఁడు నీకు యేమైనాను
వొగ్గి చేయిచాఁచేవాని నొడ్డుకొంటా బెనఁగేవు
వెగ్గళించకుండితేనే వింతవాఁడా ఇతఁడు ॥ఎక్కి॥

కొంగువట్టి తియ్యఁగానే గొబ్బున సిగ్గువడేవు
సంగతా ఇద్దరి మీసరసవేళ
యింగితాన శ్రీ వేంకటేశుఁడిట్టె నిన్నుఁగూడె
ముంగిట నిలుచుంటేనే ముచ్చటలు చెల్లెనా ॥ఎక్కి॥ **177**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ మధురకీర్తనలో పల్లవేమని అంటే ఏనుగుపై యెక్కిన వానికి ఏనుగు కురచగానే తోస్తుంది కదా? దేవీ! నిజముగా భువిలో నీవలన మాకిది అవగతమైనదమ్మా! ఆయనను చూడగానే మూటెడు మాటలు మాట్లాడతావు కదా! ఆతనితో ఇంత దంటతనము (గయ్యాళితనము) తగునటమ్మా? నీతో చిరునవ్వుతో మాట్లాడే ఆయనతో తగులుకొని పోట్లాడతావు. నీకు ఆయన కళ్ళెదుటనే వుంటే అంత అలుసుటమ్మా? పోనీ తనంతట తానే నీ దగ్గరకు వస్తే నీవు తలవంచుకొని వుంటావేమిటమ్మా? ఆతడు నీకేమైనా ఎగ్గు (అపకారం) చేస్తాడా? కావాలని నీకోసం చేయిచాచేవానితో పెనుగులాడవచ్చునా? ఇతడు తిరస్కరించటం లేదు కాబట్టే విచిత్రంగా వున్నాడా? దేవీ! నీ ప్రియుడు పైటచెంగు పట్టుకోగానే వెనువెంటనే సిగ్గులమొగ్గయిపోతావు. మీ ఇద్దరూ సరసమాడుకొనే వేళ ఇది తగునా? చాకచక్యంతో శ్రీవేంకటేశ్వరుడు నిన్ను కూడినాడు. నీవాయన ముంగిట నిలుచుంటే యెంత ముచ్చటగా వుంటుందమ్మా!!

★ **వెగ్గళించు** – తిరస్కరించు ★ **గొబ్బున** – వెనువెంటనే

సంఖ్య : 104 సంపుటము : 27 పుట: 70 రాగం : దేశాక్షి

**24 ప్రేమముతో నిందరిని బెండ్లాడితివి**
**కామించి యేరీతి నేలి కరుణించేవయ్యా ॥పల్లవి॥**

**కలికి కాఁగిటిలోనే కాఁపురము సేయఁగాను**
**వెలఁదులకెల్లా నిఁక వేళ యేదది**
**చలపట్టి యేపొద్దు సరసము లాడఁగాను**
**మలసి ఇతరులకు మరి వేళ యేదది ॥ప్రేమ॥**

**చనవున నాపె మించి సారె మోవి యానఁగాను**
**వెనకటిసతులకు వేళ యేదది**
**కనుఁగొని యట్టె తనకతలే నీకుఁ జెప్పఁగా**
**మనవి చెప్పేవారికి మరి వేళ యేదది ॥ప్రేమ॥**

**చెంత నీ శిరసుమీఁద సేస లాపె వెట్టఁగాను**
**వింత సవతులకెల్లా వేళ యేదది**
**ఇంతలో శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు**
**మంతనపు చుట్టాలకు మరివేళ యేదది ॥ప్రేమ॥ 104**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని యెలా దెప్పుతున్నారో చూడండి. పదియారువేలమంది రాచకన్నెలు అష్టభార్యలు, భూదేవి, శ్రీదేవీ, కుబ్బ రేపల్లె గోపీజనము వంటి వలపుకత్తెలు, నాబోటి వలపు భక్తురాంఢ్రతో సరిపెట్టుకోవు. ఏ వూరిలో తిష్ఠవేసినా అక్కడొక వలపుకామినుల మూక. ఇదంతా బాగానేవున్నది, కానీ ప్రేమముతో ఇంతమందినీ పెండ్లాడినావు కదా! వీరందరినీ కామించి ఏవిధముగా కరుణిస్తావయ్యా? పోనీ నీవేమన్నా పనీపాటాలేని వాడివా అంటే... అబ్బో... ఒక్కొక్కదానికే ఒక రాత్రి ఇస్తే మళ్లీ దాని గతి యెన్నడు? ఆ వెలదికి వేళయేది? ఏపొద్దునైనా వీళ్ళ ప్రేమే అయితే ఇతరులకు మరి వేళ యేడ, అది చెప్పవయ్యా! ఒకామె మోవితేనె జుర్రుతూ కూర్చుంటే, వెనకటి సతికి (నిన్నటిదానికి) నేడు చోటేది? సరే! ఈవిడ చెప్పే కతలు వింటుంటే, మనవి చేసికొనేవారి మాట యెప్పుడు వింటావు? నేడు ఈవిడ చెంతచేరి అక్షంతలు చల్లించుకొన్నావు బాగానే వున్నది. నీ పదియారువేలమంది వింత సవతులు వున్నారే! వాళ్ళకు వేళ అదియేడ? సరే! ఇంతలోనేను పట్టుకొన్నానని, నన్నూ యేలినావు. నీతోమంనాలేడే చుట్టాలమాట యేంచేస్తావయ్యా?

★ **చలపట్టి** – పంతముతో ★ **మలసి** – మళ్ళీ





సంఖ్య : 178 సంపుటము : 27 పుట: 120 రాగం : ముఖారి

**21 వద్దు వద్దు కోపము వదినె నింతే నీకు**
**సుద్దులేల చెప్పేవు సొలసితి నిన్నును ॥పల్లవి॥**

**మారుకొన్న దానఁగాను మాటాడినదానఁగాను**
**యేరా నాతోనేల యెగ్గు పట్టేవు**
**గీరితి నింతే గోర కెలని పరాకు రాఁగా**
**కూరిమి నిట్టే వేఁడుకొనేను నిన్నును ॥వద్దు॥**

**గుంసించినదానఁ గాను గొణఁగిన దానఁ గాను**
**తెంపున నేరా నన్ను దీకొనేవు**
**చెంపల చెమట జార చేఁతఁదుడిచితి నింతే**
**అంపలేను ఆయమంటి ఆదరించే నిన్నును ॥వద్దు॥**

**పాసివున్నదానఁ గాను పదరినదానఁగాను**
**వేసరక నన్నునేల వెడ్డువెట్టేవు**
**ఆసల శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి**
**మోసలేదు నీకునాకు మొక్కమెచ్చే నిన్నును ॥వద్దు॥ 178**

**పరిచయ పరిమళం :**

ఈ కీర్తనలో అన్నమయ్య స్వామికి వదినె వరుస అయిన బంధువు. స్వామిపట్ల ఆమెకున్న ప్రీతిని, అపార్థం చేసికోవద్దనీ తనను 'వెడ్డువెట్టవద్దు' (మోసగించవద్దు) అని వేడుకొంటున్నది. అదేమిటో, తెలుసుకొందామా? ఓ శ్రీనివాసా! అంత కోపము వద్దు. నేను నీకు వదినెనయ్యా! నీవు చెప్పే ముచ్చట్లు వింటే పారవశ్యం కలుగుట సహజమే. స్వామీ! నేను స్వాభావికంగానే, మారుకొన్నదానగాను (ఎదుర్కొనేటటువంటి దానను కాదయ్యా!) ఏరా! నాతో ఎగ్గు (తప్పు) ఏలపట్టేవు? నేనేదో పరధ్యానంలో పడి పొరబాటున గోటితో గీరినాను. పొరబాటే, నిన్ను వేడుకొంటున్నాకదా! దేవా! నేను ఈర్ష్యతో వికారంగా మాట్లాడేదానను కాదు. అర్థం లేకుండా గొణిగేదానినీ కాదు. ధైర్యంతో నన్నేల అంగీకరింపజేస్తావు? నీ చెంపలపై జారే చెమట నేను తుడిచినమాట నిజమే. అంతమాత్రాన, నన్నింత ఆదరించే నిన్ను ఎక్కడెక్కడో తాకుట తగదు. స్వామీ! నేను అంటీముట్టనట్లుండలేను. తొందరపడేదానినీ కాదు. నన్నెందుకు వంచిస్తావయ్యా? ఓ శ్రీవేంకటేశ్వరా! ఆశపడ్డ నన్ను కూడా కరుణించి కూడితివి. నీకూ నాకూ మధ్య వంచనలేదయ్యా! నీకు మొక్కి మెచ్చెదనయ్యా!

★ **గుంపించు**–ఈర్ష్యతో వికారంగా మాటలాడుట ★ **దీకొను**–అంగీకరింపజేయు
★ **పాసివున్న** – అంటీముట్టనట్లున్న ★ **మోసలేదు** – వంచన లేదు

సంఖ్య : 396 సంపుటము : 27 పుట: 268 రాగం : నాదరామక్రియ

**22** ఆనతీవయ్య యేమిటా నడ్డము లేదు నేఁడు
నేను నీకీ వూడిగాలు నేరుచు కొనేను ॥పల్లవి॥

కొంత గొంత నీ నిలువుఁ గొప్పు జారివున్నదిదె
పంతమున నెవ్వతైనాఁ బట్టి తీసెనో
పొంతనె యెదుగాను నీ పుక్కిటఁ దమ్మ వున్నది
అంతరంగమైనచోట నాదాయము వచ్చెనో ॥ఆన॥

తొలుతే నీ పచ్చడము తొప్పఁ దోఁగి వున్న దిదె
నిలుచుండఁగా నాపె పన్నీరు చల్లెనో
అలసి బుసకొట్టేవు అక్కడివారు నిన్ను
బలిమిఁ జెప్పఁ గారానిపనులు సేయించిరో ॥ఆన॥

యీరీతిఁ బూవుల దండ లిన్ని నీమెడ నున్నవి
పోరానివారే నీకు బూజ సేసిరో
చేరి యలమేల్మంగను శ్రీవేంకటేశ కూడితి-
వారసి బుద్ధి చెప్పిరో అందరూనుఁ దగరు ॥ఆన॥ **396**

**పరిచయ పరిమళం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! మాదేమున్నదయ్యా? ఆనతినీయవయ్యా! నీకెందునా అడ్డము లేదు. నేడు నేనే నీకు వూడిగము చేయనేర్చితిని అంటున్నారు అన్నమయ్య. మరి ఆమెకూడా అన్నమయ్యయే. నిట్టనిలువుగా అమర్చికట్టుకొన్న నీ కొప్పు నేడు యెందుకో కొంచెం సడలి కొప్పు జారిపోయింది. ఎవ్వతెయైనా పంతముతో, వూడపీకలేదుకదా? సమీపించి చూస్తే నీ పుక్కిట తాంబూలపుతమ్మ మిక్కుటముగానున్నది. నీకు మనసున మక్కువవుంటేనే లాభమూ వుంటుందని గ్రహించు. స్వామీ! ఇదిగో నీ వస్త్రము మొదటనే నీ చెమటలవల్ల తడిసివున్నది. దానికి తోడు నీవు నిలుచునియుండగానే ఆమె అధికముగా పన్నీరుచల్లినారా యేమయ్యా? అలిసిపోయినవానిలా అపరిమితంగా బుసకొట్టుచున్నావు. ఏలనయ్యా? అక్కడివారు బలవంతాన నీచేత చేయరాని పనులు చేయించినారా యేమి? స్వామీ! మరొక్కసంగతి వివరించి చెప్పవయ్యా! నీకు పో, రా అని ఆజ్ఞలిచ్చేవారు నీకు పూజచేయాలని ఆపినారాయేమి? చివరికి నీవు నీ అలమేలుమంగకే చేరువయ్యావు. అందరూ నీకు తగరని ఆమె బుద్ధి చెప్పలేదు కదా!

★ **ఎదుగా** – ఎక్కువగా ★ **పచ్చడము** – వస్త్రము





సంఖ్య : 145 సంపుటము : 27 పుట: 98 రాగం : దేసాళం

**23** నేరుతువు కరియమాణిక్కె దేవుఁడా
నీరపము కరియమాణిక్కె దేవుఁడా ॥పల్లవి॥

మక్కువ నాతోఁ బెనఁగి మంచానకుఁ దీసేవు
నిక్కమా కరియమాణిక్కె దేవుఁడా
అక్కరతో బత్తిసేసి ఆయము లంటేవు నాకు
నిక్కలాయఁ గరియమాణిక్కె దేవుఁడా ॥నేరు॥

చేరదేర నీవు నన్నుఁ జేయివట్టి పెనఁగఁగా
నీవి జారెఁ గరియమాణిక్కె దేవుఁడా
కైవశమై పాయలేను కప్పురవిడేలకే
నీవద్దనే కరియమాణిక్కె దేవుఁడా ॥నేరు॥

అచ్చపు గురుతులెల్లాఁ ఆనతిచ్చి రప్పించితి
నెచ్చెలిచేఁ గరియమాణిక్కె దేవుఁడా
ఇచ్చగించి శ్రీ వేంకటేశుఁడవై కూడితివి
నిచ్చలునుఁ గరియమాణిక్కె దేవుఁడా ॥నేరు॥ **145**

**పరిచయ పరిమళం :**

తిరుపతికి నలభై కి.మీ దూరంలోని 'నగరి'లో వెలసిన నిలువెత్తు దేవుని కరియమాణిక్యప్రభువని కీర్తిస్తున్నారు అన్నమయ్య. భూదేవి, శ్రీదేవీయుతుడైన స్వామి గజేంద్ర వరదుడని, గజేంద్రమోక్షం ఇక్కడే జరిగిందని ప్రతీతి. ఓ కరియమాణిక్కెదేవుడా! ఏదో విధంగా నీరపము (నీ పంతము) నెగ్గించుకోగల సమర్థుడవు. నాతో పోట్లాడి ఎలాగైనా మంచము మీదికి తీసికెళతావు. ఇది నిజము మాణిక్కె దేవుడా! నీ అవసరం కొద్దీ, భక్తి చూపించి ఎలాగైనా నా మర్మములను తాకుతావు. నాకు ఇదంతా ఏనాడో అనుభవంలోకి వచ్చింది. చేవదేర (బలవంతుడవై) నన్ను చేతులతో పట్టిపెనగులాడి నన్ను పందెము ఓడిపోయేట్లు చేసిన కరియమాణిక్కెదేవుడా! నీకు లొంగిన పిమ్మట నిన్ను వీడుట సాధ్యమా? నీవిచ్చే కర్పూరతాంబూలానికి కట్టువడి పోయానయ్యా! ఓ కరియమాణిక్కెదేవుడా! నేనెక్కడ నిన్ను కలుసుకోవాలో వివరమైన గుర్తులు చెప్పి మరీ రమ్మన్నావు కదా! నానెచ్చెలి చెప్పిందిలే. నేనంటే (అన్నమయ్య అనేవలపుకత్తె) ఇష్టపడి శ్రీవేంకటేశుడవై కూడితివి. నిత్యమూ నీదాననే.

★ **నిక్కలాయ** – అనుభవంలోకి వచ్చింది ★ **నీవి** – పందెము

సంఖ్య : 327 సంపుటము : 27 పుట: 221 రాగం : దేశి

**28 అంతేని మే మెఱఁగము ఆఁడువారము**
**సంతలో నేరుచుకొని జాణము గారాదా ॥పల్లవి॥**

**కూడిమాడి వుండి నీతోఁ గోపగించితి ననేవు**
**వాడికెవారి నవ్వులు వచ్చీనా మాకు**
**వేడుక కాఁడవు నీకు వేగిరము గలితేను**
**నీడల నూరివారితో నీవు నవ్వరాదా ॥అంతే॥**

**వోముక మారుమొగమై వూరకుందాన ననేవు**
**దోమటి గొల్లమాటలు తోఁచీనా మాకు**
**ప్రేమమున నీకు నింత పెక్కులాడవలసితే**
**నీమాటలు నా మాటలు నీవే యాడరాదా ॥అంతే॥**

**కన్నులఁగంటానే వచ్చి కాఁగిలించుకో ననేవు**
**నిన్నటివారి నేర్పులు నేర్చేమానేము**
**అన్నిటా శ్రీవేంకటేశ ఆయములంటి కూడితి-**
**వెన్ని గలవు నీ పొందు లెనయఁగరాదా ॥అంతే॥ 327**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ మధుర కీర్తనలో గొల్లెతలు శ్రీకృష్ణుని దెప్పుతున్నారు. మేము చల్లవెన్నలనమ్ముకొనే గొల్లవారము. పైగా ఆడువారము. నీవు సంతలలో తిరిగీ తిరిగీ జాణవయ్యావు. అయితే మాకేమి? నీ జాణతనం నీవద్దనే వుంచుకోరాదా? నీతో కూడివుండక మొకము మాడ్చుకొని వుంటానని దెప్పకు. నీకు 'అలవాటై' వారి జాణతనం, నవ్వులు మాకెలా వస్తాయి? నీవు వేడుక కాడవు. నీకు అంత "తొందర" వుంటే.. వూరివాళ్ళు చాలామంది వున్నారు. వారితో నీ నవ్వులు పంచుకోరాదా? నన్నేమన్నావో తెలుసా? సంస్కారము లేక మొగము మాడ్చుకొని వుంటానా? నా మాటలు నీకు దోమటి (మొరటుదైన) గొల్ల మాటలు అనిపిస్తున్నాయా? ప్రేమలు కురపించేట్లు నీతో మాట్లాడాలా? అయితే నా మాటలు నీ మాటలు నీవే ఆడరాదా? నిన్ను చూడగానే వచ్చి కౌగలించుకోనా? తమరితో నిన్న కులికినదాని జాణతనం నాకెక్కడిదిలే? నీవు శ్రీవేంకటేశ్వరుడవైనా ఆయము (మర్మస్థానముల) నంటి మరీ కూడుతావు. నీ పొందులతో అలరించరాదా?

★ **ఓముక** – సంస్కారములేక ★ **సంత జాణతనము** – మోసముతో కూడిన నేర్పు





సంఖ్య : 328 సంపుటము : 27 పుట: 221 రాగం : సామంతం

**25 చిత్తగించు నీ వాపెను చెన్నరాయ! ఈపె**
**చిత్తిణి గొడగుమట్టి చెన్నరాయ ॥పల్లవి॥**

**చిక్కని గుబ్బల మీఁద చేయి నీవు వేసితేనే**
**చిక్కెను నీపాల నాపె చెన్నరాయ**
**చొక్కించి నీవు గోరు సోఁకించఁగా కమ్మటి నీ-**
**చెక్కిటిపైఁ జేయివెట్టీ చెన్నరాయ ॥చిత్త॥**

**దిమ్మరి మాటలు యీ తెఱవతో నాడఁగాను**
**చెమ్మగిలఁ జెమరించె చెన్నరాయ**
**తమ్ములము నీ విడఁగ తమకించి యట్టె యాపె**
**చిమ్మెను నీమీఁదను సిగ్గు చెన్నరాయ ॥చిత్త॥**

**ఆ రీతుల నేకతాన అలుకలు దేర్చఁగాను**
**జీరలు వొళ్ళెల్ల నిండె చెన్నరాయ**
**యీ రీతి శ్రీవేంకటాద్రి నిద్దరు నేకమైతిరి**
**చీరకొంగు వదలకు చెన్నరాయ ॥చిత్త॥ 328**

**పరిచయ పరిమళం :**

కడప మండలంలోని గొడుగుమట్టి గ్రామంలో నెలకొన్న చెన్నరాయనిపై మధుర కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఈ చెన్నరాయని వలచి తపించుచున్నది ఒక చిత్తిణి జాతి ప్రేమిక. నీవు ఆమెను చిత్తగించి సంతోషింపజేయవయ్యా! అంటున్నారు. ఓ చెన్నరాయా! చిక్కనైన, ఆమె చనుగుబ్బలపై నీవు చేయి వేశావో లేదో ఆమె నీకు దాసురాలయింది. ఆమెను పరవశింపజేసి అనేకమైన నఖక్షతములను జేశావు. అందుకనే ఆమె కమ్మటి నీ చెక్కిలిపై చేయి ఆనించింది. ఓ చెన్నరాయా! మత్తెక్కించే పలుకులతో ఈ తెఱవ (జవ్వని) నీతో కలిసి నర్తించినందుకే చెమరించినదయ్యా! నీవామెకు తాంబూలము నియ్యగానే తమకముతో నీపైననే సిగ్గులు కుమ్మరించినది. ఓ చెన్నరాయా! ఆ విధంగా నీవు మీ ఏకాంతములో ఆమె అలుకలు తీర్చగానే వుక్రోషంతో నీ ఒంటినిండా గీట్లు పెట్టింది ఆ చిన్నది. ఇంతాచేసి ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు చెన్నుడవైనప్పుడు నీచెంత చేరిన ఆ చెలియ నీ దేవేరి అలమేల్మంగయే. అందుకే నీవామె చీరెకొంగు వదలవు.

★ **చొక్కించి** – పరవశింపజేసి ★ **దిమ్మరిమాటలు** – మత్తెక్కించే పలుకులు

సంఖ్య : 385 సంపుటము : 27 పుట: 267 రాగం : శంకరాభరణం

**26** **ఓ యమ్మ యశోద వొద్దన్న మానఁడు**
**ఖోయని యారిచీ గోవిందుఁడు** ॥పల్లవి॥

**పయ్యెద లెడలఁ బట్టెరు గొల్లెత-**
**లొయ్యన తాఁ గొట్టీ నుట్లు**
**తియ్యని పెరుగు తేనె వారవట్టీ**
**కూయఁగఁ గూయఁగ గోవిందుఁడు** ॥ఓయ॥

**చాడెలు దియ్యుచు సతులు నవ్వఁగ**
**ఆడవారిచన్ను లట్టె తీసీ**
**యేడకైన చాఁచీ లెత్తిన కోలలు**
**కోడెకాఁడు గదె గోవిందుఁడు** ॥ఓయ॥

**యెమ్మెలు నెరపి యిందిరయుఁ దాను**
**అమ్మరో శ్రీవేంకటాద్రి వీథులను**
**కమ్మిగోపికలు కాఁగిట గూడఁగ**
**కుమ్మరించీ సిగ్గు గోవిందుఁడు.** ॥ఓయ॥

**పరిచయ పరిమళం :**

గోవిందుడు చేసిన అల్లరిని యశోదకు పితూరీచేస్తున్నారు గోపెమ్మలు. అన్నమయ్యనాటి కొన్ని తెలుగు పదములు మింగుడు పడవు. ఇది నాబోటి సామాన్యుడు చేసిన విశ్వప్రయత్నం. చదివి ఆనందిద్దాం. ఓయమ్మా! యశోదా! నీ కొడుకు అల్లరి వద్దన్నా మానడమ్మా! "ఖో" అని పెద్దగా మా వెనకనుంచి అరచి మమ్మల్ని భయపెడతాడు, ఈ గోవిందుడు. గొల్లెతలు చెమటలతో తడిసిన పయ్యెదలను తీసిపెట్టి గాలికి ఆరబెట్టుకొంటుంటే లోపల మీవాడు వారు అప్పుడే వుట్లపై పెట్టిన పెరుగును తేనెను ధారగా కారిపోయేట్లు చేస్తాడమ్మా! మేము కూయగా కూయగా (ఎంత మొరబెట్టుకొన్నా) వినడమ్మా! సతులు తమ నెత్తిన పెట్టుకొన్న కుండలను దించుటకు చెయ్యి వేయమని, నవ్వగా అక్కడే కుండలవంటి వారి చన్నులపై చేయి వేస్తాడు. బయటకు తీసి ఎక్కడికైనా చాచిపెట్టినట్లు తన కోలలతో (చిన్న కఱ్ఱలు) ఆ కోడెగాడు తాకుతాడు. మరి అంతటితో ఆగుతాడో లేదో!! ఓయమ్మో! తిరుమల వీధులగుండా ఇందిరతో పోతూ, శ్రీవేంకటేశుడై గోపికల కౌగిట కూటములు గుర్తుకువచ్చి సిగ్గులు కుమ్మరిస్తున్నాడు.

★ **చాడెలుదియ్యుచ** – కుండలు దించుచూ ★ **కమ్మి** – అతిశయించి
★ **కోడెకాడు** – మిటమిటలాడే కుఱ్ఱవాడు





సంఖ్య : 226 సంపుటము : 27 పుట: 153 రాగం : మంగళకౌసిక

**27** **కపటము లిఁకనేలే కన్ను లెదుట నున్నాఁడు**
**నెపములు వేసి యెంత నీటు చూపేవే** ॥పల్లవి॥

**మంతనాలు గొంతవడి మాటలనుఁ గొంతవడి**
**యెంతవడి వట్టి జాగు లేమి సేసేవే**
**వంతుకు నాతఁడు వచ్చి వద్దఁ గాచుకున్నవాఁడు**
**కొంతపుఁ జూపులనేల కొచ్చి చూచేవే** ॥కప॥

**నవ్వులనే కొంతవడి నటనలఁ గొంతవడి**
**యెవ్వతె మాటలు వింటి విది యేఁటిదే**
**బువ్వాన నాతఁడు నిన్ను బోంసేతము రమ్మంటే**
**పువ్వులవాటులనేల పూఁచి వేసేవే** ॥కప॥

**సిగ్గులనే కొంతవడి సింగారాలఁ గొంతవడి**
**యెగ్గులుఁ దప్పులుఁ బట్ట నిందులో నేదే**
**అగ్గమై శ్రీవేంకటేశుఁ డాతఁడే తా నిన్నుఁగూడె**
**వెగ్గళించి మటీ నేల విఱ్ఱవీఁగేవే** ॥కప॥ **226**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య తిరుమలేశుని ప్రేమిక. దేవి తన భర్తను ఏమీ అనవద్దనీ, కపటముతో తన నాథుని తప్పుపట్టవద్దని మందలిస్తున్నది. అన్నమయ్యతో దేవి యేమంటున్నది వినండి. నా మగడు మన కన్నులెదుటే వున్నాడు కదే! కపటములెందుకే? పాపం! ఆయన మీద నెపాలు వేసి యెంత నీటుతనము చూపిస్తున్నావే!!! ఆయనతో కాసేపు మంతనాలని, కాసేపు మాట్లాడాలని, ఆయనను నిలిపివేసి జాగుచేసింది నీవు కదటే? ఆయన మాటకు కట్టుబడి వస్తే ఆయనను తీక్షణంగా చూస్తావా. ఎంతనంగనాచివే!!! కాసేపు నవ్వులొలికిస్తావా? కాసేపు నృత్యప్రదర్శనలా? నా భర్త గురించి నువ్వు విన్నదంతా, ఆ మాటలు నీకు యెవరు చెప్పారే. పాపం! ఆయనేదో నిన్ను భోజనవేళ అయింది కదా! భోంచేసి పొమ్మంటే, అది ప్రేమించడమా? ఆయనపై పూవులు వేస్తావా? ఏమే నీ చాతుర్యం? కొంతసేపు సిగ్గుల ప్రదర్శన, కొంతసేపు సింగారాల ప్రదర్శన. ఇందులో ఎగ్గులు, తప్పులు పట్టటానికి యేముందే? సరే! శ్రీవేంకటేశ్వరుడే కావాలని నిన్నుకూడినాడేపో! ఇందులో విఱ్ఱవీగటానికి యేముందే? ఆయన ఆశ్రితజనపక్షపాతి.

★ **కొంతపుజూపు** – తీక్షణమైన చూపు ★ **అగ్గమై** – అనుకూలుడై

సంఖ్య : 17 సంపుటము : 22 పుట: 12 రాగం : బౌళి

32 తామొకరి నాడుదురు తమనేరా లెంచుకోరు
భూమిలో నిట్లఁ గాఁగానేపో కౌను సమసె ॥పల్లవి॥

కాదనేటిదాననా కడు నీవు నవ్వితేను
సోదించి నీమోవి నీవే చూచుకోరాదా
యీదెస నీభావ మయ్యో యెదుటిచందురుకందు
నాదించేకన్నులు తననలుపు లెంచీనా ॥తాము॥

వేసరేటిదాననా వెంగేలు నీవాడితేను
యీసు నీగుణము నీవే యెంచుకోరాదా
మోసాన జలనిధిని మునినోరియెంగిలనే-
వూసినవాసినోరు తన వొద్దియెంగి లెంచీనా ॥తాము॥

వంతులెంచేదాననా వచ్చి నీవు గూడఁగాను
ఇంతలో నావరుస నీవెంచుకోరాదా
పంతపు శ్రీవేంకటేశ పైకొని కూడితి నన్ను
దొంతి తననీడ తోడువాసి వుండునా ॥తాము॥17

**పరిచయ పరిమళం :**

తెలుగునాట కొన్ని సామెతలు అన్నమయ్య కీర్తనలవల్లనే ప్రాచుర్యం చెందాయేమో! ననిపిస్తుంది. కళ్ళ రెప్పలు చంద్రుణ్ణి ఆక్షేపించాయట. నీవు చప్పుడు లేకుండా దొంగలావస్తావని. సముద్రంలో యెంతోమంది ఉమ్మివేస్తారు. ఆ సముద్రం ఆ ఉమ్మివేసేవాళ్ళని ఛీఛీ యెంగిలి అని ఆక్షేపించిందంట. మరి తానెక్కడనుంచి వచ్చింది ముని నోట్లోంచే కదా! శ్రీవేంకటేశ్వరుడు తమని ఒక్కసారి అనుభవిస్తే చాలు అని తహతహలాడే తన బోటి వలపుకత్తెలు, వావి వరుసలెంచితే అలాగే వుంటుందని అంటున్నారు. తప్పులెన్నువారు తమ తప్పులెరుగరని కదా! చాటువ వున్నది. ఇప్పుడు... జాగ్రత్తగా ఈ కీర్తనని అర్థంచేసుకోండి. తామొకరిని ఆక్షేపించే వారు తమనేరాలెంచుకోరు. భూమిలో ఇట్లాగనే పోవిల్లు వంకరగావుండేవాళ్ళని చూచి నవ్వితే యెట్లా? స్వామీ! నీవు నవ్వితే మందహాసం అని చంద్రుడు ఆక్షేపిస్తే అలాగే వుంటుంది, మరి. స్వామీ! నీవు వ్యంగ్యోక్తులాడితే బాధపడటం దేనికి? నేను అందులో ఈర్ష్యపడితే నీగుణాలని చూచి, ఇదీ అలాగేవుంటుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీ ప్రియురాళ్ళమైన మేము ఒకరినొకరం ఆక్షేపించుకొంటే... వెంటవెంట వచ్చే నీ నీడ మాబోటి ప్రియురాళ్ళను ఆక్షేపిస్తే... అలాగే వుంటుంది.

★ **వంతులెంచుదాననా** – వావి కుదరలేదంటానా ★ **దొంతి** – వెంటవెంటనే వచ్చె
★ **వేసరేటి** – బాధపడే ★ **నాదించుకన్నులు** – అల్లల్లాడే కన్నులు





సంఖ్య : 389 సంపుటము : 27 పుట: 263 రాగం : పళవంజరం

29 ఇంత వుపకారి నైతి నిది నీకుఁ జాలదా
బంతిఁబెట్టితి వలపు భావించుకో తగవు ॥పల్లవి॥

అలరి యాపె దిట్టిన ఆ తిట్లల్లా దాఁచి
జాలిఁ బెట్టనైతి నిన్ను చాలదా ఇది
పోలించి నీవు బొంకిన బొంకులెల్లా చెల్లఁ బెట్టి
మేలు మేలని మెచ్చితి మెచ్చవద్దా నన్నును ॥ఇంత॥

చివుకున ఆపెచేసే సేఁతలకు నడ్డమై
చవుకలు సేయనైతి చాలదా యిది
తవిలి నీవు దలఁచే తలఁపెల్లా నీడేరించి
కవ గూర్చినందుకు చొక్కఁగవద్దా మనసు ॥ఇంత॥

కలశాపె నవ్వఁగాను కాఁగిలించుకొని నిన్ను
చలములు మించి(చ?) నైతి చాలదా ఇది
నిలిచి శ్రీవేంకటేశ నెరవేర్చి నీపనులు
బలిమి సేసితిని చేపట్టవద్దా యిఁకను ॥ఇంత॥389

**పరిచయ పరిమళం :**

నాయిక (అన్నమయ్య) స్వామిని యెలా దెప్పుతున్నదో చూడండి. నేను నీకు యెంతవుపకారినైతిని అని నీవెన్నటికీ గ్రహించవు. నా వలపునంతా నీకు విందుచేస్తానుగదయ్యా? నీవు భావించుటకు కూడా తగవు. ఆమె నిన్ను తిట్టిన తిట్లన్నీ దాచిపెట్టి నిన్ను బాధపెట్టలేదు కదా! ఆ వుపకారం చాలదా? నీవు పోలించి (పోల్చి) చెప్పిన అబద్ధములనన్నింటినీ సర్దిచెప్పాను అది చాలదా. నీవు మేలుమేలైన వాడివని అందరిలో మెచ్చుకొన్నాను. అది చాలదా? మనస్సు చివుక్కుమనేట్లు ఆవిడచేసే చేతలన్నీ, అడ్డమై ఆపాను. ఆవిడలాగా నిన్ను చులకన చేయలేదు. అది చాలదా? నీ వ్యూహాలు అన్నీ అమలుచేశాను, ఈడేర్చాను, అది చాలదా? మీ ఇద్దరికీ కవగూర్చాను (జతకలిపాను) కద! దానితోనైనా నీ మనసు చొక్కగావద్దా? తనంత తానే ఆవిడ నిన్ను కలిసి కౌగలించిన నేను నా మత్సరము చూపలేదు కదా! అది చాలదా? ఓ శ్రీవేంకటేశ్వరా! నీ పనులన్నీ నేను చక్కదిద్దాను కదయ్యా? ఆ వుపకారానికైనా నన్ను చేపట్టవద్దా?

★ **బంతిబెట్టు** – విందుచేయు ★ **జాలి** – బాధ ★ **చవుకల** – చులకన
★ **చొక్కగావద్దా?** – పరవశించవద్దా?

సంఖ్య : 388   సంపుటము : 27   పుట: 262   రాగం : సామంతం

**30** **వారిగో వీరిగో వాడలవాడల**
**కోరిక మీరఁగ గోపాలులు** ॥పల్లవి॥

**జోరునఁ గారీని చొక్కపువుట్లు**
**పేరని పాలును పెరుగును**
**వారలు వట్టేవు వాకిటివుట్ల**
**కూరిమిఁ గృష్ణుఁడు గోపాలులు** ॥వారి॥

**తొట తొట రాలీ దొండ్లయి వుట్ల**
**చిటిబెల్లాలును చిమ్మిరును**
**తటుకునఁ బట్టి దాపేరు పుక్కిళ్ల**
**గుటుకలు మింగి గోపాలులు** ॥వారి॥

**వానలు గురిసీ వరుస వుట్ల**
**తేనెలుం బండ్లు తెంకాయలు**
**ఆనేరు శ్రీవేంకటాధిపతిఁ గూడి**
**గోనల గొందుల గోపాలులు** ॥వారి॥ **388**

**పరిచయ పరిమళం :**

ఇగోవారు, ఇగోవీరు – యెక్కడ చూచినా గోపాలురే? వీళ్ళని ఇళ్ళల్లో వెన్న నెయ్యి ఆరగిస్తామంటే వాళ్ళ పెద్దలు దండిస్తారు. కాబట్టి వాళ్ళంతా ఒకమూకగా చేరి కృష్ణునితోపాటు వుట్లు కొట్టటానికి వీధినిబడ్డారు. వాళ్ళు పొడవైన కఱ్ఱలతో కొట్టినవుట్లలోంచి ఇంకా పేరని (పేరుకోని) పెరుగులు, చిక్కని పాలను త్రాగివేస్తున్నారు. వాళ్ళు (గోపికలు) వాకిట్లో కట్టుకొన్న వుట్లలోంచి వారలు కట్టితే (ధారలు కట్టితే) గోపాలురు శ్రీకృష్ణునితో తమ కోరికను తీర్చుకొన్నారు. ఆ గోపాలురంతా కృష్ణుడు ఆ వుట్లకు చేసిన దొండయిన వుట్లలోంచి చిట్టిబెల్లాలు, చిమ్మిరులు తొటతొట రాలిపోతుంటే తటుక్కున చప్పుడు కాకుండా పట్టుకొని తమ పుక్కిళ్ళలో, దాపేరు. పెద్దవాళ్ళు చూస్తే గుటుక్కున మింగేస్తున్నారు. ఇవన్నీ కృష్ణుడి వుపాయాలే!! గోపులంతా బండ్లు కట్టించి విఫణి వీధులనుంచి తెచ్చుకొన్న టెంకాయలను, తేనెలను శ్రీవేంకటాద్రిపతికి అర్పిద్దామని నేటికీ గోపాలురు కోణాలున్న సందుల్లోంచి వస్తూనేవున్నారు.

★ **దొండ్లయిన** – తూట్లుపడిన ★ **దాపేరు** – దాచిపెట్టెదరు
★ **గోనలగొందుల** – కోణాలున్న సందుగొందుల్లోంచి





సంఖ్య : 129   సంపుటము : 22   పుట: 86   రాగం : మలహరి

**31** **నిచ్చనిచ్చఁ జేకొను నివాళి**
**యిచ్చఁ బేరెవరమోబుళేశ నివాళి** ॥పల్లవి॥

**సొలపులవాలుకచూపుల నెత్తేరు**
**నెలఁతలు నీకిదె నివాళి**
**వలయపుకంకణరవంబుల నెత్తేరు**
**నిలువుఁబయ్యదల నివాళి** ॥నిచ్చ॥

**గక్కనను సరసపుకప్పురపునవ్వుల**
**నిక్కుఁడ నెత్తేరు నీకు నివాళి**
**వక్కణించ మాణికపువన్నెగోళ్ల చేతుల**
**నెక్కొని(న?) నెత్తేరు నీకు నివాళి** ॥నిచ్చ॥

**ముంచినకాఁగిటిలో నీమోహనవేదమంత్రాల**
**నించినించి యెత్తేరు నివాళి**
**పెంచపు శ్రీవేంకటాద్రిపేరెవరపోబుళేశ**
**అంచె నిన్నుఁగూడి యెత్తే రదే నివాళి** ॥నిచ్చ॥ **129**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ‘పెరెవరము’ అనే గ్రామాన్ని సందర్శించి అక్కడ నెలకొన్న వోబుళేశుని (నృసింహుని) కీర్తిస్తున్నారు. ఆస్వాదించండి. నివాళి అంటే మంగళహారతి అని అర్థము. పేరెవరములో నెలకొన్న వోబులేశా (నరసింహా) దినదినమూ నీకు మంగళమగును గాక! నీకు మంగళహారతులనిచ్చేమయ్యా నృసింహా! సొలసిపోవునట్లు చూచే వాలు చూపులతో నెలతలు నీకిదే హారతినిచ్చేరు. వారు వేసికొనిన గుండ్రటి కంకణములతో నిటారుగానున్న పయ్యెదలతో హారతులనిచ్చేరయ్యా! వివరించంగా మాణిక్యపు వన్నెకల గోళ్ళతో నెలతలు నెక్కొన నీకు నివాళులనిచ్చేరయ్యా! నీ కౌగిటిలో వేదమంత్రములు సమ్మోహనంగా వినవస్తుంటే రమణులంతా హారతులిచ్చేరయ్యా! నెమలిపింఛెము వన్నెగల శ్రీవేంకటేశ్వరుని తొలిరూపైన పేరెవరపువోబులేశా! మధ్యలో నీవామెను గూడితివి. అందుకే నీకు హారతులెత్తేరయ్యా!

★ **వక్కణించు** – వివరించు ★ **నెక్కొన** – నెలకొన
★ **పెంచపు** – నెమలి పింఛెము వన్నెగల ★ **అంచె** – మధ్యలో

సంఖ్య : 76 సంపుటము : 22 పుట: 50 రాగం : బౌళి

36 చెల్లుబడిగలవాఁడు నేసినంతాఁ జెల్లెఁగాక
వొల్లనే రెండూ నడపి వొద్దనేమా నేము ॥పల్లవి॥

తప్పకచూచినవాఁడు తలవంచఁ దనకేలే
అప్పుడే యెవ్వరైనాఁ దన్నాడేరా
చెప్పితే గుబ్బనేవాఁడు చేరి నవ్వఁ దనకేలే
తప్పులు నెగ్గులు వట్టి తన్ను సొలసేరా ॥చెల్లు॥

వేఁడుకొనేవాఁడు తాను వీరుత్తరములేలే
నేఁడే తన కింతలో నీటువోయీనా
ఆఁడువారిసాదించువాఁ డందరిఁ దగులనేలే
పోఁడిమిఁ దనగుణము బూమెల్ల నెఱఁగదా ॥చెల్లు॥

వొరుల బోదించువాఁడు వుప్పరాలెగయనేలే
వోరిమైనగుణముతో నుండరాదా
సిరులమించినతాను శ్రీవేంకటాద్రివాఁడు
కరఁగించి నన్నుఁ గూడె కాదనఁబొయ్యేనా ॥చెల్లు॥ 74

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య శృంగార కీర్తనలో కూడా దశావతార సమన్వయంతో తిరుమలేశుని కీర్తించగల దిట్ట. తేలిగ్గా కొఱుకుడు పడదు. తెలివితేటలు చూపకపోతే, తెల్లిమొగము వేయవలసిందే, మరి. ఓ దేవీ! తన మాటను చెల్లించుకోగలిగినవాడు, మంచీ చెడు రెండూ సర్దుకుపోగలిగినవాడు, ఏమిచేసినా బాగానే వుంటుంది. మేము మాత్రం కాదంటామా? ఏదియేమైనా తప్పక చేసేవాడు, తలవంచదనకేలనే. **(తలపంకించి ఈదులాడే మత్స్యావతారము).** తననెవరైనా అవమానించారా, లోనదాగుట యెందుకు **(కూర్మావతారం).** మాట్లాడితే గుబ్బుమనేవాడు ఆ నవ్వులు తనకెందుకే **(వరాహావతారము)**. తప్పులు యెగ్గులుపట్టే వానినేసొలయ జేస్తారా!! **(నరసింహావతారం).** ఓ దేవీ! నాకిది చెప్పవమ్మా! వేడుకొందామని వచ్చినవాడికి, వీరుత్తరము ఘాటైన సమాధానాలు చెప్పతగునా? **(వామనావతారం).** ఇంత నీటుతనము (గర్వము) తనకెందుకే **(పరశురామావతారము).** ఆడు వారినైనా సాధించేవాడు అందరి యెదుట అణుకువ చూపనేల? **(రామావతారము).** ఇక ఆయన గుణాల సంగతికొస్తే జగద్విదితమే **(కృష్ణావతారము).** పరులకు నీతిబోధించేవాడు కానుకలు గ్రహించదగునా **(బుద్ధావతారము).** ఓరిమి కలిగి వుండవచ్చును కదా! అతడు **(కల్కి అవతారము).** సిరులు మించిన శ్రీవేంకటాద్రిమీదనున్నాడు కదా! నన్ను కరగించి కూడితే కాదంటానా.

★ **వీరుత్తరములు** – ఘాటైన సమాధానాలు ★ **ఉప్పరము** – కానుక





సంఖ్య : 139 సంపుటము : 22 పుట: 93 రాగం : సామంతం

33 ఆడేనంటా వచ్చె నారగించలే దింకా
వాడవారచేడెలాల వనజాక్షు జూపరో ॥పల్లవి॥

మందనున్న పసులాల మంచిగోపబాలులాల
కందర్పగురుఁడు వచ్చెఁ గంటిరా మీరు
కెందమ్మివనములాల కృష్ణుఁడు యమునలోన
చిందుల నీఁదాడునట చెప్పరో సుద్దులు ॥ఆడే॥

గొల్లవారిఇండ్లాల గొందిపాలువెన్నలాల
కొల్లఆడేహరి వచ్చెఁ గొండించరో
చల్లలమ్మేసతులాల సరసపురచ్చలాల
ఇల్లీడ నేడనున్నాఁడో యెఱిఁగించరో ॥ఆడే॥

గోవర్ధనముదండ గుంపులపూఁ బొదలాల
కోవిదుఁ డేమిసేసీ గుట్టుచూపరో
శ్రీవేంకటాద్రిమీఁదఁ జేరి కంటి మింతలోనె
పూవువలె నెత్తుకొంటి భోగించీ నిఁకను ॥ఆడే॥ 139

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఒక గోపికయై గొల్లవాడలోనున్న కామినులను, గోవులను, గోప బాలురను, తామర సరస్సులను, గొల్లవారిండ్లలోనున్న పాలు వెన్నలను, చల్లలమ్మే సతులను, గోవర్ధనగిరిపైనున్న పూపొదలను, మాచిన్నారి కృష్ణయ్య ఆడుకొంటానని ఇటువైపొచ్చాడు, ఇంతవరకు అన్నంకూడా తినలేదు. కాస్త నాకూ చూపించండమ్మా! అని బ్రతిమిలాడుతున్నారు. మందలోనున్న పసువుల్లారా, (గోవుల్లారా) మంచి గోపబాలుల్లారా! మన్మథుని తండ్రి అయిన హరి ఇటువచ్చాడా? మీకంట బడ్డాడా? ఎఱ్ఱతామరపూలున్న సరస్సులారా! ఈతగొట్టటానికని బయలుదేరాడట. యమునా నదిలో లేడు. వాని కథ మీకు తెలుసా. గొల్లవారిండ్లలో బానలందున్న పాలూ వెన్నల్లారా! మిమ్మల్ని కొల్లగొట్టే కృష్ణయ్య కనబడితే కాస్త నాకు పట్టించవచ్చును కదా! చల్లలమ్మే సతులారా! సరస భాషణలు జరిగే రచ్చబండలారా! ఇక్కడెక్కడో వున్నాడట యెరిగించండమ్మా! గోవర్ధన పర్వతము సమీపముననే వున్న పూపొదరిండ్లలారా! ఆ గ్రంథసాంగుడు కృష్ణయ్య రహస్యంగా దాగివున్నా కాస్త నాకు చూపించి మేలు చేయండి. శ్రీవేంకటాద్రినెక్కి చూస్తే ఇదిగో ఇక్కడే వానిని చూశాము. పూవువలె సున్నితంగా ఎత్తుకొన్నాను. ఇక వూరకుంటాడా? నాతో భోగించాడు.

★ **కొల్లలాడేహరి** – కొల్లగొట్టే కృష్ణయ్య ★ **కోవిదుడు** – గ్రంథసాంగుడు
★ **ఇల్లిదే** – ఇదిగో ★ **వారచేడెలు** – వేశ్యలు

సంఖ్య : 29 సంపుటము : 22 పుట: 20 రాగం : ముఖారి

**34** ఎట్టు గడపీనో దైవ మింతికి నీగండ మిఁక
ముట్టివచ్చి ఇరుమేల మోహరించెఁ బనులు ॥పల్లవి॥

జలజాక్షిమోము వాడె చంద్రుఁడు కళలుగూడె
కలికికన్నులు మూసె కలువలు లాసె
బలువూరుపులు దాఁగె పయ్యరగాలి రేఁగె
కులుకుమాట లణఁగె కోవిలలు గొణఁగె ॥ఎట్టు॥

చింతఁ జెలిమేను చిక్కె చిగురుకెంజాయ లెక్కె
వింతనవ్వులెల్లాఁ గుంగె వెన్నెలలు పొంగె
దొంతిఁ దురుము విరిసె తుమ్మిదమూఁక మొరసె
మంతనాలు కరవాయ మరుఁడు యెరవాయ ॥ఎట్టు॥

చనుఁగొం గెడలె పంచశరుటెక్కెము వెడలె
వెనువెంటఁ బులకించె విరులెల్లఁ బొంచె
యెనసి శ్రీవేంకటేశుఁ డింతి నిట్టె కూడఁగాను
ననుపిట్టె సేయఁ దమి నచ్చు గనమాయ ॥ఎట్టు॥ 29

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన అద్భుతమైన మధుర కీర్తననాస్వాదించండి. స్వామి, దేవి యెడబాటునననుభవిస్తున్నారు. ఆమె విరహవేదన వర్ణనాతీతము. పాపం! ఈ దేవికి యీగండం యెట్లా గడుస్తుందో? దైవం యెట్లా యీ యింతిని ఆదుకొంటాడో? శత్రుసైన్యం ఇరువైపులనుంచి ముట్టడించినట్లు, దీనికితోడు ఆమెకు పని ఒత్తిడి కూడా యెక్కువైనది. ఈ శ్రమవలన ఆ జలజాక్షి మోము వాడిపోయింది. దానికి తోడు, చంద్రుదు కళలు విరజిమ్ముచున్నాడాయె. ఆ కలికి కన్నులు మూసినచో కలువలు నర్తించాయి. ఏలననగా ఆమె పద్మనేత్రములను మూసినది. బలమైన ఆమె నిట్టూర్పులకు పయ్యెద గాలికల్లాడినది. ఆమె కులుకుచు పలికే మాటలు మూగపోయినవి. ఇది భరించలేక కోకిలలు గొణుక్కున్నాయి. దిగులు వల్ల చెలియ మేను చిక్కి శల్యమైనది. లేత కెంపు చాయగల శరీరం ఇంకా వడిలిపోయింది. వింతగా, ఆమె నవ్వులన్నీ మటుమాయమైనాయి. దీనిని చూచి వెన్నెలలు పొంగిపోయాయి. ఆమె కొప్పు విడివడింది. ఇది భరించలేని తుమ్మెదలగుంపు ఝుంకారాలు చేసేస్తున్నాయి. ఆమె ఇప్పుడు యెవ్వరితోటి మంతనాలాడుటలేదు. ఇది చూచి మన్మథుడు వికృతంగా నవ్వుకొన్నాడు. ఆమె చన్నులపై కొంగు విడిపోతే అది మన్మథుడి ధ్వజములాగా రెపరెపలాడింది. వెనువెంటనే దీనికోసమే పొంచివున్న పుష్పములన్నీ పులకించిపోయాయి. నాచెలినిట్లా బాధిస్తారా, అని శ్రీవేంకటేశుడు వచ్చి ఆమెనిట్టే కూడినాడు. ఇట్లా అనురాగం చూపించగా ఈ వికారాలన్నీ కనుమరుగయ్యాయి.

★ **తమిన్ అచ్చు గనమాయె** – ఈ తమకపు వికారాలను కనమైతిమి





సంఖ్య : 130 సంపుటము : 22 పుట: 86 రాగం : శంకరాభరణం

**35** ఎంత సింగారించేవే యేమే నీవు
కాంతుఁడు వాకిట వచ్చి కాచుకున్నాఁడు ॥పల్లవి॥

చెలులకు వెడవెడసిగ్గులే సింగారము
సెలవులకు నవ్వులే సింగారము
పలచని మోవికి పలుకులే సింగారము
కలికికన్నులకును సొలపే సింగారము ॥ఎంత॥

చక్కనిబొమ్మలకును జంకెనలే సింగారము
చెక్కులకు మురిపెమే సింగారము
వెక్కసపుగోళ్లకు విసరులే సింగారము
చొక్కపుజవ్వనానకు సొంపులే సింగారము ॥ఎంత॥

కఱకుచన్నులకును కాఁగిలే సింగారము
చిఱుఁదొడలకు రతి సింగారము
మఱి యలమేలుమంగమగఁడు శ్రీవేంకటేశుఁ-
డెఱిఁగి నిన్నిట్టె కూడె నిదె సింగారము ॥ఎంత॥ 130

**పరిచయ పరిమళం :**

ఈ కీర్తనలో అన్నమయ్య చనువుగా దేవితో, ఏమే యిది? ఎంత సింగారిస్తావు? అక్కడ నీ నాథుడు వచ్చి వాకిట నిలిచివున్నాడమ్మా! అని మందలిస్తున్నారు. అయినా నేనొకటి చెబుతాను, గ్రహించు. చెలులకు నిజమైన సింగారము పతితో వెడవెడ (మిక్కిలి స్వల్పమైన సిగ్గులు). ఇక ఆ పెదవులకు చిరునవ్వులే సింగారము. పలుచనైన అధరాలకు నీ తీపి మాటలే సింగారము. మరి, అందమైన నీకనుదోయికి, పారవశ్యమే సింగారమమ్మా! దేవీ! చక్కని నీకనుబొమ్మలకు నీవు స్వామిని బెదిరించేట్లు చూస్తావే... ఆ చూపులే సింగారము. చక్కని నీ చెక్కిళ్లకు సంతోషమే సింగారము. వెక్కసపు గోళ్ళకు (నీవాడి నఖములకు) విసరులే సింగారము. అతిశయించిన నీ యవ్వనమునకు నీ ఒంపుసొంపులే సింగారమమ్మా! కఠినమైన నీ చనుగవకు స్వామి బిగికౌగిలే సింగారము. ఇక నీ చిఱుతొడలకు చక్కటి రతికేళి సింగారము. మఱి అలమేల్మంగ మగడైన శ్రీవేంకటేశ్వరునకు నీవిరహము నెఱిగి నిన్నిట్టే కూడుటయే సింగారమమ్మా!

★ **సొలపు** – పారవశ్యము ★ **మురిపెమే** – సంతోషమే

సంఖ్య : 92 సంపుటము : 22 పుట: 62 రాగం : ధన్యాసి

**40 గాడిదె గూయకుండఁ గంసుఁడెఱఁగకుండ**
**వేడుక వసుదేవునకు విన్నవించరో** ॥పల్లవి॥

**దేవతలు జయవెట్ట దేవకి గర్భమునందు**
**యీవేళ నేనుగబిడ్డఁ డిదె జనించె**
**పూపులవాన గురిసె భూభారమెల్లఁ దీరె**
**వేవేగ నొజ్జళ్ళు వేళ చూడరో** ॥గాడి॥

**అద్దమరాతిరికాడ నటు చంద్రోదయముతో**
**వొద్దికఁ గృష్ణుఁడు వుట్టె నోచెలులాల**
**సుద్దులెల్లఁ జెప్పఁజొచ్చెఁ జూపె నాల్గుచేతు లవె**
**పొద్దున సోబన మిట్టె పొలఁతులు సేయరో** ॥గాడి॥

**సంకుఁజక్రములు వట్టి సాదుల నిందరిఁ గావ**
**తెంకినే శ్రీవేంకటాద్రి దేవుఁడు వుట్టె**
**కొంకుఁబనులెల్లాఁ దేరె కోరి తొట్టెలఁ బెట్టరే**
**లంకె బలభద్రుతోడ లలనలు వెంచరో** ॥గాడి॥ **92**

**పరిచయ పరిమళం :**

ఇది అన్నమయ్య చెప్పిన శ్రీకృష్ణామృతము. గార్ధభాసురుని కాపలాపెట్టాడు కంసుడు. దేవకి బిడ్డను కనగానే గాడిద ఓండ్రపెట్టి కంసుని లేపుతుంది. వసుదేవుడంతటివాడు గాడిదకాళ్ళు పట్టుకొని ఓండ్రపెట్టవద్దని వేడుకొన్నాడట. ప్రాణ సంరక్షణలో అధముని కాళ్ళు పట్టుకొన్నా తప్పులేదుమరి. గాడిద కూయకుండా, కంసుడు యెఱగకుండ వేడుక, జరుపమని వసుదేవునికి విన్నవించండయ్యా! దేవతలంతా జయ జయ ధ్వానములు చేయుచుండగ. ఈ వేళ దేవకి గర్భమున ఏనుగువంటి (సర్వ శ్రేష్టుడైన) బిడ్డడు పుట్టాడు. అక్కడ పుష్పవర్షం కురిసింది. భూభారం తీరింది. వేవేగ, ఒజ్జళ్ళు (పురోహితులు) శిశుజనన వేళ చూచి తెలుపండి. ఓ చెలులారా! అటుచంద్రోదయంతోపాటే అద్దమరాతిరికాడ (అర్ధరాత్రి వేళలో) శ్రీకృష్ణుడు ఒద్దికతో జన్మించినాడు. నల్లనివాడైన బిడ్డ జననమే, చతుర్భుజునిగా జరిగినది. పుడుతూనే సుద్దులెల్లా చెప్పజొచ్చె (తను యెవరు, తన పుట్టుక కారణమేమి, ఇవన్నీ చెప్పినాడు, పొలతులంతా మంగళగీతములు పాడి సేవించండి. సాధుపురుషులను రక్షించుటకు శంఖుచక్రాలతో పుట్టాడీబిడ్డ. శ్రీవేంకటాద్రిపైన వునికి గల దేవుడితడే. ఇక భయపడవలసిన పనిలేదు. ఇక బిడ్డను తొట్టెలో పెట్టండి. ఆ బిడ్డకు తోడైన బలభద్రుడు ఇదివరకే పుట్టి లలనలచే పెంచబడుతున్నాడు.

★ **తెంకి** – వునికి ★ **కొంకు** – భయపడు





సంఖ్య : 128 సంపుటము : 22 పుట: 86 రాగం : ముఖారి

**37 ఆఁడుజన్మమే మాకు నాఱడాయనో కాక**
**పోఁడిమిఁ దా మగవాఁడు భువిఁ బచ్చి సేతురా** ॥పల్లవి॥

**ముంచుకొని మగవారు ముంగిటనే వుండఁగాను**
**మంచము చప్పుడుసేసీ మాకు నిదెక్కడికా (ఁ?) కే**
**యెంచఁ బొరుగు వినఁగ నేడగొడవమ్మ మాకు**
**పొంచి పటుకురనఁగఁ బోఁకఁ గొరికీని** ॥ఆఁడు॥

**చక్కఁ బొద్దుగుంక దిదె సతులెల్లనవ్వఁగాను**
**పక్కనఁ దలుపు మూసీఁ బనో మరి**
**యెక్కువతోఁ జంటిబిడ్డ లిదె చేయి దిగరు తా-**
**నక్కరతోఁ గొంగువట్టీ నౌనే లెస్సాయను** ॥ఆఁడు॥

**యెలమితో నత్తమామ లెదుటనే వుండఁగాను**
**చలాలకే మాటలాడీ సంగతెఱఁగఁడే వీఁడు**
**అలరి శ్రీవేంకటేశుఁ డందరి మొరఁగి కూడె**
**తలఁగ కింతేసిరట్టు తగునా ఇల్లాలికి** ॥ఆఁడు॥ **128**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య వినిపించిన ఈ మధుర కీర్తనలో నాయిక ఆడజన్మపొంది తన బ్రతుకు యెలా అఘోరించిందో వివరిస్తున్నది. చిరాకు పడుతున్నది. మాకు యీ ఆడుజన్మవలన యింత ఆరడి (బాధాకరమని) అవుతుందనుకోలేదు. తాను మగవాడు యెల్లప్పుడూ సుభకాంక్షతోనే వుంటాడు. ఈ భూమిమీద పురుషులు ఇంత ఆరడి పెడతారని వూహించ లేదు. మా ఇంట్లో మామగారు మరుదులు తిరుగుతూనే వుంటే ఈయనగారు నాకోసం మంచముపై చప్పుడుచేసి సంకేతాలిస్తాడు. ఇదెక్కడి గోలరా అనిపిస్తుంది. ఇరుగుపొరుగు వాళ్ళకి వినబడునట్లు నాతో గొడవమ్మా! యేమి చెప్పను? ఇక ఈయనగారు పోకచెక్క కొరికాడంటే ఆ ధ్వని వూరంతా వినబడాల్సిందే, ఎట్లాంటి మొగుణ్ణిచ్చావురా, దేవుడా! పొద్దుగుంకీగుంకగానే తలుపులు మూసేస్తానంటాడు. పక్కవాళ్ళంతా నన్ను చూచి నవ్వుతున్నా ఈయనగోల ఈయనదే. ఇంట్లో చంటిబిడ్డడున్నాడు. వాడు చేయి దిగడు. ఈయన ప్రతిదానికీ నా కొంగుపట్టుకొని వదలడు. ఔనులే... కోరి ఈ మొగుణ్ణి కట్టుకొన్నందుకు లెస్సాయెను. అవన్నీ అటుంచి మా అత్తామామల యెదుటే నర్మగర్భంగా చలోక్తులు విసురుతాడు. వాళ్ళు ముసిముసిగా నవ్వితే పట్టించుకోడు. ఆ శ్రీవేంకటేశుడు. వీళ్ళనెందుకు కూడిస్తాడో కాని ఒక్క ఇల్లాలికే ఇంత రట్టు తగునా?

★ **పోడిమి**–సుఖకాంక్షి ★ **పచిసేతురా**–ఆరడిపెడతారా ★ **లెస్సాయెను**–బాగా అయింది, నాకు

సంఖ్య : 69 సంపుటము : 22 పుట: 47 రాగం : బౌళి

**38 ఓయమ్మ నీలిబిడ్డఁ డోయమ్మ**
**యీయెడ యశోద నీవెట్టు గంటివమ్మా** ॥పల్లవి॥

**గాలిగొట్టె తిరిగినగామిడివాఁ డోయమ్మ**
**గోలవలె నుండుఁగాని కోడెకాఁడమ్మా**
**తాలిమి యించుకాలేని తరువరివాఁడమ్మ**
**ఆలరీఁడు నీబిడ్డఁ డదె బుద్ధి చెప్పరో** ॥ఓయ॥

**కడలేని సాహసాల గట్టు(ట్టి?) వాయివాఁడమ్మ**
**తడమారి ఇందరిలో తాటఁగట్టమ్మ**
**ముడికారితనముల మునిముచ్చు వాఁడమ్మ**
**బడిబడి నుద్ధండపనులు మానుపవో** ॥ఓయ॥

**శ్రీవేంకటాద్రిమీఁది సేఁతలయేతులవాఁడు**
**వావాత నుడుగులవడ్డివాఁడు**
**వేవేలు దూరినాను విడువక మమ్ము నేలె**
**వోవల మాతప్పులెల్ల నోరుచుకొమ్మనవో** ॥ఓయ॥ **69**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య రేపల్లెలోని గోపెమ్మ. ఆమె యశోదతో యేమంటున్నదో వినండి. ఓ యశోదమ్మా! నీవు ఎట్టునిదానవు. నందగోపుడు ఎట్టునివాడే కదా! నీవు నీలవర్ణపు బిడ్డనెట్లుగంటివే? అంటున్నది. ఓయశోదమ్మా! మీవాడు గాలికి తిరిగే రండగొండివాడమ్మా! వెట్టిగొల్లవాడిలా వుండే నీ కొడుకు కోడెగిత్తలాంటివాడు. కొంచెముకూడా ఓరిమిలేని నిర్బంధించే ఆత్రగాడు. శుద్ధ అల్లరివాడమ్మా! నీ కొడుకు అదిగో యేమి బుద్ధి చెబుతావో చెప్పవమ్మా! ఓయశోదమ్మా! నీ కొడుకు, మితిమీరిన తెంపరితనముగల గట్టి నోరున్నవాడమ్మా! తడుముకోకుండా ఇంత మందిలో వాడి తాట తియ్యవమ్మా! మీవాడు ధూర్తత్వములో అందెవేసిన ముచ్చుదొంగ. బడిబడి (అతిత్వరగా) వాడి దుండగీడు పనులనాపవమ్మా! శ్రీవేంకటాద్రి మీద యేతులసేతలవాడు (బడాయి గల పనులు చేసేవాడు). వడ్డీగా, కట్టుబట్టల్ని కూడా వదలించేవాడు. ఎంత తిట్టినా, వడ్డీలాగకుండా వదలని వాడు. ఉక్రోషంతో యెంత తిట్టినా మమ్మల్ని వదలనివాడు. కానీ వాడు ఆర్తత్రాణపరాయణుడమ్మా! మా తప్పులన్నింటినీ మన్నిస్తాడు.

★ **తరువరివాడు** – నిర్బంధించే ఆత్రగాడు ★ **తడమారి** – తడుముకోకుండా
★ **ముడికారితనముల** – ధూర్తత్వంలో





సంఖ్య : 38 సంపుటము : 22 పుట: 26 రాగం : పాడి

**39 దొడ్డదొర దానైతే దోసమాయనా**
**గొడ్డేరునిష్ఠూరములే కూడాయనా** ॥పల్లవి॥

**కాఁకలఁబెట్టినవాఁడు కన్నుల నవ్వీఁగదే**
**చీకాకై యాఁడుజన్మ మే చెడఁబోయనా**
**చేకొని తా రానివాఁడు చెలులా నంపీఁగదే**
**కాకునేనేదే తనకుఁ గడమాయనా** ॥దొడ్డ॥

**మోవఁగనాడినవాఁడు మోనాన నున్నాఁడుగదే**
**దావతితో వలచుటే తప్పాయనా**
**వావిదెలిపినవాఁడు వగల నేఁచీఁగదే**
**మావంటివారికన్నా (న్నీ?) రే మనసాయనా** ॥దొడ్డ॥

**పచ్చిగాఁ గూడినవాఁడు పంతము నాడీఁగదే**
**ముచ్చటలు చెప్పినదే మోసమాయనా**
**ఇచ్చకుఁడు శ్రీవేంకటేశుఁడు నన్నేలే నిట్టె**
**పచ్చినాపాయమే తనపాలాయనా** ॥దొడ్డ॥ **38**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య ఒక గోపికవలె తన మనోవ్యధను బైటపెట్టుకొంటున్నారు. సరే! ఆయనగారు దొడ్డ దొర అయ్యాడు. అదే నేరమయ్యిందా? గొడ్డేరు నిష్ఠూరాలు (వ్యర్థమైన ఛీత్కారాలు) కూడాయనా (బ్రతుకు తెరువైనదా యేమి?) నాపై కోపతాపాలు చూపించినవాడు. కన్నులతో నవ్వులొలికిస్తున్నాడు. ఇట్లాంటివాడితో సంబంధం పెట్టుకొని ఆడజన్మమే చెడిపోయింది. వాడికేమో రావటానికి ముఖం చెల్లక తన స్నేహితురాళ్ళను పంపిస్తాడా? వాడికి అవమానించడమే అలవాటైపోయింది. నా మనస్సును గాయపరచినవాడు మౌనంగా వుంటే... వాడిని గౌరవించి వలచుటే నేను చేసిన తప్పనిపిస్తోంది. నాకూ తనకూ చుట్టరికం వున్నదన్నదీ వాడే... ఇవ్వాళ వగలనేచినవాడూ (ఈరోజు వలపులతో వేధించినవాడూ) తానే. వాడికి మా కన్నీరే మనసైనదేమో? నన్ను పచ్చిగా అనుభవించినవాడు ఈ రోజు నాపై పంతంబట్టి బాధిస్తున్నాడే. తాను నాకు చెప్పిన ముచ్చటలన్నీ మోసమని తేలింది. నేడు వాడే శ్రీవేంకటేశుడైనన్నేలినాడు. నా తొలకరి వయస్సే వాడితోడయ్యింది.

★ **కాకుసేసేదే కడమాయనా** – అవమానించటమే అలవాటయిందా
★ **మోవనాడినవాడు** – మనస్సు గాయపరచినవాడు

సంఖ్య : 281 సంపుటము : 22 పుట: 188 రాగం : కాంబోది

44 ఊరకుండవే చెలియ వొద్దికతో రమణుఁడు
చేరి తానే వలెనంటే సేవసేసేఁగాని ॥పల్లవి॥

సుసరాననేవచ్చిన చుట్టరిక మింపుగాక
కొసరఁబోతే మనసు గొంటుపడదా
ముసిముసినవ్వులతో ముదులకించేమాట
పిసికిపిసికాడితే పిప్పిరేఁగదా ॥ఊర॥

వరుసతో ననిచినవలపు చవొఁగాక
వొరసి పెనఁగితే మే నుప్పు రేఁగదా
సరసపుఁజేఁతలలో సారెకుఁ జల్లేటిచూపు
తిరిగితిరిగి చూచితేఁ దెల్లవారదా ॥ఊర॥

కదిసి బిగించితేను కాఁగిలి వేడుకొఁగాక
వదలితే నడియాస వలఁబెట్టదా
యిదె కూడె శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను
పదరితే సమరతి పచ్చిదేరదా ॥ఊర॥ **281**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య దేవి చెలికత్తెయై ఆమెతో చెలియా! అనురాగముతో వూరకవుండవమ్మా! నీ రమణుడు తనంతట తానే నీవు కావాలంటే ఆయనకు సేవచేసికొనుచు వుండిపోవద్దా? సులభంగా మీ మధ్య చుట్టరికం కుదిరింది. నీమీద కసురుకొంటే మనస్సు గాయపడేది సహజమే పైకి ముసిముసి నవ్వులు ప్రదర్శిస్తూ వెనకాతల ఎత్తిపొడుపుగా మెలమెల్లగా మాట్లాడితే ఒళ్ళుమండదా? చెలియా! ఆయనకు నీకూ వరుస అయినా కాని, వలపు అతిశయిస్తే బాగుంటుంది. ఘర్షణపడి పోట్లాడితే ఒంటినున్న ఉప్పు నీరు కారిపోదుటమ్మా! సరసపు చేతలు మానివేసి ప్రతిసారి దోషిని చూచినట్లు చూస్తుంటే... చూపులతోనే తెల్లారిపోతుంది కదమ్మా! దేవీ! నీపతి నీకు చేరువయై కౌగిట్లో బిగిస్తే ముచ్చటగా వుంటుంది. స్వామిని నీవు కాదంటే అడియాస నిన్ను వంచించి వశం చేసికొంటుంది. ఇదే శ్రీవేంకటేశుడు అలమేల్మంగను కూడినాడు. తహతహలాడితేగాని సమరతి బూతుగా పరిణమించదు.

★ **ముదులకించదా** – ఎత్తిపొడుపు ★ **ఒరసి** – ఒరిపిడి కలిగించి
★ **వలబెట్టదా**–వంచించి వశం చేసికోదా ★ **పచ్చిదేరదు**–బూతుగా పరిణమించదు





సంఖ్య : 122 సంపుటము : 22 పుట: 82 రాగం : బౌళి

41 నీపాపమా వోరి నిచ్చఁ గాలమహి మిది
ఆపాటితగవెల్ల నంతేసి కోపుదునా ॥పల్లవి॥

కోపము వేళమె వచ్చుఁ గోరి నిజమాడితేను
యేపున శాంతము వచ్చు నిచ్చలాడువారిఁ గంటే
వోప నాదిక్కేమి చూచే వొల్లనొల్లఁ బట్టకురా
నీపాటిదొరతనము నేరఁగాక నేను ॥నీపా॥

యేతులు వేళమె వచ్చు నింటనున్న వారిఁ గంటే
జాతివినయాలే వచ్చు సారె వాడవారిఁ గంటే
నీతుల నీగుణమిది నేఁడు గొత్తలా నాకు
రీతి గాదు నవ్వకురా రేయిపొద్దు దోసము ॥నీపా॥

బీరాలు వేళమె వచ్చు బ్రియపడ్డసతిఁ గంటే ।రతిఁ
దారిన మొక్కులే వచ్చు దంటైనసతిఁ గంటే
యేరా శ్రీవేంకటేశ ఇది నేనెఱిఁగినదే
కూరిమిఁ గూడితి విఁకఁ గొంకు నాకుఁ జెల్లదు ॥నీపా॥ **122**

**పరిచయ పరిమళం :**

స్వామి, ప్రియురాలైన అన్నమయ్య యేమంటున్నారో, ఆనోటినుండే వినండి. తిరుమలేశా! ఓరీ! ఇది నీవు చేసిన పాపము కానేకాదు. నిత్యం జరుగుతున్నదిదే. నేటి, కాల మహిమ ఇది. ఆమాత్రం తగవు రాకుండా వుంటుందా? అంతమాత్రాన అంతేసి అఘాయిత్యానికి ఓపుదురా? (చాలెదరా?) నిజంచెబుతే వేంటనే కోపము వస్తుంది.పరాయి ఆడువారి యెదుట యెక్కడలేని శాంతమూ వస్తుంది. నాకేసి యేమిచూస్తావయ్యా. వద్దంటే వద్దు. నన్ను పట్టుకోకు. నీపాటిదొరతనము నేనెరుగుదునులే. ఇంట్లో నీకోసం వేచివుండే వారిని చూస్తే నీ నోట వచ్చేది బడాయి మాటలే. అదే వాడలో వున్నవారిని చూస్తే మీమగజాతి లక్షణమైన 'అతివినయం' కనబడుతుంది. నేడు కొత్తగా జెప్పేదేముంది? నీగుణమే అంత... నీది పద్ధతికాదు. రేబవళ్ళూ ఇదేపని అంటే యెట్లారా? అది దోసమురా! నవ్వకురా! నీవంటే ఇష్టపడిన ఆడుదానిని చూస్తే బీరాలు తెగవస్తాయి నీకు, అదే రతి కావలసివస్తే ఆమె సమర్థురాలైతే మీ మగవారు వంగి వంగి నమస్కరిస్తారు. ఏరా! ఓ శ్రీవేంకటేశా! ఇదంతా నేనెరిగినదే కదా! నీవు కూరిమితో నన్ను కూడినావు. ఇక నాకు గొంకు చెల్లుతుందా స్వామీ!

★ **బీరాలు**–గర్వోక్తులు ★ **దంటయినదైతే**–సమర్థురాలైతే ★ **కొంకు**–సంకోచము

సంఖ్య : 63 సంపుటము : 22 పుట: 43 రాగం : సామంతం

**42 అందరి కొక్కటే చాలు ఆండ్లకు మొగలకు**
**ముందటెత్తు వేరె నీతో మోవనాడవలెనా ॥పల్లవి॥**

**వలపుల యీఁదియీఁది వాసులకే లోఁగిలోఁగి**
**అలుకలే తవ్వితవ్వి యట్టె నవ్వి**
**చెలఁగేటివిరహివి చింత మాన్ప నెఱఁగవా**
**చెలి నింతే నీకు నేను చెప్పి చూపవలెనా ॥అంద॥**

**బలిమై చేయి చాఁచిచాఁచి పంతాన మెయి దోఁచితోఁచి**
**పలుకాఁకఁ గందికంది భామలఁ బొంది**
**కులుకుజాణఁడవు నాకోర్కి దీర్చనెఱఁగవా**
**ఇల నే జవ్వని నింతే ఇంతరట్టు వలెనా ॥అంద॥**

**పలుకులే చల్లిచల్లి పారిపారి మల్లి మల్లి**
**వలరాచపనులకే వయ్యాళి వెళ్లి**
**తలఁచి శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి**
**వెలయు నీదేవి నింతే వేఁడుకొనవలెనా ॥అంద॥ 63**

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో, ఆడువారైనా మొగవారయినా అందరికీ ఒక్కటే చాలును, అంటారు. ముందటనే యెత్తుగడగా నీతో వేరే నొప్పించేటట్లు నాకు మాటలాడవలసిన పనియేమి? ఆడువారికైనా మొగవారికైనా ఒక్కటే నీతికదా! స్వామీ! నీవు వనితల వలపులలో యీది యీదీ, వారు జూపే వాసులకు (ఆధిక్యమునకు) లొంగి లొంగీ వారి అలుకలు తీర్చి తీర్చీ మళ్ళీ మధురంగా నవ్వి వాళ్ళ విరహతాపము నీవే అనుభవిస్తూ వారి చింత బాపుట నెరుగుదువు. నీకు నేను నెచ్చెలినే కదా! స్వామీ! వేరే నీకు చెప్పిచూపవలెనా? స్వామీ! బలిష్టమైన నీచేయి చాచిచాచీ, నా శరీరం పంతముతో నీకు దోచిదోచీ, అనేకమైన తాపములతో కంది కందీ, అనేక మంది భామలను పొంది పొందీ, వారితో కులికే నేర్పరివి. మళ్ళీ నా కోర్కెలనుకూడా తీర్చ నెఱుగవా. నేనూ జవ్వనినే. నన్నింత రట్టుచేయవలెనా? స్వామీ! నాపై మాటలు గుప్పించీ గుప్పించీ, మళ్ళీమళ్ళీ నన్ను పారిపారీ (తడిపీ తడిపీ), మన్మథుని పనులకు వాహ్యాళికి వెళ్ళి పనిలో పనిగా వేంకటేశా! నన్ను కూడితివి. ఇంతా చేసి నేను నీ దేవేరినే స్వామీ! నన్నింత వేడుకోవలెనా.

★ **మోవనాడవలెనా** – మనస్సు నొచ్చునట్లు మాట్లాడవలెనా

★ **వయ్యాళి** – విహారము (వాహ్యాళి)





సంఖ్య : 89 సంపుటము : 22 పుట: 60 రాగం : పాడి

**43 సుదతులు లేరే సోబనము సేయ**
**పొదలి మరుగురుఁడు పొడమెను వాఁడె ॥పల్లవి॥**

**శ్రావణబహుళాష్టమి యిదివో**
**ఆవలఁ జంద్రోదయం బదివో**
**యీవేళ నడురే యిప్పుడే రోహిణి**
**దేవకి కొడుకుఁ గనె దేవుఁడు వీఁడె ॥సుద॥**

**సరి వసుదేవునిసంతోష మదివో**
**మరులుగొల్పేహరిమా యదివో**
**విరిసెను కాంతులవెలుఁ గదివో**
**లలలలపురుషోత్తముఁడె పుట్టెను వీఁడె ॥సుద॥**

**నాలుగుచేతులు నలి నివివో**
**మేలిమిసొమ్ముల మెఱుఁగు లవె**
**యీలీల శ్రీవేంకటేశ్వరుఁడు మన-**
**పాల జనించెను బాలుఁడు వీఁడె ॥సుద॥ 89**

**పరిచయ పరిమళం :**

యోగమాయ ప్రభావంచేత రేపల్లెలోని గోపికలంతా మొద్దునిద్రబోతున్నారు. అర్ధరాత్రి శ్రీకృష్ణుడు దేవకి ఒడిని వీడి వసుదేవునిచే రేపల్లెతేబడి, యశోద ఒడిచేరాడని ఒక్క వసుదేవుని భార్య బలభద్రునితల్లి, రోహిణికి తప్ప ఎవరికీ తెలీదు. వసుదేవుడు వెడలిపోయిన తరువాత ఆమె గోపికలను నిద్రలేపుతున్నది. శ్రీకృష్ణామృతం అన్నమయ్య త్రాపుతున్నారు, త్రాగండి? ఓ సుదతులారా! లేవండమ్మాఔ పండుగ జరుపుకోవాలి. మన్మథుని తండ్రి మనింట పుట్టినాడమ్మా! వానిని జూడలేవండమ్మా! ఇదిగో నేడే, శ్రావణ బహుళాష్టమి. అటువైపు నా చంద్రోదయము జరిగింది. ఇవ్వాళ నడిరేయి సమయముననే రోహిణి దేవకి కొడుకును తాను కన్నది. వీడూ దేవుడే. పరమాత్మ ఆదేశం పాటించినందుకు వసుదేవుడు అదిగో పరవసించుచున్నాడు. సమ్మోహనకరమైన విష్ణు మాయ, అదిగో. విచిత్రములైన కాంతిపుంజములవిగో. పుట్టినవీడే పురుషోత్తముడు అదిగో చతుర్భుజుని నాలుగు సేతులు. కౌస్తుభము, వైజయంతితో సహా హరి భూషణమ్ములవిగో, ఈ విధముగా ఆ శ్రీవేంకటేశ్వరుడే మనపట్ల అవతరించినాడు. వీడేనే బాలుడంటే.

★ **నలిని** – విజృంభించి ★ **పొదలి** – అతిశయించి

సంఖ్య : 304   సంపుటము : 22   పుట: 203   రాగం : శుద్ధవసంతం

**48 నడివిడి (వీది?) మాటలు నాయమా నీకు**
**పిడితెఁడుచల్ల వోసేఁ బెనఁగకువోయీ** ॥పల్లవి॥

**గొల్లవారము మాకుల మేమియడిగేవు**
**మొల్లమిగా జాణతనములు నేరము**
**చొల్లెపుజుట్టులతోడ సుద్దు లెందాఁకాఁ జెప్పేవు**
**అల్లదె మాయిల్లు దాయాలాడుదము రావోయి** ॥నడి॥

**దొడ్డివారము మేము దోవేల చూపుమనేవు**
**వొడ్డారపుఁజేఁతల కోపము నేము**
**బిడ్డ నాచేతనున్నది ప్రేమతో నేమినవ్వేవు**
**జిడ్డుచేత విడెమిచ్చేఁ జేతువు రావోయీ** ॥నడి॥

**ఆలఁగాచేవారము మాయంగా లెంతపొగడేవు**
**మేలెతిఁగి మెచ్చఁగ నేమీ నెఱఁగము**
**అలరి శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి**
**యేలితివి నన్ను నీడ నిట్టె రావోయీ** ॥నడి॥ **304**

**పరిచయ పరిమళం :**

రేపల్లెలోని ఒక గొల్లెత కృష్ణయ్యను దెప్పుతున్నది. అన్నమయ్య చిందించిన శ్రీకృష్ణ రసామృతాన్ని ఆస్వాదించండి. ఇటువంటి కీర్తనలకు ప్రతిపదార్థ వివరణ ఎబ్బెట్టుగా వుంటుంది. ఓ కృష్ణయ్యా! నడివీధిలో పలకరింపుమాటలవలె నాతో మాటలు నీకు న్యాయమటయ్యా? చిలిపిగా, అలిగి పిడితెతో నీపై చల్ల చిమ్మాను. అందుకని నాతో పెనుగులాడకు కృష్ణయ్యా! మేము గొల్లవారము. మా కులం ఏమిటని గుచ్చి గుచ్చి అడుగుతావెందుకు? మాకు మీలాగా జాణతనము లేదు. నీ వుంగరాలజుట్టుతో ఎంతసేపు సుద్దులు వినిపిస్తావు. అదిగో ఆ కనపడునదే మా ఇల్లు అక్కడకెళ్ళి గవ్వలతో ఆడుకొందాము, రావోయీ. మేము గొల్లవారమని ముందే చెప్పానుగదా! మమ్మల్ని నీకు దోవచూపమని యెందుకడుగుతావు? నీవన్నీ ఒడ్డారపు చేతలు (పంతపు చేతలు) మేము వాటిని తట్టుకోలేము. నా చేతిలో ఒక బిడ్డవున్నది అదిచూచి వ్యంగ్యంగా యెందుకు నవ్వుతావు? నావి జిడ్డు చేతులే, కానీ నీకు తాంబూలమిస్తాను రావోయీ! మేము ఆవులు కాచుకొనేవారమే. మా అంగసౌందర్యం పొగడవలసిన పనిలేదు. నీకు నచ్చేట్లు మెచ్చుకోవటం మాకు రాదు. ఇంతకీ నీవు అలమేల్మంగ పతివైన అల్లరి శ్రీవేంకటేశ్వరుడవా? నన్ను ఏలెదవు రావోయీ!

★ **పిడితె** – చిన్నముంత ★ **దాయాలాట** – గవ్వలాట ★ **దొడ్డివారు** – గొల్లవారు





సంఖ్య : 511   సంపుటము : 22   పుట: 341   రాగం : ముఖారి

**45 మగవానితో బలిమి మగువల కమరునా**
**వెగటులేక యిట్టె వినయమే సేయవే** ॥పల్లవి॥

**కొంగువట్టి తీసితేను కొప్పు గడువెడజారె**
**వుంగరాన కొడిసితే నూర్పులు రేఁగె**
**చెంగటఁ బెనఁగితేను చెమటలు మేనఁ జిందె**
**సంగడి నాతనితోను సాము లెంతసేసేవే** ॥మగ॥

**కదుఁజెనకఁబోతేను కంకణాలు వాఁగఁజొచ్చె**
**తడవి తిట్టఁగఁబోతేఁ దగదొట్టెను**
**తడవుగా నవ్వఁగాను తలకెక్కె వలపులు**
**యెడయక యిందులో నీవెందుకయ్యేవే** ॥మగ॥

**నాఁటఁగ గాఁగిలించఁగా నడుమఁ జన్నులు చిక్కె**
**మాటున రతిసేయఁగా మతి గరఁగె**
**యీటున శ్రీ వేంకటేశుఁ డితనిపొం దింతసేసె**
**చీటికిమాటికి నిఁక సిగ్గులేల పెంచేవే** ॥మగ॥ **511**

**పరిచయ పరిమళం :**

ఈ కీర్తనలో కూడా అన్నమయ్య దేవికి చెలికత్తెయై హితబోధ చేస్తున్నారు. ఓ దేవీ, మగవానిపై బలముచూపుట మగువలకు తగదమ్మా! ద్వేషము చూపక, ఆయనతో వినయము ప్రదర్శించవమ్మా! ఆయన నీ కొంగుపట్టి లాగితే నీ కొప్పు విడిపోయి, జారినది. నీ వ్రేలికి వుంగరం పెడితే నీ ఉచ్ఛ్వాస నిస్వాసాలు జోరునందుకొన్నాయి. నీకు చేరువై పెనవేసికొంటే నీఒళ్ళంతా చెమటల ముద్ద అయిపోయింది. అతను బలిష్టుడైన పురుషుడు. అతనితో సాముజేస్తానంటావేమమ్మా! దేవీ! ఆయన నిన్ను గట్టిగా అదుముకొంటే నీ కంకణాలు గోలపెట్టినట్లు చప్పుడు చేసాయి. ప్రయత్నించి తిట్టాలనుకొన్నా నీ నోరెండిపోయింది. మధురమైన ఆయన నవ్వుచూచి నీకు వలపు తలకెక్కింది. దేవీ! నిన్నాతడు ఒత్తుకొని కౌగలించుకొంటే మీ నడుమ నీ స్తనములు చిక్కువడ్డాయి. రహస్యముగా రతిగూడితే నీ మనస్సు కరిగిపోయింది. శ్రీవేంకటేశ్వరుడైన ఇతనితో పొందుకు ఇంతచేశావు. ఇక చీటికి మాటికి సిగ్గులేల పెంచేవే?

★ **తగదొట్టె** – ఎండిపోయింది ★ **తడవుగ** – అదనుగా
★ **నాటగా** – ఒత్తుకొని ★ **ఈటున** – ఉత్సాహంతో

సంఖ్య : 520 సంపుటము : 22 పుట: 347 రాగం : శ్రీరాగం

**46 ఏమి నోము నోచినదో యీయింతి**
**కామించి కన్నులారఁ గంటిమి మీపొందులు** ॥పల్లవి॥

**చిత్తగించి నిన్నుఁజూచి సిగ్గువడీ నిదివో**
**కొత్తపెండ్లికూఁతురు యీకొమ్మ గాఁబోలు**
**మొత్తమి నీమాట విని ముసిముసినవ్వు నవ్వీ**
**జొత్తైనతొల్లిటినీచుట్టముగాఁ బోలును** ॥ఏమి॥

**అగపడి సరసములాడితే సమ్మతించీని**
**తగిననీమేనమఱఁదలు గాఁబోలు**
**పగటున నీవుగప్పే పచ్చడము గప్పుకొనీ**
**జగమెఱఁగఁగ నీకు చనవరి గాఁబోలు** ॥ఏమి॥

**వొనరఁ బానుపుమీఁద నుండి నీపాదములొత్తీ**
**యెనసి వూడిగమాపె యీకె గాఁబోలు**
**నను నేలితివి ముందే నంటున శ్రీవేంకటేశ**
**నిన్నుఁ జెనకీఁ దానూ నేస్తము గాఁబోలు** ॥ఏమి॥

**పరిచయ పరిమళం :**

అన్నమయ్య శ్రీదేవి భాగ్యానికి అబ్బురపడుతున్నారు. స్వామీ! యీ యింతి యేమి నోము నోచినదయ్యా. జగన్నాథుడవైన నీ పొందు సంపాదించగలిగిందే!!! ఇదేమీ రహస్యంగా జరిగిన వ్యవహారం కాదు. కోర్కె దీరునట్లు మేమందరము మీ కూటమిని కన్నామయ్యా! ఈ కొమ్మ కొత్త పెండ్లికూతురగుటచేత ఇదిగో సిగ్గుతోనే నిన్ను మనసారా చూచింది. నీ మాటలు ఆసాంతము విని మీ తొల్లిటి కూటమిగుర్తుకు వచ్చి (సాగరకన్యగా నిన్ను జేపట్టుట) ముసిముసి నవ్వులు చిందిస్తున్నది. నేడు ఆమే నీ మేనమరదలయింది. నీవు ఆమెకు యెదురై సరసమాడితే తప్పక ఒప్పుకొంటుంది. మురిపెముతో నీవు ఆమెపై కప్పిన వల్లెవాటును కప్పుకొని, జగద్విదితముగా నీకు ప్రేమిక అయినదయ్యా! ఆమె నీకు సేవ చేయుటకు కాబోలు నీకు చేరువయై పాదములొత్తి పాన్పుపై నీకెంతో సేవచేసినది. కానీ ఓ శ్రీవేంకటేశ్వరా ముందే నన్నూ యేలితివి. కానీ నిన్ను తాకు స్వాతంత్ర్యముగల ఈమె నీ నేస్తమా యేమి?

★ **ఊడిగము** – సేవ ★ **పగటున** – మురిపెముతో





సంఖ్య : 537 సంపుటము : 22 పుట: 358 రాగం : ధన్యాసి

**47 అలమేలుమంగపతి యన్నిటా జాణఁ డితఁడు**
**ఇల మీ చుట్టరిక మిరవాయసుండీ** ॥పల్లవి॥

**వుంకించి కృష్ణుఁడు వుట్లు గొట్టీ**
**వేంకటాద్రిపురవీథులను**
**మంకుగొల్లెతలు మరి మీరు పెనఁగితే**
**సుంకించి మానాలు సోఁకీసుండీ** ॥అల॥

**పాలు వెరుగు వారవట్టీ గోవిందుఁడు**
**సోలిఁ గోనేటియీచుట్టులను**
**ఆలించి గొల్లెత లటు మీరు సొలసితే**
**చేలకొంగు లంటితే సిగ్గయ్యీసుండీ** ॥అల॥

**చేకొని వెన్నలు జుట్టీ శ్రీవేంకటేశుఁడు**
**వాకైననిధిమీఁదివాడలను?**
**కాకరిగొల్లెతలు కాఁగిలించి పట్టేరు**
**యేకమైతిరి మీగుట్టు లెరిఁగీసుండీ** ॥అల॥ **537**

**పరిచయ పరిమళం :**

శ్రీవేంకటేశ్వరునిపై అన్నమయ్య వినిపిస్తున్న చక్కటి కీర్తననాస్వాదిద్దాం. ఈ అలమేల్మంగ విభుడు అన్నిటిలోనూ జాణ. మాబోటి వారికి మీ చుట్టరికము కన్నులపండుగ వంటిది సుమా! దుమికి దుమికి శ్రీకృష్ణుడై వుట్లను గొట్టినాడు. నేడు తిరుమల వీధులలో ఊరేగుతున్నాడు కానీ... వలపుకాడై గొల్లెతలు యెంతపెనగినా వారి మానములను ఎగిరి ఎగిరి తాకి చిలిపిగా నవ్వినాడు, సుమా! ఈ గోవిందుడే పాలు పెరుగులను ధారలుగా కారిపోయేట్లు చేశాడు. కోనేటి ఒడ్డున సోలిపోయివున్న గొల్లెతల మొరలాలించి సొలసిన వారి చీరెకొంగులు పట్టుకొని సిగ్గులలో ముంచెత్తాడు సుమా! నేడు శ్రీవేంకటేశుడైనా ఇంకా వెన్నలు జుఱ్ఱుతూనేవున్నాడు. వాటమైన నిధివలె వాడలలో అతిశయించినాడు. మాయకత్తెలైన గొల్లెతలు కౌగలించి పట్టుకొంటే ఏమయ్యారు. మీ గుట్టులన్నీ వీనికి యెరుకే సుమా!

★ **మంకు** – మొండితనంగలిగిన ★ **వాకైన** – వాటమైన ★ **కాకరి** – మాయకత్తె

రచయిత:

## అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు




పిలవండి : **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

పుట్టింది : **9-6-1945**

చదివింది : **ఎం.టెక్.**

ఉండేది : **ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61,**
**సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్.**

రంధి : **భగవన్నామ సంకీర్తన**

నచ్చింది : **శాస్త్రీయ సంగీతం**

నచ్చంది : **నక్కజిత్తులు**

మెచ్చింది : **సజ్జన సాంగత్యం**

రింగండి : 00919393021360

చదవండి : www.geetadeksha.com

ఇవ్వండి : e-mail : geetadeksha@gmail.com






సంఖ్య : 275 సంపుటము : 22 పుట: 184 రాగం : సాళంగనాట

**49 నీవేల తిట్టేవు నన్ను నీచేఁతలే యింతసేసె**
**వావాత నిన్ను దూరఁగవలెనా నాకు** ॥పల్లవి॥

**కోరి నీమేనిపైనున్న గుఱుతులు చూచికాక**
**సారె నిన్ను నవ్వ నింతచలమా నాకు**
**వేరే నీవాడేమాటలు వింతలై వుండఁగాఁగాక**
**కోరి గద్దించి యడుగఁ బొద్దువోదా యేమి** ॥నీవే॥

**అవ్వల నెవ్వతోచీర అంటించరాఁగాఁ గాక**
**దవ్వులఁ బెనఁగ దంటతనమా నాకు**
**నివ్వటిల్ల నన్నీఁజేసి నీవే వేఁడుకోఁగాఁగాక**
**పవ్వళించి మొక్క నుండఁబట్టదాయేమి** ॥నీవే॥

**పలునారతులలోనే పరాకై వుండఁగాఁగాక**
**బలిమిఁ జన్నులనొత్తఁ బంతమా నాకు**
**అలరి ఎవేంకటేశ అలమేలుమంగ నేనీ-**
**తలఁపు చూచేఁగాక దారకమా యేమి** ॥నీవే॥

**పరిచయ పరిమళం :**

దేవి తిరుమలేశునితో ఎంత చమత్కారంగా దెప్పుతున్నదో అన్నమయ్య బాణీలో విని ఆనందించండి. స్వామీ! నీవు చేసిన పనులే నిన్నీ స్థితికి తెచ్చాయి. మధ్యలో నన్ను నిందిస్తావు దేనికి? నాకు నోరారా నిన్ను తిట్టడం తప్ప పనిలేదాయేమి? నీ ఒంటిపైనున్న మరకలు చూచికాకపోతే మాటిమాటికీ నిన్ను చూచి నవ్వులాడే మత్సరమున్నదా నాకు? నీవు చెప్పే మాటలు పొంతన లేక వింతగా వున్నాయి. అందుకని కొద్దిగా వివరించమన్నాను. నిన్ను గద్దించి శోధించకపోతే నాకు పొద్దుపోదాయేమి? స్వామీ! అవతల అదెవత్తో నీపై చీరెకొంగువేస్తే, దానికోసం నీతో పోట్లాట పెట్టుకొనే గయ్యాళితనం నాకున్నదా? నీవు చేయాల్సినవన్నీ చేసి ఇప్పుడు నన్ను వేడుకొంటున్నట్లు పవ్వళింపుకు నీతో చేరకపోతే నాకు వుండబట్టదాయేమయ్యా? పలు రతులలో, తమరు పరాకునవుంటే నిన్ను నాకుచగిరులతో ఒత్తేటంత పంతమా నాకు? ఓ శ్రీ వేంకటేశ్వరా! నేను అలమేల్మంగనయ్యా! నేను నీ మనస్సు చూస్తాను. అదెప్పుడూ, నాదే. అంతేగాని పిల్లచేష్టలు నాకు వుంటాయా?

★ **వావాత** – నోరారా ★ **దంటుతనము** – గయ్యాళితనము

★ **దారకము** – పిల్లచేష్టలు ★ **నివ్వటిల్లు** – నెఱవేఉ

సంఖ్య : 503 సంపుటము : 22 పుట: 336 రాగం : పాడి

**50 నాకు నిన్నుఁ జూచిచూచి నవ్వు వచ్చీని**
**యేకతాన నన్నేలితి వేమిచెప్పేదయ్యా** ॥పల్లవి॥

**తొయ్యలియొక్కెతకుఁ గందువ చెప్పకుండఁగాను**
**వొయ్యనే వేరొకతె నీవొద్దికి వచ్చె**
**చెయ్యార విత్తొకటిడఁ జెట్టొకటై మొలచె-**
**నియ్యెడ నీవలపిదె యేమని చెప్పేదయ్యా** ॥నాకు॥

**పేరుకొని యొకతెను ప్రియముతోఁ బిలువఁగా**
**మారుపేరుదొకతె నెమ్మది నూఁకొనె**
**కోరినదొకటుండఁగాఁ గొసరు వేరొకటాయ**
**యీరీతి నీభాగ్యము లేమిచెప్పేదయ్యా** ॥నాకు॥

**గక్కన వేరొకతెను కలయ సన్న నేసితే**
**నక్కున శ్రీదేవి నిన్ను నదె కూడెను**
**మొక్కొకటి మొక్కఁగాను ముంచి దీవెనొకటాయ**
**యిక్కడ శ్రీవేంకటేశ యేమిచెప్పేదయ్యా** ॥నాకు॥

**పరిచయ పరిమళం :**

తిరుమలేశుని తిప్పలు చూచి ఈ వలపుకత్తెకు నవ్వు ఆగటం లేదు. రహస్యంగా నాకు చేరువై నన్నేలితివి. ఇంకా ఏమిచెప్పను? నా ఆనందమేమంటే నాలాగ నీవల్ల ఇక్కట్లు పాలైన వారిలెక్కేలేదు. ఒక తరుణి నీసమాచారం చెప్పకుండా దాచి తానే నీ దగ్గరకు వచ్చింది. నీవూ ఆశ్చర్యపోయివుంటావులే. విత్తొకటి నాటితే చెట్టు వేరొకటి మొలిస్తే మరి ఇది నీ వలపు మహిమ. మేమేమి చెప్పగలమయ్యా! స్వామీ తమరు అక్కడికీ పేరుపెట్టి పిలిచారు. తమరి పొరబాటేమీలేదు. కానీ అదే పేరున్న తమరి ఇంకొక వలపుకత్తె "ఊఁ" కొట్టి ఏమికావాలి అన్నట్లు నీదగ్గరకు వచ్చింది. కోరుకున్న దొకతె వుండగా కొసరుగా ఇంకొతె దక్కినట్లయింది తమరికి. ఇట్లావుంటాయి నీ భాగ్యములన్నీ. ఏమి చెప్పమంటావు స్వామీ! తమరు ఒకసారి వేరొక్కదానికి సైగలు చేస్తే... అప్పుడూ తమరు వూరకనేలేరు. తమరి బిగికౌగిలిలో శ్రీదేవి కూడియున్నది. ఒకదాని కోసం మొక్కితే వేరొక వరము దొరకడమంటే ఇదేమరి. ఓ శ్రీవేంకటేశ్వరా! పొట్ట చెక్కలవుతుంటే ఇంకా యేమి చెప్పమంటావయ్యా!

★ **సన్నసేసితే** – సైగచేస్తే ★ **ఒయ్యనే** – తిన్నగా





సంఖ్య : 538 సంపుటము : 22 పుట: 359 రాగం : లలిత

**51 సోబనము సోబనము చూడరే పేరటాండ్లు**
**ఆ బలభద్రుఁడు ముందే యవతరించినాఁడు** ॥పల్లవి॥

**జనియించెఁ గృష్ణుఁడు సతమాయ ధర్మములు**
**జననీజనకులకు సంతోసమాయ**
**ననిచి యశోదానందగోపులు వెంచేరు**
**వొనర నందరికిని వొక్కమనసాయ** ॥సోబ॥

**నాలుగుచేతులవాఁడు నల్లనిమేనివాఁడు**
**మేలిమిసంకుఁజక్రాల మించినవాఁడు**
**కోలుముందుగాఁ గంసునిగుండెదిగులైనవాఁడు**
**వోలార్చరే యిందరికి నొక్క మనసాయను** ॥సోబ॥

**కోరికె లీడేరెను గోపికల కెల్లాను**
**తేరి కరుణించి మనదిక్కు చూచీని**
**గారవపుటలమేల్మంగపతి శ్రీవేంకటేశు-**
**నూరడించరే యిందరి కొక్క మనసాయను** ॥సోబ॥

**పరిచయ పరిమళం :**

శ్రీకృష్ణుడే హరి. హరియే శ్రీవేంకటేశ్వరుడు అని అన్నమయ్య చాటిచెప్పారు. పేరంటాండ్లను వచ్చి మంగళ గీతములనాలపించమని, మంగళ మహోత్సవం చూడమని పురమాయిస్తున్నారు. అన్నమయ్య వారిలో ఒకరు. ఆ బలరాముడు ఇంతకుముందే అవతరించాడంటున్నారు. శ్రీకృష్ణజననం జరిగింది ధర్మము శాశ్వతంగా నిలబడ్డది. జననీజనకులైన వసుదేవుడు, దేవకి సంతోషమయ్యెను ప్రేమతో యశోదానందగోపులా బాలుని పెంచారు. శ్రీకృష్ణుడు అందరికీ తానే ఒక్క మనసన్నట్లు పెరిగాడు. ఇక ఆ బాలుడు పుట్టినప్పుడు చతుర్భుజునిగా పుట్టాడు. నల్లటి మేని నిగనిగలు వర్ణింప నసాధ్యము. బంగారు శంఖ చక్రములతో అతిశయించియున్నాడు. అంతకు ముందే కంసుడి గుండె దిగులుతో నింపాడు. అందరికీ ఒక్కటే మనసన్నట్లు ఉత్సాహంగా వుండండి. శ్రీకృష్ణుడే సర్వస్వమని తలచిన గోపికలను అందరినీ కరుణించి వారి దిక్కుకే చూచినాడు. నేడు గౌరవముతో అలమేల్మంగ పతియైన శ్రీవేంకటేశ్వరుడై కలియుగంలో కూడా అందరికీ తానే మనసు అన్నట్లు ఊరడించండి.

★ **కోలుముందుగా**– మున్ముందుగానే ★ **ఓలార్చరే** – ఉత్సాహంగా వుండండి